చ రి త్ర లు - క థ లు

	రు	అ
ఖమ్మెర పోతరాజు		1
శ్రీకృష్ణదేవరాయల చరిత్ర		1
నలమహారాజు కథలు (వచనం)		1
పంచపాండవుల అజ్ఞాతవాసం పెద్దది బైండు		
శ్రీరామ వనవాసం		
పరమానంద శిష్యుల కథలు		
భోజకాళిదాసు కథలు		1
భట్టివిక్రమార్కుని కథలు		
డిటో చిన్న సైజు		1
స్త్రీల వ్రత కథలు 1, 2, 3 భా॥		1
రైతుఋణచట్టం		
పాండవ వనవాసం	1	
కాశీక్షేత్ర మహాత్మ్యం	0	1
మహాపతివ్రతల కథలు	0	1
మదనకామరాజు కథలు	1	
హరిశ్చంద్ర (వచనం)	0	
మైరావణ చరిత్ర	0	
డిటో పెద్ద సైజు బొమ్మలతో	1	
ప్రవృద్ధపాండవం	0	
అభయరాఘవం	0	
సౌభ్రాతృరాఘవం	0	
విక్రమరాఘవం	0	
భట్టీ విక్రమార్కుని కథలు (క్యాలికో బైండు)	3	
చమత్కారకథాకల్లోలిని 1 వ భా॥	1	

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి.

న వ్వు ల గ ని

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిచే
రచియింపఁబడియె

పబ్లిషర్సు :
కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో
రాజమండ్రి
1946

కాపీరైటు

[వెల 1-8-0

విషయసూచిక

1 నూతన పంచాంగము

2 ప్రశ్నలు

3 పురహుందిరము

4 శృంగారచేష్ట

5 రామస్వస్తి—రావణస్వస్తి

6 దెబ్బ దేవేంద్రలోకము

7 వృద్ధవివాహము

8 ఎల్లవారు—గొల్లవారు

9 నేనే

10 క్రమము

11 నెపములపుట్ట

12 యోగానందస్వామి

13 శత ఘంటావధానము

14 అడ్డబొట్టు—నిలువుబొట్టు

15 స్తోత్రపాఠము

16 తండ్రికొడుకుల వివాదము

17 గార్ధభ జన్మము

18 రంగధామో పాఖ్యానము

19 విష్ణుభక్తి

20 రంభా మేనక సంవాదము

21 గయ్యాళిగంప

22 సంతుష్టి

23 పౌరుష మహాసభ

24 తోక మనుష్యులు

25 పరస్పరస్తోత్ర సమాజము

26 గౌరవ సంపాదనము

27 లబలబలు

28 మాపుల మందిరం

29 కావలెను సభ్యులు కావలెను

30 ఏజంట్ల తమాషాలు

31 నక్షత్రముల లెక్క

32 కరణాల కట్నం

33 వడ్డీవ్యాపారము

34 మహోపన్యాసము

నవ్వులగని

నూతన పంచాంగము.

శ్రీమూర్జాలదేవతాయైనమః

గీ. కుడుములన్ మెక్కి పొంగిన కడుపు; చేట
చెవులు; నేనుగు తొండంబు; చెవులుగొలుప
రుబ్బు రోల్పోత్రమట్లు కూర్చుండి కదల,
లేని గణనాథు నవ్వులకై నుతింతు.

ఈపంచాంగము కళంకి బ్రాహ్మణమహావంశజాతుండును కేవ లచిచ్ఛిద్ధాంతినాగణిత పధకతస్కరుండును, కిరాత మహారాజాస్థాన విద్వాంసుడును, అగు కుండగోళక సిద్ధాంతిచే రచింపంబడి, దౌర్భాగ్య పురము దగుర్బాజీపేటలోని అనృతవాదినీ ముద్రాక్షరశాలయందు దీర్ఘ వాలపు గ్రామసింహరావు పంతులుగారిచే ముద్రింపబడి లోకవినోదార్థము ప్రకటింపంబడియె.

ఆంజనేయ స్తుతి.

గీ. భాస్కరునిగాంచి ఫలమనుభ్రమయు బుద్ధి,
శాలి; లంకనుగాల్చిన చక్కనయ్య!
అంజనేయుండు కృతిభర్తకనుదినంబు
తనగుణంబులొసంగుచుఁ దనుపుగాత.

సంవత్సరఫలము.

ఈ సంవత్సరము గుంటూరు అత్తరువు సాహేబులకు బేరముల వలన మంచిలాభమును సాతానులకు ముష్టివలన సుఖజీవనమును కలు

గును. తురకపకీరులు అడుగుకొనుటవలన సాధారణలాభమే కాని విశేష లాభము కలుగదు. వేశ్యలకు మేళములవలన వచ్చు ఆదాయముకన్న బాల్యులగు ధనికుల ప్రాపకములవలన కొంత జీవనోపాధి కలుగును. బృహస్పతి పరగృహవర్తియై యుండు సమయమున చంద్రుఁడు బృహస్పతి యింట్లో ప్రవేశించును గావున యేమి ఫలము గలుగునో చదువరులే యూహించగలరు. దీనికై యే విఘ్నాశములు గలుగకుండా నవగ్రహదానములు సేయవలయునని మేము సలహాయిచ్చుచున్నాము. అమావాస్య దినంబున చంద్రగ్రహణంబును పౌర్ణమిదినంబున సూర్యగ్రహణంబును కేవల మద్భుతమ్ములై సంభవించును [ఇది నమ్మనివారు మహాపాపమును జెందెదరు] పంటలు మొత్తముపై బాగానేపండినను రైతులు పండలేదని గోలపెట్టుచునే యుందురు. సర్వేషాం సన్మంగళానిభవంతు.

పంచాంగ పీఠిక.

ఇష్టదేవతా ప్రార్థనము.

సీ. పల్లికల్ తామరల్ బాపునమరవిల్లి
యెల్లమ్మదేవత నెదఁ దలంచి
రహి మాలపేరంటాండ్రను శివమాడించు
జగ్గంగి యుసిరమ్మ సన్నుతించి
కోళ్ళపోట్లేళ్ళ గైకొని మింగు కోరంగి
తణుకులమ్మను మదాత్మను నుతించి
రాజమహేంద్రవరంబు నందున్న
చామాలమ్మ తల్లిని మదిభజింతు

గీ. పిదప గంజాము ముసలమ్మ వినుతిజేసి
కోరి నూకాలశక్తి కుపారమొసఁగి
పన్నెకెక్కిన గ్రామదేవతలనెన్ని
వ్రాయఁబూనితి పంచాంగ రాజమువని.

గురుధ్యానము.

సీ. డొక్క నెక్కుడనయిన నొక్కయక్కరమైన
గలగియుండని మహా ఘనుడెవండు ?
పలుమారు నోటిమాటలు నాడుటకైన
బడిమందిలో తడబడునెవండు ?
పుట్టినదాది యేపొత్తమైనను చేతఁ
బట్టియెఱుంగని ప్రౌఢయెవఁడు ?
తనతెల్వి కెందరెంతని సంతసించిన
మారుమాటాడని మానియెవఁడు ?
గీ. శుంఠ లందరిలో మేటి శుంఠయెవఁడు ?
భోజనమునకెంత దవ్వయిన బోవునెవఁడు ?
దర్భపోటన్న రయమున దరలునెవఁడు ?
అట్టి మద్గురు వర్యునే నాత్మదలఁతు.

పు ర వ ర్ణ న ము

సీ. ఏమహాపట్టణం బేపేట దప్పక పరసురామప్రీతిఁ బరగుచుండు
ఏవీట నేపేట శ్రీవిశూచీదేవి లలిజమాబందీల నలుపుచుండు
ఏపురవీధులం దెల్లపగల్ గృధ్రములు రాత్రులందునక్కలుచరించు
ఏయూర శునకంబు లిండ్ల వాకిండ్ల దొంగలు పెరళ్ళన్ మైత్రి
[మెలగుచుండ్రు
గీ. ఏపురము జారిణులకెల్ల కాపురంబు
ఏపురము త్రాగుబోతులకెల్ల యిరవు ?

ఏపురము కలహాసులకిల్లు ఆపురంబు
పాపనిలయంబు దౌర్భాగ్య పట్టణంబు.

గీ. మహాజరులు వ్రాయనేర్చిన మాన్యజనులు
జారులను దోచనేర్చిన ధైర్యయుతులు
బాలికల నమ్ముకొనునట్టి పండితులును
రహి జెలంగుదు రాకాశ రామపదులు.

ప్ర భు వ ర్ణ న ము

గీ. ఆపురంబున వసియించు నంతిపురము
గాచికొనియెడి బూదేని కడుపునిండ
ద్రావి మత్తిలు పట్టెద రాజుమాడ్కి.
ప్రభు వోకండొప్పు నవని కిరాతుడనగ.

క. కలనైన నిజము పల్కడు
తులువల సాంగత్య మెపుడు తొలగ డనిశమున్
కలుద్రావి పేకలాటల
కలకాలము గడుపుచుండు కాపురుషుండై.

దైవజ్ఞ ప్రశంస.

గీ. అక్షరజ్ఞాన శూన్యుడైనట్టి ప్రభున
కన్నిటకె దగు సిద్ధాంతి నగుట తన్క
రంపు పంచాంగరాజమర్పణనేతు
క్షితి నిరంతర మీతనిక్కృతి వెలుంగ.

శా స్త్రి ప్ర శం స.

మ. తెలుపున్ భూతభవిష్యదర్థముల జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంతముల్
పొలుపారంగ మహార్థమున్ దెలుపునామహార్థసిద్ధాంతముల్
భళిరా! ఇందు విశేషమేమి? పటుసర్వజ్ఞత్వముం గూర్చుచున్
దలపన్ మత్కృతమైన తస్కరణ సిద్ధాంతంబె మేలిన్నిటన్.

అన్యవిరోధికృద్వత్సరస్యనహుషుడుశకము 50,000 తారకాసుర శకము 40 వేల సం॥రములు. రావణశకము 30 వేల సం॥రములు. మహిషాసురశకము 20 వేల సం॥రములు మరియు మహమ్మదుబీను టోగ్లాకుషహాశకము ఔరంగజేబుశకము. టిప్పుసుల్తానుశకము నాదర్షా శకము. సురాజదౌలశకము ఈమొదలగు యోగ్యులగు చక్రవర్తులశకములు పాటించుకొనవలయును. (షరా:—ఈ సంవత్సరముల లెక్క శాస్త్రజ్ఞానమువల్ల చేయబడినదిగాన సరికానిచో ఈతప్పు జ్యోతిష శాస్త్రము గుణించివ్రాసిన సిద్ధాంతులదిగానితస్కరించి వ్రాసినవాడెంత మాత్రమును గాదని మాచదువరు లెఱుంగ వలయును.) అథాస్మిన్ దేశేలోక వ్యవహారార్థం హూణమానేన 1911 అబ్దోగ్రాహ్యాని. దేశేనా మహిమాలమస్య దక్షిణభాగే బె ఆఫ్ బెంగాల్ అరేబియన్ సి మధ్య ప్రదేశే పారిలన్ పేనేజిపర్యంతం సూర్యోదయప్రభృత నిర్ణయతవంతిథాపనాది సమస్త నిత్యకృత్య నిర్వహణార్థం తస్కరణ సిద్ధాంత్యోక్త ప్రకారేణ మయాలిఖ్యంతే.

అథసంవత్సర ఫలం.

సూర్యుడు పశుపాలుడు డగుటచే వట్టిపోయిన ఆవులు తిరిగి యీనేవరకు పాలియ్యవు. నిశాధిపో చంద్రః। పదుచు భార్యలుగల ముసలి మగలకు రాత్రులయందు సరిగా నిద్రపట్టదు — శ్వానపాలకః కుజః। పట్టణములయందు మ్యునిసిపాలిటీలవల్ల ఊరకుక్కల కప్పాడప్పా డకాల మృత్యువు గలుగుచుండును— న్యాయపాలకో బుధః। అబద్ధవాజ్యములు కోర్టులో వేసి రాజీకి తిరుగ నారంభించు పార్టీలు మెండయి జిల్లాకోర్టులమీద జిల్లాకోర్టులు సబుకోర్టులమీద సబుకోర్టులు కావలసివచ్చును. విత్తాధిపోగురుః। పార్టీలకు డబ్బులేనప్పుడు తమరే సెట్టుబడిపెట్టి పత్రములు వ్రాయించుకొనుట, ఇతరులవద్ద అప్పులు కుదుర్చుట మొదలగు పనులు ప్లీడరు లారంభింతురు—కాలాధిపోశుక్రః ఎండకాలమున వేడిమి, వర్షాకాలమున బురద, శీతాకాలమున చలి

సర్వత్రా కలిగియుండును—నష్టాధిపశ్శనిః। పాలకుండలకు పిల్లులువల్ల నున్నూ, తినుబడిసామానులకు యెలుకలవల్లనున్నూ, కర్రసామానులకు చెదవల్లనున్నూ, మాధుర్యమైన పదార్థములకు చీమలవల్లను డామేజీ కలుగుచుండును—పుస్తకాధిపో రాహుః। అక్షరజ్ఞాన మెఱుగని శుంఠల పేర్లతో గ్రంథములు వెలువడును. మాటలాడుటకు తడుము కొనుశుంఠలు గ్రంథవిమర్శనముల కారంభించెదరు—పంచాంగాధిపతిః కేతుః। సిద్ధాంతమననేమో యెఱుగని వెఱ్ఱిమొగముల పేర్లతో పంచాంగములు వెలువడును.

ఈసంవత్సరమున ముప్పదిమూడు కోట్ల ముప్పదిమూడు లక్షల ముప్పదిమూడు వేల మున్నూట ముప్పదిమూడు అర్బుదముల వర్షము కురియును. (అనుమానము గలవారు సరియైన సిఖా కుంచములతో కొలిచి చూడవచ్చును.)

ఉష్ణము 11 పాళ్ళు; ఉక్కపోయింపు 10 పాళ్ళు; చెమట 8పాళ్ళు; గాలి 10 పా॥ ధూళి 5 పా॥ చలి 10 పా॥ ఒణుకు 8 పా॥ రొంపలు 4 పా॥ దగ్గు 5 పా॥ తుమ్ములు 4 పా॥ ఆవలింతలు 12 పా॥ ఎక్కిళ్లు 7 పా॥ మత్తు 1[illegible] పా॥ నిద్ర 13 పా॥ స్వప్నములు 6 పా॥ కలవరింతలు 6 పా॥ తుళ్ళిపాటు 10 పా॥ భార్యాభర్తలకలహములు 8 పా॥ వాళ్ళలో వాళ్లే రాజీపడడము 4 పా॥ ఇతరులతగవులు తీర్చడం 3 పా.

వంట బ్రాహ్మణుల గిరాకీ 16 పా॥ చాకలివాళ్ల గిరాకీ 8 పా॥ సానిమేళములగిరాకీ 1టెన్నర పా॥ తద్దినపుబ్రాహ్మణుల గిరాకీ 8 పా॥ పట్టణములయందు అద్దెల గిరాకీ 10 పా॥ రైలు స్టేషనులవద్ద బళ్ల గిరాకీ 8 పాళ్లు.

కోతులవృద్ధి 4 పా॥ గాడిదలవృద్ధి 3 పా॥ పందులవృద్ధి 5 పా॥ కాకులవృద్ధి 6 పా॥ పిచ్చుకలవృద్ధి 6 పా॥ పిల్లులవృద్ధి 4 పా॥ బల్లులవృద్ధి

3 పా॥ తొండలవృద్ధి 3 పా॥ ఉడతలవృద్ధి 4 పా॥ బొద్దెకలవృద్ధి 2 పా॥ సాలెపురుగులవృద్ధి 2 పా॥ కప్పలవృద్ధి 3 పా॥

ఆయవారపు బ్రాహ్మలు ముష్టివల్ల ఆదాయము 4 పా॥ వ్యయము 3 పా॥ సదస్యపు సంభావనవల్ల ఆదాయము 3 పా॥ సదస్యాలు మానివేయడమువల్ల నష్టము 3 పా॥ జగన్నాధము పండాలకు రాబడి 10 పా॥ కమీషనుక్రింద నష్టం 6 పా॥ క్షౌరములవల్ల మంగళ్ళకు రాబడి 10 పా॥ గుళ్లపుజాతులవలన బేరం తగ్గిపోవడం 3 పా॥ స్పెష్లీ రేజర్లు వల్ల బేరంనష్టం 3 పా॥ స్త్రీపునర్వివాహామువల్ల బేరము పడిపోవటము 3 పా॥ తిరుపతి వేంకటేశ్వరులకుముడుపువల్ల రాబడి 6 పా॥ దాసులు మధ్య తినడంవల్ల నష్టము 2 పా॥ ఉద్యోగస్తులుచిట్టాలో జమకట్టక తస్కరించడంవల్ల నష్టము 2 పా॥ యాత్రస్తులు తలలు గొరిగించుకొని మొక్కు తీర్చుకొనుటవల్ల స్వామివారికి జమవచ్చే వెంట్రుకలు సవరాలుచేయించి అమ్మించే యెడల రాబడి 3 పా॥ సానులకు విటులవల్ల ఆదాయము 8 పా॥ తగిలిన సంకటాలు కుదుర్చుకోడానికి వ్యయం 4 పా॥ గవర్నమెంటు ఉద్యోగస్థులకు (పుచ్చుకొనే యెడల) లంచాలువల్ల ఆదాయము 8 పా॥ లంచపు చార్జీలక్రింద వ్యయము 10 పా॥ గ్రామమునసబు కరణాలకు గ్రామస్థులవల్ల ఆదాయము 15 పా॥ గవర్నమెంటు ఉద్యోగస్థులకు నష్టయిక్రింద వ్యయము 12 పా॥ స్వదేశీషాపులవల్ల ఆదాయము 6 పా॥ పెద్దమనుష్యులమను పేరిడుకొన్న మేనేజర్లు తస్కరించి లెక్కలు లేవన్నయెడల నష్టము 16 పా॥ చౌకరకం వాచీల గరీదు 16 పా॥ వాటిమరమ్మత్తుక్రింద ఖర్చు 20 పా॥ మ్యునిసిపల్ దీపాలవల్ల వెలుగు ० పా॥ కంట్రాక్టర్లు సరిగా చమురు పోయించక పోవడంవల్ల చీకటి 2 పా॥ చాకలివాళ్ళు చమురుతస్కరించడమువల్ల చీకటి 3 పా॥ రాత్రులయందు బీటు తిరగడములో పోలీసు కానిస్టేబిల్లుకు హుషారీ 4 పా॥ కునికిపాట్లు 3 పా॥ బద్దకం 2 పా॥ తణికీ సరిగా లేకపోతే

నిర్భయం 2 పా॥.—బిళ్ళగోచీలు 4 పా॥ జారుకచ్చలు 6 పా॥ గూడ కట్లు 2 పా॥ పెరాయిలు 8 పా॥ పిలకజుట్లు 6 పా॥ తివాసీక త్తిరజుట్లు 6 పా॥ వైష్ణవజుట్లు 5 పా॥ జునపాలు 4పా॥ గేరాజుట్టులు 5పా॥ గుట్టపు జుట్టులు 14 పా॥ కేవలము బోడిగుళ్ళు 3 పా॥ పంపరపనాసకాయడిప్ప జుట్లు 2 పా॥ వంకరపిలకజుట్లు 3 పా॥ మార్వాడీజుట్లు 1 పా॥ వేంక టేశ్వరమొక్కు కోడిజుట్లు 2 పా॥ చింపిరిజుట్లు 2 పా॥ తుప్పతలకాయలు 2 పా॥ పూర్తిగా పెంచేసిన జుట్లు 3 పా॥

అధరాజపూజ్యావమానాని

భాగ్యవంతులకు రాజపూజ్యము 10 పా॥ బీదలకుఅవమానం 13 పా॥ యోగ్యులకు రాజపూజ్యము 10 పా॥ జారులకు (సానివీధులలో) రాజపూజ్యము 12 పా॥ (సంసారులవీధులలో) అవమానము 16 పా॥ వైద్యులకు (ఆరోగ్యమురోగికి కలుగువరకు) రాజపూజ్యము 16 పా॥ (పిమ్మట కట్నము అడిగినయడల) అవమానము 14 పా॥

అధసంక్రాంతి పురుషలక్షణము.

అస్య సంవత్సరస్య భ్రష్టనామకోసంక్రాంతి పురుషః ఊర్ధ్వము ఖం ఏకనేత్రం - గార్ధభవాహనం - పంకలేపనం - షోడశోర్ధ్వపుండ్రధార ణం - మర్కటాకారం - కుంకుడుకాయల ఫలహారం - ఉమ్మెతకాయ శాఖం (ధాన్యంలోపుట్టు)జోడాలు లేక గోలివెలు అన్నభోజనం- అస్య పురుషస్యధర్మపత్నీ -మహామారీదేవి-పిశాచీ జ్యేష్ఠసోదరీమానభక్షణీ- బొంబాయివాసినీ విజయుతే—

[తిథులు మామూలుగనున్న వేళాన మేము వ్రాయలేదు.]

స మా ప్త ము

ప్రశ్నలు.

ప్రశ్న—భాగ్యవంతు డెప్పుడు బీదవాడగును ?

ఉత్తరము—పన్ను లిచ్చుకోవలసివచ్చినపుడును, కొడుకుగాని తమ్ముడుగాని చనిపోయిన తరువాత కోడలుకో మరదలుకో మనువర్తి యిచ్చుకోవలసివచ్చినపుడును మనుష్యులు పేదవారగుచుందురు. ఇతరుల భూములు వ్యవసాయము జేయు రహితులు, ఈనాముదారులకు భూమిశిస్తు నీయవలసి వచ్చినప్పుడు తప్పక పేదవారగుచుందురు.

ప్రశ్న—పేదవాడు భాగ్యవంతు డెప్పుడగును ?

ఉత్తర—తనకుగాని తన కుమారునకుగాని తన తమ్మునకుగాని పెండ్లి సంబంధము వచ్చినప్పుడు ప్రతిమనుష్యుడు వడ్డీవ్యాపారము జేయువాడగును. ఈనాముదారు డగును. ఒకరికి పెట్టి తాను తినవలసినంత భాగ్యశాలి యగును.

ప్రశ్న—ముసలివాడు చిన్నవా డెప్పుడగును ?

ఉత్తరము—కళత్ర నష్టమైనప్పుడు ముసలివాడు తప్పక పడుచువాడగును. అరువదియేండ్లవా డేబదియేండ్లవా డగును. ఏబదియేండ్లవాడు నలువదియేండ్లవా డగును. తలవెంట్రుకల నెరుపు బాలనెరుపగును. శరీరములో నోపిక లేకపోవుట సుకుమారముచేత గాని వార్ధక్యముచేత గాదని సిద్ధాంతపడును. మఱియు సర్కారులో నుద్యోగము గావలసివచ్చినప్పుడుగూడ పెద్దవాడు చిన్నవా డగుచుండును. ఇరువదియైదేండ్లు దాటిన తరువాత గవర్నమెంటువారి కొలువులో ప్రవేశించుటకు వీలు లేదు గనుక ఎందుకైనా మంచి దని నాలుగేళ్ళో అయిదే

ళ్ళో మొదట తగ్గించి చెప్పుట శిష్టసాంప్రదాయము. వేశ్యాంగన లెంత ముసలివారైనను పంద్రెండేండ్ల బాల లగుదురు.

ప్రశ్న—చిన్నవాడు పెద్దవా డెప్పుడగును.

ఉత్తరము—తప్పుసాక్ష్య మీయవలసివచ్చినపుడు అనగా నలుబదియేండ్ల వయస్సు గలవారు తాను పుట్టకమునుపు గాని తన చిన్నతనములో జరిగిన సంగతి గాని కోర్టులో జెప్పవలసి వచ్చినప్పుడు అబ్బో నేనిప్పటివాడనా అఱువదియేండ్లున్న వని యొకడు ఆనకట్టుకట్టినప్పటికై దేండ్లవాడి నని యొకడు, వికారిసంవత్సరము గాలివానకు వీధుల వెంట దిరుగుచుంటినని మఱియొకడు జెప్పి పెద్దవాడు కావలసిన యువసరము వచ్చును. సన్యాసులు చిన్నవారైనను పెద్దవారగుట అవశ్యము. ఏలఅనగా సన్యాసులలో చాతుర్మాస్య లెక్కుడు గడచినవాని కేగాని పూజలు గలుగవు. అందుచేత చిన్నవాడయినను ఎక్కుడచాతుర్మాస్యలు చెప్పుకొనుచుండును.

ప్రశ్న—తల్లిదండ్రులయెడ భక్తి లేనివాడు ఎప్పుడు పరమభక్తుడగును.

ఉత్తరము—తల్లిదండ్రులు చనిపోయిన తరువాత నొకప్పుడు పరమభక్తుడగును. బ్రతికియున్నపుడు తలిదండ్రులకు బట్టలియ్యనివాడు శ్రాద్ధసమయములందు బ్రాహ్మణులకు మంచి బట్ట లిచ్చును. బ్రతికియుండగా వారి కన్న మెప్పుడు బెట్టనివాడు, బ్రాహ్మణులకు అరిశెలు గారెలు పరమాన్నముతో భోజనము పెట్టి మామిడిపండ్లు నరటిపండ్లు ఫలహారము లిచ్చును. బ్రతికియున్నపుడు మరియాద లేకుండ దిట్టినవాడు చనిపోయిన తరువాత మానాయనగా రని మానాన్నగారని ప్రశంసించుచుండును.

ఒకేపట్టణమున జిల్లాకోర్టు, సబుకోర్టు కూడా కలదు. అక్కడి ప్లీడర్లలో కొందరికా సబుజడ్జిగారియందుండు వైమనస్యముచే ఆకోర్టునకు తాము వెళ్ళనేవెళ్ళమని బింకములు పలికిరేని ఆబింకములు తక్కిన ప్లీడర్లరొట్టె నేతిలో పడుటకేనా. ఇంకేమయిన ప్రయోజనము కలదా ?

రివిన్యూ యిన్‌స్పెక్టరువారు తమ ఖండములో సర్క్యూటు దయచేయించే దినములలో కరణంగారింట్లో తప్పావేస్తే (భోజనముచేస్తే) సౌఖ్యమా, లేక గ్రామస్థులకొంపలుమాపి సప్లయిపుచ్చుకుని వంటచేసుకొని భోజనముచేస్తే సౌఖ్యమా ?

ఒక గ్రామమందుండు ముసలి సోమయాజులుగారిని, ఆయన తాలూకు పడుచు సోమిదేవి నానాదుఃఖములు పెట్టి యేడ్పించుచుండును. ఆసోమయాజులుగారి యజ్ఞఫలము సమకూడి రంభాసమాగమమునకు స్వర్గయాత్ర కేగుతరి సోమిదేవిగారు ఎలుగెత్తి రోదనము జేయసాగిరి. ఆమె ఏడ్పుటకు కారణము తలవెంట్రుక లూడిపోవుననియా తాను నానాదుఃఖములు పెడితే పడువారు యెవరూ లేరనియా ? సాగనుకత్తెయగు రంభను తనభర్త కూడుననియా, లేక ఏడువలేకపోతే యిరుగుపొరుగు అమ్మలక్కలు మూతులు ముక్కులు విరుతురనియా?

లింగధార్లకు వైష్ణవులకు మత సంబంధమగు కల్తలు పెరిగి నాయకులగు బసవయ్యలింగంగారు మారేడుకొమ్మ పట్టుకొని, రంగాచార్యులుగారు తులసికొమ్మ పట్టుకుని యుద్ధ మారంభించిరేని ఎవరికి జయము ఎవరికి పలాయనము?

దావా తెచ్చినపైని రాజీపూర్వకముగ నేమైనలభించునని తెచ్చిన దావాలో రాజీకుదరదని తన కపజయము తప్పదని తెలుసుకున్న పార్టీ సాధ్య మగునంతకాలము దావా విచారణ జరగకుండా వాయిదాలు

వేయించే ప్రయత్నము చేయవలసినదేనా, ఇంకేమయిన ఆలోచన ఉన్నదా?

ఫూల్సు (Fools)

తన అసమర్థతను గుర్తెఱుగక ఇతరులను హేళన చేయువాడు నాలగవవంతు ఫూలు (One fourth fool)

తన్ను లోకమందు తెలివితక్కువ మనుసదెఱుంగక యితరులను 'ఫూలు' అనువాడు సగముఫూలు (Semi fool)

అసమర్థతచే కలమాడక, పిరికితనముచే నోరు పెకలక, ఇంట భార్య కోపించుననుభయము, బయట అధికార్లు కోపింతురను భయము, నలుగురిలో ఎవ్వరేమి పరిహసింతురో యను భయము గడగడ చలివేయుచుండ, పయివారెవ్వరు లేకుండ జూచి తన క్రిందివారితో మెల్లగా ఊపిరి బిగియబట్టి గొప్పవారిని ఫూలు అనువాడు సరియయిన ఫూలు (Fool)

ఈతని సంగతి ఎంతటిదో చూతమని పదేపదే "తన్నే తానానన్యా" చేయుచున్న క్లయింటును లోకువగా నెంచి ఇదే సమయమని నిక్కి విర్రవీగుచు "నాక్లయింటు నాకాలి క్రిందపడి వుండవలెనని" ప్రగల్భములు కొట్టి ఆక్లయింటు తన్ను లక్ష్యపెట్టక పరాభవించిన పయిని ఏదో జేసినము త్రయిదువవలెనే మౌనముద్ర వహించిన న్యాయవాది.

డబుల్ ఫూల్ (Double fool)

ఎదుట నీవు దేవుడంతవాడవు నేను నీ భక్తుడను నీ అంతటివాడు లేనే లేడని ప్రతివారిని ముఖమున పొగడుచు పరోక్షమున ఆ నోటనే హేళనముజేయుచున్న గడసరియొక్క నైజము అందరు గుర్తెరిగి యీతని మాటలకు నవ్వి ఊరకుంటయె ముఖస్తుతులకు తగు పరాభవమని లోకు లల్లాచరించుట గ్రహింపలేక నదేపనిగ తానే గడు

సు వాడననుకొని ఎదుటపొగడుచూ, వెనుక హేళనము చేయుచుండు పెద్దమనిషి. ట్రిబిల్ ఫూల్ (Trible fool)

ఇట్లు ఫూల్సు అయిదు తెగలవారు. వీరికి క్రమాలంకారముగా ఇడియట్, డన్స్, క్రేక్, బ్లాక్ హెడ్, స్టుపెడ్ అను పర్యాయనామము లను పెద్దలమర్చియున్నారు. సరసులగు చదువరులు నవ్వుచు దీనిం జదివి ఆనందించెదరు గాని పయిలిస్టులో చేరిన ఫూల్సు ఆగ్రహించు కొనక మానరు. వారిసంగతి వివరించితినేగాని వారిని నేను తిట్ట లేదని విన్నవించుచు వారికి కలిగెడు యాగ్రహము వారు ఫూల్సు అవుటనే కలిగినదని యదార్థవాదినగు నన్ను మన్నించమనియు వేడు కొనుచున్నాను.

ప్రశ్న—క. వరహాలపురములో పూర్వము జడ్జిపనిచేసిన దొర గారు చెరువుగట్టుమీద కట్టించిన సత్రమిప్పుడున్నదా? ఉన్న పక్షమున దానిలో నిప్పుడు వెనుకటివలెనే మార్గస్థులు బసలు దిగి వంటలు చేసి కొనుచున్నారా?

చ. మునిసిపల్ పెంటబండ్లను లాగునట్టి యెద్దుల నిమిత్తమై యుపయోగపడుచున్న తట్టలు, గడ్డిమోపులు మొదలయిన సరకులు ఆ సత్రములో దిగి బసచేయుచున్నవనియు, అందుచేత మనుష్యులు మును పటివలె బసలుచేయుటకు వీలులేకున్నదనియు జనులు చెప్పుకొనుచున్న మాటలో నేమైన సత్యము కలదా?

ప్రశ్న—క. మునిసిపల్ బండ్లను లాగునట్టియెద్దులలో కొన్నిటి కన్నులు ఎండవేడిమిచేత పువ్వులు వేసిపోయినవని లోకు లనుకొను చున్న వాడుక నిజమా యబద్ధమా?

చ. ఇప్పుడు చూపుచున్న యాదరణమే యాయెద్దులకుచూపు చున్న పక్షమున తక్కినయెద్దుల కన్నులుపోవుట కెంతకాలముపట్టును?

ప్రశ్న—వరహాలపురము మునిసిపల్ ఆసుపత్రిలో జనుల కవసరములైన యౌషధములు కొన్ని లేకపోవుటకు గారణ మేమి? మునిసిపల్ వారు తగినంత సొమ్ము కర్చుపెట్టకపోవుటచేతనా? జనుల దురదృష్టముచేతనా? మనవారు కొనదలచినప్పటికి ఔషధములు దొరకకపోవుటచేతనా?

ప్రశ్న—క. అనప్పిండివారి వీధిపైన పొర్లుచున్న మురికినీళ్ళు యేరు లేకుండ జేయుటకై ఏమేమియుపాయములు మీకు తోచుచున్నవో అవియెల్ల వ్రాయుడు?

చ. కారెముతో పూట కాని పత్తామెత్తుటగాని .కూడతోడుగాని చేసి యీనీ రావలకు వెళ్ళగొట్టవచ్చునా లేక కిరసనాయిలు యింజను పెట్టవలసియుండునా?

ప్రశ్న—క్రొత్తగాపోసిన పోతగట్టుకు ప్రతిదినము వందలకొలది మనుష్యులు దిగుచున్న కంభంవారి సత్రమురేవున విశాలములైన మెట్లువేయక జనశూన్యమైన వడ్డివీధికి యెదురుగ విశాలమైన మెట్లుకట్టుట యెవరి బుద్ధికుశలత? దీని కిప్పుడైన ప్రతిక్రియ జరుగుటకు వీలున్నదా?

ప్రశ్న—మునిసిపల్ కౌన్సిలరులు తమ నియమితకాలమనగా మూడుసంవత్సరములు సమాప్తము కావచ్చినప్పుడు తిరిగి కమీషనరు పదవి తమకు వచ్చుటకై పడవలసినజాగ్రతలేమిటి? అరుగులు పెంచి గోడలు జరిపి జనులుచేసుకొన్న ఆక్రమణలు చూచి, చూడనట్లూరకొనుట, తూములలోనుండి వచ్చిన మురికినీరునకు ప్రాసిక్యూషను చేయకపోవుట, వార్డులలోనికి సాధారణముగ రాకపోవుట యనెడు జాగ్రత్తలుగాక యితరములైన జాగ్రత్తలేవైన పడవలెనా?

ప్రశ్న—క. పెద్దదొడ్లు లేనివారు నూయి త్రవ్వించుకొనవలసి వచ్చినప్పుడు తమ నూతినీరు వీధిలోనికి వెళ్ళినపక్షమున తమ కేవిధ

మైన యిబ్బంది లేకుండ జేసికొనుటకై ధర్మమను పేరుపెట్టి సగము నకాయికాని నూటిలో నాలుగవవంతుగాని ప్రజలనిమిత్తమై వదలి వేయుట గాక మరి యుపాయ మేదైననున్నదా ?

చ. చిన్న చిన్న సందులలో గొందులలో గూడ ధర్మనూతులు బయలు దేరుట కీకారణముగాక మరియొక కారణమేమైననున్నదా ?

ప్రశ్న—తాలూకాబోర్డు మెంబర్లకు డిస్ట్రిక్టుబోర్డు మెంబర్లకు మునిసిపల్ కౌన్సిలర్లకు తమచుట్టు జరుగుచున్న అక్రమములు, ఆక్రమణలు కనబడునట్లు చేయుటకై ఏదైన మంచికాటుకచేసి యియ్యగల వైద్యుడు లోకమున కలడా ?

పురమందిరము

(గజముఖరావుగారు హయగ్రీవరావగారు ప్రవేశించుచున్నారు)

గజ—ఏమండోయి హయగ్రీవరావుగారు ! ఈవేళ మీకే మైనా పని యున్నదా ?

హయ—అట్టే పనేమీ లేదు. కాని యెందుకు ? నావల్ల మీకేమిపని కావాలి.

గజ—నాతో కూడా మీరొకచోటికి సాయము రావలెను.

హయ—ఎక్కడికి ?

గజ—నేను పురమందిరమునకు వెళ్ళుతున్నాను.

హయ—పురమందిరానికి వెళ్ళితే సాయ మెందుకండోయి. మీమాటలు విచిత్రముగా నున్న వేమిటి.

గజ—ఎందుకయితేమి మీరువస్తురూ నామాట విని. కారణం తరువాత చెపుతాను.

హాయ—కారణం చెప్పితేనేకాని నాకు రావాలని లేదు. ముం దుగా కారణం చెప్పండి.

గజ—పురమందిరములోకి నేనొంటిగా వెళ్ళిన పక్షమున ఒంటి గాడినిచేసి నన్ను యెవరైనా దొంగలు కొడతారని భయము.

హాయ—(ఆశ్చర్యముతో) ఇదేమిటండోయి, ఇప్పుడు సాయం కాలము ఆరుగంటలైనదికదా, ఇండ్లలోకి సయితము దొంగలర్ధరాత్రి వేళ నిద్రపోవుచున్నప్పుడు కాని రారు. నూట దీపాలు పెట్టలేదిప్పటికి ఇప్పుడే అంత భయమేమిటయ్యా పురమందిరములో.

గజ—జనసమ్మర్దము లేని చోట పగలేమిటీ రాత్రేమిటి. మాపూరి సంగతి మీరు బొత్తిగా ఎరుగరు. పట్టపగలు రెండుజాముల వేళ పురమందిరమువద్ద ఒక యింట్లో ఒక పిల్లని చంపివేసినారు. పట్ట పగలే యింతపని జరిగినప్పుడు సాయంకాలము ఆరుగంటలకు పురమంది రము వంటి జనసమ్మర్దము లేనిచోట యేదైనా ప్రమాదము జరుగుట దేమియాశ్చర్యము.

హాయ—సమర్దము లేకపోవడ మేమిటి. అందులో మెంబ ర్లెంతమందున్నారు.

గజ—నూటపాతికమం దున్నారు.

హాయ—నూటపాతికమం దున్నప్పుడు భయమేమిటయ్యా.

గజ—ఉండడం నూటపాతికమం దున్నారు. కాని వచ్చేవా రెందరని అడగరేమి మీరు.

హాయ—అందరూ రారా యేమిటి సాయంకాలము చదువు కుందురు ?

గజ—అందరూకాదు కొందరు వస్తారా అని అడగండి.

హాయ—ఎవరూ రారా యేమిటి.

గజ—రాకేమి. నావంటి తెలివితక్కువవాళ్ళు యిదివరకొక్కడో యిద్దరో వస్తున్నారు.

హాయ—ఎందుచేత రావడంలేదు.

గజ—ఎందుచేతనని చెప్పను. రావలెనని యిష్టములేదు. అందుచేత రావడంలేదు. వారు పెద్దలు మన మనడానికి తగదు.

హాయ—అయితే చందాలిచ్చుకొని చదువుకోకుండా యూరకుంటారా?

గజ—ఎవరో తెలివిమాలినవాళ్లు నావంటివాళ్ళే చందాలు యిచ్చుచున్నారు. తెలివయినవాళ్ళాపనిగూడా చెయ్యడంలేదు. ఒక్కొక్కరు నెలకి రు 0-8-0 లు చందా యివ్వవలసినవాళ్ళు అరవయి డెబ్బదిరూపాయలవరకు బాకీయున్నారు. నూరు రూపాయలు కూడా యున్నారు.

హాయ—చీట్లపేక బల్లలు చదరంగవు బల్లలు లేవా యేమిటి మీపురమందిరములో.

గజ—లేకేమి మునుపె చదరంగపుబల్ల చీట్లపేకబల్ల కొంచెము సందడిగా యుండేది. వాటిమీద కూడా యిప్పుడు మోజు తగ్గిపోయినది. టెన్నిసుకోర్టుంది కాని సరసంచారము లేకపోబట్టి అక్కడ చిగిలింత సీమసేపాళము మొలిచినది.

హాయ—అయితే యిటువంటి భయసమయములో నీవు టౌనుహాలు కెందుకు వెళ్ళవలెను.

గజ—దక్షిణాఫ్రికాలో మనవారి గతియేమైనదో కాస్త పత్రికలలో జూడవలెననియున్నది. కాని వెళ్లితే యొంటిగాడి నగుటచేత దొంగలే కొట్టిచంపుతారో, లేక పిశాచములే మీదపడి కొట్టి చంపునో అని భయమువేయుచున్నది. కాబట్టి నీవు తప్పక రా బాబూ.

హాయ—ఆహాహా! ఏమి పురమందిరమండీ. ఏమండి జనుల శ్రద్ధ. (అని యిద్దరు నిష్క్రమింతురు)

శృంగార చేష్ట.

[రాజు బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నారు]

రాజు—శాస్త్రిగారూ ! మీనివాసస్థలమేదండీ ?

బ్రాహ్మ—చిత్తము నాకాపుర మీగ్రామమే.

రాజు—మీరిప్పుడేపనిమీద దయచేసినారు ?

బ్రాహ్మ—దేవరవారిదర్శనార్థము వచ్చినాను.

రాజు—ఏమిపనిమీద వచ్చినారు ?

బ్రాహ్మ—(తనదౌడ జూపుచున్నాడు.)

రాజు—ఏమిది దౌడ జూపుచున్నారు. పాప మీదవుడ మీకు వాచిన దేమి ? ఆపట్టు వేసినదేమిటి సున్నము బెల్లమా ? అడిగిన మాట కుత్తరము చెప్పక, దౌడజూపుట నాకాశ్చర్యముగానున్నది. మీయభిప్రాయమేమిటో నాకు చెప్పండి.

బ్రాహ్మ—ఆదౌడమీద నాకు గట్టిదెబ్బ తగిలినది.

రాజు—పాపము ! నాతో ఫిరియాదు చేయుటకు వచ్చినారా కిట్టనివారెవరో మిమ్ము కొట్టియుందురు. వారిపేరు వెంటనే చెప్పండి వారిని తగిన శిక్ష జేయింతును.

బ్రాహ్మ—నన్ను కొట్టినవారు కిట్టనివారు కారు. నాకాప్తులే.

రాజు—అట్లయిన నెవ్వరు కొట్టిరో చెప్పండి శిక్షించెదను.

బ్రాహ్మ—పేరు చెప్పెదను గాని మీరు శిక్షింపవద్దు. (అది శృంగారచేష్టగాని దెబ్బగాదు.

రాజు—ఎవరిశృంగారచేష్ట ?

బ్రాహ్మ—అది నాప్రియభార్యయొక్క శృంగారచేష్ట

రాజు—(ఆశ్చర్యముతో) ఇదేమి శృంగారచేష్టయ్యా శృంగార చేష్టయనగా మాటలాడు కొందురు. పలుకాడుకొందురు. పరిహాసము చేసికొందురు. కాని దాహ వాచునట్లు చెంపకాయలు కొట్టుకొందురా?

బ్రాహ్మ—నాభార్య స్వయముగా నన్నుకొట్టలేదు. ఒకరిచేత కొట్టించినది.

రాజు—ఇదేమిచిత్రమయ్యా! భార్య యొకరిచేత కొట్టించుట మీరు వచ్చి నాతో జెప్పుకొనుట మిక్కిలి సరసముగా నున్నదే. నీచరిత్రమేమిటో విస్పష్టముగా జెప్పు.

బ్రాహ్మ—చెప్పెదను చిత్తగించుడు. నాకు ముగ్గురు భార్యలున్నారు. పెద్దభార్యపేరు ఆకలి. రెండవభార్యపేరు దాహము. మూడవ భార్యపేరు ఆశ. ఈముగ్గురు భార్యలు మహాపతివ్రతలు. నేను జీవించియుండగా నన్ను విడిచి మరియొకని తావునకు బోరు. ముగ్గురిలో చిన్నభార్య యగుఆశకు నాకు ఒకటే ప్రాణము. ఆమెమీద నాకెంత ప్రేమ కుదిరినదనగా ఆమె గీచినగీటు దాటను. ఆమె యేపని జేయుమన్న నాపని జేయుదును. ఆమె నాముద్దులభార్య ఈదెబ్బ ఆమె యొక్క శృంగార చేష్టితము.

రాజు—దెబ్బకారణమేమో స్పష్టముగా విప్పిచెప్పండి?

బ్రాహ్మ—చిత్తము మీయమ్మగారు నిన్న లక్షవత్తుల నోము చేసినారు. అప్పుడు బ్రాహ్మణుల కందరికి తలకొక రూపాయి సంభావన ఇచ్చినారు. నేను మొదట సంభావన పుచ్చుకొని ఆశచేత సంభావన ముట్టలేదని దొంగవేషము వేసి అబద్ధము చెప్పి దొడ్డిదారిని మీయింటిలో మరల దూరపోవుచుంటిని. మొదటనేను సంభావన పుచ్చుకొనుండగా జూచిన మీబంట్రోతొకడు నన్నానవాలుపట్టి గుమ్మముదగ్గఱ నన్నటకాయించెను. నాప్రియభార్య ప్రేరణముచేత

నేను వానిని బుకాయించి టకాయించవలెనని చూచినాను. వెంటనే వాడు జకాయించి యొక చెంపకాయ కొట్టినాడు. అప్పుడు వెంటనే మొగము తిరుగ నేనింటికి వెళ్ళిపోయి యీపట్టు వేసికొంటిని. ఇది జరిగిన యావద్వృత్తాంతము. మీద దేవరవారి చిత్తము.

రాజు—అయ్యో! బ్రాహ్మణుడా నీ ప్రియభార్యకు నీమీద నెంతో ప్రేమ యున్నదిగాని ఆమె ప్రేమను నీకు బాధగా బరిణమించుచున్నది. ఇకమీద నామె చెప్పినట్టు లెన్నడు వినకుము.

బ్రాహ్మ—దేవా! నేను శాస్త్రములు చదువుకొన్నాడను, స్వాధ్యాయములు చదువుకొన్నాడను ఎన్ని చదువుకొన్నను పొట్టగడచుటలేదు. దారిద్రవశేమున నిట్టి పాడుపనులలో దిగితిని. లక్ష్మీనంపన్నులగు మీరు నన్నొక్కసారి కటాక్ష వీక్షణములచే జూచినంత మాత్రమున ఆశా పిశాచము నన్ను వదలిపోవును.

రాజు—బ్రాహ్మణుడా! నీకేమియు భయములేదు నీవుచదువుకొన్నవాడ వగుటచే సాలుకు సరిపడు గ్రాసము నీకు పంపించెదను. ఇక ముందెన్నడు నిట్టి కక్కుఱితి పనులం జేయబోకుము.

బ్రాహ్మ—చిత్తము.

(అని యిద్దరు నిష్క్రమింతురు.)

రామస్వస్తి—రావణస్వస్తి

(ఇద్దరు బ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు.)

ప్రథముడు—ఎవరయ్యా మీరు?

ద్వితీయుడు—మేము బ్రాహ్మణులము

ప్రథ—ఎక్కడ్నించి దయచేస్తున్నారు తమరు?

ద్వితీ—నేనా ! ఈలా దండకారణ్యంలోనుంచి వస్తూవున్నాను.

ప్రథ—దండకారణ్యంలో బ్రాహ్మణులు కాపురమున్నారా ?

ద్వితీ—అయ్యో ! లేకేమి మహార్షు లనేకులున్నారు.

ప్రథ—అయితే మీరేవ రాశ్రమంలోనుంచి వస్తూవున్నారు ?

ద్వితీ—నేనా ! అగస్త్యభ్రాతగారి ఆశ్రమంలోనుంచి వస్తూవున్నాను.

ప్రథ—(నవ్వి) అగస్త్యభ్రాత ఏమిటయ్యా ? ఇదాయినపేరా ? లేక అగస్త్యులవారి తమ్ముడగుటచేత అట్లావచ్చినదా ?

ద్వితీ—ఆయనపేరేమో ఎవ్వరికి తెలియదు అందరు అగస్త్యభ్రాత అగస్త్యభ్రాతఅంటారు. అన్నగారైన అగస్త్యులవారిని బట్టి కొంచెము నామరూపాలు గలుగుతున్నవిగాని స్వయముగా ఆయనకేవిధమయిన పేరుప్రతిష్ఠలు లేవు అయినా నావంటివాడే.

ప్రథ—సరే ! యెటువంటివాడైతే మనకెందుకు ? అగస్త్యభ్రాతగారి ఆశ్రమంలో విశేషాలేమిటి ? అక్కడ మహార్షులేంజెప్పుకుంటున్నారు. యుద్ధవార్త లేమయినా తెలుస్తున్నాయా ?

ద్వితీ—తెలియకేమి ! ఎప్పటికబురు అప్పుడే తెలుస్తూవుంది.

ప్రథ—ఎల్లా తెలుస్తూవుంది ? మీమహామునిగారు దివ్యదృష్టి వల్ల గనిపెడుతున్నారా యేమిటి ?

ద్వితీ—మామహామునికి దివ్యదృష్టి గివ్యదృష్టి యేమిలేదు. ఎప్పటికప్పుడు వానరులు వచ్చి చెప్పుతూవున్నారు అందువల్ల మాకెప్పటివార్త అప్పుడు తెలియుచున్నది.

ప్రథ—అయితే రావణయుద్ధ మేలాగున్నదో తెలిసిందా ?

ద్వితీ—చాలవఱకు తెలిసింది. ఇంద్రజిత్తు కుంభకర్ణుడు మాల్యవంతుడు మొదలయిన పెద్దతలకాయ తెగిరిపోయినాయి సర్వనో

మహా వృశ్చికరోముడు మొదలైన దేవాంతక నరాంతకులు గూడా వెళ్ళిపోయినారు.

ప్రథ—రావణాసురు డేమైనాడు ?

ద్వితీ—రావణాసురుడు గూడా వెళ్ళిపోయినాడని కింవదంతి పుట్టినది.

ప్రథ—పోయినాడూ ముండాకొడుకు ? నేటికాలానికి పీడకి వినాశమొచ్చింది ? చావవలసిందే దిక్కుమాలిన ముండాకొడుకు. పుత్రమిత్ర కళత్రములతో నాశనమైనాడూ ? పది తలకాయలు ముంజికాయలలాగ నేల రాలిపోయినాయిగదా ? లోకపీడ వదలిపోయింది నేటితో యింద్రుడికష్టం తీరింది దేవతల బెంగతీరింది బ్రాహ్మణులబాధ పోయింది యాగములు బాగా సాగవచ్చును. సూర్యచంద్రులు హాయిగా తిరుగుతాడు. రాములవారికి స్వస్తి స్వస్తి. మహానుభావు డారాముల వారు గెలవక యీ పాడుముండాకొడుకు గెలుస్తాడు ? ఆయనయోగ్యత యెక్కడ ఆయనెక్కడ ? ఆపితృవాక్య పరిపాలనము, ఆ సోదరప్రేమ, ఆ వైరాగ్యము, ఆ వినయము ఎవరికొస్తుంది ? అడవిలోకి వెళ్ళు మన్నప్పటికి సవతితల్లిని ఒక్కమాట మాటాళ్ళేదుగదా ? పాపము ! ఆ సీతామహాదేవి భూదేవతగదా ! అటువంటి పతివ్రత నెత్తుకపోయిన దుర్మార్గుడు మన్నుతాడా ? ఛీ వీడిమొగంమండా తలుచుకుంటె పాపం వీణ్ణి రాములవారు విల్లెక్కబెట్టి బాణాలొదితే యీ నిర్భాగ్యుడా నిల్చేవాడు ? ఇంద్రాదిదేవతలు నిలువలేరు ! పరశురాముడివంటివాడు భంగపడిపోయినాడు స్వస్తి; రాములవారికి స్వస్తి పదివేల సంవత్సరాలు ఆయనే భూమండలం యేలవలె ఈ రాక్షసజాతి మాడిపోవలె. వేరులేకుండ మాడిపోవలె.

ద్వితీ—ఇందులో ఒక్క సందేహమున్నదయ్యా రాములవారు రావణాసురుణ్ణి తలలు ఊడగొడ్తూంటే అవి తిరిగి మొలుస్తున్నాయట

అందుచేత పూర్తిగా చచ్చిపోయినాడాలేదా మళ్ళాబతుకుతాడా అని సందేహంగా వుంది.

ప్రథ—(భయముతో) ఆలాగా! బ్రతుకుతాడా యేమిటి? వాడు బతికినాడంటే మనం చచ్చావన్నమాటే. ఏదో ఒళ్ళైరక్క యిష్టమువచ్చినట్టు కూశాన్నేను ఎవరు విన్లేదుగద కొంపతన్ని అయినా ఒక్కసంగతుందండీ, రావణాసురుడు అనుకున్నంత దుర్మార్గుడుకాడు లోకులుకాకులు ఇదిగో పులిఅంటె అదిగో తోకంటారు. దున్నపోతు యీనిందంటె దూడనుగట్టివేయమంటారు కాకపోయినా రావణాసురుడు సామాన్యుడా బ్రహ్మదేవునకు మునిమనుమడు పులస్త్యబ్రహ్మకు మనుమడు విశ్రవసుబ్రహ్మకు కొమారుడు నాలుగువేదములు తు, చ, తప్పకుండా గట్టిగావచ్చును. సామవేదంలో పెట్టింది పేరు, భక్తి జూడ వస్తే అసాధారణ మయింది. రోజూ నవకోటిశివాలయాలు పూజ్జేసేవాడు. తపస్సుచేసినప్పుడు తొమ్మిదితలకాయలు తామరపువ్వుల్లాగు కోసి హోమంచేసి వేశినాడు పరాక్రమ మెటువంటిది కైలాస పర్వతం చేతులతో యెత్తి గడగడలాడించాడు. దేవేంద్రుణ్ణి ముప్పు తిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్లుతాగించాడు ఆకారముజూడవస్తే పదితలలు. ఇరువై చేతులు ఎవరున్నారయ్యా ఆలాంటివాడు మళ్ళీని. పాపము మంచిబ్రాహ్మడు రావణాసురుడు. ఆమండోదరి మంగళ సూత్రం గట్టిగావుండవలెపాపం బతకవలె రావణాసురుడు లక్షయేండ్లు బతకవలె కాక పోయినా యీరాములవారేమిటయ్యా పనికిమాలిన ఆడది కైక అడవికి వెళ్ళమంటేవెళ్ళడమే చచ్చుఘటమయ్యా, త్రాణ లేదు. అందుకే అతనికరణ్యం తగివుంది ఆశూర్పణఖ ముక్కు చెవులు, గోయించడమేమిటి? పనిలేని మంగలి పిల్లితల గొరిగాడన్నట్లు. పైగా ఆసీతాదేవి తెలివేమిటి? తనకోసం లక్ష్మణస్వామి కాపుంటే అతణ్ణి

నోటికిరాని పాడుకూతలుకూసి సాగనంపింది. అటువంటి తెలివితక్కువ వారి కిటువంటికష్టాలు రాకమానుతవా? చేతులార తెచ్చుకున్నవి గనక అనుభవించనీ స్వస్తి; రావణాసురుడికి స్వస్తి.

ద్వితీ—ఏమయ్యా? రామస్వస్తి; రావణస్వస్తి ఒకచోటనే వచ్చినది.

ప్రథ—ఏమయ్యా! ఒస్తే తంటాఏమిటి? ఎవడుగెలిస్తే వాడే మనవాడు గెల్చినకోడేనంది. పేలిన టపాకాయేమంది. చెల్లిననాణెమే మంది ఎవడెల్లాపోతేమనకేమి? మనకు స్వస్తిగావలె నుండు.

ద్వితీ—ఛీ! నీవంటివాడితో మాట్లాడగూడదు. ధర్మాత్ము డయిన రాముడే గెలువవలె దురాత్ముడయిన రావణాసురుడు నశింప వలెనని యెల్లప్పుడొక్కమాట మీదనే యుండవలెనుగాని యిన్ని మాటలు పనికిరావు. నడు! అవతలికి.

(ఇద్దరు నిష్క్రమించుచున్నారు)

దెబ్బ దేవేంద్రలోకము.

నాపేరు సింగన్నపంతులు. నాకిప్పటికి డెబ్భైయేళ్ళున్నాయి. పభైయేళ్ళనుంచి నేను బడిపంతులుపని చేస్తున్నాను నాదగ్గర చదువు కొన్నాళ్ళెందరో బాగుపడి యుద్యోగాలు చేస్తున్నారు. మొదటినుంచి కూడా నాసిద్ధాంతమేమిటంటే దెబ్బ దేవేంద్రలోకమని. బడితెబాజా చేస్తేనేగాని చదువులు రావని సంధ్యలురావని పిల్లవాళ్ళు బాగుపడరని బుద్ధిమంతులుకారని నాయభిప్రాయము. ఈయభిప్రాయముతోటే నే నొక యర్ధశతాబ్దముపాధ్యాయుడనై యున్నాను. నేను కోదండాలు వేయించాను. ఈతజువ్వలతోను కఱ్ఱలతోను గొడుగుకామలతోను చేతి కేమిదొరికితే దానితోను బాది, యేమీదొరకకపోతే దేవుడిచ్చిన చేతి

తో మణుగుద్దులు కొన్ని గుద్ది చరుపులు వేసి తొడపాశములు పెట్టి చెంపకాయలు గొట్టి బుగ్గలు సాగదీసి గిద్దెడు నూనె యింకేటట్టు మొట్టికాయలు మొట్టి యెండలో నుంచోబెట్టి అన్నానికి వెళ్ళనియ్యకుండా ఆపి గోడకుర్చీలు వేయించి వీపులమీద బరువులెత్తి యింకా అప్పటప్పటికి నాబుద్ధికుశలతకొద్ది తోచినశిక్షలు చేసి బాలురను బాగుచేసినాను. నాజీవితకాలమంతా పిల్లవాళ్ళబుద్ధికోసమే ధారపోసినాను. నాపేరుచెపితే పిల్లలకు హడలు సింగన్నపంతులుపేరు వింటే నిద్రపోతూన్నపిల్ల లులికిపడి లేచేవారు. పంతులుగారూ నేనల్లరచేయుడము లేదండని నిద్రలో పలవరించేవారు. పిల్లవాళ్ళు పెద్దవాళ్ళై నాదగ్గర చదువులుమానేసి వ్యవహారాలు చూచుకుంటూన్నప్పుడుకూడా నేను కనబడితే గడగడలాడిపోయేవారు. శరీరము ముచ్చెమటలుపోసిపోయేవి. రెండుమూడేళ్ళ పిల్లలు మారముచేస్తూంటే తల్లిదండ్రులు సింగన్నపంతులూ అని పిలిచారంటే మారముమానేసి మూగవాళ్ళలా కూర్చునేవారు. ఇంతెందుకు నాపేరంటే సింహస్వప్నము అలాగుండబట్టే పిల్లలు బాగుపడ్డారు. గోడదగ్గిర కూర్చుని పిల్లవాడు చదువుతూ తప్పుచదివాడంటే తలకాయ గోడకువేసి కొట్టేవాణ్ని. గోడబెల్లులూడి క్రిందపడేవి. ఆలాటిరోజులు పోయినాయి. ఆదినములు వేరు. ఆచదువులు వేరు. అందుకనే అప్పుడు బాగా చదువువచ్చేది. ఇప్పుడు ఓ అంటే ఢం రావడంలేదు. ఎందుచేతంటారు. దెబ్బలు కొట్టకూడదనడంచేత. ఏవోరూల్సు వచ్చాయట వీళ్ళరూల్సు మండిపోను. పిల్లవాళ్ళను బండలనుచేయుటకే రూల్సువట్టాయి. నావంటివాళ్ళు యీరోజులలోగూడ కొందరు బయలుదేరినారు గనుక నాకు చాలాసంతోషముగా నున్నది. చెన్నపట్టణములో గొప్పయొక కాలేజియున్నదట! అక్కడ తెల్లవారే యుపాధ్యాయులట. ఆయన మహాతపోధకుడుకూడానట. అటువంటాయన పెద్దపెద్దక్లాసులలో చదివే విద్యార్థులను వీపుమీదబట్టవేయించి వీపుబద్దలయ్యేటట్టు పిఱ్ఱతో

ళ్ళేగిరేటట్టు బహుచమకుగా బజాయించినాడట. ఆమాటవినగానే భేష్‌వహాయని నేను చంకలు కొట్టుకొన్నాను. ఈ క్రొత్తరూల్సువచ్చి విద్యార్థులు పాడై పోయిన యీరోజులో ఒకానొక దొరగారు అచ్చంగా నామోస్తరుగానే శిక్షలుచేశాడంటేనాకు పరమానందముగానుంది. పూర్వము మనవాళ్ళున్నాయని చెప్పినవన్నీ యిప్పుడు కొందరు సంస్కర్తలు లేవన్నారు. అవిదొరలు వున్నాయన్న తరువాత మన వాళ్ళోప్పుకొంటున్నారు దెబ్బ దేవేంద్రలోకమన్న బడితెబాజా సిద్ధాంతముకూడా దొరలువప్పుకొని న్యాయముగాచేసినారు. గనుక మనవాళ్ళు కూడా వెనకటివిచ్చినమ్ముకాలు మానేసి మాసిద్ధాంతములోకే వస్తారని నమ్ముతున్నాను. కాబట్టి యుపాధ్యాయులంతాకూడా ముందాలాగే చేయవలసినది.

వృద్ధవివాహము

1 రంగము

(సింహాద్రవధాన్లు, వెంకప్పవధాన్లు ప్రవేశింతురు)

సింహా—వెంకప్పవధాన్లూ ఇంకా యెంతదూరం వుంటుంది శాంవయ్యగారిల్లు ?

వెంక—ఏవిటయ్యో సింహాద్రవధాన్లూ ! ఈకాస్తదూరంమే నడవలేకుండావున్నారు.

సింహా—ఆ ! నడవలేకుండా వున్నాననుకున్నావా యేమిటి ! ఎంతదూరంవుందో అని వూరికే భోగట్టాకడిగినాను.

వెంక—అయితే ఆవొగర్చడమెందుకూ ?

సింహా—అయ్యో గ్రహచారమా ? అల్లాంటావేమిటి ! నేనంతడారుఢ్యమైన వాణ్ణో తెలుసునా ?

వెంక—చిన్నప్పుడా ?

సింహా—ఆహా ! ఇప్పుడు మాత్రమో ! నాతో నువ్విప్పుడు మినుపసున్నుండలు తిని చూస్తానూ ! అసలు నాలా వోపిగ్గా కూర్చుని పనిచేసేవాడేడీ ! తాటాకుతో చాపల్లుతాను, చదర్లల్లుతాను, బుట్టల్లుతాను, కత్తివర్లల్లుతాను, కూజాబుట్టలల్లుతాను, సులోచనాల జోడువర్లల్లుతాను, పుస్తకాలసంచులల్లుతాను. ఇల్లా వొహాటేమిటీ ! నీచిత్తం వచ్చినన్నిపనులు చేస్తాను. అన్నట్టింకా చేదలు విసినికఱ్ఱలు మడతవిసినికఱ్ఱలు, యిల్లాంటివి లెక్కేలేదు.

వెంక—అబ్బో ! అయితే మీా రింద్రాళ్ళకన్న కూడా బాగా నయమే అన్నమాట. అయితే యివన్నీ యెప్పుడు నేర్చుకున్నావయ్యా. ఓపికతగ్గి తిరగడం మానేశాకా యేమిటి ?

వెంక—అదుగో ! అల్లాంటేసే కోసం వొస్తుంది. ఓపిక తగ్గడవేవిటి ఆసందర్భం.

వెంక—సరే ఆమాటకేం గాని, ఇదిగో పెళ్ళివారింటిదగ్గిరికొచ్చాం, అక్కడ ప్రస్తావనలో చెప్పవలసిన మాటలన్నీ జ్ఞాపకమున్నాయా ? ముందే చెప్పు ఆనక రసాభాసు చేశావంటే నీపెళ్ళి కుదర్చడం కోసం నువ్వు నాకిచ్చిన నూరు రూపాయలు యెగెయ్యడం సరేకదా యీావ్యవహారం కేసి తిరిగి చూడనైనా చూడనన్నమాట అంచేత ముందీమాటకు జవాబు చెప్పు.

సింహా—ఏమాటికి ! వయస్సైబై సంవత్సరాలని చెప్పడమూ !

వెంక—అంతేనా ?

సింహా—ఇంకేవిటో ! ఇప్పుడు పెళ్ళాడ్డంపిల్లలకోసవ్వూ అందుకోసవ్వూ అని చెప్పడమూ !

వెంక—అందుకోసవేటయ్యా ! స్పష్టంగా చెప్పు.

సింహా—ఇంకేవుంది ! సంరక్షణా అగీ అవడమూ !

వెంక—అ దేమిటయ్యా! నీలదికులా. మీ యింట్లోవాళ్లు నీలాంటి మొగవాళ్ళకి తొంభై మంది కిల్లాంటి సంరక్షణలూ, ఇల్లాంటి అదిలూ చేస్తారన్న మాట లోకమంతా యెరుగుదురు. అందుచేత సంరక్షణకోసమంటే చాలదు. ముఖ్యమైనమాట మరచిపోయావు.

సింహా—ఏమిటి చెప్పాలదీ! జ్ఞాపకం రాకుండా ఉందీ!

వెంక—అయ్యో! మందమతా! ఎగ్గం చేస్తానని చెప్పమన్నాను కాట్టయ్యా!

సింహా—ఆ! ఔనౌను నిజమే జ్ఞాపకం వొచ్చింది అవునుకాని నాకు డబ్బూలేదు. నోట్లోముక్కాలేదు. ఎల్లాగెగ్గం చెయ్యడం?

వెంక—డబ్బులేదుగనుకనే ఎగ్గంచెయ్యడం. ఎగ్గమని చూచిస్తే బోలెడ్డబ్బొస్తుంది. ముక్కా మూట్రా అవొచ్చిన సంధ్యావందనం ముక్కలే చాలు, సరే; దానిమాటకేమి యిష్టవుంటే యేదో చెయ్యవొచ్చు. లేకపోతే మానెయ్యొచ్చు. ఆమాటకేంగాని, ప్రస్తుతం చేస్తాననిమాత్రమను. ఇదిగో పెళ్లివారిల్లు: చెమట తుడుచుకో నిబ్బరంగా నడిచిరా.

సింహా—ఇంకా పెళ్ళిలే దేమీలేదు. పెళ్లివా రిల్లంటున్నావేమి టప్పుడే.

వెంక—ఇల్లావిను, నేనన్నటల్లా నువ్వువింటూంటే నీకు పెళ్ళికాకపోడమేమిటి చెప్పు. నా మంత్రాంగాలవల్ల పీటిబాబుల్లాంటి పెళ్ళిళ్ళు చేయించేసాను. అల్లాంటిదీపెళ్ళి చేయించడము అనగా యెంత! చచ్చుముండాపెళ్ళి.

సింహా—ముండాపెళ్ళనకయ్యా బాబూ!

వెంక—కాదు సంగతి చెప్పాను, నడు లోపలికి గుమ్మాలు మెల్లిగా యెక్కు.

(ఇద్దరు నిష్క్రమింతురు)

2 వ రంగము.

(అప్పుడు కామయ్య భార్య మంగమ్మ, కుమార్తె సత్యమ్మ ప్రవేశింతురు.)

మంగ—ఏమేసత్తీ! ఇప్పుడొచ్చిన తాతని పెళ్ళాడతావా, రాముడు బావని పెళ్ళాడతావే!

సత్య—రాముడు బావనే పెళ్ళాడతా!

మంగ—ముండా! రాముడుగాడైతే నగలేవీపెట్టల్డే! తాతైతే చాలానగలెడతాడు.

సత్య—ఓసీ! ఐతే తాతనే పెళ్ళాడతా!

మంగ—అబ్బే! తాతముసిలాడే! రాముడుబావైతే యెంచక్క చిన్నవాడు, ఎంతో చక్కగావుంటాడు.

సత్య—ఊఁ! ఐతే రాముడుబావేకావాలి,

కామ—తాతసిపెళ్ళాడతే చాలనగలెడతాడే

సత్య—ఊఁ! ఐతే-మరీ-ఇద్దర్నీ పెళ్ళాడితా.

కామ—ఓసీ ముండకానా! నీకమవులో ఎల్లాంటయూహాలున్నాయే!

మంగ—(ముద్దిడుకొని) నాచిట్టికన్నది నాబంగారుతల్లిది నావరహాలమూటేది వెఱ్ఱితల్లి? పో ఆడుకో (పిల్ల గెంతుచూపోవును)

మంగ—అవునుగాని మరి మీామేనల్లుడు రాముడుకాస్తిలేదని కట్నిద్దామన్నిచ్చ్యనంటున్నారుగదా! యింకెవ్వరికిస్తానంటారేమిటి? నిశ్చయం చెప్పండి.

కామ—అదే ఆలోచిస్తూంటే యింతట్లోకే సంబంధం వొచ్చింది.

మంగ—ఈయనెవరేమిటి?

కామ—సింహాద్రివధాన్లుగారని మనవాళ్ళే గొప్పాస్తిపరుడు, మనకుట్టుదానిస్తే రు 500 లు నగలెట్టి రు 300 లు రొక్కం యిస్తానంటున్నాడు. నగలైదువందలు, రొక్కం అయిమువందలు, యిచ్చి ఉభయఖర్చులు పెట్టుకోమంటున్నాను, చిన్నపిల్లయని సంశయిస్తున్నాడు కాని లేకపోతే ఆకాడికిచ్చేసేవాడే, ఇంకా యిల్లావుంది బేరం;

మంగ—ఏవిటో! అల్లా యిచ్చినాసరేకాని యీముసిలాడికివ్వడం నాకేమీ యిష్టంలేస్సుమండీ! అరవయ్యోపడెళ్ళి డబ్బయ్యోపడొస్తూంటే యింకాపెళ్ళీ, పిల్లనివ్వడమూ, యేవిటి.

కామ—ఆ! డబ్బయ్యి ఉంటాయో, యెనభయ్యేవుంటాయో ఆయిన్ని నేనడగలేదనుకున్నావా యేమిటి? యాభయ్యో సంవత్సరవింకా వెళ్ళలేదని చెప్పాడు తలల్లాకాస్త నెరిస్తేనరా? శరీరవెల్లాగుందో చూడు! పిక్కలాగ.

మంగ—మసిమిపొట్టిమీదల్లా కనపడుతున్నాడు అంతేకాని యేళ్ళుతక్కువుండవు ఐతే యిది మొదటిపెళ్ళా? రెండోపెళ్ళా?

కామ—అబ్బే! మొదటిపెళ్ళా మీమధ్యేపోయిందట. ఇది రెండోపెళ్ళి.

మంగ—ఆవిడికేవన్నా పిల్లలా?

కామ—లేరనుకుంటాను. మొగపిల్లలుంటే యీపెళ్ళి అవసరం లేకపోవునన్నాడు.

మంగ—పోనిస్తురూ! లేకపోతే పెంచుకోకూడదూ!

కామ—అన్నట్టింకోమాట చెప్పాడు. ఈయనేమో యెగ్గంచేస్తారుట. పెళ్ళాం లేకుండా యెగ్గం చేయకూడదట. అంచేత యెగ్గంచేయడంకోసం యిప్పుడు పెళ్ళిచేసుకోవలసొచ్చిందన్నాడు.

మంగ—ఏవిటో! షష్టిపూర్తయిపోయిన ముసిలాడు—వీ

రేంచేసినా సరేకాని పిల్లనిమాత్రం ఆముసిలాడి కివ్వడాని కొల్లకొన్నుమండీ !

కాసు—ఆఁ! వొల్లకాదేవిటి! బోలిడాస్తికలిసొస్తుందనిఆ రెండో ఆయన చెప్పాడు కూడాను. వెట్టిపట్టు పట్టకు

(అంత కాశీపతి. చెల్లప్ప యెడముగా ప్రవేశింతురు)

కాశీ—ఏవిటయ్యా! చెల్లప్పగారూ! ఈముసిలిముండాకొడుకు మనమీాదికి పోటీకొచ్చాడేం?

చల్ల—ఏముసిలాడూ?

కాశీ—సింహాద్రవధాన్లయ్యా ఇప్పటికై దారు సంబంధాలు మనకన్నా ముందు వెతికేశాడు. ఆ వెంకప్పవధాన్లతనికెంతో సాయం చేస్తూ సంబంధాలు చూసిపెడుతున్నాడు.

చల్ల—నేనూ చూస్తున్నాను కాదుమరి! ఇదివర కేదో అయిపోయిందికాని, ఈకొత్త సంబంధంమాట అవధాన్లుగారికి తెలిసుండదు.

కాశీ—అయితే సరే! ఏదో ముడెట్టించెయ్యి ఆమట్టుకు యే గుళ్లోనో తదిగిణ్ణాత్తాలని ముడెట్టేసి తీసుకుచక్కాపోత్తాను. తీరిపోతుంది. ఇదుగో మరోమాట ఓవందో, యేభయ్యో అటూయిటూ చూడొద్దు పిల్ల దొరుకుతే చాలు సొమ్ము పారెయ్యొడవే. ఏదో తట్ట తగలవెయ్.

చల్ల—అల్లాగే! అదుగో! కావయ్యగారిల్లు. దయచెయ్యండి.

కాశీ—ఓ! పదండి. తలు పేసుందేం? యీాగుమ్మవేనా? పిలవండి.

చల్ల—ఏవండోయ్.

(లోపలినుంచి)

“ఎవరువారు?”

చల్ల—తలుపుతియ్యండి. నేను.

“ఎవరంటే రావడూ?”

చల్ల—వారెవరూ లేరు. నేనేనండీ!

“నేనేనండీ యేవిటి, యెవరంటేను?”

కాశీ—తలుపుతియ్యండీ! మేమని చెప్పుతూంటేను!

“మేమేవిటి మీ శ్రాద్ధం పేరులేదూ?”

కాశీ—ఆ! తిడుతున్నా రేవిటి? శుభమ్లేను.

చల్ల—నేను చెల్లప్పనండీ! తలుపు తీయించండి.

(తలుపు తెరచి కామయ్య ప్రవేశించును)

కామ—ఓహోహో! మీరటండీ! వొడ్డిగుమ్మా న్నొచ్చే రేం? దయచెయ్యండి

చల్ల—చిత్తం. చిత్తం. ఇలా కూర్చుంటాం.

కామ—తమరు కూడా యిల్లా చాపమీద దయచెయ్యండి.

కాశీ—అక్కర్లేదండి! యెక్కడైతే నేవిటి! (అంతా కూర్చుందురు. వంటనిమిత్తము మంగమ్మ లోనికి పోవును)

కామ—ఇల్లా దయస్ఫుట్టి దేవిటి మామీదివాళ.

కాశీ—మాదయేవిటి, అంతా మీదయతోటే వుంది హా.

చల్ల—ఏవండీ కామయ్యగారూ! మీ అమ్మాయి వివాహం మాటేవాలోచించారు?

కామ—ఏవిటోనండీ సింహాద్రవధానులుగా రిప్పుడే చూసు వెళ్ళారు.

కాశీ—ఆఁ! అప్పుడేరావడం! చూసివెళ్ళడం కూడా అయిందీ తద్ధిగిణత్తొా అని!

చల్ల—అప్పుడే యిక్కడి కొచ్చాడా వొచ్చాట్టండీ! లేదను కున్నాను. అయితే యింకా మాటివ్వలేదుకదా!

కామ—ఇంకాలేదు. కాని యెంత సేపివ్వాల్లేండది. నేనన్నట్ల

యిదువేఁందల రూపాయిలనగలు అయిదువేఁందల రొఖ్ఖం యిచ్చి వుభయఖర్చులు పెట్టుకుంటే యిప్పుడిచ్చేస్తాపిల్లని.

కాశీ—మంచి ఘట్టివాళ్లాగే వున్నారండోయ్ 70 యేళ్ళ ముండావాడు ఆస్తీలే దేవీలేమ వాడికి. అల్లాంటివాడికిస్తానంటారేవిటి ? వాడి వీబూదిపెండికట్టూ, బిళ్ళగోచులూ చూసివ్వాలి పిల్లని అంతే వాడికున్నాస్తి.

చల్ల—ఆమాట నిశ్చయవేనండి వీరికున్నాస్తిలో నాలుగో వొంతేనా వుండబాయినాస్తి.

కాశీ—నాకున్నాస్తిలో అంటారేవిటి? నాచేతినున్న మురుగులు పాటిచేసూ ? వాడిబతుకంతాను పోనీ! ఇల్లాంటి తమ్ముళ్లేజన్మంలో నయినా పెట్టుకున్న పాపాన్ని పోయాడూ ? అదంతాయెందుకు ? బ్రాహ్మణార్థం గుడ్డముక్కలుతప్ప యిల్లాంటి ఝరీ కండువా వాడి జన్మమధ్యంలో చూణ్ణైనా చూశాడూ !

చల్ల—నిజమే! ఇవన్నీ కూడా వీరి స్వంతవేనండి వీరిది జోలిడాస్తి. మీఅమ్మాయి నామసిలాడికిచ్చి మోసపోక వీరికివ్వండి. ఏదో ఓమోస్తరుగా వ్యవహారం పైవలు చేసుకుందాం.

కామ—అల్లాగ్గే; కాని! యేదో ఓమోస్తరేవిటి? నేలన్న వాడికి దమ్మిడీ తగ్గడానికి వీల్లేదు.

చల్ల—అల్లాకాక్కుడు. నేమనవిచేసే దేవిటంటే;—చిత్తగించారా! ఓసంగ తాలోచించాలి అయనకంటె ఈయన యర్రగా బాగుంటారు. ఆస్తి వీరిదిగొప్పది. వయస్సులోనా ఈయనచిన్న. అంచేత పావమ్మ విషయంలో కొంచెం తగ్గించాలి.

కామ—ఏమిటో! రూపంలో యిద్దరూ వొకాళ్ళే. చూశారా ఆస్తిమాటంటే మనవిచేస్తా. వెళ్ళిముందర కనపరిచేఆస్తి నిప్పుణూ

నమ్మకూడదు, మనవ ర్తివ్వావల సొచ్చినప్పు డిందులో నాలుగోవొంతైనా కనపర్చరు. ఇంక వయస్సులోనా? ఇద్దరూ ముసిలాళ్ళే. అంచేత తగ్గించ డానికి వీల్లేదు.

కాశీ—ఆఁ! ఏమిటయ్యా! ముసిలాణ్ణంటావు; సింహాద్రప ధ్నానుకన్న భాగా పది పదిహేనేళ్ళు తక్కువుండాకోమకుని నేను. ఆ భాగానికేం డబ్బు నువ్వన్నట్టిస్తాను. కాని మరి పిల్లవయస్సెంత? ఈ యేడు కాపరాని కొస్తుందా?

కామ—అయ్యో! చిన్న పసికూ ననుకున్నారాయేమిటయ్యా! అప్పుడే యీ యే డారుసంవత్సరా లెళ్ళొచ్చాయి. మీ దటికేడు సంవ త్సరాలెళ్ళి యెనిమిదో సంవత్సరం కూడా వెళ్ళిపోతుందన్న మాట. వయస్సులో లోపంలేదు. సమర్తాడిన వెంటనే కాపరానికి చక్కగా వస్తుందన్న మాట.

కాశీ—సరే! ఆపైని పిల్లల్ని కూడా కంటుందన్న మాట. ఏమిటయ్యా! పిల్లకిప్పుడయిదేళ్ళున్నాయని తేల్చావు. తద్దిగ్గిణ్ణాత్తాఅని.

కామ—ఆఁ! యేమిటయ్యా! యెక్కడో సాంబయ్యలాటి వాడు తప్ప మనబ్రాహ్మల్లో పెళ్ళి చెయ్యకుండా యింతకన్న వయ సొచ్చేదాకా వుంచుతారాపిల్లని.

కాశీ—ఎవరాయనపేరు?

చల్ల—ఎవరో సాంబయ్యట!

కామ—“ఎవరో” అంటారేం? మీ రెరుగరటయ్యా! ఆబొజ్జ వాడూను. బ్రాహ్మణపరువంతా తీసేశాడీమధ్య.

చల్ల—ఏంచేశాడు?

కామ—ఇంకా అడుగుతారేమిటి. కొంపతీసేశాడు. ఈయనగా రన్నట్టు వాడికూతురొహ ర్తికి బాగా పదివద్దాలు గేళ్ళొచ్చేదాకా డబ్బుకోసం పెళ్ళిచేశాడు కాడు. ఆమట్టుగా దభీలుమని సమర్తాడేసింది. అయితే తల్లీవాళ్ళూ మాచెడ్డవాళ్ళులెండి. వెలేస్తారేమోఅని లేదనిదబా

యించేశారు. కాని ఆకుఱ్ఱదానివల్లే నానాఅల్లరీ అయిపోతూంది. ఇప్పటి కూడా ఆపిల్లకి పెళ్ళికాలేదు. చిత్రం.

కాశీ—అల్లానా! అయితే చల్లప్పగారూ! జరుగురుగా మన వోచోటి కెళ్ళాలిరండి. కామయ్యగారూ! మళ్ళీకలుసుకుందాం సెల విప్పించండి.

(అంతా నిష్క్రమింతురు.)

[illegible]. రంగము.

(సింహాద్రవధాన్లు. వెంకటప్పవధాన్లు ప్రవేశము.)

సింహా—ఇంకా పెళ్ళితేదేవీ లేదుగాని, నీ యిష్టవొచ్చినచోటు కల్లా తిప్పి చంపుతున్నావు.

వెంక—నాకోసవా యేవిటి తిప్పుతూంట. ఇందాకటి కావయ్య కూతురు పెద్దదేలని ఒకళ్ళు చెప్పబట్టి యిల్లాదగాపడ్డాంగాని, యిప్పుడు మనంచూడవెళ్ళే పిల్లలాంటిదికాదు. గుఱ్ఱంలాంటిపిల్ల యిందాకిటిపిల్లకి నగలూ రొఖం తక్కువిస్తానని ఋషపెట్టి తప్పించుకు రావలసొచ్చింది కాని యీపిల్ల విషయంలో అల్లా అక్కర్లేదు. పిల్లనిచూస్తే నువ్వొదల నన్నమాట.

సింహా—అల్లాగేం! అయితే త్వరగాపద. లేకపోతే యీలోపున యేకాశీపతో చప్పుని చూసుకుపోగలడు.

వెంక—ఫరవాలేదు. పద. అదుగో సాంబయ్యగారు వీధరుగు మీద కూర్చుని మనకేసి చూస్తున్నారు. రా. కలుసుకుందాం (సాంబయ్యను సమీపింతురు.)

సాంబ—ఒహోహో! వెంకప్పవధాన్లుగార్లాగున్నారు!

వెంక—చిత్తం. చిత్తం. దయచెయ్యండిబాబూ!

సింహా—చిత్తంబాబూ. చిత్తం.

సాంబ—ఈయనెవరండీ.

వెంక—సింహాద్రవధాన్లుగారని, గొప్పవారు మంచి స్వాధ్యాయవేత్త.

సాం—అలాగాండి. ఇల్లా సావిట్లోకి దయచెయ్యండయ్యా!

సింహా—చిత్తం. చిత్తం. (అంతా సావిట్లో చాపమీద కూర్చుందురు.)

సాంబ—ఇంటిదగ్గిరనుంచేనా రావడం.

వెంక—చిత్తం. చిత్తం. పిల్లాజల్లా అంతా క్షేమమా?

సాంబ—మీదయవల్ల.

సింహా—తమకెంతమందండి సంతానం!

సాం—అయిదుగురు మొగపిల్లలు ఇద్దరాడపిల్లలు, నండి.

వెంక—అయితే, సాంబయ్యన్నగారూ! వివాహాం యెంతమంది పిల్లలకి చేశారు?

సాంబ—అబ్బే! ఏదీ! ఇంకాచేద్దా మనుకుంటూంటేనే పెద్ద కుర్రవాడు జర్వవొచ్చి పోయాడుగదా! ఇంక రెండోవాడిప్పుడున్నాడు. వాడికిప్పుడు చెయ్యాలి.

సింహా—పెద్దబ్బాయి పోయాడండిపాపం! తక్కినపిల్లలు చదువుకుంటున్నారు కాబోలు!

సాంబ—లేదుబాబూ మూడోవాడూ, నాలుగోవాడూ వెనక కలరావొచ్చి యిట్టేపోయారు మొన్న పురిట్లోపోయిం దాడపిల్ల. దాని కన్న పెద్దపిల్లవాడుకూడా పురిట్లోనేపోయాడు.

సింహా—అన్నా! పాపం చాలామందిపోయారు.

వెంక—అయితే, యిప్పుడున్నవాళ్లు ఓ మొగపిల్లవాడూ మన పెద్దమ్మాయీ మాత్రవేగాదూ!

సాంబ—అంతే. అంతే.

వెంక—అయితే, అబ్బాయికింకా వివాహం చెయ్యలేదేం.

సాంబ—ఏదీ, ఈయేడు కుద్రదానికీ పిల్లాడికీకూడా ఏకంగా ఏవేనా సంబంధాలు కుదురుతే చేసేద్దామని చూస్తున్నాను. చూశారా, ఈరోజుల్లో మనమనుకున్నట్లు సంబంధాలు జతపడ్డం మాచాలా కష్టమండీ!

సింహా—నిజమేనండి అమ్మాయికి సంబంధంకోసం సంవత్సరము నుంచి చూస్తున్నాను. ఎక్కడా కుదరడంలేదు. సంబంధం చూసిపెట్టుమని మన వెంకప్పవధాన్లుగారితో మనవిచేశాను.

సాంబ—మన కాపుర స్థలమేపూరండి?

వెంక—అయ్యో! అల్లా అడుగుతున్నారేమిటి! వారెవరో మీకు బాగా తెలియదుకాబోలు. వీరిది మావూరేనండీ కాపుర స్థలం మనకి సన్నిహితబంధువులే. సాలీనా వీరికి భూములమీద అయిదారు వందల రూపాయిలొస్తాయి. పైగా నాలుగైదు గరిసిలధాన్యం ఆపైన పనసతోటలు, మామిడితోటలు, కొబ్బరితోటలు, అరటితోటలుం యిల్లాంటివిబోలెడు, వీరింటిప్రక్కనున్న ఇళ్ళన్నీ మొదటవీరివే. ప్రస్తుతం అన్నదమ్ముల పంపకాల్లో రెండు పెద్దనాలుగిళ్ళ భవంతులు, నాలుగు ఖాళీపెరళ్ళూ యిల్లాంటి వావీధులో వారికున్నాయి.

సాంబ—అల్లాగండి.

సింహా—ఏమిటో నాయినా! ఎన్నుంటే నేం అవన్నీ తలుచుకుంటే నాకడుపు చెరువైపోతుంది అన్నింటికి అదిల్లాకుడిభుజంలా వుండేది.

వెంక—ఏమిటో, దైవనిర్ణయానికి మనమే చేయుగలం అన్నీ తెలిసినవారు తమరు ఇల్లావిచారించకూడదు.

సాంబ—ఏమిటండీ సంగతి!

వెంక—ఈమధ్య వీరిభార్య కాలంచేసింది మంచిబుద్ధిమంతు రాలు. అయితేనేం చూశారూ! ఇంతకీ యీఐశ్వర్యం, యీసౌఖ్యం ఇది అంతా అనుభవించడానికి యెవరికి యోగంవుందో మరావిడికి లేకపోయింది.

సాంబ—చిత్రం అంతేనండి. విచారించకం డవధాన్లుగారూ! ఓర్చుకోవాలి. నన్ను చూశారుకాదూ! ఎన్నికష్టాలొచ్చినా తుమ్మ దుక్కలాగెల్లాగున్నానోను!

వెంక—ఏదో, చూశారా, ఇంతకీ ఆవిడ కడుపునో మొగపిల్ల కాయకాసివుంటే ఏదో మోస్తరుగా బాగుండును. మరాయోగం లేక పోయింది. అందుచేతేదో మనవాళ్ళు నలుగురూ పోగయ్యి ద్వితీయ వివాహం చేసికోవలసిందని బలవంతపెడుతున్నారు. ఏదో ఆవున్నా స్త్రీ గీస్త్రీ యావత్తూ ఏజ్ఞాతులాళ్ళో వేసుకుపోతే యేవుందిచెప్పండి అందు చేత ఏదో మనవాళ్ళకుటుంబాల్లో కాస్తవయస్సొచ్చినపిల్లలు జోలిడీమం దున్నారు. జోలిడాస్తి మంచిసంబంధం, పోనీ దూరంగా పోనియ్యడ వేం అని పిల్లలకోసవాలోచిస్తూంటే చటుక్కున మీఅమ్మాయిమాట జ్ఞప్తికొచ్చింది. అవట్టుగా "దయచెయ్యండిబాబూ పిల్లనిచూతురుగా" ననిచెప్పి యిల్లాతీసుకు చక్కావచ్చాను.

సాంబ—అల్లాగా! అయితే యిదివరకెక్కడనయినా సంబం ధాలు చూశారా?

వెంక—లేదండి. లేదండి. ఏదోకామయ్యగారూ, వీరూ, అంతా తమ పిల్లల్ని చేసుకోవలసిందని, ఊవలపలాడారు కాని, పిల్లలికి వయస్సు తక్కువ మనఅమ్మాయైతే అంతకన్న కొంచెంయీడూజోడు గా వుంటుందని చెప్పి యిల్లాతీసుకొచ్చాను.

సాంబ—అటుకూడా చాలామంది పెద్ద కన్యలేవుంటారే. తగిన డబ్బియ్యలేకపోయారు కాబోలు.

సింహా—డబ్బు ఊ ఖర్చుపెట్టేస్తూన్నా నిందుకోసం అప్పుడే రెండొందలై పోయాయి.

వెంక—అందులో లోపం చెయ్యడం లేదు. ఖర్చుపెడుతూనే వున్నారు.

సాంబ—ఖర్చుపెట్టాలి లేకపోతేయిల్లాంటప్పుడు పిల్లలు దొరకడంమాకష్టం. రెండుమూడువేలకి తక్కువైతే పిల్లెక్కడేనా దొరకుతుందా! ఎక్కడా యిల్లాగాలించి పెట్టినా ఇల్లా ఆడపిల్లపుట్టడం లేదన్న మాట.

సింహా—మూడువేలే. ముప్పైవందలన్నమాట. అబ్బో అయిదువందలకన్న దమ్మిడీ యెక్కువివ్వను.

సాంబ—ఇవ్వకపోతే మానుకోవయ్యా!

వెంక—అవధాన్లుగారూ ! తొందరపడకండి. మనవిచేస్తా సాంబయ్యన్నగారూ, ఆభాగంవెనకనుంచి మాట్లాడుకుందాంకాని, ముందుగా పిల్లనోపర్యాయం పిలిపించండి. అవధాన్లుగారు చిత్తగిస్తారు. ఆపైని మీచిత్తంవచ్చినట్లూ వ్యవహారం పైనలాతుంది.

సాంబ—చూసుకోవయ్యా! పిల్లకేంలోపం లేదు. మాణిక్యంలాంటిపిల్ల. ఏవేఁ ! ఔనే ఒహోయ్!

(ఇంటిలోనుంచి భార్య) 'ఏం?'

సాంబ—కుఱ్ఱదాన్ని యిల్లా ఓమాటుపిలపించూ!

"యిక్కడలేదమ్మా; దిక్కుమాలిన ముండయెక్కడికిపోయిందో కాని పొద్దున్నగాపోయింది. ఒక్కమాటేనా యింట్లోవుండదుగదా.

సాంబ—శంకరంగా రింటివేవుంటుం దే! ఒక్కకేకెయ్యి.

సింహా—శంకరంగారెవరండీ?

సాంబ—మనవాళ్ళపిల్లాడే, వెనక మాఅబ్బాయితో చదువుకోడానికొస్తుండెవాడులెండి. ఆపరిచయాన్ని మాపిల్లలక్కడికి వెడుతూ వస్తుంటారు.

వెంక—ఆయనిప్పుడేం చేస్తుంటారండీ.

సాంబ—ఆయ నింగ్లీషుచాలామట్టుకు చదువుకున్నాడు. పట్నం న్నుంచాయనకేవో పేపర్లూ అవీవస్తుంటాయ్, మాబాగా చదువు తారండాయన. తెలుగుపుస్తకాలు; పద్యాలు, యింగ్లీషుసంగతులు, అన్నీ క్షుణ్ణంగా తెలుసునాయనకి మాఅమ్మాయికవంటే మాయిష్టం పాపం, అన్నీ చెబుతారాయన

సింహా—అతగాడెవరయ్యా! పిల్లక్కడికెళ్ళి కూర్చుందేం?

వెంక—అదుగో! అమ్మాయొస్తోంది, (సాంబయ్య కూతురు ప్రవేశించును.)

సాం—దాఅమ్మా! ఇల్లాకూర్చో.

(దగ్గిర కూతురిని కూర్చుండ బెట్టుకొనును.)

సింహా—మీఅమ్మా యీపిల్లేనాండీ? పెళ్ళికూతురీపిల్లే?

సాంబ—చిత్తం,

వెంక—యేం అల్లాఅడుగుతున్నారు. పిల్లేవుగావుందనా?

సింహా—కాదు సంగతూరికే;—

(వీధిలోనుంచి)

"మాలక్ష్మి! నీపుస్తకం మరిచిపోయావుట. ఓ మాటొచ్చి వెళ్ళిపో"

మహా—మళ్ళీయిప్పుడేవస్తానుండునాన్నా ! (నిష్క్రమించును)

సింహా—అయ్యా! పిల్లవయస్సెంతండీ?

సాంబ—అబ్బే! ఏపాటోనాండి! అంతా మొన్న మొన్ననే పద మూడో సంవత్సరం వెళ్ళింది ఏవిటో మావాళ్ళేయేడేనా పెళ్ళిచేసేస్తే నేకాని వొల్లకాదని తొందర పడుతున్నారు.

వెంక—అవునండిమరి తొందరపడవలసిన మాటనిజవే. ఎక్కడో

రాజుల్లోను శూద్రుల్లోను అక్కడాతప్ప మనవాళ్ళలో తప్పకుండా యీ పాటికి సవర్తాడి తీరతారు.

సాంబ—అబ్బే! యింకా రజస్వలకాలేదయ్యా! కిట్టనిముండా కొడుకులూరికే అల్లాంటారంతే.

వెంక—అల్లానాండి చిత్తం అయితే ఎంచేత చెప్పండి. వాళ్ళంత అపవాదెయ్యడం.

సాంబ—ఏవని చెప్పను బాబూ! మూదినవ్వుల సామాన్యం. ఇంతపవాదని మీ రాశ్చర్యపడుతున్నారు. అక్కడితో వూరుకొన్నా రనుకున్నారా యేవిటి.

వెంక—ఆ! యింకా యేవంటారు?

సాంబ—అయ్యో! కిట్టనప్పుడే వాదేవిటి బాబూ! అల్లవాణ్ణి చూసి ఏదో అందిఅంటే, ఇల్లా ఒహాటేమిటండీ. ఓర్వలేనిముండామాట లెన్నైనా అంటారు. అవి నమ్మకూడదు.

వెంక—నిజవేనండి. లోకులు నిజం కనుక్కొని మాట్లాడరు.

సాంబ—చూశారా! యింకా మా అబ్బాయిని గురించి యేమో దుర్మార్గ సావాసంచేత యిల్లూ వళ్ళూ పాడుచేసుకుంటున్నా డని అంతా అంటూంటే నిజం కనుక్కొని నేను కూడ వాణ్ణి చీవాట్లు పెడుతూ వచ్చాను. అంతేకాని నిష్కారణంగా ఆడపిల్లని పట్టుకొని నలుగురూ యిల్లాంటూంటే నా ప్రాణం మా వునూరుమంటూం టుందండి.

వెంక—నిజవేనండి. నిజవే.

సింహా—(తనలో) అంతుంది. ఇంకా సవర్తాడలేదంటాడు. కొంపతీసి మాసకమ్మగానే కాదుగదా! ఏమో పాపకర్మం అల్లాగైతే నాకెందుకు నెత్తిమీదికి. అయితే పిల్లమాత్రం మాపసందుగా వుంది. మరోమాటు చూద్దాం. (పైకి) అయ్యా! మరోమాటు పిల్లనిల్లా పిలి పించండి.

వెంక—అదుగో! ఆపిల్లే యిల్లావొస్తూంది.

(మహాలక్ష్మి ప్రవేశించును)

సాంబ—(పిల్లను దగ్గర కూర్చుండబెట్టుకుని) ఏఁవే! మళ్ళీ యెక్కడికి పరిగెట్టావు?

మహా—ఈ పుస్తకం శంకరంగారింట్లో మరచిపోయాను. పట్టి కెళ్లమని కబురంపితే తెచ్చుకోడానికి వెళ్ళాను.

సింహా—అమ్మాయీ! నీపేరెవరమ్మా!

వెంక—"అమ్మా!" అనకయ్యా! బాబూ!

సింహా—లేదు. లేదు. అల్లాచక్కావొచ్చింది. నీపేరెవరుపిల్లా!

సింహా—చెప్పమ్మా! చెప్ప తప్పులేదు.

మహా—మాలక్ష్మిని.

వెంక—బస్. సరిగ్గా మాలక్ష్మిలాగే వుంది. అమ్మాయి! అదేం పుస్తకం?

మహా—సుజ్ఞానోదయం.

సింహా—అబ్బో! ఘట్టిపుస్తకమే!

సాంబ—ఆ! కొత్తదేనండీ! వెనక బళ్లో బహుమతిచ్చారు దీనికిది.

మహా—అది కాదిది. అది మానవతీచరిత్ర. ఇది శంకరంగారిది చదువుకోడానికిచ్చారు.

సింహా—ఏదమ్మాయి! ఈజ్ఞానంపుస్తకంలోదోపద్యం చదువు.

సాంబ—బాగా సర్దుకూర్చోవే! అయ్యో తెలివితక్కువా!

మహా—

"లోకములోన కొందరబలుల్ నతులన్ దనియింపలేక న
స్తోకమనీష నన్యపురుషుల్ తమకాంతల గూడకుండ, తా

టాకులలోన వ్రాసిరి "పరాంగసగూడిన పాప"యంచు, న
య్యాకులపాటుజూచియిపుడాకుల పాలైనయంగనేటికిన్"

సింహా—ఓహోహో! కంఠం మాబాగుంది.

సాంబ—మనబోటివాళ్ళ కర్థంకావుగానండి యిల్లాంటివేవో అ స్తమానూ మాచాలా చదువుతూంటుందండి.

వెంక—సరే! యీసంగతి బాగానేవుంద కాని ఇప్పుడు శలవివ్వండి అవధాన్లుగారికి తమపిల్ల నివ్వడంలో తమ అభిప్రాయ వేవి టోను చూడండి! యెవరేనా మీకోసం లోపలికొస్తారేమో మీ రింట్లో లేరని చెప్పేయమనండి. మన వ్యవహారాలు వాళ్ళెందుకు వినడం.

సాంబ—చిత్తం అవునండి చూడొనేకుర్రదానా! కాస్సేపు వీధులో కూర్చుని నాకోసవెవరేనా వొస్తే యింట్లోలేడు పొమ్మను. లోపలికి రానివ్వకుమా! (పిల్ల నిష్క్రమించును)

వెంక—ఇంకిప్పుడు సెలవివ్వండి సంగతి.

సాంబ—చెప్పానుకాదూ! రు 1000 లు నగలు రు 1000 లు రొఖ్ఖం ఉభయకర్చులు పెట్టుకోవడం.

సింహా—అబ్బోరిబాబో! నాయిల్లూవాకలీ—

వెంక—ఇన్నూ, ఉండవయ్యా! చిత్తగించారా అన్నగారూ! సంగతంతా మనవిచేస్తాను. ఇల్లా ఒపర్యాయం దయచెయ్యండి మనవి చేస్తా. (ఇరువురు దూరముగా వెళ్ళెదరు)

సాంబ—మీరేంచేస్తారోకాని డబ్బులో దమ్మిడితగ్గను సుమండీ.

వెంక—సరే బాగానేవుంది, అయితే మీకు డబ్బుప్రధానవా? పిల్ల సుఖవూ, సాంప్రదాయమూ ఇవీ ప్రధానవూనా?

సాంబ—ఈమాటలకేవయ్యా! డబ్బుమాట ముందుచెప్పు డబ్బేముఖ్యం.

వెంక—డబ్బేముఖ్యం నరేబాగుంది అయితే, మీరు కోరిన దానికన్న ఎక్కువడబ్బు మట్టచెప్పిస్తే నాకేం బహుమతీ యిస్తారు?

సాంబ—యేంమట్టచెప్తారయ్యోయ్?

వెంక—వెర్రిబ్రాహ్మడా! తొందర, అనుమానము, పడక నే చెప్పేది విని ఆలోచించుకోండి. ఈయునాస్తిసంగతి యావత్తు మీకు చెప్పనే చెప్పానుగదా! ఇంక రేపోనేడో యీముసిలాడి బతుకు డిక్రీ అయిపోయిందంటే, ఇదంతా యెవరిపరవౌతుంది, ఇదంతా మీది కాట్టయ్యా మాట్టాడ్రేం!

సాంబ—వారసులో?

వెంక—విధవ్వారసులు పెళ్ళయిన వెంటనే మీకుటుంబవంతా వాడింటిమీదే సంరక్షణ అనే విషమీదపడి తినెయ్యడం మొదలెట్టండి ఆపైని అందినకాడికి లోడ్డో లోనుకో యావత్తూ యీలోవునే చిక్కపెట్టెయ్యి. బోలెడాస్తి చరమేవుంది. అదంతా నీస్వాధీనవౌతుంది కదా! ఆపైని స్థిరానికి నీకోమనవడుట్టకుండా వుంటాడా అదికూడా నువ్వంకించుకుని పిల్లజమీదారుడవై పోవడం మానతావా! అదృష్ట వంతుడవు నిజంగానివ్వు.

సాంబ—అయితే యిప్పుడు రొఖ్కం యేమీ యిప్పించరూ?

వెంక—ముసిలాడు చూసి చూసి యివ్వలేడయ్యా! అయినా ఉభయఖర్చులు పెట్టించి కావలిస్తే రు 500 లు నగలుకూడా పెట్టిస్తాను.

సాంబ—అయితే ఓ ఉపకారము చెయ్యాలి. ఈతనికూతు రుందిట. ఆపిల్లని మాఅబ్బాయికిప్పించు. వాడో ఘోటక బ్రహ్మచారై అఘోరిస్తున్నాడు. ఈపుణ్యం నీకుంటుంది.

వెంక—అబ్బో! పోనీ అల్లాగయితే రెండుపెళ్ళిళ్ళ ఖర్చులూ నువ్వెట్టుకో.

సాంబ—నాచేడబ్బుకూడానా! అదివల్లకాదు.

వెంక—పోనీవయ్యా! అయితే మీకర్మం ఏడెనిమిదివేల రూ.

పాయినాస్తి పోనీ ముట్టచెబదామనుకుంటే మీకు ప్రాప్తంలేదు. నేనేం చెయ్యను.

సాంబ—వెళ్ళిపోకండి. మనవి. మీకు నూటపదహార్లిచ్చుకుంటాను. నేనన్నకాడికెల్లాగోల్లాగ పైసల్ చేయించండి

వెంక— రు 500 లు తక్కువైతే కుదరదు, ఇదేమిటయ్యా! బోలెడాస్తి.

సాంబ—రు 100 లే. అలాగైతే ఇద్దరిపిల్లలికీ చెరో రు 300 లు నగలు పెట్టిస్తారూ ?

వెంక—నగలా! ఊఁ సరే; అయితే నాసొమ్మిప్పు డివ్వాలి సుమండీ.

సాంబ—తక్షణంయిస్తా. నగలికిప్పుడు రొక్కం నాదగ్గిర ధరావతుంపించండి. ముందీ సంగతులన్నీ ఆ మనత్రో చెప్పండి పాపం! ఆయన వడుకుచున్నట్టుంది.

వెంక—వాడిమొగం వాడితో చెప్పడవేమిటి మనమన్నమాట కడ్డుండదు. తాంబోలాలుపుచ్చుకుని గ్రంథం కానివ్వడమే తరువాయి.

(మహాలక్ష్మి ప్రవేశించి)

నాన్నా! యెవరో వచ్చారు నీకోసం కాశీపతిగారటాయనపేరు.

వెంక—అన్నా! ముండాకొడుకిక్కడికూడా వొచ్చాడూ! సరే, అమ్మాయి, ఏమనిచెప్పావు?

మహా—ఇంట్లోలేడు పొమ్మన్నాను. ఆయనతోటింకో ఆయన కూడ వొచ్చారు. ఆయన మధ్యాన్నమైపోతుంది పద భోంచేసొద్దామని తీసుకు చక్కా పోయారు.

వెంక—బాగా జరిగింది. వెళ్ళమ్మా! వీధిలోకూర్చుని యెవ్వర్నీ రానీకు.

(మహాలక్ష్మిపోవును.)

వెంక—సింహాద్రవధాన్లుగారూ ఏమండోయి? ఓమాటిల్లారండి.

సింహా—(లేచివచ్చి) ఏంసెలవుబాబూ!

వెంక—వ్యవహారం యేదో మోస్తరుగా పైసలైంది. మీ అమ్మాయిని వీరబ్బాయికివ్వడం,

సింహా—సరే నామాటో?

వెంక—చెబుతున్నానుకాదుమరి, వీరమ్మాయిని మీకివ్వడం పెళ్ళిఖర్చులురెండూ మనమేపెట్టుకొని పిల్లలిద్దరికీ చెరో రు 300 లు నగలు పెట్టడం ఇదీనిర్ణయం.

సింహా—రెండు పెళ్ళిళ్ళకీ నేనే ఖర్చుపెట్టడం?

వెంక—అయ్యోకర్మమా! యిల్లారండిచెప్తాను. చూడు నువ్వేచచ్చినా యిల్లాంటి సంబంధం నీకుదొరకదు, పెళ్ళికూతురెల్లాగుందో చూశావా? అవతల కాశీపతిగాడు, ఇదిమించిందంటే కాశీపతియీసంబంధం యెగరేసుకుపోతాడు, అంచేతమరి మాట్లాడకు వాడికంట్లో దుమ్ముకొట్టాను, తాంబోలాలిప్పుడే పుచ్చుకోవడం నగలుసొమ్ము వాడిమొహాన్ని పారెయ్యి.

సింహా—సరే, పద, రండిమామగారూ! తాంబోలాలు పుచ్చుకుందాం,

సాంబ—దయచెయ్యండల్లుడుగారూ! అల్లాచేదాం,

(అంతా నిష్క్రమింతురు)

వృద్ధవివాహము.

4 రంగము.

(అప్పుడు కాశీపతి, గవరయ్యశాస్త్రుల్లు ప్రవేశించుచున్నారు)

గవ—ఏమిటోయ్, కాశీపతిబావా! ఏదో ఆ చెలప్పతో తంటాలుపడక నన్ను చంపుతున్నావు.

కాశీ—అబ్బే! నిజంగా ఆచెల్లప్ప వట్టి వెర్రిప్పోయ్, వాడు నాకు పెళ్ళిచేసేదేమిటి నామోహం బ్రహ్మాండమంత కబురుచెప్పి ఆఖరికి కళ్ళుతెరవని పెళ్ళికూతుళ్ళని చూపించడం మొదలెట్టేవాడు. పోనీ, ఓమాటపొందికా, తెలివీ, తేటా, యేవల్లకాదులేదుగదా! అదంతా యెందుకు! మొన్నీమధ్య ఓచోటుండగా అధాటుగా సాంబయ్యాకూతురు సంగతి తెలిసి అక్కడికి తక్షణంవెళ్ళి పెళ్ళికుదుర్చుకొద్దాం పదవయ్యా బాబూ అంటేను, రేపెడదాంలెండంటాడు! అల్లాచేస్తే సంబంధం వోవేళ మించిపోతుంది మొర్రోఅనియేడుస్తే బ్రహ్మాండంమీద బయలుదేరి యీసురోమంటూ రొండుఝాములు దాటిపోయేటప్పటికి ఊరంతాతిప్పి, అప్పుడు సాంబయ్యయిల్లు చూపించాడు. అప్పుడక్కడికెళ్ళేటప్పడి కెవళ్ళో అంతాకుర్రాళ్ళు వీధరుగుమీద కూర్చుని పేకాడుతున్నారు. ఆమట్టిగా సాంబయ్యగారింట్లో వున్నారా అని అడిగాను అడగడమే తడువుగా ఆడమనిషి వాళ్ళమధ్యనుంచి లేచివొచ్చి ఇంట్లోలేరుపో అని కొట్టొచ్చి గుమ్మానికడ్డుగా నిలబడింది. ఆవైఖరిచూస్తే ఆయనగారింట్లోవుండే లేడనిపించుకుంటూన్నట్లు నాకనుమానంవేసిందికాని, ఓమూల యీచెల్లప్పగాడు భోంచేసి మళ్ళీవొద్దాంరావయ్యా? అనిపీక్కుతినడం మొదలెట్టాడు. ఏంచెయ్యను. ఇంటికిపోయాను కాని తరువాత తెలిసింది. ఆకొట్టొచ్చిన ఆడమనిషి పెళ్ళికూతురట! ఆసంగతిముందే తెలుస్తె ఆమట్టిగా నాలుగు పెద్దకానులు చేతిలోపెట్టి యెల్లాగోల్లాగ యీపాటికి గిరుక్కునాసంబంధం యిటు తిప్పేసి తద్దిగ్గిణితాఅని పెళ్ళాడేసేద్దును.

గవ—వోస్. తద్దిగ్గిణితాఅని పెళ్ళాడేసేద్దువేం నీ మొహాగ్గిణతా అని జోగందనుకున్నావా యేమిటల్లాచేయుడానికి?

కాశీ—నువ్వు చూళ్ళేదుకాని ఆపిల్లని చూస్తే జోగందాని కెక్కువగానే వుందన్న మాట.

గవ—అయితే తీసుకురా లేకపోయినావేమిటప్పుడు ? ఇవేవెర్రి ముండాకొడుకుమాటలు నీవనల్లా తద్దిగిణ్ణతొ్తా అంటూ కూర్చోడమే. హాయిగా ఆసింహాద్రవధాన్లుని చూడు ? నిజంగా సింహంలా కార్యం చేసుకున్నాడు. నువ్వు రెండువేలిచ్చినా మూడువేలిచ్చినా నీకెవళ్ళూ పిల్లనింకివ్వరు.

కాశీ—ఆఖరికిదా నువ్వొచ్చి నాకుచేసిన ఉపకారం. గాడిదిగుడ్డులాగేవుంది.

గవ—బావా ! నిజంగా నీకుపకారం చెయ్యమన్నావా ?

కాశీ—అడుగుతావేమిటింకా అల్లాగ. ఇంతడబ్బు ఖర్చుపెట్టుకుంటూ నిన్నెందుకోసమిల్లా ఇంతదూరం తీసుకొచ్చాను.

గవ—అయితే సరే నే చెప్పినట్టల్లా చెయ్యి. తక్షణం నీడబ్బాడవాలీ అంతే చంకపెట్టుకో యీవాళ మెయిల్లోనే మనవూరుపోదాం తరువాత పెళ్ళిమాట తలపెట్టకు ఇదేనీకు నిజమైన ఉపకారం.

కాశీ—వహ్వా, యేమాటచెప్పావు. గాడిదిగుడ్డుమాట.

గవ—లేకపోతే నీకు పెళ్ళేవిటిబావా !

కాశీ—సింహాద్రవధాన్లుకో ?

4 రంగము

కాశీ—సరే, నీకేం తెలుసునా చిక్కులన్నీ; అల్లాక్కాదరదుమరి,

గవ—చెప్పకూడదూ సంగతులన్నీను ఎందుకాదాచడం.

కాశీ—బావా ! నీకు తెలియనిదేముంది నానోటితో పేలించను పడుచుముండాకొడుకుని యెంతకాలమిల్లా వుండమంటావు ?

గవ—ఆ అల్లా స్పష్టంగా చెప్పు యీమాటు జవాబుచెప్తాను. బావా ! అయితే నువ్వు పెళ్ళాడ్డానికై తేయిప్పుడెంతఖర్చుపెట్టగలవోయ్

కాశీ—రెండుమూడువేలకేమీ అభ్యంతరంలేదు. కావలిస్తే యీమొత్తం యిప్పుడు నీచేతికిచ్చేస్తా. యిప్పుడు కుదుర్చు పిల్లని.

గవ—సరే, యిల్లావిను. రెండుమూడువేల కభ్యంతరం లేదు కదా! అవిచాలువిను. ఓవెయ్యిరూపాయలు నీవికావని ఖర్చుపెట్టి ఓ శుభ్రమైనముండనుంచుకో ఇదిమీకుటుంబములో కొత్త గాదు. మరో ఖర్చుపెట్టి వంటకెవ్వరినైనా పెట్టుకో.

కాసీ—సరే మళ్లీ యిదాచెప్పావు గాడిద్గుడ్డుమాట పెళ్ళి కుదురుస్తావేమో అనుకున్నానునేనూ. అయితే ఆసింహాద్రవధాన్లుగాడికి చెప్పలేకపోయావూ యీావుపాయం.

గవ—ఆఖర్మం నీకెందుకు. మనపొట్టీశ్వరయ్యానిచూడు. మొద టేదో పెళ్ళికి ప్రయత్నముచేసినా నీకన్న బుద్ధిమంతుడుగనుక ఆఖరికి ప్రయత్నం మానుకుని శుభ్రమైన ముండనుంచుకున్నాడు. వానివల్ల గౌరవం వాడికేంపోయింది? నీకేవెక్కువుంది?

కాశీ—అత్త గారు ముండపోరు పళ్ళేక మళ్లీ పెళ్ళి మాను కున్నాడు కాని మరేంకాదు.

గవ—పోనీ యెల్లాగోల్లాగ మానుకున్నాడుకదా! అదే ప్రధానం.

కాశీ—సరే మాబాగుంది నీసాయం పెళ్ళి మానుకొమ్మంటావే మిటి తద్దిణ్ణాత్తా అని సింహాద్రవధాన్లుపాటీచేశాను కానాయేమిటి నేను.

గవ—సింహాద్రవధాన్లు సంగతి నీకెందుకోయ్ వాడుచెడితే నువ్వుచెడాలా.

కాశీ—వాడుచెడ్డవేం! సుబ్బరంగా చక్కని పిల్లనిపెళ్ళాడితేను!

గవ—ఓహోహో! ఆచక్కని పిల్లని పెళ్ళాడ్డం ఆసౌఖ్యంపడ్డం సంగతీ, సందర్భం! అంతా ౨,౩ యేళ్ళల్లోస్పష్టంగా చూద్దుగానుందు ఇంక అయ్యగారల్లాగా అమ్మగారిల్లాగాను.

కాశీ—పోనీపయ్యా కొంతమట్టుకల్లాగైనా బాధ లేదంటాను. పెళ్ళయితే చాలిప్పుడు.

గవ—అక్కడితో సింహాద్రవధాన్లుతో సమానమౌతావు కాబోలు.

కాశీ—అదిగో! నేసల్లాగన్నానా. వాడికీ నాకూసాటిచేస్తావే మిటి బిళ్ళగోచీ, వీభూదిపెండికట్లువాడును వాడికన్న నాకేంలోపమని పెళ్ళికాదోయ్ తద్ధిగ్గిణత్తా అని డబ్బులెక్కువా? ముసిలాళ్ళా? ప్రయత్న లోపవా? నాకేంలోపవోయ్?

గవ—తద్ధిగ్గిణత్తా అంటోస్తావు మాటిమాటికీని అంచేత వెఱ్ఱి ముండా కొడుక్కాబోలని యెవ్వరూ పిల్లనివ్వరు.

కాశీ—పోనిస్తూ ఎవడేనా నవ్వుతాడు ఏదోవెధవముక్క అల వాటైపోయింది తద్ధిగ్గిణత్తాఅని.

గవ—అదుగో! మళ్ళీ తద్ధిగ్గిణత్తా, యే?

కాశీ—అబ్బ! పోనిస్తూ దానిమాటకేమి అస్తమాను వేళాకోళ వాడక యీమాటనిజముచెప్పు. వారికన్న నాకేంలోపవుంది.

గవ—చెప్పానుకాదూ? ఆలోపవేదోను.

కాశీ—ఏమిటది; ఇదుగోచూడు నాతో వేళాకోలవొద్దుసుమా!

గవ—ఛా! ఛా! నీతో వేళాకోళమాడతానా బావా! నిజం చెప్తానువిను. నువ్వు గడ్డమూ, బొజ్జా, దినంవిడిచిదినం యెంతగొరిగించుకుంటూన్నా తెల్లగా వెంట్రుకలుమొలవడం మానలేదు. పడుచు వాడననిపించుకోడంకోసం నువ్వెంత గెంతుతూవచ్చినా యెంతవాగుతూ అల్లరిచేసినా వెఱ్ఱిముండాకొడుకంటున్నారుగాని కుఱ్ఱముండాకొడుకనియెవ్వరూ అనుకోవడంలేదు, ఈకారణాలచేత నువ్వు ముసిలాడవని చెప్పియెవ్వళ్లూ చూచ్చూచిసి పిల్లనివ్వలేకుండవున్నారు, ఇదీఅసలుమాట.

కాశీ ఆ! నేముసిలాడినా! ఏగాడిదికొడుకన్నాడు. వాడికిగ తరగా, నేముసిలాడినా!

గవ—కాదు బావా కాదు. నువ్వు అడ్వాన్సు తిట్టు తిట్టాక కూడా ముసిలాడవని యెల్లాంటాను.

కాశీ—యీమాటలన్నీ యెందుకొ్కాని నాపెళ్ళివిషయములో యిల్లాంటి వితండవాదాలు పెట్టక నువునాకు నిజంగా సాయం చేస్తావా? చెయ్యవా?

గవ—తప్పకుండా చేస్తాను.

కాశీ—చెయ్యాతేను, ఈవూళ్ళో యెక్కడ పిల్లలు కుదర్లేదు గదా? ఇప్పుడే వూరెడదాం?

గవ—మనవూరెడదాం.

కాశీ—ఎందుకు మనవూరు?

గవ—నిశ్చింతగా కూరోచ్చడానికి.

కాశీ—ఫో, గాడిదిగుడ్డువేషం. అస్తమానూ ఒహాటే మాట తద్దిగిణాతా అని.

గవ—రక్షించేవు. ఇదుగో! యిప్పుడే పోతున్నాను.

ఎల్లవారు గొల్లవారు

(ఒక గొల్లవాడు బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నారు)

గొల్ల—అయ్యా మీపేరెవరు? మీకులమేది?

బ్రాహ్మ—మేము బ్రాహ్మణులము, వైదికులము. నాపేరు సోమావధాని.

గొల్ల—అయితే మీరు మావాళ్ళే.

బ్రాహ్మ—నేను నీవాడనేమిట్రా పిచ్చివాడా. ఎవరైనా వింటే నవ్వుతారు. ఇల్లాంటి మాటలాడకు.

గొల్ల—నవ్వడమెందుకు మావాళ్ళంటే మీకప్రతిష్టగా నున్న

దా యేమిటి నీవంటి బోడిబాపనయ్య వెయ్యేళ్ళు తపస్సుచేస్తే మాత్రం మావోడవుతాడా. ఎంత పున్నెంచేస్తే మావోడవుతావు.

బ్రాహ్మ—నేను పున్నెము చేయనక్కఱలేదు. నీవాడని కానక్కఱలేదు. నన్నిల్లా బ్రతకనియ్యి. అప్రతిష్టమాటలాడకు.

గొల్ల—చాలు చాలూరుకోవయ్యా. అప్రతిష్టా. కృష్ణమూర్తి గొల్లవాడే కదా!

బ్రాహ్మ—కృష్ణమూర్తి గొల్లవాడే అనుకో అందుచేత మీవాడే అనుకో మేము మీవాళ్ళవేమిటి.

గొల్ల—ఏమిటో చెపుతావిను. నీవేగాదు. మీబ్యామర్లంతా గొల్లవాళ్ళే.

బ్రాహ్మ—ఓరీ నీకడుపుడక నేనే కాకుండా బ్రాహ్మణులంతా గొల్లవాళ్ళే అంటావూ ఏమైలా ఒక చుక్క వేసొచ్చావా యేమిటి.

గొల్ల—చుక్కమాదాకా మిగులుతుందటయ్యా మీబ్యామ్మలికే చాలడంలేదు. బానలు గూనలు పీల్చేస్తూన్నారు. మాకు చుక్కే మిగలడం లేదు.

బ్రాహ్మ—సరే. ఆమాటలకేమి. నీవంటే నీవనడమే కాదు. కుడియెడమలేదు. ఇప్పుడు బ్రాహ్మణులంతా గొల్లలెల్లాగైనారో చెప్పుదూ.

గొల్ల—ఒక్క బ్యామ్మలేనా రాజులు కోంయిట్లు కాపులు అందరూ గొల్లలే.

బ్రాహ్మ—ఓరీ నీయిల్లు పటారుగాను. లోకమంతా గొల్లలెల్లాగో చెవుదూ వించాను.

గొల్ల—చెపుతినవయ్యా, ఇట్టుమూర్తోరున్నారా ఇట్టుమూర్తోరి బొడ్లో తాంమరపువ్వుంగా బెమ్మదేవుడా తాంయరపువ్వులో పుట్టాడా లేదా? బెమ్మదేవుడు గొల్లోడవునా కాదా? ఆ బెమ్మదేవుడు నోట్లోనిం చూడిపడ్డారా లేదా మీరు? మీరంతా గొల్లలు కారూ!

బ్రాహ్మ—ఓరీ నీవాదము కూలిపోను యిదేమి వాదమురా, విష్ణుమూర్తి గొల్లవాడెల్లాగైనాడురా ముందు గాను?

గొల్ల—ఇట్టుమూర్తొక్కడేం దేబేంద్రుడు, చాంబమూర్తోరు అంతాగొల్లలే,

బ్రాహ్మ—కామాలరోగికి ప్రపంచమంతా పచ్చనైనట్లు నీకు పద్నాలుగు లోకాలు గొల్లలైనట్లు కనబడుచున్నాయి. దేవేంద్రుడు శంకరుడు విష్ణుమూర్తి యెల్లాగొల్లలైనారో చెప్పరా?

గొల్ల—ఇట్టిమూర్తంటే కిట్టమూర్తి కిట్టమూర్తంటే యిట్టిమూర్తి ఆడేయీడు యీడేఆడు. యీడుగొల్లయితే ఆడుగొల్లే ఆడు గొల్లయితే యీడుగొల్లే ఆడుకామోతే యీడుకాడు. యీడుకామోతే ఆడుకాడు. ఆడేయీడు యీడేఆడైనప్పుడు ఆడీడుకామాతాడా యీడాడుకామోతాడా, అందుచేత ఇట్టుమూర్తోరుగొల్లే. గన్క—వొప్పుకోన్నావా లేదా?

బ్రాహ్మ—ఒప్పుకోపోతే యిప్పుడు కొవిడిబద్దుచ్చుకొనినడుము విరగగొట్టేలాగున కనబడుతున్నావునీవు. అందుచేత నొప్పుకొన్నట్లే. కాబట్టి శంకరుడు దేవేంద్రుడు యెట్లుగొల్లలయినారో జెప్పుము. నీమాటలు వినసొంపుగా నున్నవి.

గొల్ల—సాంబమూర్తంటే గయిరిదేవి మొగుడేకాదు. గయిరి దేయి ఇట్టుమూర్తోరి సెల్లిలే. బావగొల్లయితే మరిదిగొల్లకాడు. బావ నోన్నంటావు యేం తెల్దేంమయ్యానీకు.

బ్రాహ్మ—సరే, దేవేంద్రుడుమాటేమిటి.

గొల్ల—దేవేంద్రుడు గొల్లోడే. ఎల్లాగంటావా దేబేంద్రుడిట్టుమూర్తోరి కన్నగారు. తమ్ముడు గొల్లోడైతే అన్న గొల్లోడుకాడూ.

బ్రాహ్మ—నీవాదముపట్టిచూస్తే ముప్పదిమూడుకోట్ల దేవతలు గొల్లలే.

గొల్ల—కాకమోతే మరేవిటి అనుకున్నావు. అంతామావోళ్ళే లోకమంతా ఇట్టుమయం ఇట్టుమూర్తి గొల్లమయం.

బ్రాహ్మ—(నవ్వుచు) గొల్లలంతా గోమయం అయితే మీరిపుడు మాకంటె యెక్కువంటావా తక్కువంటావా.

గొల్ల—మీరు మాకంటెతక్కువని యింకాచెప్పాలేరే. గొల్లలు బ్యామ్మర్లు, రాజులు, కోమట్లు, చూద్రులు.

బ్రాహ్మ—అయితే నీకీవిద్య యెవరుచెప్పినారోయి

గొల్ల—ఒకరుచెప్పేదేయింటి, రామాంధంలోనుభాగోతంలోను అదేంటమ్మా పెద్దపుత్తకం జూదాలాడి అడియిల్లోకి పారిపోయినారు.

బ్రాహ్మ—భారతమట్రా.

గొల్ల—అద్దదే నారోలు తిరగడంలేదు. దాల్లోను చక్కానోళ్లు చెప్పేరు.

బ్రాహ్మ—సరే, నీవాదము విన్నాను. చాలాబాగుంది. నడు మనుష్యుడు తానెటువంటివాడైతే లోకమంతా అట్టిదని భావనచేస్తూంటాడు నీమాటలవలన గూడ కొంత లోకజ్ఞానము తెలిసింది. పద. పద.

నే నే

రంగము—కోటిపల్లితీర్థము.

(రామనాథంగారు, శివనాథంగారు ప్రవేశించుచున్నారు)

రామ—ఏమోయీ శివనాథం పడవ దిగినతరువాత, అదేపో పడం పోయినావుగాని నాకంటి కగపడ్డావుకావేమి; ఈతీర్థంలో నీవెక్కడతప్పిపోయినావో యని నే నెంతో పరితాపము పడుచున్నాను.

శివ—తప్పిపోయేటందుకు నేనేమి చిన్నవాడనా చిటికవాడనా? పడవ దిగగానే మాబంధువు డొకడు కనబడ్డాడు ఆయన తన బసలోనికి తీసికొనిపోయినాడు. పొద్దున్ననుండీ అక్కడే బసచేసియున్నాను.

రాదు—బంధువుడు పిలిస్తే నాతో చెప్పి వెళ్ళనక్కరలేదట య్యా నీవు వస్తావేమోయని రెండుజాములదాకా భోజనానికి కనిపెట్టు కొని కూర్చున్నాను.

శివ—నాకోసం కనిపెట్టుకొని యుండడ మెందుకోయి. నేనేమి దేవతార్చనపరుడ ననుకొన్నావా ? ఎక్కడోపిచ్చిపుల్లయ్యలాగున్నావు.

(అప్పుడొక క్రొత్తమనుష్యుడు ప్రవేశించును)

మను—(శివనాధమునుజూచి) ఎవడవయ్యా నీవు ?

శివ—నీ వెవడవు. అంతతూలుగా మాటాడుచున్నావు.

మను—తూలుగా మాటాడుతానా మాటాడి చూపెడతానా నాజోలి కెందుకురావాలి నీవు.

శివ—నేను మా రామనాధంగారూ మాటాడు కొనుచుండగా నీజోలి కేమివచ్చాను. నిన్ను పలకరించలేదు నీతో మాటాడలేదు ఏమీలేదు నాకు నీజోలీసొంటీ యేమిటయ్యా.

మను—దారేపోయేవాడికి కోపంతెప్పించి అబద్ధాలుకూడా ఆడుతావూ.

శివ—నీకు చూస్తె పిచ్చిలాగున్నది.

మను—ఛీ నోరుముయ్యి నీకుపిచ్చి నీయబ్బకుపిచ్చి నీతాతకు పిచ్చి నీముత్తాతకుపిచ్చి

శివ—నిన్ను విశాఖపట్టణం పంపిస్తే బాగుండేలాగున్నది అక్కడ పిచ్చాసుపత్రి యున్నది.

మను—నిన్ను యమలోకం పంపిస్తె బాగాఉంటుంది.

శివ—నీకు దయ్యంపట్టినట్టున్నది.

మను—నీవే దయ్యానవి నీవే పట్టావునాకు.

రామ—ఏమిటండయ్యా ! మీరితిగాదా యేమిటో నాకుతెలి

య లేదు మీరీయనమీద నిప్పుడెందుకు దెబ్బలాడుచున్నారు మిమ్మలి నిప్పుడీయనేమన్నాడు.

మను—ఏమన్నాడా. నీవు వాడు తోడిదొంగలే. చెవులారా విని యెరగనట్టు నంగనాచిలా కబుర్లు చెప్తుతావేమి.

రామ—నిజంగానేనండి. మిమ్మల్ని నాయనయేమన్నాడో తెలి యదు. మేమిద్దరము మాట్లాడుకొనుచున్నాము కాని మీసంగతి యే మున్నదో తెలియదు.

మను—(ఎడమచేతిలో కుడిచేయి పిడికిలిపెట్టిగుద్దుచు నాసం) గతి కాకపోతే నీ వెవడసంగతి అన్నావు.

రాము—మీరెవరో నే మెరగందే మీ సంగతి యెల్లామాట్లా డుకుంటాము

మను—ఎరుగకేమి. నాసంగతి మీకు రంగప్పగాడు జోగయ్య గాడు శీతన్నగాడు తప్పకుండగా చెప్పినారు. ఆతుంటరుల చెప్పబట్టే మీకు నాగుట్టూ మట్టూ తెలిసినది.

శివ—నాకిదంతా చిత్రకథలాగున అరణ్యరోధనలాగున నున్నది. ఈమాటలు మాకర్థంకావడం లేదు.

(అప్పుడు చుట్టును చాలమంది జనులు చేరుదురు)

శివ—అయ్యా! మీరందరు చిత్తగించండి. ఈయన అకార ణంగా మామీద కజ్జాకు కాలుదువ్వుచున్నాడు మేము యీయననేమి అనలేదు.

మను—అనలేదా. అనలేదా. అబద్ధాలాడుతారా,

శివ—ఏమన్నామో చెప్పు.

మను—అలాఅయితే చెవుతా విను. చెప్పి నలుగురిచేతా నోట్లో గడ్డి పెట్టిస్తాను, నాదగ్గర నీపప్పుడకదు. ఇవి ఇనపగుగ్గిళ్ళుకాని మినపగుగ్గిళ్ళు కావు.

రాము—కేకలు వేయక ఊమ్మన్న మాటేమిటో చెప్పండి

మను—చెపుతానా చెప్పి చూపిస్తానా. వినండయ్యా పెద్దమనుష్యులందరునూ. నేను యీదారిని వెళ్ళుచుంటే వారిలో వాడు మాట్లాడుకొనుచున్నట్టుగా నటించి "పిచ్చి పుల్లాయి"లాగున్నావు అనుకున్నారు.

రాము—ఆమాటంటే మీకేమి మధ్య.

మను—(కోపముతో) నాకు కాకపోతే యింకెవరికనుకున్నావు. ఇంకా బేహద్బిగా మాటాడుతావు.

శివ—పిచ్చిపుల్లాయి అంటే మీకేమి కోపమండీ.

మను—అదిగో వద్దంటే మళ్ళీ ఆకూతే కూస్తావు.

రాము—ఈమాట బలేపసందుగా నుందండి. పిచ్చి పుల్లాయి మీరా యేమిటి.

మను—ఆ తప్పకుండా నేనే అతురాలా నేనే నేను కాకపోతే నీవా యేమిటి?

(అందరు తప్పట్లు కొట్టి నవ్వుచున్నారు)

శివ—(ఆగండి అని) అయ్యా! పిచ్చిపుల్లాయి మీరెల్లా అయినారండి.

మను—మా యూళ్లో వారందఱు చిన్నప్పుడు ముద్దుగా అలా పిలిచేవారు. పెద్దవాళ్ళంతా అలాగే పిలుస్తారు. ఇటీవల కొందఱు కొంటెముండాకొడుకులు అల్లా పిలుస్తూంటే వాళ్ళని రాళ్ళతో కొట్టి తిట్టి యెల్లాగో కాలక్షేపముచేయుచున్నాను. వాళ్ళెవళ్ళు యెరక్కుండాయీ తీర్థంలోకి వచ్చి మాయూరివాళ్ళకు కనబడకుండా యున్నాను ఎల్లాగున్నా మీరు ఆరంగప్పగాడూ వాళ్ళూ చెప్పిన మాటలు విని నన్ను వేళాకోళము ఆరంభించినారు.

రామ—అయ్యో! క్షమించండి మిమ్మలిని మేము అనలేదు. మీరు పిచ్చిపుల్లాయి అనేమాట మాకు తెలియలేదు.

మను—తెలియకేమి తెలిసే అన్నారు. మీరు నన్నే అన్నారని ఒట్టు పెట్టుకోగలను ప్రమాణం చేస్తాను. గుళ్ళో దీపం ఆరిపేసి చెపుతాను గోదావరిలో స్నానంచేసి చెపుతాను. పచ్చనిచెట్టుక్రిందుండి చెపుతాను. పదిమంది కట్టినయింటికింద ప్రమాణము చేస్తాను. రామాయణము నెత్తిమీద పెట్టుకొని చెప్పగలను. అమ్మతోడు బాబుతోడు నీతోడు నాతోడు. మీరు నన్నే అన్నారు ఆపిచ్చిపుల్లాయి నేనే. నేనే. నేనే. మీరు కాదంటే పోతుందా.

అందఱు—పుల్లయ్యగారూ మిమ్మలిని కాదండి.

మను—కాదంటే నే నొప్పుకుంటానా. దొంగముండాకొడుకుల్లాలా. నన్నే నన్నే ఆపుల్లాయిని నేనే. నేనే.

అందఱు—పుల్లాయికి జే. పుల్లాయికి లేవిడీ.

మను—చావండి ముండాకొడుకుల్లాలా చావండి. (అని రాళ్లు రువ్వపరుగెత్తుచున్నాడు. జనులందరు రాళ్ళురువ్వి పరుగెత్తుచున్నారు)

శివ—కోటిపల్లితీర్థములో పిచ్చిపుల్లాయి యని యెవ్వరైనా అనుకుంటే అది తననే అని దెబ్బలాటకు వచ్చే వెర్రిపప్పలు లోకంలో నుంటారని నేనెన్నడు ననుకొనలేదు. రామనాథం పోదాము పదరా బాబు.

(అని యిద్దఱు పోవుచున్నారు)

క్రమము

(అప్పుడు పేరి సోమయాజియను బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నాడు)

పేరి—(తనలో) అబ్బబ్బా కష్టాత్ కష్టతరం క్షుధా అన్నట్లు సకలకష్టములకంటె ఆకలికష్టము మిక్కిలి ఎక్కువది దానికి తోడుగా

నేను చాలాదూరము ప్రయాణంచేసి వచ్చితిని. అందుచేత శ్రమ రెట్టింపయినది. ఈమండువేసవిచేత నాప్రాణములు పోవుచున్నవి. ఈచెవి గాడుపు ఆచెవికికొట్టుచున్నది నాలుక యెండిపోవుచున్నది స్నానము చేసినట్లు చెమటపట్టినది చెవులు గడియలుపడుచున్నవి. ఒక యడుగైన ఇకనేను పెట్టజాలను ఏమైననుసరే ఈచెట్టుక్రింద అంగవస్త్రము వేసికొని పరుంటాను. (అని చెట్టుకు చేరబడి కూర్చుండి) ఎవరండో వెళ్ళేవారు నేను బ్రాహ్మణ్ణి ఆకలిచేత ప్రాణము పోవుచున్నది నాకు పట్టెడు అన్నం పెట్టించగలరా (అప్పుడు రామనాథం ప్రవేశించుచున్నాడు.)

రామ—అయ్యా! మీవంటివారికి పట్టెడుఅన్నము పెట్టినందు వల్ల తప్పులేదుగాని మాకుపురుడు యీగ్రామంలో కామశాస్త్రిగారొక్కరే అన్నప్రదానం చేయగలవారు. వారింటికి మిమ్మును తీసుకు వెళతానురండి. ఇక్కడికి ఎంతోదూరంలేదు పదిబారలు దయచేయండి.

పేరి—మంచిదినాయనా మీపెద్దలకు వేయినమస్కారములు నన్ను తీసుకువెళ్ళు. ఇంతమజ్జిగ అన్నం పెట్టిస్తావా నీకు బహుపుణ్యం వుంటుంది.

రామ—చిత్తమురండి (అని నడిపించుచు) అయ్యా తమరే గ్రామమునుండి ఏమిపనిమీద వస్తున్నారు?

పేరి—మాపిల్ల దానికి సంబంధము మాట్లాడడానికి భీమడోలు వెళ్ళి వస్తున్నాను.

రామ—భీమడోలులో మీపిల్లని ఎవరికిస్తారు?

పేరి—నాయనా నాకు దప్పచేత మాటరాలేదు. (తనలో) నేను రాయప్ప అవధానులకు పిల్లనిచ్చి వెయ్యిరూపాయలు పుచ్చుకున్నానని వీడితో చెప్పడమెందుకు. కాబట్టి ఈవంక మంచిదే.

రామ——అవును పాపము దయచేయండి. ఇదిగో కామశాస్త్రుల్లు గారియిల్లు ఈయరుగుమీద దయచేయండి ఆయన విస్తళ్ళు కుట్టుచు ఇక్కడనే కూర్చున్నారు (అప్పుడు కామశాస్త్రిగారు ప్రవేశించుచున్నారు.)

రామ——అయ్యా! ఈ బ్రాహ్మణుడు వడకొట్టి పడిపోయినాడు. తమరింత అన్నోదకములిచ్చి రక్షించవలెను.

కామ——ఏవూరండిమీది.

పేరి——నాకాపురం అత్తిలి. భీమడోలునుండి వస్తున్నాను. ఇహా నేను మాటాడలేను అన్నం అన్నం.

కామ——వేదము చదువుకున్నవారికేగాని అన్నము పెట్టనని నా ప్రతిజ్ఞ. మీకు వేదమువచ్చునా?

రామ——ఇదియేమి ప్రతిజ్ఞండి వేదము రానివారికి ఆకలికాదా యేమిటి? ఏజాతివారికైనా అన్నప్రదానము చేయవలసినదే.

కామ——నాయిష్టం నాది, వేదమువచ్చినవారికే నేను అన్నం పెడతాను లేనివారికి పెట్టను ఏమయ్యా! నీకు వేదము వచ్చునారాదా?

పేరి——(తనలో) వేదము రాదంటేనా వీడు అన్నం పెట్టడు. పెట్టకపోతే ప్రాణం ఇప్పుడేపోతుంది. కాబట్టి ఇప్పుడబద్ధమాడకతీరదు. (పయికి) అయ్యా నాకు వేదం సంపూర్ణముగా వచ్చును.

కా——సరే ఒక పనస చెప్పండి.

పేరి——ఇప్పుడు ప్రాణంపోతోంది భోజనమయిన తరువాత చెపుతాను.

కా——సరే స్నానమునకు లేవండి. వంటఅయింది.

(అందరు నిష్క్రమింతురు)

రెండవ రంగము

కామ—భోజనము నదికదా ఏదైనా ఒక పనసకు పదము, క్రమము, జట ఘన చెప్పండి.

పేరి—ముందుగా క్రమము చెప్తానువినండి. మీకుమారుడు మీదుగా మీరు స్వర్గమునకువెళ్ళుట క్రమము. మీరుండగా మీ కుమారుడు వెళ్ళుట అక్రమము. మీఅమ్మగారు మీచేతి మీదుగా పోవుట క్రమము. మీఅమ్మగారుండగా మీరువెళ్లుట అక్రమము.

కామ—ఛీ. దిక్కుమాలినముండాకొడుకా మాయిల్లల్లాచెడితిని మమ్మందరిని చావమంటావా (అని కొట్టబోవును.)

పేరి—చచ్చానయ్యో బ్రాహ్మణ్ణి చంపేశారయ్యో (అని అరచుచు దర్భాసనము మీదవేసుకొని వీధిలోనికి కేకలువేయుచు పరుగెత్తును. అప్పుడు పదిమంది చేరుదురు)

అందరు—కామశాస్త్రిగారు ఏమిటీగోల ?

కామ—(కలహకారణమును చెప్పెను)

అందరు—(కలహకారణమును విని) కామశాస్త్రిగారు మీప్రతిజ్ఞ బాగులేదు బ్రాహ్మణుడా నీనోరు మంచిదికాదు. మీ ఇద్దరివలన తప్పున్నది మీదారిని మీరుపొండి.

(అందరు నిష్క్రమింతురు)

నెపముల పుట్ట

ఒకపట్టణమున గొప్ప గానసభ జరిగెను. ఆసభకు పట్టణములో నున్న పెద్దమనుష్యులందరు విచ్చేసిరి. గానము ముగిసెను. చందాపట్టిక బయలుదేరెను. దాని వానసవేయగనే కొందరు పెద్దమనుష్యులు

అంతర్ధానమొందిరి. ఒకపెద్దమనుష్యునకు ఆలాగు పోవుటకు వీలులేక పోయెను. సంగీతముమీఁది ఆసక్తిచేత నతఁడు ముందుకువెళ్ళి కూర్చుండెను. ఆసమయమున చందాపట్టిక వచ్చునన్నమాట మఱచిపోయెను. ఆయానందసముద్రములో మునిగిపోయి మైమఱచి యున్నపుడె దాని కడుపుకాల పిల్లపిడుగువలె చందాపట్టిక వచ్చెను. ఆకాగితము చేతిలో పడునప్పటికి పాము మీఁదబడినట్లు అత డదరిపడి తెల్లపోయిచూచెను. అంతలో రూళ్ళపెన్సిలు గూడ చేతికిచ్చిరి. పాఱిపోవుటకుగాని తప్పించుకొనుటకుగాని వీలులేకపోయినది ఒక్కొక్కప్పు డిటువంటియసందర్భములు తటస్థించుచుండును అవి తప్పించుకొనుటకు గొప్పయుపాయము కావలయును. ఈపెద్దమనుష్యునకు గావలసిన యుపాయములన్నియు నతని దగ్గరనున్నవి. అందుచేత నతఁడు తెగించి మూఁడురూపాయలు చందా వేసెను. ఈచందాసొమ్ము వసూలుచేయుట కొఱకు పెత్తనదారు డేర్పడెను. ఆపెత్తనదారుఁడు చందాకాగితమొక సేవకునిచేతికిచ్చి చందాలు వసూలుచేసి తీసుకొనిరమ్మని యాజ్ఞాపించెను. సేవకుఁడు ఇండ్లుదిరుగ నారంభించెను. తక్కినయిండ్లమాట మన కక్కరలేదు.

ఇదిగో. జవాబులువినండి. ఒకనాఁడుదయమున సేవకుఁడు వెళ్ళునప్పటికి ఆపంతులుగారు నిద్రలేవలేదు. పదిగంటలకు వెళ్లునప్పటికి స్నానముచేసి మడిగట్టుకొన్నారు. మధ్యాహ్నం కచ్చేరికి వెళ్ళినారు. సాయంకాలము షికారువెళ్ళినారు. రాత్రివేళ సేవకుఁడు వెళ్లగా యర్థరాత్రివేళ అంకమ్మశిపాలు అన్నట్లు నీకిపుడా సమయముదొరికిందని చీవాట్లు బెట్టిరి. కచేరీసెలవు వచ్చినదినమున యుదయమున వెళ్ళగా పంతులుగారు స్నేహితుని జూచుట కెచ్చటికో వెళ్ళిరి. మధ్యాహ్నం 12 గంటలకు భోజనముచేసి పండుకొనిరి. మూఁడుగంటలు మొదలు నాలుగు గంటలవరకు ఫలహారము చేయుచుండిరి. మఱియొకమారు కనబడి, పెద్దమనుష్యులతో మాట్లాడుచున్నాము, మఱియొకప్పుడు

జరూరుకాగితములు చూచుకొనుచున్నాము. యింకొకప్పుడు రమ్మనిరి. వేరొకప్పుడు నాదేహములో నుస్తీగానున్నది పొమ్మనిరి. మఱియొకపుడు మాయింట్లో చంటిపిల్లవాడికిజబ్బుగానున్నది తోచడంలేదు మళ్ళి రమ్మనిరి. వేరొకమారు మాఆడవాళ్ళు బద్ధకంగానున్నారు. రేపురమ్మనిరి. పదిసార్లు సాయంకాలం రమ్మనిరి. మఱినాలుగుసార్లు మధ్యాహ్నమనిరి. రావలసినలెఖ్ఖ రాలేదని కొన్నిసార్లనిరి. గుమాస్తా నడిగి పుచ్చుకోమని కొన్నిమాట్లు చెప్పిరి.

గుమాస్తానడుగగా పంతులుగారినే యడుగుమనెను. ఇద్దరును కలసియున్నపుడడుగగా తాళముచెవి పోయినదనిరి. మరియొకసారి మైలవచ్చినది. పెట్టెలుముట్టుకొనుటకు వీలులేదు ఆనకరమ్మనిరి. కానుపాలుకు వచ్చినపుడు ఆనేవకుడడుగగా నీకోసము జేబులోవేసికొని వస్తాననుకొన్నావాయేమిటి? నాకిదేజ్ఞాపకము నూరుపనులమీద ఫో పొమ్మనిరి. బజారులో కనబడునప్పుడడుగగా మహాకోపముతో డాం ఫూల్ నీకుమర్యాదలు తెలియవు ఎక్కడబడితే అక్క అడుగుతారా? పెద్దపిన్నలు లేకుండా బేహాయాయని చేతికఱ్ఱతో కొట్టబోయిరి. కొన్నిసారులు ఫస్టుతారీఖున రమ్మనిరి. తరువాత పదిహేనవతారీఖనిరి. తరువాత ముప్పదియవతారీఖయింది, అమావాస్యయింది. పౌర్ణమాస్యయింది. పాడ్యమినాడయింది పంచమినాడయింది నౌఖరును మానిపించి పెత్తనదారుడు స్వయముగా వెళ్ళెను. ఆయనకుగూడ ఆమర్యాదే జరిగింది. తిరుగలేక కాళ్ళునొప్పిపట్టినవి. అడుగలేక నోరునొప్పిపెట్టినది. వ్యవహారము పాతబడినది అడుగువారు యిచ్చువారుగూడ ఆమాట మఱచిరి. వానితో మనపెద్దమనిషికి తేలిపోయెను. గానసభ చేయించినందుకు పెత్తనదారుడు చందావేసినవారి సొమ్ముగూడ తానే యిచ్చికొని యికయెప్పుడు సభ చేయించనని ఒట్టువెట్టుకొనెను.

మూడురూపాయలు చందావేసిన పెద్దమనుష్యుని యింటిమాట మనకు కావలెను. సేవకుడు వారింటికెన్నిసార్లువెళ్ళెనో చెప్పుటకు దగిన లెక్కలులేవు. పాపము సేవకునికాళ్ళు తోలుకాళ్ళయినవి ఇనుప మేకులు నుక్కునరములు వజ్రపుపాదములు భగవంతుడిచ్చియుండిన పక్షము నతడోపికగా యాయనయింటిచుట్టును దిరిగియుండును. ఇటువంటిసమయములలో నటువంటిపాదములియ్యవలెనన్న తెలివితేటలు భగవంతునికిలేవు. భగవంతుడు సర్వజ్ఞుడందురు. సర్వజ్ఞుడిటువంటి చిన్నసంగతులు తెలిసికొనలేకపోవుట కేమికారణమో తెలియదు. భగవంతునికి గూడ తెలియనిసంగతులెన్నో కొందఱుపెద్దమనుష్యులు దగ్గర గలవని దీనినిబట్టి నిశ్చయింపవచ్చును. సేవకుడు చందాపట్టిక పట్టుకొని వెళ్ళినపుడు పెద్దమనుష్యునివల్లనుండి ఆయన యింటిలోనున్న వారివల్లనుండి వచ్చినజవాబులు కొన్ని మేమిం దుదాహరించుచున్నాము. ఇది లోకోపకారపుకార్తి. అందఱు పబ్లికుగుడ్డుకోసరము పాటుపడుచున్న దినములివి. మేముకూడా కొంతగుడ్డుచేయవలెనని సంకల్పించి, ఆజవాబులు ప్రకటించినాము. దీనివల్లవచ్చు గుడ్డు యేమిటని మీరడుగుదురేమో దీనిలో గొప్పప్రయోజన మున్నది. ఈజవాబులన్నియు మీరు గట్టిగా చదువుకొని వేసినచందా లెగబెట్టుటకు మీరుకూడ ఆపాటలే పాడవచ్చును.

యోగానందస్వామి.

(వెంకటరత్నము, భీమశంకరము ప్రవేశించుచున్నారు)

భీమ—ఓరే వెంకటరత్నం మనగ్రామము లోనికి ఒక గొప్ప స్వాములవారు వచ్చినారు. ఆయనకు నేనొకభిక్ష చేయదలచుకొన్నాను.

నీవుకూడా భిక్ష చేస్తావా? రేపు మాయింట్లో భిక్ష ఎల్లుండి నీవుచేస్తే బాగుంటుంది.

వెంక — ఈరోజులలో ఆస్తి విశేషముగా లేక మనమే సన్యాసుల వలె నున్నాము. భిక్షలు మనము సరిగా చేసికొంటే చాలును. భిక్ష చేసినంత ఫలము.

భీమ — మొదటినుండీ నీకున్న తెగులేయిది. ఏమాటచెప్పినా దాని కడ్డదిడ్డము అకటా వికట మేకాని సరిగా మాటచెప్పవు. ఈస్వాములవారు తక్కిన సన్యాసులవంటి వాడనుకొన్నావా యేమిటి ఆయనకు భిక్షచేస్తే మనగృహము పావనమాతుంది.

వెంక — ఏమిటోయి యీయన దగ్గరనున్న గొప్ప మహిమ కొంచెము చెప్పు.

భీమ — నాలుగు వేదాలు ఈయనకు కంఠతావచ్చును. ఉపని షత్తులు బ్రహ్మసూత్రాలు భగవద్గీతలు ఆయన బోధిస్తే అరటిపండు వొలిచి చేతికిచ్చినట్టు అర్థము విడిపోతుంది. వేందాంత శాస్త్రములలో ఆయన నిధి.

వెంక — ఈస్వాములవా రెప్పుడొచ్చినారు.

భీమ — ఈవేళ ప్రొద్దున్నే వచ్చినారు.

వెంక — ఈవేళప్రొద్దున్నే ఆయన వచ్చినప్పుడు ఆయన ప్రజ్ఞలు నీకప్పుడే యేలాగు తెలిసినవి? ఉపనిషత్తులు నీకేమైన బోధించినారా యేమిటి?

భీమ — బోధించాలా యేమిటి, ఆయన ముఖవర్చస్సుచూస్తే నే ఆయనకు సకల శాస్త్రాలు వచ్చినట్టు తెలుస్తోంది. ఆ హా! హా! ఆబ్రహ్మతేజస్సు నీయంటి నిర్భాగ్యునకు తెలియదుగాని ముఖము సూర్యబింబములాగున్నది.

వెంక—వర్ఛస్సునుబట్టే పాండిత్యము తెలుస్తుంది! అబ్బా నీవు చాలాగొప్పవాడవే? ఇదెవరు కనిపెట్టలేకపోయినారు మొగము సూర్య బింబములాగున్నవా ళ్ళెంతమందో ఓ అంటేనా, రాకుండా యున్నారు.

భీమ—నోరుమూసుకుందూ ఈపాటికి ఒళ్లు పై 'తెలియకుండా మహానుభావులను ఆక్షేపించడ మొకటున్నది. వెధవయింగ్లీషుముక్కలు నాలుగు చదువుకొన్నావని చెప్పి నీకు తెగనీలుగు బలిసినది. నీకు పెద్దా పిన్నా లక్ష్యములేదు ఇలాటిమాట లన్నందుకు పాదిత్యం చుట్టుకొని పురుగులుపడిపోతావు ఆఖరికి.

వెంక—ఓరే కోపపడకు. ఆయనమహిమ నీకేలాగున తెలిసినదంటే నన్ను తిడతా వెందుకురా?

భీమ—తిడతానా, పళ్లురాలగొడతానా ఆయన రాత్రిళ్ళు ప్రాణ యామముపట్టి గజమెత్తులేస్తారు. ఈయన క్రిందటి శివరాత్రినాడు శ్రీశైలములోను కోటిపిల్లిలోను నత్తల రామేశ్వరములోను మూడు వూళ్ళలోను ఒక్కనాడే కనపడ్డారట. ఒక్కపర్యాయమే రెండుబిందెల నీళ్ళు తాగేసివేయగలరు. గుడ్డపీలిక నోట్లోపెట్టి కడుపంతా శుభ్రముగా కడగివేసి ఆగుడ్డ రెండవప్రక్కనుండి ఆయన తీయగలరు.

వెంక—ఆయన యీవేళ ప్రొద్దున్నే వచ్చినారుగదా రాత్రి గజమెత్తు లేవడము నీవెప్పుడు చూచినావు. నోటిలోముళ్ళుపెట్టుకొనే విప్రవినోదులకును గుడ్డపెట్టుకొనే యీయనకు భేదమేమిటి?

భీమ—ఛీ! నీమొగమీడ్చ నీపాపానికి మేరలేదురా? నీకిల్లా బుద్ధిరాదు. రేపు మాయింట్లో స్వాములవారికి భిక్షచేసి నిన్నక్కడకు తీసుకువెళ్ళి ఆయన యెదుట కూలవేసి ఆయనచేత నీ కుపనిషత్తులు బోధింపజేసి ఆయనపట్టే ప్రాణాయామం నీకు చూపించి, ఆయనమహిమ చూపించి అప్పుడు నలుగురిచేతా నీకు తలవాచేటట్టు చివాట్లు వేయిస్తాను నీయింగ్లీషుచదువు తగలెయ్యా. పొట్టకోసము నాలుగింగిలీ

ముక్కలు నోటికి తగిలించుకొని తెగనీలిగి చస్తావు ఉండు నీరోగము కుదురుస్తాను. రేవుమాత్రం మాయింటికి పిండాకూటికిరా మరిచిపోక.

వెంక—(నవ్వుచు) ఎందుకురా నీకింతకోపము. నిష్కారణముగా పట్టుకుతిట్టుచున్నావు రేవుమీాయింటికి భోజనమునకు నేనువచ్చి ఆయన మహిమలు చూచినతరువాత ఆయనకాళ్ళుకడిగి నీళ్ళు త్రాగుతాను.

(అని యిద్దరు నిష్క్రమింతురు)

2 రం గ ము

(ప్రవేశము—భీమశంకరముగారియిల్లు. భీమశంకరము, వెంకట రత్నము, మరికొందరు బ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు.)

భీమ—వెంకటరత్నం! మనభోజనానైనవిగద మనము స్వాములవారి సన్నిధిని కూర్చుందము. ఆయనచేత నీకు ముండకోవని మత్తైనా తైత్తరీయమైనా చెప్పిస్తాను!

వెంక—వినడానికి నాకేమి అభ్యంతరములేదు. (అని యిద్దరు స్వాములవారివద్దకు వెళ్ళుదురు)

(అంతట పడకకుర్చీమీాద పండుకొని యోగానందస్వామివారు ప్రవేశిం చుచున్నారు.)

భీమ—స్వామీానమస్కారము

యోగా—నారాయణ

భీమ—(కూర్చుండి) వెంకటరత్నమూ! విస్సయ్యశాస్త్రుల్లు గారూ! బుల్లెన్నావధానులుంగారూ అంతాదయచెయ్యండి.

(అందరు నమస్కరింప స్వాములవారు నారాయణా యనుచున్నారు)

భీమ—స్వామీాతమవంటి మహానుభావుల దర్శన మిదివరకెన్న డూ మేము చేయలేదు. అనేకమంది స్వాములవార్లు వస్తూపోతుంటారు కాని వారు నోట్లోవుప్పు వత్తిలేనివారు, తమవల్ల మేము ధన్యులము కావలెననియున్నది.

యోగా—మీరు మంచివాళ్ళురా నాయనా. భిక్ష బాగా యున్నది. (అని త్రేపుమని తేన్చును)

భీమ—మాదొక చిన్నమనవి యున్నది. తమరనుగ్రహించి వినవలె.

యోగా—చెప్పరా నాయనా వినకేమి

భీమ—ఉపనిషత్తులు కొంచెము పుచ్చుకోవలసినదని నాకోరిక.

యోగా—ఓరి వెఱ్ఱివాడా యిప్పుడు చెప్పినావేమి, ఇందాకా భిక్ష వేళ చెప్పినట్లయితే పనిలోపని పుచ్చుకొందునుకదా.

భీ—అప్పుడు తమకు వీలుండదు. ఆకలిగానుండునని నేను మనవిచెయ్యలేదు.

యోగా—అప్పుడే వీలుండును ఇప్పుడెంతో అయాసముగానున్నది. ఉపనిషత్తులు ప్రస్తుతం పుచ్చుకోలేను రాత్రి ఫలహారము వేళ తీసుకురా, అప్పుడు తప్పకుండా పుచ్చుకుంటాను.

భీమ—(తెల్లబోయి చూచుచున్నాడు)

వెంక—(తనలో) ఈ నిర్భాగ్యపుస్వాములవారికి ఉపనిషత్తులంటే అర్థమే తెలిసినట్లు కనబడదు. (ప్రకాశముగా) స్వామీ! ఉపనిషత్తులనగా తమ యభిప్రాయమేమిటి.

యోగా—ఓసి ఉపనిషత్తులంటే నాకు తెలియదనుకున్నావు. ఇంతదేశము తిరిగిన ముండావాడిని స్వాములవారంటే యేమో శుద్ధ వెఱ్రిపప్ప అనుకున్నావు కాబోలును ఉపనిషత్తులనగా మీదేశపు పిండి వంటలలో ఒకటి.

భీమ—(తలవంచుకొని తనలో) అప్రదిష్టవచ్చినదిగదా ఇంత నిర్భాగ్యము ముండాకొడుకన్నమాట తెలిసినదికాదు.

వెంక—(నవ్వు పట్టజాలక చివాలున లేచి వీధిలోనికి వెళ్ళి పకపక నవ్వుచున్నాడు)

భీమ—వానివెనుక వెళ్ళుచున్నాడు (బ్రాహ్మణు లొక్కరొక్కరే వీధిలోనికి వెళ్ళుచున్నారు.)

వెంక—నాయనా భీమశంకరం రారాబాబూ (అని పకపక నవ్వి) ఏమి గొప్పస్వాములవారిని సంపాదించినావురా. ఇంతవాగొప్పవాడూ మన దేశం రాలేదురా బాబూ. దీనికోసమే గాదురా బాబూ నన్ను చెడామడా తిట్టినావు.

భీమ—బుద్ధిలోపము వచ్చినది. ఏమనుకుంటే కార్యమేమిటి. అయినదేమిటో అయినది. ఆముండాఘాడిని యేడిపింపక నీవింటికి నడు. ఈరాత్రి సాగనంపుతాను. చెప్పుకుంటే సిగ్గు ఏపెళ్ళాముమీద కోపము వచ్చి జందెములు తెంపిన ముండాకొడుకో పీడు. అనుభవము అయితేనే గాని బుద్ధి రాదు, నీకుగాదు గాని నాకిప్పుడు బాగా బుద్ధివచ్చినది.

(అని అందరు నిష్క్రమింతురు)

శతఘంటావధానము

రంగము 1

(అంతట సోమశాస్త్రిగారు రామకవిగారు ప్రవేశించుచున్నారు)

సోమ—రామకవిగారూ! మీరు శతావధానము చేయగలరని చెప్పి మన మాధవరావుగారిని వలలో బడవేసినాను. వారును మీ కవనము వినవలెనని కుతూహలపడుచున్నారు గావున మనము వారి దర్శనమునకీదినము పోవలయు.

రామ—సరేకాని నేను నాటకముల వ్రాయగలనని కూడ జెప్పినారా?

సోమ—ఆ చెప్పినాను. మీరు మన సుందరం పంతులుగారికి దినమున కొక్కనాటకము వ్రాసి యిచ్చుచున్నారని కూడ చెప్పి మీరు

వ్రాసిన దుర్భాణీపరిణయమును గూడ జూపినాను. అది చూచి వారు చాల సంతసించినారు.

రామ.—ఏమిటి ఎంతపని జేసినారయ్యా శహబాస్, మీరు మంచిస్నేహితులు. మీమేలు మరవగూడదు. అయితే నా రీదినమున సభ చేయించుదురు కాబోలు. అప్పుడు మన సుబ్రహ్మణ్య కవిగారు వస్తారా ?

సోమ.—వారు రారు. మనము మొన్న వారికి "దినదినప్రబంధ కర్తృత్వమున మహోన్మాదించి గెలుపొందు" దని వ్రాసిన రిజిస్టరీయుత్తరమును జూచి సిగ్గుపడిపోయినారు. మీముందర వారు నిలిచి కవిత్వము చెప్పగలరటయ్యా.

రామ.—(తనలో) నేనేమో చదువుకొన్నవాడననుకొని యా సుబ్రహ్మణ్యకవి సిగ్గుపడి యుండనోవు. మంచిపని జరిగినది. నాకింత సంభావన దొరకుట కిక సభ్యంతరముండదు. కాని యీశాస్త్రిముండా కొడుకున కేమైన హిరణ్యశ్రాద్ధము పారవేయవలెను. వీనికి కొంచెము ఆశపుట్టించి హెచ్చరిక చేయవలయును. (ప్రకాశముగా) శాస్త్రిగారూ మీమేలు మరవగూడదండీ, చూడండి. మనము ఘనకముం దొక యేర్పాటు చేసికోవలెను. అది యేమిటందురేమో నే నెక్కడ శతావధానముచేసినను మీకు నాకు చెరిసగము. అందుకు మీ రంగీకరించవలెను.

సోమ.—మీదయ యుండిన చాలును, నేను శాస్త్రాలు చదివినానని మీరు చెప్పుచుండుటయే పదివేలు. అంతకంటె మీరు నాకేమియు నీయ నక్కరలేదు. కాని మనము పట్నాలు మాత్రము తిరగకూడదు. అక్కడ కొంచెము చదువుకొన్నవా రుండకపోరు. అప్పుడు మన బండారము బయటపడును.

రామ—చాలు, మీకేమి తెలియును. పట్టణాల్లో మాత్రము మహా చదువుకొన్నవాళ్ళుంటారయ్యా. ఊరికే డాబుచేసి బుకాయించే వాళ్ళేగాని పట్టుమని పదిమాటలు నేర్చినవారు ఈదినాల్లో యెక్కడా లేరు. ఏదోవిధంగా నాలుగుపద్యాలల్లి చకచక మాట్లాడితిమా మన కేదో వచ్చుననుకొని, ఉద్యోగస్థులు ప్లీడర్లు యింతడబ్బు పారవేస్తారు గదా. పైగా యీ మహారాజు లిచ్చారని ఆ మహారాజు లిచ్చారని నాలుగు బిరుదులు చెప్పినామంటే మనలను ప్రశ్నవేసేవారేలేరు. చూడండీ. మీకు బొబ్బర్లంకజమీందారుగారు పరీక్షించి "మహా మహిమోపాధ్యాయ శిరోభూషణచక్రవర్తి" యని బిరుదునిచ్చినట్లు నేను చెపుతాను అందుకు మీరు రంగీకరించాలి.

సోమ—చిత్తము. ఏదో బాబూ, నాలుగుడబ్బులు దొరికే మాత్రం చూడు ఒకవేళ మనగుట్టు బయటపడినచో చిక్కువచ్చునేమో సుమా.

రామ—చిక్కేమయ్యా. నేను శతావధానిననియు, కవిశేఖరుడ ననియు, దినదినప్రబంధకర్తననియు జెప్పుచుండ, నెవరీ బిరుదుల నిచ్చినారని అడిగేవారేలేరు. ఒకవేళ యెవరైన నడిగినచో ఏదో డాబు డాబి బుకాయిస్తే నోరెత్తేవా డెవడయ్యా.

సోమ—చూడండీ. మనపంతులుగారితో మీ బిరుదులసంగతి చెప్పుట మరచినానండీ.

రామ—అయ్యో! ఎందుకు మరచిపోయినారు. అవి చెప్పక పోతే మనపరువు దక్కుతుందా మన బ్రతుకు వాటితోనే యున్నది. ఎంతపని చేసినారండీ శాస్త్రుల్లుగారూ.

సోమ—పోనీ యిప్పుడుపోయి చెప్పిరానా?

రామ—చాలు యిదొక తెలివితక్కువా. మీరు శుద్ధవైదికము

చేసినారు. పోనీలెండి ప్రొద్దుపోయినది. మాధవరావుగారు మన నిమిత్తము కనిపెట్టుకొంటారు. పోదాము పదండి.

(అని యిద్దఱు నిష్క్రమింతురు)

2 రంగము

మాధవరావుగారి యిల్లు

(అప్పుడు రామకవి సోమశాస్త్రి ప్రవేశింతురు)

మాధ—ఓహో శాస్త్రిలుగారు దయచేయండి.

సోమ—చిత్తము వీరే మన రామకవిగారు మీరెప్పుడు జూడ లేదుకాబోలు.

మాధ—(రామకవినిజూచి) దయచెయ్యండి. మీ దర్శన మెన్నడు చేయలేదు.

రామ—నేనును తమదర్శనము చేయవలెనని చాలదినముల నుండి ప్రయత్నము చేయుచున్నాను. నేటికి నా మనోరథము నెఱవేరి నది. శతావధాన మీ దినముననే చేయించుట కేర్పాటుచేసినారా?

మాధ—మొదట చేసినాను గాని నేను కొన్నిపనులమీద బెజవాడ వెళ్ళవలసియున్నది. కావున తిరిగివచ్చినతరువాత యేర్పాటు చేసినాను.

రామ—మరల తమరెప్పుడు దయచేయుదురు.

మాధ—అది నేను చెప్పజాలను అయినను మీరు రాకరాక వచ్చినారుగదా. ప్రస్తుతము నాకుదోచిన బహుమాన మిచ్చెదను. పుచ్చుకొని నన్ను సంతోషపెట్టండి. (అని ఎనిమిదిరూపాయలిచ్చును.)

రామ—(పుచ్చుకొని) చిత్తము మీదయయుండిన చాలును; కాని తమరు మాకొక్క యుపకారము చేయవలయును. మేము అవ ధానము చేయనిదే బహుమానము పుచ్చుకొన్నామని చెప్పుట భావ్యము

కాబట్టి కావున కొన్ని పద్యములరచించి యిచ్చెదను. అవిమీరు చేయించిన అవధానములోనివని యేపత్రికకైనను బంపవలయును.

మాధ— అది నేనెట్లుచేయుదును. అవధానము చేయనిదే పత్రికకు పంపినచో బాగుండునా ఈయూరిలోను వారందరును నన్నుగతాళి చేయరూ.

రామ—మనవిశ్వనాధముగారు శరభరాజుగారు మొదలయిన వారు మీవలెనే బహుమానము మాత్రమిచ్చి, అవధానము చేయించుటకు తీరికలేదని చెప్పినారు వారును పద్యములను పత్రికకు బంపుటకు సమ్మతించి మీతోగూడ మనవిచేయుమన్నారు.

మాధ—వారు సంతకము చేసినచో నాయభ్యంతర మేమియు లేదు కావున మీరు విశ్వనాధముగారిని, సంతకముచేసి పంపమనిచెప్పండి అప్పుడు నేనుగూడచేసి పంపుతాను.

రామ—చిత్తము మీమేలు మరచుటకు వీలులేదు. మీకీర్తి మన సోమశాస్త్రులుగారు చెప్పినారు. పద్యాలు విశ్వనాధముగారి కిచ్చి యీదినముననే మేము విశాఖపట్టణము పోవుచున్నాము. కావున దయ యుంచి పత్రికకు మాత్రము పంపవలయునని మాకోరికె.

మాధ—చిత్తము అట్లనే చేయుదును. మీరు విశ్వనాధము గారి చేతికిచ్చి వెళ్ళవచ్చును.

రామ—చిత్తము. వారి చేతికిచ్చివెళ్లుదుము. మాకు సెల విప్పించండి.

(అని యిద్దరు పోవుదురు)

రంగము ౪ బజారువీధి.

(సోమశాస్త్రి రామకవి ప్రవేశము.)

రామ—శాస్త్రిగారూ. రెండు పుంజీలు పడ్డాయి. మనమిక యీయూరను యుండరాదు, మొన్న దేవపాలెంలోచేసిన పద్యాలువిశ్వనా

ధంగారికి యిచ్చి వెడదాము. పేపర్లో వారు చాలాగొప్పగా జరిగినదని వ్రాస్తారు. చూచారా నామహిమ.

సోమ—అందుకేగాదు బాబూ మీవెంటనున్నాను. ఏదో నాలుగు కబుర్లు చెప్పి కాలము గడపలేనివాళ్లీదినాల్లో పనికిరారు బాబూ.

రామ—ఈదినాల్లో చదువుకున్నావాళ్ళని చూచేవారెవరయ్యా ఇంతకు మన అదృష్టము బాగుంటే పట్టినదల్లా బంగారు మవుతుంది. ఇప్పటి కెక్కడా అవధానం చేయనవసరము లేకపోయినది. మన శతావధాన బిరుదు శాశ్వతముగా నుండుగాక! పదండిపోదాము.

అడ్డబొట్టు—నిలువబొట్టు

(జంగము బసవలింగము, సాతాని తిరువెంగళము మరికొందరు ఒక తాటియాకు పాకలో ప్రవేశించుచున్నారు)

బస—రేవుపడవ దాటుటకు వచ్చేవాళ్ళందరికి, ఎండదెబ్బ వానదెబ్బ తగులకుండా యీపాక చాలయుపయోగముగా నుంటూయుంది.

తిరు—ఉపయోగమన్న యుపయోగమా, వందలకొలది మనుష్యులు సుఖిస్తున్నారు.

బస—ఆశ్రీలింగమూర్తి కృపవుంటే యిటువంటి సత్కార్యములు చేయవలెనని బుద్ధిపుడుతుంది.

తిరు—ఆ శ్రీరంగనాయక కరుణాకటాక్షం ప్రసరిస్తే కాని యిటువంటిబుద్ధులు తోచవు.

బస—(దగ్గర నొకమనిషినిజూచి) అయ్యాగారు చిత్తగించినారా, అడ్డబొట్టుయొక్కమహాత్మ్యం, ఆమహావిశ్వమంతా యిందులోనేయున్నది

ఆదూలమడ్డముగా వేయబట్టి యీపాకంతా దానిమీద ఆధారము చేసికొనియుంది. అది సరిగా అడ్డబొట్టులాగుంది. ఈదూలంలాగే అడ్డబొట్టుకూడ సుఖమంతకు నాధారమని దీనినిబట్టి తెలిసికొనవచ్చును.

తిరు——(మరియొకని బిలిచి) నామన వాలకించండి నిలువుబొట్టు మహాత్మ్యమువంటిది మరియొకటిలేదు. దానికదే సాటి. అందుకనే నిలువుబొట్టు మూడులోకాలికి ఆధారమయినది ఆగుజ్జులు చూడండి. నిలువుగా పంగనామములుగాగున్నవి. వాటినే ఆధారము చేసికొని కొంప నిలిచినది నిలువుబొట్టంటే కోటిపంగనాల కిమ్మతు ఈగుజ్జులు లేకపోతే కొంపలేకపోవును, ఆలాగే నిలువుబొట్టు లేకపోతే లోకమే లేదు.

బస——అడ్డబొట్టు ముందర నిలువు బొట్టెందుకూ పనికిరాదు చూడండా వెనుబద్ద అడ్డబొట్టులాగుననున్న ఆవెనుకబద్ద లేకపోతే యిల్లు నేల కూలిపోవలసినదేకదా. అడ్డబొట్టుకు నిలువుబొట్టుకు యేనుగునకు దోమకున్నంత; తేడాయున్నది. అడ్డబొట్టు రాజాబొట్టు.

తిరు——నిలువుబొట్టుతో అడ్డబొట్టు పోల్చడానికే వీలులేదు. ఈగుజ్జులు లేకపోతే ఆనడిబద్దయెక్కడుంటుంది. నీనెత్తిమీదా యేమిటి?

బస——నానెత్తిమీదగాదు. నీవెన్నుమీదుంటుంది.

తిరు——నిలువుబొట్టును నిందిస్తే మహానరకం పాలైపోతావు. ఏడేడు పద్నాలుగు జన్మాలికి నీకు పుట్టగతులుండవు.

బస——అడ్డబొట్టును దూషిస్తే నీనోరు పుచ్చిపోతుంది. యమలోకములోనిన్ను యినుపముక్కుల కాకులెగిరెగిరి పొడుస్తాయి. అడ్డబొట్టును తిడతావు. నీకేమిచేటు కాలముువచ్చింది, విభూతి పిండికట్లు మొగమున నడ్డముగా బెట్టుకొనియుంటే మొహమున కెంత కళకాంతి.

తిరు——నీకళ మండిపోయినట్లేయుంది. శ్రీవేతకళ ఆతిరుణామణి తిరుచూర్ణము మొగమున దిద్దుకొనిద్వాదశోర్ధ్వ పుండ్రములుశరీరమున

ధరించియుంటే లక్ష్మీవిలాసం కలకలలాడుచు మొగముమీద తాండవ మాడుతుంటుంది.

బస—నీతాండవము దగ్గపట్టినట్టేయుంది. మొగానికి వెల్లేసినట్టుగా సుద్దపాముకోగానే సరా.

తిరు—ఒంటినిండా బూడిద పట్టించుకొని బూడిదగుమ్మడికాయలాగుంటే సరా వెధవసింగారం ఆకొల్చేదేవుణ్ణి పట్టివస్తాయి, బొట్టుబుద్ధులూను.

బస—ఒరే, ఒరే, దుర్మార్గుండాకొడుకా చస్తావు చస్తావు. మహేశ్వరుని తిట్టకు మహేశ్వరునితిట్టకు నీజిహ్వ పడిపోతుంది.

తిరు—ఏం తిడితే యేంజేస్తాడు నీమహేశ్వరుడు ఉండేది వల్లకాట్లోను, యెముకలు పెత్తాలు వంటినిండా నగలు, యేనుగుతోలు పులితోలే గాని కట్టుకుందుకు గుడ్డలులేవు బొల్లెద్దు నెక్కుతాడు విషమే గాని తినబోతే అన్నములేదు. నెత్తిమీద నీళ్ళకుండ, మీదేవుడికి నీకు సిగ్గులేదు పోపో అవతలకు గుడికట్టలాగ రాయిపట్టుకొని లింగం జంగం అంటూ తిరుగుతావు.

బస—ఓరి నీతలపండు వేయిచక్కలుగాను. నీకాయుర్దాయము సరిపోయిందిరా. నీగొల్లదేవుడు గోదారిపాలుగాను ఆవులు మేపుకొని గొల్లబొట్టెలతో సరసాలాడుకొని పెళ్ళాముచేత కాలుతాపులుతిని ఉండడానికి కొంపలేక యిల్లరికమెళ్ళి సముద్రములో కాపురముండి పాముమీదపడుకొని బొల్లిగద్దనెక్కి తిరిగేదేవుడు నీదేవుడు ఆడిదగ్గర మాత్రమేమా వల్లాకాడా. నీదేవుణ్ణి కొలిస్తే దొంగితనము లంజతనమే గాని యికనేమీ అబ్బదు. సిగ్గుపడిపోవక యింక మాటలాడుతావేమిరా.

తిరు—నీకు యమకింకరులచేత పోట్లు.

బస—నీకు రౌరవాది నరకాలే.

ఒక మనుష్యుడు—మీరిద్దరు వాదించికుంటూ మధ్య దేవుడిని తిడతారేమి ?

తిరు—జంగంముండాకొడుక్కి దేవుడేమిటి ?

బస—గొల్లబోయడు దేవుడేమిటి నా అడ్డబొడ్డు మహాత్మ్యము చూపిస్తాపట్టూ ఈపాకలోనున్న జంగాలంతా గాండోయి. అడ్డంగా వున్న దూలం పీకివెయ్యండోయి. యిల్లు నిలుస్తుందేమో చూదాం.

తిరు—ఇక్కడుండే సాతానులందరు రండోయి. నిలువుబొట్టు మహాత్మ్యము చూపిద్దాము. నిలువుగానున్న కొమరులు వాసములు పీకి వేస్తే యిల్లు నిలుస్తుందేమో చూద్దాం పీకండి.

(అప్పుడు జంగములు దూలములంగా సాతానులు వాసములు పీకుచున్నారు. పాక కూలుచున్నది.)

తక్కిన బాటసారులు—ఓరి మీ నిలువుబొట్టూ అడ్డబొట్టూ దొంగలుతోలా, నిక్షేపమల్లా ఉండనీకి నీడ నిచ్చేపాక కూలద్రోసినారు. రండి యీపాటికి, అదిగో రేవుపడవ ఎక్కుదాము రండి.

(అందరు నిష్క్రమించుచున్నారు)

స్తోత్ర పాఠము

(ఆశ్రితుడు ప్రభువు ప్రవేశించుచున్నారు.)

ప్రభువు—శంభుశాస్త్రిగారూ అయితే మీరు మాతాతగారి నాటనుండి మీరు మాకాశ్రితులై యున్నారు. ఈనాటివారు కారు. అయితే మీవయస్సెంత.

శంభు—అబ్బో నేనీనాటివాడనాండి. బందరుప్పెనకు ముప్పది యేండ్లవాడిని. వికారి సంవత్సరపు గాలివానగూడ బాగా యెరుగుదును. డొక్కలకరువని చెప్పుతుంటా రెరుగుదురా? నందన సంవత్సరపు

కరువు అప్పటికి నాలుగేళ్ళ కుఱ్ఱవాడిని. అప్పుడు మా నాయనమ్మ మే మన్నములేక మలమలమాడి చచ్చిపోతూంటే తమ పురోహితుడుగా రింటికి తీసుకొనివెళ్ళి అన్నముపెట్టించేది. తరువాత నేను పాతిక సంవత్సరములు వయస్సులో నుండగా మీతాతగారు పరమపదించారు.

ప్రభు—మా తాతగా రెల్లాంటివారండీ.

శంభు—ఏలాటివారని తమతో నేను మనవి చేయగలను. మనిషి ఆజానబాహువు. స్ఫురద్రూపి ఆయనయెదుటికి ఆడవాళ్ళు వచ్చేరంటే మోహంలోపడిపోయిరన్నామాటే చేరడేసి నేత్రాలు. ఆయనజుట్టు ముడి యుండేదండి పెద్ద గుమ్మడికాయంత యుండేది ఆయనను నేను మునలితనములో జూచినప్పటికి ఆయన జబ్బలు మన దర్బారుచావిడి స్తంభాల వలె యుండేవి. ఆయన వక్షస్థలమా మోటబండంత వెడల్పుండేది. శరీరచ్ఛాయ పచ్చగా దబ్బపండుగదా చచ్చిపోయేవరకు గూడ.

ప్రభు—మా బాబయ్యగారికంటె పొడుగగా నుండేవారా పొట్టిగానుండేవారండి.

శంభు—మీ బాబయ్యగారికంటె బాగాపొడుగుగా నుండేవారు మీ తాతగారు. ఆయనచెయ్యెత్తుమనిషి మీబాబయ్యగారాయనకంటె ఒకజానెడు పొట్టిగా నుండేవారు.

ప్రభు—అయితే మా బాబయ్యగారు చాలా బలమంతులట గాదూ.

శంభు—బలవంతులేమిటి. అహాహా! గుఱ్ఱముమీదకూర్చుండి సవారుచేస్తే సవారు తిరిగి వచ్చేటప్పటికి గుఱ్ఱము నడుము విరిగిపోయే దండి. ఒకరోజున పదమూడు గుఱ్ఱాల నడుములు విరిగినది నే నెఱుగుదును.

ప్రభు—ఏంటీ పదమూడు గుఱ్ఱాలే యిరిగిపోయినవిగా. ఆడి తస్సాగొయ్యా యేం బలమండీ.

శంభు — ఉడినారంటే గోదావరి అడ్డంపడి పదదరోజులలో యిద్దరినుంచి అద్దరికి యీదేవారు అయిన భోజనమాప్పాటకు మూడు తవ్వాలబియ్యపుఅన్నము తవ్వెడుపప్పు అచ్చావునెయ్యితవ్వెడు. శేరు గేదెపెరుగు దానికితగిన కూరగాయ తక్కిన రవర్గాలువుండేవి.

ప్రభు — ఇదంతా యెల్లాజీర్ణమయ్యేది.

శంభు — ఆమీన తాంబూలమువేసికొని యొక్కసారినిద్రపోయి లేచేటప్పటికి యెక్కడిదక్కడ భస్మీపటలమైపోయేది రెండుచిన్నాల కస్తూరి చేరెడు లవంగాలు గుప్పెడు యాలక్కాయలు దోసెడు పోక చెక్కలు తులం జాజికాయలు తులం జాపత్రి రెండుమోదల తమల పాకులు ఒక్కపరియాయము వేసికొనేవారు నిద్రపోయి లేచినతరువాత మూడువందల అరిసెలు ఫలహారముక్రింద తినేవారు.

ప్రభు — ఆసత్తువులు ఆరోజులుయెల్లిపోయినాయండి. మేమంతా కూకుంటే లెగలేనోళ్ళముపుట్టాము.

శంభు — అలాగున తమరు సెలవియ్యగూడదు. తమది సుకుమారావతారము. ఏదుమల్లిపువ్వులెత్తు మనుష్యులు. తమకు వెన్నెలకు వడ తగులుతుంది తమకు తివాసులమీద తమరు నడచినప్పటికిగూడ తమ కాళ్లు కందిపోతవి. తమరు సాక్షాత్తు మన్మధావతారము.

ప్రభు — ఏమిసుకుమారమో యెప్పుడు రోగమేనండినాకు.

శంభు — అదిరోగముకాదు. సుకుమారుల కెప్పుడు యీప్రకారంగానే యుంటుంది.

ప్రభు — తమకింత ఒయస్సుందికందాండి బాగా జీర్ణమవుద్ది.

శంభు — తమ అనుగ్రహామువల్ల యిప్పటికి బాగాజీర్ణమవుతుంది మొన్న తమరు పంపించిన మామిడిపండ్లు పది పుచ్చుకొన్నాను అంతా జీర్ణమైనది.

ప్రభు — పండెంతపెద్దదో సూశారా.

శంభు—పెద్దేంమిటండి అహాహా గుమ్మడికాయంత పండండి ఒక్కొక్కటికి.

ప్రభు—టెంక చిన్నదికామోను నేమండి.

శంభు—అబ్బే టెంక ఉందోలేదో చెప్పడానికివీలులేదు గుమ్మడి గింజంత టెంకయున్నది. ఈజాతి టెంకలేనిజాతనుకుని నేను పండుతినివేసి నాను మధ్య గుమ్మడిగింజలాగ యేదో తగిలితే టెంకేమో అనుకున్నాను.

ప్రభు—అయితే రసం సాలావుండమోను.

శంభు—రసమన్నా రసమాండి చెంబుడేసిరసము. ఒక్కొక్క దానిలో మూడు తవ్వాలుంటుంది.

ప్రభు—రసమెల్లాగుందండి.

శంభు—పానక మేనండి. చెరుకురసానికి దానికి యేమీతేడాలేదు తమతోటలోబుట్టిన కాయ తమహృదయమెల్లాంటిదో అదిఅల్లాంటిదే.

ప్రభు—ఎవరోగాని టెంకపుల్పన్నారండీ!

శంభు—అయితే వాళ్ళనోళ్ళుపులుపుగాని కాయపులుపుగాదు.

ప్రభు—అయితే యీచెట్టుకాయ బలం లేదంటారండి.

శంభు—నిజమేనండి ఎంతతిన్నాకాని మనిషిపీనుగులాగె యుంటాడు కాని సత్తువరాదండి.

ప్రభు—అయితే కాయ కొంచెము సువాసనుంటుందండి.

శంభు—మల్లెపువ్వులదండలు చేతితో పట్టుకొన్నట్టే. గుమ గుమ గుమ లాడుతూ వుంటుందండి. కాస్తాకూస్తాసువాసనా.

ప్రభు—ఇంత రసనుందని కాయ బరువులేదనుమండి.

శంభు—సందేహామా దూదిపించండికాయ.

ప్రభు—ఇంకోచెట్టు కాయలున్నాయి. మంచియి ఒకపాతిక్కాయ లిత్తానురండి.

(అని యిద్దరు నిష్క్రమింతురు.)

తండ్రికొడుకుల వివాదము

(అప్పుడు బలరామయ్యయు శంకరప్పయు ప్రవేశించుచున్నారు)

బల—ఇదివరకెన్నిసారులో మిమ్మ గోరినాను. ఒక్కసారి మీరు మాయింటికి దయచేసి మాపిల్లవాడిని మీరు కొంచెము కూకలెయ్యండి.

శంక—మీపిల్లవాడిని నేనేవిషయములో కూకలెయ్యాలి. వానిని నాదగ్గర కొకసారి పంపించండి నేను కూకలు వేస్తాను.

బల—తమరు పొరబాటు పడుతున్నారు వాడు మాయింటికే తిన్నగారాడు. మీయింటికొస్తాడా అదిగాక నేను చెప్పినమాట వాడు వినేటట్టయితే మీతోవచ్చి నేను మొఱ్ఱపెట్టుకొనడమెందుకు?

శంక—అయితే విషయమేమిటో చెప్పినారుకారు ఏమనికూకలు వెయ్యాలి.

బల—ఆసంగతి తమతో నడివీథిలో చెప్పదగినదికాదు. మీరొకసారి నాతో మాయింటికి దయచేసినారంటే యావత్తు సంగతులు మీతో స్థిమితముమీద మనవిచేస్తాను. ఈ గ్రామములో మీరొక్కరే నాకు ముఖ్య స్నేహితులు. అందుచేత నాగృహాకృత్యము మీతోనే చెప్పుకొని పిల్లవాడిని బాగుచేసుకోవలెనని యున్నది. అందుచేత తమకెప్పుడు తీరుబడో చెప్పినట్లయితే నేనింటికివచ్చి తీసుకొని వెడతాను.

శంక—ఎప్పుడోయెందుకు? నాకిప్పుడే తీరుబడిగా నున్నది పదండి మీతో నేనిప్పుడు వస్తాను.

బల—చిత్త మింతకంటె యున్నదా దయచేయండి.

(అని యిద్దరు నడచి యిల్లు చేరుచున్నారు.)

బల——తమరీ చాపమీాద దయచెయ్యండి. నేనిప్పుడే లోపలికి వెళ్ళి పిల్లవాడిని దీసికొనివస్తాను. కాదు కాదు. ఇక్కడే యుండండి. లోపలికి వెడితే వాడికి నాకు తగాదా అవుతుంది.

శంక——సరేపోని యిక్కడనుండి పిలవండి.

బల——చిత్తము. ఒరే ఆనందరావూ, ఇల్లారా శంకరప్పమామ గారు వచ్చారు.

(అప్పుడానందరావు ప్రవేశించుచున్నాడు)

శంక——అబ్బాయీ. ఈలాగున కూర్చుండుము.

ఆనంద——చిత్తము (అని కూర్చుండును)

బల——శంకరప్పగారూ కడుపుచించుకుంటే కాళ్ళమీాద పడుతుందని నోరుమూసుకొని యున్నాళ్ళనుంచి యూరుకుంటున్నాను. మావాడి చరియలు బొత్తిగా బాగులేవు. వీడియుందర నేను నిలవలేకుండా యున్నాను.

శంక——అబ్బాయీ! ఏమిటి యల్లరి. పరువుగల కుటుంబము లలో తండ్రికొడుకుల కిల్లాటి వివాద యుండవచ్చునా ఒకరికితగవు చెప్పవలసినవాళ్ళుగదా మీారు మీాకే యొకరుతగవు చెప్పవలెనా? పెద్దవాడిని తండ్రిముండావాడిని అంత యునురుపెట్టడం మంచిదికాదు.

ఆనం——నేనేమి యునురుపెట్టుచున్నానో చెప్పుమనండి ఆయన నన్నే యునురుపెట్టుచున్నాడు కాని నేనేమియునురు పెట్టుటలేదు. చక్కగా దరియాప్తు చేసిన పక్షమున మీాకే తెలియగలదు.

శంక——బలరామయ్యగారూ ఏమిటి వీనావాడిల్లాగంటాడు

బల——అల్లాగునే మాటాడుతాడు. తండ్రిని హింసపెట్టేవాడింత కంటె యెక్కువ మాటలంటాడా? తనవల్ల లోపమున్నదంటాడా? ఏమి చేస్తున్నాడో చెపితే సిగ్గుచేత తల వంచుకోవలసి వస్తుంది.

ఆనం—పంచుకుంటే యేకంగా యిద్దరము పంచుకుందాము. చెప్పదలచిన దేమిటో చెప్పు.

బల—చెప్పు చెప్పని బెదరిస్తావు. చెప్పక మానుతానట్రా చూడండి. శంకరప్పమామగారూ నాకు చాలా కాలాన్నించి దగ్గు బాధగావుంటే తమవంటి పెద్దలందరుకూడా నల్లమందు వేసుకో మన్నారు. నల్లమందు చేదుగావుంటుంది అని వేసుకోలేక నేను తట పటాయిస్తూంటే ఒక పెద్దమనిషి వచ్చి రోజూ కాస్తంత బ్రాంది పుచ్చుకోమని సలహా చెప్పాడు. అప్పటినుంచి రోజుకు ఏదో కొద్దో గొప్పో పుచ్చుకుంటుంటాను. దుస్సహావాసాలు చేసి నేనెన్నికుసల్లో దాస్తున్నా వీడు వెతికి నాకొక చుక్కయినా యుంచడు. ఇది వచ్చి ఘోరకలిగా వున్నది. నేననేక పర్యాయములు లబలబ మొత్తుకుంటే నేను పుచ్చుకోవడంలేదు. పుచ్చుకోవడంలేదని చెప్పి అయినకాడికి బుడ్డిలో నున్నదికాస్తా త్రాగివేసి దాన్నిండా నీళ్ళెక్కిస్తాడు. బుడ్డినిండా యున్నదికాబోలు ననుకొని నేనది పుచ్చుకొనేసరికి వట్టినీళ్ళు. ఆపైని నిషాచాలక తెల్లవార్లు కాళ్ళుపీకి నేనుచస్తాను. అస్తమానువెళ్ళి జూదపు పాకలో కూర్చుంటాడు.

శంక—మహాగొప్పతగాదా వుందే ఎక్కడా తండ్రికొడుకుల కిటువంటి తగాదా వినలేదు. ఇందులో తప్పెవరిదో తీర్పుచెప్పాట కెవ రయినా బృహస్పతివంటి బుద్ధిమంతులు రావలెను.

ఆనం—ఇదంతా అబద్ధమండి. నేనెక్కడనో నాలుగు రూపా యలు జూదమాడి తెచ్చుకుంటే అవి యీయనగారు తాగేస్తాడు.

బల—ఇక వీడితో నేను పడలేను మాతుభాగా లేర్పరచండి విడిపోతాము.

ఆనంద—పంచుకుందు కేమున్నది. సారాపాక ఆయనవాటా. జూదపుపాక నావాటా. మాయిద్దరికి యున్నభూమి. లక్ష్మికానభూమిలే

బల—చూడండి. ఆపాడుమాటలు వీడు అక్కరకొస్తాడా.

ఆనంద — మనమిద్దరము అక్కరకురాము. ఈయన త్రాసుబోతు తనము మూలాన్నే నాకుగూడ అబ్బిందండి. లేకపోతే బాగుపడుదును.

శంక — ఇది నావంటివాడు తీర్చవలసిన తగాదా కాదు బాబూ. మీరు మీపెద్దలకు నమస్కారము మీవంటివాడిని తెచ్చి తగవు తీర్చుకోండి. నేను వెళ్ళెదను.

(అందరు నిష్క్రమింతురు)

గార్ధభ జన్మము

రంగము — ఒక నదీతీరము

(అప్పుడు వేదాంత సూరిగారును కొందరు శిష్యులును)
(ప్రవేశించుచున్నారు)

వే — శిష్యులారా! ఈవరకు సమస్తధర్మములు మీకుపదేశించితిని. ఇప్పుడు చెప్పవలసిన పరమార్ధ మొకటున్నది. అది ధర్మములలో కెల్లధర్మము, ఈధర్మ మాచరింపకపోయిన పక్షమున తక్కిన ధర్మము లన్నిటిని ఆచరించుట వ్యర్ధము. ఇది మాకు అనుశ్రుతముగా వచ్చినది కావున మీరు భక్తిశ్రద్ధలతో నాలకించి ఆలకించుటతో తృప్తిపొంది ఊరకుండక ఆచరింపవలెను.

ఒక శిష్యుడు — దేవరవారు ఆ ధర్మమేదో తప్పక తెలియజేయ వలయును. మీపాదములసాక్షిగా అనుష్ఠించి కృతార్ధుల మయ్యెదము

రెండవ — శిష్యుడు — అటువంటి పరమార్ధములు వినుటకేకదా మీ పాదసేవ చేయుచున్నాము. కాబట్టి తక్షణము తెలియజేయవలెను.

వే—నాయనా వినండి ఇతరమతస్థులందరు రాక్షసులు. మన మతస్థులు ఉత్తమోత్తములు. దేవతలు. ఇతరమతస్థుల మొగము మన మెన్నడు చూడకూడదు. అట్లు చూచినవారు గార్ధభజన్మమెత్తుదురు. అనగా గాడిదలై పుట్టుదురు.

ఒక శిష్యుడు—స్వామీ! వారి మొగములు చూడకుండ ప్రపంచములో నేలాగున తిరుగగలము. వ్యవహారము లేప్రకారముగా చేసుకోగలము. ఎదురుగా వచ్చినప్పుడు చూడకుండా యెట్లు తటస్థించును.

వే—ఇటువంటి పిచ్చిపిచ్చి సందేహము మీమనస్సులో పెట్టుకోగూడదు. ఇతరమతస్థులతో మనవాళ్ళు వ్యవహారములే చేయగూడదు వాళ్ళ కప్పులియ్యగూడదు వాళ్ళదగ్గర మనము అప్పులు పుచ్చుకోగూడదు. ఈతుచ్ఛమైన ప్రపంచకవ్యవహారముల విషయమై వాళ్ళ మొగములు చూచి వాళ్ళతో మాట్లాడి నరకకూపములలో బడిపోవుదురా? ఇతరమతస్థు లెదురుగా వచ్చినప్పుడు విసనకర్ర యెదురుగా పెట్టుకోవలెను లేకపోతే ఉత్తరీయమైన మొగమున కడ్డముగా బెట్టుకోవలయును. అటుల వీలులేనిపక్షమున యెదుటవానితో వెనుకప్రక్కకు తిరిగి మాటాడవలయును. శాస్త్రమూ మరొకటా? ఇటువంటి పరమార్థములు తెలుసుకోకపోయిన తరువాత ఎన్నిభాషలు చదివిననేమి ఎన్ని ధర్మములు నేర్చుకొన్ననేమి?

శిష్యులు—చిత్తము. చిత్తము. ఇప్పుడు మాకు బుద్ధివచ్చినది. ఇదివరకు యితరమతస్థులతో మేము చేసిన వ్యవహారము లన్నింటికి మేము ప్రాయశ్చిత్తము చేసుకొని యికముందు వాళ్ళజోలికి పోయి వాళ్ళతోటి మాటలాడము వాళ్ళను చూడము మీయుపదేశమువలన మిక్కిలి ధన్యులమైతిమి.

వే—నేను చేసిన యుపదేశములతో మీకు యెంతవరకు గురి కుదిరినదో పరీక్షజేయుటకై నేను మీయూరువచ్చి మీగృహమందు

వారము దినములుండెదను. మీనమ్మకము సంగతి అప్పుడు బాగ తెలియగలదు.

శిష్యులు.—చిత్తము చిత్తం తమ రాక మహాప్రసాదము.

(అప్పుడు దేవదాసుడను యితరమతస్థుడు ప్రవేశించుచున్నాడు)

దేవ—(తనలో) ఈచెట్టుచాటునుండి వీని యుపదేశ మంత విన్నాను. ఇంత పాడుయుపదేశము లేదుగదా! ఈగురువుగారికి శిష్యులకు తగినట్లు బుద్ధి చెప్పవలయును. (అని దగ్గర మేయుచున్న యొ గాడిదవద్దకుబోయి దానిమెడ కౌగలించుకొని) అయ్యయ్యో! అయ్యయ్యో! మీ కెంతకష్టము వచ్చినదండీ స్వామీ! మహామూలమున మీ కింతకష్టము వచ్చినదండీ స్వామి! మీదుఃఖము జూచిన నేలాగు భరించగలనండీ అయ్యయ్యో! అయ్యయ్యో! ఇది మీవంటివారి కావలసినది గాదండి స్వామీ

(అని గట్టిగా నేడ్చుచున్నాడు

వే—ఇదేమిటోయి. వీడెవడో పిచ్చిముండాకొడుకులాగున్నాడ గాడిదను కౌగలించుకు నేడ్చుచున్నాడేమిటి?

శిష్యులు—నిజముగా వీడికి పిచ్చేనండి. లేకపోతే వీడిట్టి ప చేయడు. చూతాము రండి.

(అని వెళ్ళుచున్నారు

వే—(దగ్గరకుబోయి) ఏమిటయ్యా పిచ్చివాడా? గాడిదన కౌగలించుకు నేడ్చుచున్నావు. నీకుపిచ్చా. వెఱ్ఱియా.

దేవ—(ఏడ్చుచు) అయ్యో! స్వామీ! వీనికెంత కష్టమువచ్చి నది. ఈకష్టము నేనెటుల భరించగలను. అయ్యో! నాతండ్రీ అయ్యో నాస్వామి ఇటువంటి కష్టము మీకు తెచ్చిపెట్టిన దుర్మార్గులు వంశక్ష యమైపోవుదురు.

వే—నీగోల కాలా చెప్పవయ్యా నీదుఃఖమేమిటోను.

శిష్యులు—స్వామీ, ఈయనకు పిచ్చండి.

దే—నాకుకాదురా నాయనా! నీకుపిచ్చు సంగతిచెపుతాను వినండి ఒక క్షణముక్రిందట మీగురువుగారు ఇతరమతస్థుల మొగము చూచినవారు గార్ధభజన్మమెపోవుదురని చెప్పినారుగదా! కాబట్టి యీ గాడిద మావంటి యితరమతస్థుల మొగముచూచి యీలాగున పుట్టిన మీబంధువులలో నెవరో నొకరై యుండవచ్చును. బహుశః వేదాంత సూరిగారి తండ్రియో తాతయో మావంటివారి మొగము చూచి యీగాడిదయైపుట్టి చాకలిమూటలు మోయుచున్నారని నమ్ముచున్నాను మాపాపపుమొగములు చూడబట్టి మీకింత కష్టము వచ్చినది గదా యని యీలాగున యేడ్చుచున్నాను.

వే—ఛీ!—దౌర్భాగ్యుడా! మాతండ్రి తాతలను నిందించుచున్నావురా?

దేవ—నిందించుట లేదయ్యా మహాప్రభో! మామూలముగా వీనికింత మహాపద సంభవించినది గదా యని దుఃఖపడుచున్నాను.

శిష్యులు (తనలో) ఓరీ! మన గురువుగారికి ఈతడున యెవరో గాని మంచిదెబ్బ కొట్టినాడురా! ఇటువంటి వారికి యీలాగుననే బుద్ధి చెప్పవలసినది.

వే—ఈదుర్మార్గునివద్ద మన మున్న పక్షమున పాపకూపములో పడిపోవుదుము రండిపోదము. (అని అందరు నిష్క్రమించుచున్నారు.)

రం గ థా మో పా ఖ్యా న ము

రంగము—ఒక పాఠశాల

(భోగనాధస్వామి యను నొక యుపాధ్యాయుడు తనతరగతిలో కుర్చీ మీద కూర్చుండి నిద్రించుచుండగా దశరధరామయ్యయను మఱియొక ఉపాధ్యాయుడు ప్రవేశించును)

దశ—(తనలో) ఈక్లాసుపిల్లలూరకున్నారేమి చెపుమా

మేస్టరుగారు రాలేదా యేమి? (అని చూచి) అదుగో! మహాభోగనాధ స్వామిగారు వచ్చారు. కాని నిద్రపోతున్నారు. పాపము లేపుతాను. (అని దగ్గరకు వెళ్ళి) భోగనాధం! లే లే క్లాసులో నిద్రపోతున్నావే మిటి?

భోగ—నాగమణి! నాగమణి! చీరె బాగున్నదా? (అని పలవ రించును.)

పిల్లలు—(నవ్వుచున్నారు.)

దశ—ఛీ! వెధవల్లారా నోరు మూయ్యండి ఆలా గింజుకుచస్తా రేమిటి? స్టాండప్ ఆన్ది బెన్చ్.

పిల్ల—(మెల్లగా నవ్వుచున్నారు.)

దశ—(మీద చెయి వేసి) భోగనాధం! భోగనాధం! లే లే. యిప్పుడు నిద్రపోతున్నావేమిటి?

భోగ—(సగము తెలివివచ్చి) రాత్రికన్నె - అని న్వాలిక కరుచు కొని (కనులు తెరచి చూచి) ఎవరువాడు? ఎవరువారు?

దశ—మరెవరు లేరు నేను రాత్రి కన్నె ఏమిటి? విపరీతము గా మాటాడుతున్నావేమిటి?

భోగ—మరేమిలేదు. ఇప్పుడు నిద్రపోతున్నావేమని అడిగి నావు కాదూ?

దశ—ఔను అడగినాను. అడిగితే?

భోగ—అడిగితే దానికి జవాబు చెప్పినాను.

దశ—రాత్రికన్నెంటె ఏమిటూ జవాబు?

భోగ—రాత్రిమా గేదెదూడ మెడకుకట్టె కన్నె పోయింది. కట్టివేయకుండా వదలివేసితినా పాలు తాగిపోవునని కన్నెకోసం పూరం బడి బయలుదేరి తెల్లవార్లూ తిరిగినాను. ఎక్కడా కన్నె దొరకలేదు.

దళ—(మెల్లగా చెవిలో) మీయింటిప్రక్క భోగంవాళ్ళింటిలో ఒక కన్నె వున్నది. అదైనా దొరకలే?

భోగ—చాలులేవయ్యా నీవేళాకోళాలు.

దళ—కొబ్బరిచెట్టు ఎందుకెక్కావయ్యా అంటే దూడగడ్డికోసర మన్నాడట ! అలాగుంది నీజవాబు.

పిల్ల—(పుస్తకములు చాటుబెట్టుకొని మునిమునిసి నవ్వులు నవ్వుచున్నారు)

భోగ—ఓరీ వెధవల్లారా ! ఒక్కొక్కడినే తన్ని పాతేస్తాను చూడండి నవ్వులల్లా పువ్వులచేస్తాను. నాతడాఖా ఎరగకుండా వున్నారు మీరు.

దళ—పాఠం చెప్పకుండా నిద్రపోవడమే చాలు ! అక్కడ కొప్పడకు ఈసంగతి విని హెడ్మాష్టరు వచ్చినా నీపరువు నాపరువు తీసివేస్తాడు.

భోగ—హెడ్మాస్టరుగారొస్తే ఏదో ఒకటి సరిది చెప్పలేక పోతానా ఏమిటి? ఈమాత్రం చెప్పలేకపోతే తెనాలి రామలింగము లాగు రోజుకు తొంభై తొమ్మిది తప్పులుచేస్తూ రెండుమూడేళ్ళనుంచి ఏలాగు నెట్టుకొని వస్తున్నా ననుకొన్నావు?

దళ—సరేగాని నిజంగా యెందుకు నిద్ర లేదో కొంచెము చెప్పుదూ? దూడకన్నెకు వెళ్ళేవంటే, నేల వుమ్మేయరు. నీమాటపిచ్చివాడైనా నమ్మడు. దూడకన్నేమిటి. నీమొఖం నిజం చెప్పు ?

భోగ—ఏం దూడకన్నె, పోకూడదా? దానికోసం నే వెళ్ళకూడదా ?

దళ—ఏదో కన్నెకోసరం వెళ్ళినమాట నిజమే అంతవరకు నే నొప్పుకుంటాను కాని. పొద్దున్నే వూళ్ళో యేదో కొంచెం శుభమైన సంగతి విన్నాను. అది నిజమేనా? అది నిజం కాబట్టే? రాత్రి కన్నెఅని

నీనోట వచ్చింది నిద్రబద్ధకంచేత నిజమే భగవంతుడు పలికించిన ’డు. లేకపోతే ఆమాటని నాలికెందుకు కరుచుకొంటావు. కొంచె మింవతలికి రా? చెప్తాను.

భోగ—ఒరే! అందరు పుస్తకాలు తీసి చదువుకోండి! ఇప్పు డొచ్చి పాఠ మప్పగించుకొంటాను. వొప్పగించకపోతే తప్పావొక్కంటికి డజన్ దెబ్బలుచొప్పున కొడతాను (అని దశరథరామయ్యతో వసారా లోనికి వెళ్ళును)

దశ—భోగనాథం! పిల్లి కళ్ళుమూసికొని పాలుతాగి తనచర్య లెవరూ చూడలేదనుకుంటుందట! ఆలాగే నీవుకూడా రాత్రిచేసిన పని యెవరికి తెలియడం లేదనుకుంటున్నావు గాబోలు! నీవు దేనికో కన్నె రికంచేసినావని ఊళ్లో చెప్పుకుంటున్నారు. నిజమేనా యేమిటి?

భోగ—ఏదో బాబూ నన్నాట్టె చంపక వదిలేస్తూ. లేనిపోని ప్రశ్న లేసి చంపకు. జరిగిందేమో జరిగింది. దీనమ్మకడుపుకాల యెల్లా పొక్కిందిరా తెల్లవారేటప్పటికి?

దశ—పాపం బద్దలుకాకమానదు అయినా నీకు గుట్టూమట్టూ లేదుగదా! నీవు బహిరంగముగా వెళ్ళేవాడవైతివి. కాని, భోగనాథం నీకొక్క మాట చెప్పాలని వుందిరా నాకు.

భోగ—ఏమిటోచెప్పు పెందలాడేను.

దశ—ఒరే నీవు స్కూలు మాష్టరువు కదా మాష్టరుయొక్క ప్రవర్తననుబట్టి పిల్లలప్రవర్తన ముంటుందికదా! నిన్ను చూచి పిల్లలు చెడిపోతారుగదా! నీవీలాగున చేయవచ్చునా?

భోగ—ఓరి పిచ్చివాడా! నావుద్దేశమేమిటో నీకు తెలియదు గాబోలు! చెప్తాను విను నేను రిఫారం చేయదలచుకొన్నాను.

దశ—(నవ్వుచు) నీరిఫారము మండా. ఇదేమి రిఫారమురా?

భోగ—నారిఫారము మందుతుంది? నారిఫారము మందుతుందో సాగుతుందో చూడు! వివాహములకు దేవాలయములలో వుత్సవములకు భోగంవాళ్ళను పిలువకూడదని కొందరు తెలివితక్కువవాళ్ళు బోధించి లోకమంతా పాడుచేస్తున్నారు. పైగా గన్నెరికములు చేయకూడదని భోగమోళ్ళ సావాసం చేయకూడదని పిచ్చికుక్కల్లాగు మొరుగుతున్నారు. అవి తప్పుడుకూతలని తెలియచేస్తూ కొన్ని లెక్చరులిచ్చి కొన్ని గ్రంథాలు రాయ తలచుకొన్నాను. ముందుగా కన్నెరికములు మంచివని చెప్పతలచుకొన్నాను. ఇప్పటి రిఫార్మర్లవలె చెప్పేదొకటి. చేసేదొకటి. కాకుండా చెప్పతలచుకొన్న సంగతేమో ప్రాక్టికల్‌గా చేసి చూపించవలెనని ఈపని సంకల్పించినాను. చెప్పేడిది, చేసెడిది వొకటే అని అనుష్టించి చూపించుచున్నాను. దిక్కుమాలిన దేముడు పుస్తకాలు రాయడానికి తెలివితేట లిచ్చినాడుగాని, లేకపోతే పుస్తకాలు వ్రాసి లిటరేచర్ పుట్టించి లోకము ముంచెత్తివేతును.

దశ—ఆరె నీకడుపుగాల! ఉద్దండపిడుగువురా నీవు! ఇందుకే నిన్ను స్నేహితులంతా రంగథాముడంటారు. నీచరిత్ర రంగథామోపాఖ్యానమని యెవరిచేతనైనా వ్రాయించవలెనని వుంది నాకు. విశ్వామిత్రసృష్టిలో తాడికి నేలతాడి, తేగలకు పిల్లితేగలు, నక్కకు గుంటనక్క పోటీగావున్నట్లు సత్పురుషుల చరిత్రతోపాటు భాషలో నీపాడు చరిత్రకూడా వుండవలె వుంటే చదివి కొందరు బాగుపడతారు.

భోగ—మీయిష్టమొచ్చిన చరిత్రలు వ్రాసుకోండి కూసుకోండి! ఏడవండి! నే చేసేవని నేచెయ్యకమానను. గంటకావచ్చినది, క్లాసులోకి వెళ్ళుదాము రా! (అని వెళ్లుచున్నారు)

విష్ణుభక్తి

(శంకరప్ప నారాయణప్ప ప్రవేశించుచున్నారు)

శంక—ఏమోయి! నారాయణప్ప! నీవీమధ్యను పరమభక్తుడ వైనట్లు కనబడుచున్నావు. అందులో విష్ణుభక్తుడవైనట్లు కనబడు చున్నావు. ప్రొద్దున్నే లేచి, యీ చలికాలంలో స్నానముజేసి పట్టుపంచ గట్టుకొని, కేశవస్వామిగుళ్ళోకి బహుశ్రద్ధగా వెళ్లుచున్నావు. పూర్వ మెప్పుడైనా విభూతిపిండికట్లు బెట్టేవాడవు అవిప్పుడు మానివేసినావు. ఎవరైనా నీకు అష్టాక్షరీమంత్ర ముపదేశించినారా యేమిటి? ఇంతమార్పు నీలో కలగడం నాకు మిక్కిలి ఆశ్చర్యముగానున్నది. దీనికేమికారణమో కొంచెము చెప్పగలవా?

నారా—నాలో యీలాటిమార్పు వచ్చేటందుకు చాల గొప్ప కారణమే యున్నది. కారణములేందే యేకార్యములు జరుగవుగదా! మునుపెట్టే విభూతిపిండికట్లు మానెయ్యడానికి యిప్పుడు పంగనామం పట్టుపంచలు సింగారించుకొని ప్రొద్దున్న దేవుడుగుళ్లోకి వెళ్ళడానికి గొప్పకారణ మున్నది.

శంక—ఆకారణమేమిటో నాకొంచెము తెలియజేస్తావా? నీ వలెనే నేనుకూడ పరమభాగవతోత్తముడనై మంచిమార్గములో పడ్తాను.

నారా—చెప్తానుగాని యిది దేవరహస్యము. పదిమందికి తెలియ గూడదు. ఇది నీలోను నాలోను మాత్రమే యుండవలయును. పైకి పొక్కిందంటె మనవోట్లో కరక్కాయ పడుతుంది.

శంక—మీరహాస్యము నేను బయలుపెట్టను నేనుగూడ తరుణో పాయము ఆలోచించుకుంటాను. నీవు ఒక్కడవే వైకుంఠానికి వెళ్ళకూడదు. నీజుట్టో, నీజంధ్యమో, నీకాళ్ళో పట్టుకుంటాను. నన్నుగూడ దీసికెళ్ళు.

నారా—కాళ్ళు పట్టుకుంటే పట్టుకున్నావు గాని నీపుణ్యమయిరి జుట్టు జంధ్యంమాత్రం బట్టుకోకు జంధ్యం తెగిపోతుంది జుట్టుపట్టుకుంటే వున్నపిలక వూడుతుంది.

శంక—అలాగేచేస్తానుగాని ఆ దేవరహాస్యమేమిటో చెప్పు.

నారా—ఇదిగో చెప్పుచున్నాను విను శివుడు ప్రత్యక్షదైవము కాదు. ఎన్నాళ్ళుసేవించినా వట్టిదే. విష్ణుమూర్తి ప్రత్యక్షదైవము. సేవించినవారికి వెంటనే ఫలంకనబడుస్తాడు.

శంక—నీకు విష్ణుమూర్తి ఎప్పుడైనా ప్రత్యక్షమైనాడా ఏమిటి?

నారా—ఆహా! ఈమధ్య రోజూ అవుతూనేవున్నాడు.

శంక—ఏరూపముతో ప్రత్యక్షమవుతున్నాడు? సగుణుడా! నిర్గుణుడా?

నారా—ఈరూపమేమిటి ఆరూపమేమిటి. అన్నిరూపములతో ప్రత్యక్షమౌతాడు నిర్గుణుడైవాన్ని నేను సేవించనే సేవించను. సగుణుడు కాబట్టే నేను సేవిస్తున్నాను.

శంక—సగుణమైతే యేగుణములుగలవో చెప్పు!

నారా—ఏగుణములని చెప్పను. ఒకప్పుడు తెల్లగావుంటాడు. ఒకప్పుడు పచ్చగావుంటాడు ఒకప్పుడు తియ్యగావుంటాడు? ఒకప్పుడు కమ్మగావుంటాడు ఒకప్పుడు పుల్లగావుంటాడు ఒకప్పుడు కారంగా వుంటాడు ఒకప్పుడు కరకరలాడుతూ వుంటాడు. ఒకప్పుడు మెత్తగా వుంటాడు, ఒకప్పుడుపలుచగా వుంటాడు. ఒకప్పుడు గట్టిగావుంటాడు.

శంక — నీమాటలు బలే తమాషాగా వున్నాయి దేవుడు తియ్యగా వుండడమేమిటి? కారంగావుండడమేమిటి? ఇటువంటిదెక్కడ వినలేదు. దేవుడు సగుణుడని చెప్పేవారిమాటలు విన్నాము. నిర్గుణుడని చెప్పే వారిమాటలు విన్నాము కాని, యిటువంటి తమాషాలుమట్టుకు వినలేదు దేవుడు కరకరలాడుతూ వుంటాడనికూడా అన్నావు అదేదో నాకు స్పష్టంగా జెప్పినా కేమి బోధపడటం లేదు.

నారా — తెలియకపోతే అడిగితే చెప్పనా? నాకుముఖ్య స్నేహితుడవగుటచేతను విష్ణుమూర్తికి శిఫారస్సుచేసి నిన్నుకూడా బాగుచేయవలెనని నాకెంతో అభిలాషగావుంది. అందుచేత తప్పకుండా చెప్తాను, శ్రద్ధతో విను విష్ణుమూర్తి వారి ఆలయములోకివెళ్ళితే దేవుడు లేడనే నాస్తికులకందరికి బుద్ధివస్తుంది శివాలయంలోకి వెళ్ళితే శివుడు ప్రత్యక్షఫల మివ్వలేడు. విష్ణువు వెంటనే ఫలమిచ్చివేస్తాడు. వెంటనే నోరు తీపిజేస్తాడు. ఒకప్పుడు పులిహోరరూపమై ప్రత్యక్షము అవుతాడు. ఒకప్పుడు చక్రపొంగలి రూపముయెత్తుతాడు. ఒకప్పుడు దధ్యోదనంరూపమెత్తుతాడు. ఒకప్పుడు చిట్టిగారెల అవతారమెత్తుతాడు. ఒకప్పుడు పరమాన్నరూప మెత్తుతాడు. ఇన్నిరూపాలతో ఆయనప్రత్యక్షమై నోరుతీపిజేసి కడుపునిండించి రక్షిస్తాడు. కాబట్టి విష్ణుమూర్తి వారేసర్వేశ్వరుడని నాకునమ్మకముకలిగింది. ప్రత్యక్షఫలమివ్వనిదేవుడు దేవుడా? శివాలయంలోకి చాలాసార్లు వెళ్ళిచూచాను. ఎన్నిమారులు వెళ్ళినా మారేడుపత్రి కొబ్బరికాయముక్కలు తప్ప మరేమిలేదు. ఈపాటి భాగ్యానికి వెళ్ళడమెందుకని శివాలయంలో అడుగుపెట్టడం మానివేసి నాను అప్పటినుంచి నాకు శివభక్తి తగ్గిపోయింది. ఒకసారి మాచుట్టాలెవరో కేశవస్వామికి భోగం చేయించినారు. ఆపేరనన్నువాళ్ళు బలవంతపెట్టి గుళ్ళోకి దీసికెళ్ళారు. విష్ణుమూర్తి మహత్యమేమిటో ఆరోజున నాకుపూర్తిగా తెలిసింది. అది మొదలుకొని నేను రోజు గుడికి

విస్తూవున్నాను. ఇన్నిమాటలెందుకు గోపాల అంటే నాకు మిఠాయి దుకాణమే అని నమ్మి. ఈవిష్ణుమూర్తివారివల్ల నాకింకొక లాభంకూడ, మునుపు ప్రతిరోజు ఆరుడబ్బులో అణాడబ్బులో పెట్టి మిఠాయి దుకాణాలవద్ద యేమైనాకొనుక్కొనితినేవాణ్ణి. గుడిమరిగినతరువాత మిఠాయి దుకాణం కట్టిపెట్టాను. రోజు అణాడబ్బులో ఆరుడబ్బులో మిగులుతున్నాయి ఏదో ఒకటి కమ్మగా తియ్యగా నోటికి తగులుతూ వున్నది. ఇన్నిలాభాలు చేసేవిష్ణుమూర్తి దేవుడుకాక వెఱ్ఱిశివుడు దేవుడవుతాడా? నాభక్తికి తగిన కారణముందంటావా లేదంటావా ?

శంక—నీకారణం చాలాగొప్పది. ఇటువంటి గొప్ప యుద్దేశము మనస్సులో పెట్టుకొని విష్ణుభక్తులైనవారెవరు ఇదివరకు లేరని నాయభిప్రాయము.

నారా—పిచ్చివాడవు. నావంటి మహానుభావులు, నాతలదన్నినవారు ఇదివరకే అనేకు లుండవచ్చును. ఏపుట్టలో ఏపామున్నదో ఎవరికి తెలునును?

శంక—అయితే విష్ణుమూర్తివారు చక్రపొంగలి రూపం చిట్టిగారెలరూపం ఎత్తుతున్నారని చెప్పినావుగదా! అవతారాలకు అవతారాలే భక్షించివేస్తున్నావా యేమిటి నీవు ?

నారా—అవతారాలకు అవతారాలు నేనేమి భక్షించగలను? ఆపనిచేయడానికి బిరుదులు పొందిన మహానుభావులు ఇదివరకనేకమంది యున్నారు. విష్ణుమూర్తివారియొక్క మత్స్యావతారము కూర్మావతారము వరహావతారము కూడా లెక్కలేకుండా గుటుకుగుటుకు మింగివేసే మహానుభావు లుండగా వారి ముందరనే నెంతవాణ్ణి.. హనుమంతుని యెదుట కుప్పిగంతులు వేయుట పనికివచ్చునా ?

శంక—అయితే నాలుగు డబ్బులుతోటి నీవు విష్ణుమూర్తివై

పోయినానన్నమాటే. రెండు డబ్బుల తిరుచూర్ణమును రెండు డబ్బుల నామమునద్ద పెన్నట్టయితే నేను కూడా విష్ణుభక్తుడను అవుతాను.

నారా—ఇదేమార్గము. రేపటినుంచి నీవుకూడా రా.

శంక—విఘ్నేశ్వరునిమీద భక్తియా, ఉండ్రాళ్ళమీద భక్తియా యని వెనక ఒక సామెత వున్నది. అలాగే పులిహోర చక్రపొంగలి మీద భక్తిగాని మనకు దేవుడిమీద భక్తి ఏమి కద్దు.

నారా—గట్టిగా కేకలు వెయ్యకోయి. నీయిల్లు బంగారంగాను. ఇది నలుగురు విన్నారంటే మనలాగే వారు గూడా పట్టువంచలు గట్టుకొని సిద్ధమైతే తిన్నంత చక్రపొంగలి పులిహోర మనకు దొరకవు. మన నోట్లో కరక్కాయపడుతుందిరా వెళ్ళుదాము.

(ఇద్దరు నిష్క్రమించుచున్నారు)

రంభా మేనకా సంవాదము

మేనక—అక్కా! రంభా! ఏమే తీరుబడిగా నున్నావు.

రంభ—ఈమధ్య నాకు మిక్కిలి తీరుబడిగానే యున్నది.

మేనక—అదే నేను గూడ చూచుచున్నాను మునుపటివలె నీయింటికి యజ్ఞము, చయనము, పౌండరీకము, వాజిపేయము, సర్వతోముఖము మొదలయిన క్రతువులు చేసి చెవులకు కుండలములు, వ్రేలాడగట్టుకొని దర్భాసనాలు శాలువలు వీపులమీద దగిలించుకొని బుట్టముక్కలతోను పొడుముబుర్రలతోను సోమయాజులవారలు నీయింటికి రావడములేదు. ఎందుచేతనో కారణము తెలిసినదా?

రంభ—ఆహా కారణము తెలిసినది. భూలోకసంచారము జేసి నారదులవారొకనాడక్కడి విశేషములు ప్రభువైన యింద్రునితో జెప్పుచుండగా నేను వినియుంటిని. అదియే నీకు జెప్పెదను.

మేనక—ఆకారణ మేమో నాకుగూడ చెప్పు. నాసందేహము గూడ తీరిపోవును.

రంభ—ఇదిగో చెప్పుచున్నాను విను భూలోకములో మును పటియజ్ఞములు చాలమట్టుకు నశించినవి. అక్కడక్కడ తెలివితక్కువ బ్రాహ్మణులెవరో యొకరు మునుపటివలె యజ్ఞములు చేయుచున్నారు వారుకూడ కేవలపరమార్థచింతలో జేయుటలేదు. యజ్ఞము పేరుపెట్టి నాలుగువేలో యైదువేలో రూపాయలు సంపాదించి యందులోనియొక వేయిరూపాయలో రెండువేలో కర్చుపెట్టి యజ్ఞమయినదనిపించి తక్కినసొమ్ము వడ్డీవ్యాపారము చేసికొనుచు హాయిగ నుందురు.

మేనక—పోనీవే. అటువంటివారైనా విశేషముగా బయలు దేరి యజ్ఞములు చేయుటకు లేదేమి? వారు రాకపోవడముచేత నీయిల్లంతా చిన్నబోయినది. కొండగబ్బిలములవలె నీచూరులు పట్టుకువాళ్ళంత వ్రేలాడు చుండెడివారు

రంభ—నాయిల్లు చిన్నబోయినమాట నిజమేకాని యెటువంటి వారు రాకపోవుటకు ముఖ్యకారణము చెపుతాను విను. భూలోకములో బ్రాహ్మణులు క్రొత్తపద్ధతిగా యజ్ఞములారంభించినారు. ఆయజ్ఞములకు నల్లమేకలే కావలెనను నియమములేదు. ఏమేకలయినాసరే పనికివచ్చును.

మేనక—నల్లమేకలు కాకపోతే శాస్త్రదూష్యములు కావా?

రంభ—వారిశాస్త్రప్రకారము దూష్యములు కావు.

మేనక—వారికేమైనా క్రొత్తశాస్త్రములున్నవా యేమిటి?

రంభ—లేకేమి? ఇప్పుడిప్పుడు బయలుదేరుచున్న క్రొత్తశాస్త్రముల నన్నిటిని జదివి యీక్రొత్తయజ్ఞము లారంభించినారు.

మేనక—ఆశాస్త్రములేమిటో నాకు కొంచెము చెప్పి వినవలయునని కుతూహలమున్నది.

రంభ—అదే చెప్పుచున్నాను. తొందరపడకవిను ఈక్రొత్త యజ్ఞములకు యజ్ఞశాల లవసరములేదు. కసాయిదుకాణములే యజ్ఞశాలలు. యజ్ఞములు జరిగిన నాలుగురోజులలో రోజుకొక్క మేక చచ్చునోలేదో, ఈకసాయి దుకాణములనే యజ్ఞశాలలలో రోజు నూర్లకొలది మేకలు చచ్చును. ఈమేకలను కుమ్మరవాండ్రువచ్చి నవరంధ్రములు మూసి చంపనక్కరలేదు. కత్తిదెబ్బతో నొక్కవేటున బుఱ్ఱ తెగిపడిపోవును. ఆమేకలమాంసమే భూలోకములో ననేక బ్రాహ్మణులు నేతితో వేయించి హోమము చేయుచున్నారు.

మేనక—ఆ హోమములచేత నగ్నిహోత్రుడు ప్రీతుడగుచున్నాడా.

రంభ—అక్కడ ప్రీతుడగు నగ్నిహోత్రుడు వేరు. ఆతడు జఠరాగ్నిహోత్రుడు. కలియుగ బ్రాహ్మణులయొక్క గర్భగోళములనే హోమకుండములలో జఠరాగ్ని ప్రజ్వరిల్లుచున్నది ఆయగ్నిలోనె మేకలన్నియు హోమమగుచున్నవి. యజ్ఞములలో మేకలవప మాత్రమే హోమముచేయుదురు. ఇక్కడవపయొక్కటేకాదు గుండెలుమెదడును సమస్తము నీజఠరాగ్నిలో హోమమై పోవుచున్నది. ఈకసాయి దుకాణములేకావు యజ్ఞశాలలు బ్రాందీషాపులుగూడ యజ్ఞశాలలే యని చెప్పవచ్చును. రైలు స్టేషనులో నుండే రిఫ్రెషుమెంటు రూములుగూడ యజ్ఞశాలలె యని చెప్పవచ్చును. సాయంకాలమప్పుడు శరీరమాద్యంఖలు ధర్మసాధన మ్మను సిద్ధాంతమెరిగిన బుద్ధిమంతులందరు శరీరములు కాపాడుకొనుటకు బూర్వులుచేసిన యజ్ఞము లేదో విధముగ తమవంశమున నిలుపుటకు సాయంకాలము కాగానే ఆషాపులకు ఆరిఫ్రెషుమెంటు రూములకు వెళ్ళి యథావిధిగా కర్మచేయుచుందురు.

మేనక — ఈయజ్ఞము మిక్కిలి చిత్రముగా నున్నదే. ఈయజ్ఞము సాయంకాలమే చేయవలెనాయేమి ?

రంభ — ఉదయకర్మలు గూడ కొన్ని యున్నవి. కాని యీకర్మ విశేషముగా సాయంకాలమప్పుడే జరుగుచుండును. ఈ యపూర్వ కర్మిష్ఠులందరు పగలంతా యేవో కొన్ని వ్యాపారములు చేసికొని సాయంకాలము తీరుబడిగా బండ్లమీద షికారువెళ్ళి యీకర్మ చేయుచుందురు. ఈకర్మ కొక్కనియమముమాత్ర మున్నది. సాధారణముగా సూర్యుడస్తమిస్తేనేకాని యీకర్మ చేయరు.

మేనక — వీరికి సోమపానముచేసే అలవాటున్నదా? యజ్ఞకర్మలో నదియొక ముఖ్యభాగముకదా.

రంభ — అయ్యో మేనకా! చేయకేమి? పానములేనిదె కర్మ లేదు సోమపానము జేయకపోయిన మానె సురాపానము జేయుదురు. పూర్వమహర్షులు యజ్ఞములు చేయునపుడు నానావస్థలుబడి యొక్క సోమపానమె చేసేవారు ఈ కలియుగ బ్రాహ్మణులచేసే యజ్ఞములలోనో క్రొత్తకొత్తపానము లనేకములు. సురాపానమప్పుడప్పుడు జరుగుచుండును. దానికేమి అది దేశవాళీసరుకు. ఇవి స్వదేశీదినము లని నీ వెరుగుదువుకదా! స్వదేశీ యభిమానముగల దీక్షితులు సురాపానమె చేయుదురు. పూర్వ మీసురలోనుంచి తీసిన సారాయి త్రాగేవారు ఇప్పుడు క్రొత్తగా రమ్ము అను సారా బయలుదేరినది. ఇది సాయంకాలము కాగానే ప్రతివానిని రమ్మురమ్మని తనయొద్దకు పిలుచుచుండును. సంగుపేత దానికే పేరు వచ్చినట్లు తోచుచున్నది. అదిగాక బ్రాంది పానము, విస్కీపానము, ఓల్డుటమపానము మున్నగున వనేకములు కలవు. దేవతలు, మహర్షులు, వాళ్ళజన్మమెత్తి యిటువంటివి వెరుగరు.

మేనక — ఈయజ్ఞములలో సోమిదేవమ్మలుందురా.

రంభ—సోమిదేవమ్మలు వెంటనుండరు. సోమయాజులవారొక్కరే యీయజ్ఞముచేసి యీపానము చేయుదురు. అప్పుడప్పుడు సోమిదేవమ్మలు కూడా నుండవచ్చును. వారు స్వభార్యలుగాక యుంపుడుకత్తెలై యుందురు.

మేనక—అయితే అక్కా! యీ యజ్ఞములు చేసినవారికి రంభాసంభోగముండునా లేదా?

రంభ—అయ్యో వెర్రిదానా ఏనాడో క్షీర సాగర మథనమందు పుట్టి యౌవనమంతా తీరిపోయిన పాతరంభ వాళ్ళకెందుకే ఈరంభ కావలసినవారు యజ్ఞమారంభించి స్వభార్యతో గలిసి నాలుగు దినములు మాడి హోమకుండములదగ్గిర కూర్చుండి కన్నులనిండా పొగదూరి చచ్చి చెడి చేయంగల విన్నపము లనుభవింపవలెను. ఈ క్రొత్తయజ్ఞములు చేసినవారికి భూలోకములోనే బ్రతికియుండగానె యుపవాసము లక్కరలేకుండానె ఒక రంభగాకుండా కావలసినంతమంది రంభలు దొరుకుచున్నారు.

మేనక—అక్కా! యజ్ఞములమాట నేనడుగగా నీవు త్రాగుబోతులై మాంసము దిని భ్రష్టులైన బ్రాహ్మణులమాట చెప్పినావు.

రంభ—నీవిప్పటికి గ్రహించినావా? కలియుగ బ్రాహ్మణులందరు నటువంటివారని మాత్రమనుకోకు ఈయజ్ఞములన్న నిష్ఠము లేనివారనేకు లున్నారు నారదుడు మిక్కిలి చమత్కారి గనుక నీ ప్రకారము చమత్కరించినాడు. రా రా పోదము.

(ఇద్దరు నిష్క్రమింతురు)

గయ్యాళిగంప

రంగము 1

[అప్పుడు బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నాడు.]

బ్రాహ్మ—(తనలో) అబ్బబ్బా! ఇది పెండ్లాముగాదు, నాపాలిటి పెనుభూతము. ఎప్పుడు పుస్తెముడిపెట్టితినో అప్పుడే నాకు శనిగాడు ప్రవేశించినాడు ఎవడో నామీద కోపముచేతను భార్య అను పేరుపెట్టి బ్రహ్మరాక్షసిని ప్రయోగంచేసినాడు. ఇది తిండికి ఏనుగు, పనికి పీనుగు చెప్పినమాట వినదు తనకుతోచిన పనేగాని చేయదు. వీరున్నారు వారున్నారు అను సందేహములేకుండా, యీమాట అనవచ్చును ఆమాట అనకూడదు అని వరుస బెదురు లేకుండ యెంతమాట నోటికివస్తే అంతమాట పెడేల్మని అని వేస్తుంది. ఏనాటికైన బాగుపడుతుందేమో అని యెన్నివిధాల చూచినా నానాటికి తీసికట్టు నాగంభట్టు అన్నట్లు అంతకంతకు పాడగుతున్నదిగాని బాగుపడడం లేదు. ఈదిక్కుమాలిన సంసారం వదలిపెట్టి, 'జేపరమేశ' అని యింటిమీద ఒకదెబ్బపీకి లేచిపోదామనుకుంటే పెద్దవాడను నల్లమందుముండాకొడుకును, ఉపచారములు జరుగవని భయము. ఏకేకలేసియో యేతిట్లు తిట్టియో, యేమూడు జాములకో ముచ్చపొద్దుకో, దానిధర్మమా అంటు యింతగంజి కాచి పోస్తుంది. ఈగంజికాశపడి, చూచి చూచి కొంపవొదలిపెట్టి వెళ్ళలేకుండా వున్నాను. ఈమధ్యదీనికి క్రొత్త తెగులుకూడా పుట్టింది, నేనన్నమాటకు యిది వ్యతిరేకంచేయడ మారంభించింది. నేనన్నము తిందామంటే తాను వద్దంటుంది. నేను వద్దంటె తాను కావాలంటుంది. నేను కుక్కంటె తాను గోవ్వంటుంది. నేను గోవంటె తాను కుక్కంటుంది. ఈముండతో వేగడమెట్లాగో నాకు తెలియకుండా వున్నది. రేపు దశమి! మాతండ్రిగారి ఆబ్దికము ఏదిచేయకపోయినా విడువకుండా యేటేటా తండ్రితద్దినము పెడుతున్నాను. ఈయేడు అదికూడా సాగేటట్టులేదు. తద్దినం పెడ్తానంటె యిది వొద్దంటుంది చూచి

చూచి అబ్బతద్దిన మెట్టాచూసుకోను? మానుకోక మరొకచోటపెట్టు కుందామన్నా యీముండ అక్కడికివచ్చి వంటమైలపడిచేస్తుంది శ్రాద్ధం చెడిపోయినతర్వాత దీన్ని కొడ్తే యేమికార్యము? తిడితే ఏమికార్యము? దీన్ని లొంగదీసుకొనే వుపాయము ఆలోచించవలె. ఆహా! తోచిందుపాయము. ఆవుపాయప్రకారమే చేస్తాను. సాగిందా ఆవుపాయము అదృష్టవంతుణ్ణి. సాగకపోతే మానుకోవడం వుండనేవుంది.

భార్య—ఏమిటండో ఆలోచిస్తున్నారు.

బ్రాహ్మ—ఏమిలేదు. రేపు దశమి మాతండ్రి తిథిప్రయోజనము. నేనిది మానివేస్తామని ఆలోచిస్తున్నాను. పెద్దలు తిని యేడ్చారాయేమినా?

భార్య—అయ్యయ్యో ఇదేంమాటండి. తండ్రితద్దినం మానుకునేవా రెవరైన వున్నారా? ఇంత విరుద్ధ మెక్కడాలేదు. పెట్టకపోతే కులంలో వెలివేస్తారు. గనుక తద్దినం బెట్టితీరవలె.

బ్రాహ్మ—(తనలో) నేనే తద్దినంపెట్టవలెనంటే యీగయ్యాళి ముండ పెట్టవద్దని వాదించును, నేను వద్దంటున్నాను. గనుక తాను పెట్టవలెనని వాదన చేస్తున్నది. నావుపాయము బాగా పారినది. ఇది నాగోతిలో పడినది ఊటన్నాగా మాట్లాడుతుండవలె. (ప్రకాశముగా) ఊతద్దినము యీమాటు నేను పెట్టేదేలేదు.

భార్య—పెట్టకపోయినట్టయితే కొంప నిప్పెట్టి లేచిపోతాను.

బ్రాహ్మ—సరే! అలాగయితే నీయిష్టమువచ్చినట్టె చేస్తాను. కాని నేను బ్రాహ్మణులను పిలవను, శూద్రవాళ్ళిద్దరిని పిలిచి శ్రాద్ధం పెట్టివేస్తాను.

భార్య—దీక్షితులుగారి కుమాళ్ళయి శూద్రవాళ్ళనాభోక్తలుగా తీసుకరావడం. ఛ, ఛ, మీకింత దుర్బుద్ధులు పుట్టినాయేమి? మీకేదన్న పిశాచంపట్టిందాయేమిటి? పరిశుభ్రమైన బ్రాహ్మణులను నేను పిలుస్తాను. వాళ్ళకే మీరు పెట్టవలె.

బ్రాహ్మ—వాళ్ళకేపెట్టడం నాకిష్టంలేదుగాని నీబలవంతంచేత

పెడ్తాను. కాని నాకు మంత్ర మక్కరలేదు. మంత్రబ్రాహ్మణులను పిలవను. నేను బ్రాహ్మణులతోకూడాకలసి భోజనంచేస్తాను. మంత్రం తంత్రం అయితే ప్రొద్దుపోతుంది. నల్లమందువాణ్ణి అగుటచేత నేను ప్రొద్దుపోయినదాక వుండలేను.

భార్య—మంత్రంలేని శ్రాద్ధం శ్రాద్ధంకానేకాదు అట్లతద్ది భోజనంలాగ కలిసి తినవలెనని వుందాయేమిటి? మంత్రంతోనే పెట్టి తీరవలె. ఘూడుజాములు అయిందాక వుండవలె. ప్రొద్దుపోతేకాని పితళ్ళురారు.

బ్రాహ్మ—నాచేతులో యిప్పుడేమి డబ్బులేదు తద్దినమంటె యేలాగైనా ఒక్కవరహా కాకమానదు. అందుచేత నేను మినుములు, బెల్లం, పాలు, నూనె తీసుకునిరాలేనుగనుక పిండివంట చేయవద్దు పప్పుఅన్నంబెట్టి బ్రాహ్మణులను లేవదీతాను. అదిగాక బ్రాహ్మణులకు బట్టలు పాతలు యివ్వలేను. చెరిఒకఅర్ధణా చేతిలోబెట్టి బ్రాహ్మణులను సాగదోల్తాను ఇదివరకు వెనుకటితద్దినాలకు చుట్టాలను నలుగురిని భోజనాలకు పిలిచేవాణ్ణి ఈపర్యాయము యెవరినిగాని పిలవద్దు ఇద్దరుబ్రాహ్మలు నీవు నేను తప్ప మరెవరు అక్కరలేదు.

భార్య—డబ్బులేకపోతె నామెడలో పుస్తెడ తాకట్టుపెట్టి నాలుగురూపాయలు యిపుడేతెస్తాను. శుభ్రంగా నాలుగుకూరలు నాలుగుపచ్చళ్లు, పప్పు చారు, అరిసెలు, గారెలు, క్షీరాన్నం చేస్తా తద్దినం పెట్టవలెను. చంటిముండాకొడుకుకు వేసినట్లు యింత గుంట పులగం వేస్తారాయేమిటి, మామగారికి నాకంఠంలో ప్రాణమున్నా నా ళ్ళుఅటువంటి పాడుపని నేను చెయ్యనివ్వను. భోక్తలకు బట్టలివ్వనంటా రేమి? ఇందులో సొమ్ము కూడదీస్తారామీరు? మీనాయన బ్రతికివుంటేయాటా నాలుగు ధోవతులు నాలుగు వుత్తర్యాలు యిస్తారా యివ్వరా? ఆయన చచ్చిపోయినాడు గనుక అడగడానికినోరులేదుగనుక

బట్టలు మాని వేస్తారు? రెండుసైనుగుడ్డలకు మొఖం జూచుకుంటేనే మంటారు అందుకని తప్పకుండా బట్టలు తెప్పిస్తాను చుట్టాలు నలుగురిని మునుపుపిలిచి యిపుడు పిలువకపోతేబాగుండదు. కూడానికొకమాటు గాని రోజూరారుగదా వాళ్ళు చుట్టాలురానిది కార్యానికి శోభలేదు. వాళ్ళు వచ్చితీరాలె.

బ్రాహ్మ—సరే నీయిష్టమువచ్చినట్టు చేయి ఆలాగయితే. (తనలో) దీనికి పూర్తిగా తిక్కయెక్కించినాను. మాతండ్రి అదృష్టవంతుడు ఈసంవత్సరము శ్రాద్ధముయథావిధిగ జరుగుతుంది. దైవము నానోట యీలాగున పలికించబట్టి మాటనక్కింది.

(ఇద్దరు వెళ్లుచున్నారు)

2 రంగము

బ్రాహ్మణుడు, భార్య ప్రవేశించుచున్నారు.

బ్రాహ్మ—ఒసే ఒసే బ్రాహ్మణులు లేచారు. అసీ మాంతమై పోయింది. ఇక పారణం విసర్జించవలె. నేను గోదావరికి వెళ్ళలేను ఈ పారణం మనగోవుకు పెట్టివేస్తాను.

భార్య—(కోపముతో) గోవును దీసుకొనివెళ్ళి గోదావరిలో పూరదొక్కండి. ఈపారణం నేను గోవుకు గీవుకు పెట్టేదాన్నికాను. అదిగో ఆకుక్కకు పెట్టేస్తాను. అడ్డమువచ్చారంటె గరిటెకాలవేసి వాత లెడ్తాను. లేకపోతే రోకలితో కుమ్మివేస్తాను జాగ్రత!

బ్రాహ్మ—అయ్యో! అయ్యో! కుక్కకు పెట్టకూడదే పెట్ట కూడదేపాపమే నిష్కారణం తద్దినం చెడిపోతుందే. వరహాసొమ్ము వ్యర్థమై పోతుందే. నీపుణ్యమే. పూరుకోవే (అని మొత్తుకొనుచున్నాడు.)

భార్య—మొత్తుకోండి. నాలుక పీక్కోండి, చావండి నేను కుక్కకు పెట్టకమానను. (అని పెట్టుచున్నది.)

బ్రాహ్మ—నారాయణ, నారాయణ, యెంతపాపమెంతపాపము మా పితాళ్ళు అధోలోకంపాలై పోతున్నారు. యీ ముండమూలాన అన్నిమాటలు నేను వ్యతిరేకంగాజెప్పి, యీఒక్కమాట బుద్ధిపొర బాటుచేత సరిగా చెప్పాను అదే నాబుద్ధితక్కువ. నే నేనెకుక్కకు పెట్టు మంటే యీముండాకూతురు గోవుకు తప్పకుండా పెట్టితీరును. నాప్రా లుబ్ధంచాలక ఆమాటలకు బదులు నోటివెంబడి యీమాట వచ్చింది. చేసుకున్న దనుభవింపక తప్పదు. ఓదిక్కుమాలినముండ నీయమ్మ కడుపుకాల నాయింటిలోనుంచి లేచిపోవేనీవు.

భార్య—ఇది మీయిల్లుగాదు నాయిల్లు. మీరే లేచిపోండి.

బ్రాహ్మ—ఛీ నోరుమూయిముండా!

భార్య—మీరుండగ నేను ముండనుకాను. మాట దక్కించు కొని ఆగుక్కెడు ప్రాణము వదలివేస్తారా నేను ముండనవుతాను. మీయమ్మముండ, మీయప్పముండ, మీచెల్లెలుముండ, మీవాళ్ళం దరు ముండలు.

బ్రాహ్మ—నేనెందులోనైనా దిగి చస్తాను నీతో వల్లేను.

భార్య—నాపీడేపోతుంది. ఈలాంటి పాపిష్టిమొగుడు వుండేకన్న పోతేనే మంచిది.

బ్రాహ్మ—ఛీ! నీమొఖం చూడకూడదు. లేచిపోతున్నాను. (అని వెళ్ళుచున్నాడు.)

భార్య—వెళ్ళండి! దీపాలవేళకు యిల్లువెతుక్కుంటూ మీరే చచ్చినట్లు మళ్లీవస్తారు.

(అందరు నిష్క్రమించుచున్నారు.)

సంతుష్టి

(కామరాజు సోమరాజు ప్రవేశించుచున్నారు.)

కామ—సోమరాజు నీకింటిదగ్గర కూర్చుంటే యేలా తోస్తుం దోయి! సాయంకాలమప్పుడు టవున్‌హాలుకైనా రావేమి?

సోమ—కామరాజు! నీవు చెడిపోయినావు నరే! మేముకూడా చెడిపోవాలనా? ఎందుకు టవున్‌హాలుకు? మాయింటిదగ్గర కూర్చో నేందుకు స్థలంలేదా? నాతో మాట్లాడేందుకు? మనుష్యులు లేరా?

కామ—మనుష్యులు లేకనా నిన్ను రమ్మన్నది స్థలంలేకనా? అక్కడికివస్తే పేపర్లు చదువుకోవచ్చును.

సోమ—ఎందుకు? ఎందుకు పేపర్లుచదవడం? ఏముంది పేపరులో వాడు వంగుని వంకాయ తిన్నాడు. వీడు కూర్చుని గుమ్మిడికాయ తిన్నాడు మట్టిగుండపాలెందో మనిషికి మూడు కోతులు పుట్టినవి కొక్కిరిగడ్డ కోకిలమ్మకు ఆవుదూడలు పుట్టినవి అని నాలుగు కల్లబొల్లి మాటలుండడమేగాని పత్రికలో నేముంటవి?

కామ—(నవ్వుచు) ఇంతేనా పత్రికలలో నుండేది? పత్రికలసారం బాగాగ్రహించినావు! పత్రికల వుపయోగమంతె నిన్నడుగవలెన్నవచ్చి.

సోమ—ఓస్! నేనంత మూర్ఖుడనుగాబోలు నీవు గొప్పనాగరకుడవు బయలుదేరినావు. పత్రికలసారం గ్రహించేందుకు ప్రతికలోకసారలవాళ్లైతే నల్లమందులాగ పట్టుకొంటవి. నల్లమందువానికి వేళకు మందందకపోతే కాళ్ళీడ్చుపీకునో పత్రికలవానికి ఆవేళకు పత్రికందక

పోతే కాళ్ళులాడీక్కుపోతాయి. అందుచేత ఆదురభ్యానం నేను చేసుకో లేదు. పత్రికలు చదిని నీవుపడిన బాగేమిటో చెప్పు! నేను చదవక పాడై పోతానా! కృష్ణా అనుకోవడమా? రామా అనుకోవడమా?

కామ—బాగుపడడానికి ఓగుపడడానికి ఇందులో ఏమున్నది? కావలసినంత యుద్ధం జరుగుచున్నది. చీనాలో ఆయుద్ధవార్తలు తెలుసుకోవడమే ప్రధానము. అది తెలియడమే లాభము.

సోమ—ఏమి! తెలియకపోతే సూర్యుడుదయించడా? చంద్రుడస్తమించడా? భూమి తిరుగదా? ఆకలికాదా? నిద్రపట్టదా?

కామ—పేపరు చదవకపోయినా సూర్యుడుదయిస్తాడు ఆకలవుతుంది నిద్రపడుతుంది. గాని, మహాయుద్ధం జరుగుతుంటే ఆ సంగతులు తెలుసుకోవాలని నీకు ఆసక్తిలేకపోవడంచూస్తే నాకు మిక్కిలి ఆశ్చర్యముగా యున్నది. నీవు గొప్ప వేదాంతివి. లాభముంటేగాని అందులో చొరబడవు.

సోమ—వేదాంతమో గీదాంతమో నాకు తెలియదు. యుద్ధముజరిగితేనాకేమి? గిద్ధముజరిగితే నాకేమి? ఎవళ్ళుపోతేనాకేమి? నేను బాగుంటేచాలు.

కామ—అయితే మీరీసంవత్సరము కాంగ్రెసుసభకు రారా?

సోమ—ఎందుకు కాంగ్రెసుసభకు? యాభైయో నలభైయో దండుక్కా? కాంగ్రెస్ అంటె నాకు తెలియకా? మామూలుమీటింగు కన్న పదిమంది ఎక్కువుంటారు తక్కినమీటింగులలో లోపలికి పూరక వెళ్ళనిస్తే యింకులో 10 రూ॥ టిక్కెట్టులు పుచ్చుకుంటారు. పుత్తమీటింగులలో యిద్దరుముగ్గురు మాట్లాడితే యిందులో 40, 50 మంది మాట్లాడుదురు. పుత్తమీటింగు పూళ్ళోవాళ్ళుచేస్తే యీ మీటింగుకు పైవాళ్లువస్తారు. అరవవాడు, కన్నడవువాడు, మరాటి

వాడు, గుజరాతివాడు, బంగాళీవాడు అందరుచేరుతారు. వింతవింత కట్లు చిత్రచిత్రపుబొట్లు, తమాషాతమాషాజుట్లు కనుపడతాయి. కాంగ్రెసుభాగవతమంటే యింతేనా ? వెళ్ళకుండా కాంగ్రెనంటే ఏమిటో నేను వూహించుకోగలను.

కామ—నీవు మహాగొప్పవాడవయ్యా ! అంతామనోభావముతోనే వెళ్లుతున్నది. చెన్నపట్నం చూడరా మీరు ?

సోమ—చెన్నపట్నం నేనెరుగనా ? చూచేదేమిటి ?

కామ—అయితే మీరు చూచినారాయేమి యిదివరకే.

సోమ—చూచేదేమిటి ? చూడకుండానే యెరుగుదును నేను. మనవూరికంటె మరొకపదిళ్ళెక్కువుంటాయి మరొకపదిమకాణాలుంటాయి. లొడలొడలొడమంటూ మంగలంలో రాళ్ళుపోసివేయించినట్లు అరవగొడవ మాట్లాడుతుంటారు. మనవూర్లో గోదావరుంటే ఆవూళ్లో సముద్రముంటుంది. ఇక్కడ రాధారీపడవలకుమారుగా అక్కడ నావలుంటాయి మనవొంటెద్దుబండ్లకు బదులుగా అక్కడ ట్రాంబండియేదో వుంటుందట ! పాకీవాళ్ళుబాగుచేసే గొట్టాల్లోనుంచి నీళ్లొస్తాయి అక్కడకాదాఅంటె మరొకపది గుఱ్ఱంబండ్లు, మోటారుబండ్లు, తొక్కుడుబండ్లుంటవి. ఈమాత్రమూహించుకోలేనానేను.

రామ—వహవ్వా ! మెచ్చవచ్చునయ్యా నీసంతుష్టి, నీవైరాగ్యము నీకు ప్రపంచములో ఏదీచూడాలనిలేదు.

సోమ—ఇదిచూస్తే యింకొకటి చూడాలని బుద్ధిపుంటుంది, ఏదీచూడకపోతే నయం.

(అని యిద్దరు నిష్క్రమించుచున్నారు)

పౌరుష మహాసభ

రాక్షసనామ సంవత్సర జ్యేష్ఠ బహుళ అమావాస్యకొత్తమం గళవారమునాడు రాత్రి 12 గంటలు మొదలు 2 గంటలవరకు యినుకతిప్పమీద జరిగిన పుర మహాజన సభయొక్క తీరుమానములు. ఆ సమయమున పిడీగుద్దుల భేతాళరావుగారు అగ్రాసనాధిపత్యము వహించిరి. అప్పుడు బెత్తాల భీమశంకరం పంతులుగారు యీక్రింది తీర్మానమును ఉపపాదించిరి.

తీరుమానము

మన పట్టణమందున్న పాఠశాల లన్నిటిలోను ఉపాధ్యాయులు కేవలము జీతములకొరకు గాక బాలురను బాగుచేయవలెనను లోకోపకార బుద్ధితో పని చేయునట్టి మహానీయులగుటచే వారు యేపిల్లవానిని గాని బెత్తముతో గాని వెదురు బద్దతో గాని, యీతజువ్వతో గాని, మ్యావు కఱ్ఱలతోగాని, చేతికఱ్ఱలతోగాని, వారికవసరమనితోచినప్పుడు నెత్తిమీదగాని, మొగముమీదగాని, వీపుమీదగాని, చేతులమీదగాని, పిఱ్ఱమీదగాని, కాళ్ళమీదగాని, పొట్టమీదగాని, పొద్దున్నగాని, సాయంకాలముగాని, మధ్యాహ్నముగాని, చొక్కాలుకోట్లు విప్పించిగాని వుంచిగాని, పదిగాని, యిరువైగాని, ముప్పైగాని, నూరుగాని, అవసరమని తోచినపక్షమున ఇంకాయెక్కువగాని, కొట్టవచ్చుననియు, అట్లు కొట్టునప్పుడు నెత్తురు వగైరా వచ్చునప్పటికీ డాక్టర్లు డ్రెస్సర్లు వారికిగాని, వారి తలిదండ్రులకుగాని, వారి బంధువులకుగాని, సర్టిఫికేట్లు యివ్వకూడదనియు దెబ్బలుతిన్న పిల్లల తల్లిదండ్రులుగాని, సంరక్షకులుగాని, తెలివితక్కువచేతగాని, పెంకితనముచేతగాని, దుర్మార్గుల ప్రోత్సాహముచేత గాని చార్జీలిచ్చుటకు మేజస్ట్రీటు కోర్టులకు

వెళ్ళినప్పుడు బెంచిమేజస్ట్రీట్లుగాని, తాలూకా మేజస్ట్రీట్లుగాని డిస్ట్రిక్టు మేజస్ట్రీట్లుగాని, చార్జీలు పట్టగూడదనియు, ఉపాధ్యాయులు కొట్టునపుడు ఆ దెబ్బలు తిని చల్లగాపూరకోక యింటిదగ్గరకు వెళ్ళిచెప్పి తల్లిదండ్రులచేత సంరక్షకులచేత అల్లరిగడబిడ రాద్ధాంతము చేయించిన బాలకులను యావత్తు ప్రెసిడెన్సీలోను, యేస్కూలులోను చేర్చుకొనగూడదనియు, అటువంటి బాలకులకు యేడిపార్టుమెంటులోను యుద్యోగములియ్యకూడదనియు చెన్నపురి గవర్నమెంటువారిదివరకు ప్రచురించిన యడ్యుకేషనలు రూల్సులో హెడ్‌మాస్టరులేగాని, క్రింద యుపాధ్యాయులు కొట్టకూడదని వ్రాసినభాగములు రద్దుచేయించి ప్రతియుపాధ్యాయుడు చిన్న నేరమైనను సరే పెద్దనేరమైనను సరే ఇష్టము వచ్చినట్లు కొట్టుట కధికారముండవలసిన దనియు, గవర్నమెంటు వారొక చట్టము నిర్మింపవలసినదని యీసభవారి యభిప్రాయము.

మహాజనులారా! ఇప్పుడు నేను చదివిన తీరుమానమును ఉపపాదించవలసినదని మహాజనులందరు నన్ను గౌరవించినందున నేను అటువంటి గౌరవమునకు తగకపోయినప్పటికి యీమహాభారము నిర్వహించుటకు నాకంటె సమర్థులగు మహాజనులు వేనవేలున్నప్పటికి నేటివిషయము మనపట్టణముయొక్క జిల్లాయొక్క ప్రెసిడెన్సీయొక్క బాలుర క్షేమముతో గూడిన పని యౌటచేత నేను దానిని తప్పక నిర్వహింప బూనుకొన్నాడను. లోకమునకు ఉపకారము చేయవలెననే అదుర్దాతో నేనేమైనా తొందరమాటలన్న పక్షమున అవన్ని మీరు క్షమింపవలెను, మన గ్రామములో యిదివరకెన్నడూలేని క్రొత్తవింతలు పుట్టుచున్నవి చదువుకొనే పిల్లవాళ్ళను కొట్టకూడదని కొందరు దౌర్భాగ్యులు వేలు తూవుచున్నట్లు మీలో చాలామందికి తెలియవచ్చినది "బెత్తము

దాచినావో పిల్లవాడిని పాడుచేసినావో" అని అర్థ మిచ్చేసామెత యింగ్లీషుభాషలో నున్నది ఈనిర్భాగ్యపు తల్లిదండ్రులా సామెత లెప్పుడు వినలేదా? దెబ్బ దేవేంద్రలోకమును సామెత మన తెనుగులో నున్నది అదైన వారు వినలేదు కాబోలు! వాళ్ళ చెవులలో జిల్లేళ్ళచెట్లుమొలిచినవి కాబోలు! కొట్టకబోతే పిల్లవాడు బాగుపడతాడా? మేము చదువుకొనేటప్పుడు మాపంతులుగారు నన్ను చీమల చింతకు కట్టించి చింతబరికెతో నెత్తురుచుక్కలు కారేటట్లుగా కొట్టేవారు ఆలాగున దెబ్బలుతిని కష్టపడి చదువుకోబట్టే నాలుగు ముక్కలు నాకంటాయి లేకపోతే ముష్టెత్తుక పోవలసిందే. అటువంటి గురువులేనప్పుడు చదువు లేనప్పుడు వట్టిపాడురోజులు వచ్చికూర్చున్నవి ఒకమొట్టికాయ వేసినా కాస్త తొడపాశంపెట్టినా కొడుకును వెనుకవేసుకొని వచ్చి ప్రతిచాకలి ప్రతిమంగళ ప్రతినీళ్ళకావిళ్లాయన పై అధికారులకు తెలియచేస్తానని చార్జీ యిస్తానని బెదరించడమే కదా! ఈతీరుమానం ప్రకారం గవర్నమెంటువారు కరుణించి అటువంటి చట్టమును నిర్మించినట్లయితే యీచచ్చుపీనుగుల నోళ్ళు అణిగిపోతాయి తలుచుకుంటే నాకు వళ్ళు మండిపోతుంది. వీళ్ళమ్మకడుపు గాల! కొట్టకుంటే వొక్కముక్కొస్తుందా యీబండ కుంకలకుచదువంటే పప్పుదప్పళాలు కొట్టడమా, అసలుబడి పంతులంటే కూర్చున్న గుడ్డిముండ లేవదీ తాలూకాబంట్రోతుకన్నా గౌరవముందిగాని మాకులేదు. అటువంటి యవస్థలో యీ బెదిరింపులు కూడానా? ఈచట్టము నిర్మించకపోతే మేమంతా గంగా ప్రవేశము కావలసినదే. చదువులు చట్టుబండవులతాయి. వొకడికీ వొక ముక్కరాదు. మీపిల్లవాళ్ళ బాగు మీరు కోరితే యీతీరుమానము మీరు వొప్పుకోండి.

భేతాళరావు—సభాసదులారా! మనబెత్తాల భీమశంకరంగారు తూము కాలువలో నీళ్ళులాగ దొడదొడదొడ యిప్పుడుచేసిన యుప

న్యాసము మీరందరు విన్నారుగదా! ఈతీరుమానమును మొట్టికాయల మోహనరావుగారు ధ్రువపరుతురు. కాబట్టి మీరు శ్రద్ధగవినండి!
(సభ్యులు చప్పట్లు గొట్టుచున్నారు)

మోహనరావు—సభాజనులారా! ఇప్పుడు భీమశంకరంగారు వపాదించిన తీరుమానమును నేను ధ్రువపరుచుచున్నాను. పిల్లలను కొట్టక పోతే చదువులు రావన్నమాట మీకందరకు తెలియదా? చిన్నప్పుడు మాపంతులుగారు నన్ను మొట్టికాయలు మొట్టేవారు ఒక్కొక్క మొట్టుకు సోలడేసినూనె నెత్తిని యినికేది. కోదండాలు తీశాము గోడకు ర్చీలు వేశాము వీపుమీద మూటలు పెట్టించుకొన్నాము. మాపంతులుగారు విశేషించి కళ్ళలో మిరపకాయపొడుము వేసేవారు మేమెంతో దయావంతులమగుటచేత అటువంటి పనులు చేయడంలేదు. చేయక పోయినప్పటికిని మమ్మలిని అడ్డమైన కూతలు కూస్తోన్నారట! వాళ్ళ వాళ్ళు. పిల్లవాళ్ళాడిందాట పాడిందిపాట చేసినట్టయితే గాడిదలనుకానుటకైనా పనికిరారు. అందుచేత మేష్టర్లకు కొట్టుట కధికారమియ్య వలసినదనిచెప్పే యీతీరుమానమును మీరందరు అంగీకరించవలసినదని నాయభిప్రాయము.

(అని కూర్చుండును)

(అప్పుడు తొడపాశాల దుర్గప్రసాదరావుగారు లేచుచున్నారు)

దుర్గ—అయ్యా! ఈతీరుమానమునకు నేనొక యమెండుమెంటు ప్రపోజుచేస్తాను అనగా ఒక సవరణచేస్తాను.

భేతాళ—ఏమిటాసవరణ త్వరగాచెప్పండి పొద్దుపోతుంది.

దుర్గ—ఇదిగో చెవుతున్నానండీ అడుగున గంటములు పాతి శాటాకులమంటవేసి పిఱ్ఱమీద చింతబరికెలతో బాదుచు కోదండము తీయించినప్పటికి తప్పులేదు అనేమాట లీతీరుమానములో నుండవల

యును. ఇందువిషయమై నేను నాలుగుమాటలు చెప్పుతాను. ఈకాలములో కోదండములు మరిచిపోయినారు. కోదండం తీయించడంకంటె మంచిశిక్ష లిప్పుడులేవు. వెధవనాగరికత ముదిరి పిల్లలను గారము చేయడము ఆరంభించి కోదండాలు మానివేసి పాడుచేస్తారు, కోదండం వస మరియొకదానికి దేనికీరాదు. అది యీ తీరుమానమంతకు శిఖరము వంటిది. కాబట్టి మీరందరు దీనికంగీకరించవలయును

భేతా—ఇదెవరైనా సెకండుచేసేవారున్నారా?

(చింపకాయల చెల్లయ్యగారులేచి) అయ్యా! ఈ తీరుమానమును నేను సెకండుచేస్తూన్నాను. కారంలేనిదే కూరలకు రుచిరాదు. కోదండం లేనిదే పిల్లలకు చదువురాదు. అడుగున గంటాలుపాతడం తాటాకులమంట వేయడం యెందుకనగా కోదండం తీశేవాడు కాళ్ళు క్రింద పెట్టకుండాను కోదండమంటూవుంటే ఒక్కపిల్లాడైనా పరీక్షలో ఫేలైపోతాడా గవర్నమెంటువారు తెలివిగలవారయితే తప్పకుండా ఆలాటిచట్టమే యేర్పరుస్తారు. ఇంతకు మనమహాజరుమీద పదివేల మందియైనా దస్కతుచేయాలి, కొందరు పెంకెతనముచేత దస్కతు చేయనంటారు. వాళ్ళతో యీ మహాజరు నీటిపన్ను తగ్గించడానికిస్తూన్నామని చెప్పండి దానితో చచ్చినట్టు వాళ్ళేచేస్తారు. దస్కతు. ఏలాగో ఒకలాగ సంతకాలుమట్టుకు కావాలి. ఇంతతో నేను విరమించుచున్నాను.

భేతా—సభలో వారందరికీ యీ సవరణ యిష్టమేనా? ఈ సవరణ యిష్టమున్నవారంతా నాలుకలు ముందరకు జాపండి.

మోహా—నాలుకలు జాపడం యేమిటండీ చెయ్యెత్తుతాం.

భేతా—ఒక చెయ్యెత్తమంటే రెండుచేతులెత్తుతారు. నేను చత్వారముముండావాడిని కనబడదు. నాలుకవకటేవుంది కనుక అది చులాగ్గా లెక్కపెట్టవచ్చును.

(అప్పుడందరు నాలుకలు జూపుచున్నారు)

భేతా—అయితే యీ తీరుమానమందరకు యిష్టమన్న మాటే.

సభవారు—అందరకు సమ్మతమే అందరకు సమ్మతమే (అని చప్పట్లు కొట్టుచున్నారు.)

(అప్పుడు చదువుల సాంబయ్యగారు లేచుచున్నారు)

సాంబ—అయ్యా! ఈ తీరుమానవిషయమై మహాజరు తయారు చేయుటకు సంతకములు చేయించుటకు గవర్నమెంటువారికి పంపించుటకు ఈ క్రింది పెద్దమనుష్యులతో నొక యుపసభ యేర్పరచవలసినదని నేనొక తీర్మానమును పెట్టుచున్నాను. అందులో ఈవేళ మాట్లాడినవారందరును ఈతజువ్వల యీశ్వరప్పగారు, రకుట్ల రామన్నగారు నేను గిల్లుల కృష్ణయ్యగారు నుండవలయును.

అందరు—సరే సరే తప్పక యుండవలయును. అంగీకారమే.

తిట్లతిరపతయ్యగారు—అయ్యా! ఈసభ జయప్రదముగా జరిపినందుకు అగ్రాసనాధిపతిగారికి, నేననేకవందనము లాచరించుచున్నాను.

అందరు—భళాభళ.

తోకమనుష్యులు

(నరహరి, పురహరి, ప్రవేశించుచున్నారు)

నర—ఏమిటోయి! పురహరి నీలోనీవే నవ్వుకొంటూవస్తున్నావు.

పుర—ఓహో! నరహరీ మనుష్యుడు తనలోతానే నవ్వుకోడానికి గొప్పకారణ మేదో వుంటుందంటావా లేదంటావా?

నర—కారణమేదో వుండకపోదు. కారణములేకుండా నవ్వేవాడు పిచ్చివాడు నీవు పిచ్చివాడవు కావుగనుక యేదో బలమైన కారణముంటుందనే అడిగినాను. ఆకారణమేమిటో చెప్పు?

పుర — చెప్పకపోడానికి ఇందులో యేమీ రహస్యములేదు. చెప్ప తలచుకొనే వున్నాను.

నర — త్వరగా చెప్పు ఏమిటోవిని సంతోషిస్తాను.

పుర — లోకకోసం తపస్సుచేసే మనుష్యునిచూచాను నేను. అందుకని నాలోనాకే నవ్వొచ్చింది.

నర — (నవ్వి) ఇదేమిచిత్రమయ్యోయి! లోకకోసం తపస్సు చేసే మనుష్యు లున్నారా లోకంలో? దిక్కుమాలినలోక మెయ్యి లేక చావవలె. ఇంతవింత లోకంలో వుంటుందయ్యా? మీరు నిజం చెప్తున్నారా, లేక వేళాకోళం మాట్లాడుతున్నారా? నాకు రెండూ తెలియడంలేదు.

పుర — నేను వేళాకోళం చెప్పడంలేదు. పరిహాసాలు నాకు పనికిరావు. కడుపులోనున్న దేమిటో స్పష్టంగా చెప్పడమేకాని, అడ్డ దిడ్డం మాటలు నాకురావు.

నర — ఆమహానుభావు డెవడో త్వరగా సెలవియ్యండి! చెవులు పండుగగా వింటాను. ఆయనెవరో త్వరగా కోతులలో కలిసిపోవాలె ననుకున్నాడు గాబోలు.

పుర — కోతుల్లో కలిసిపోవడమేమిటి? పిచ్చివాడవులాగున్నావు మనము కోతులసంతతివారమే కొందరు గొప్ప శాస్త్రవేత్తలు నిర్ణ యించిన సంగతేమీ నీవు వినలేదా? కోతి మనకు ఆదిపురుషుడని వారు తేల్చినారు.

నర — ఆరె దీనమ్మకడుపుకాలా! చివరకు మనకుకోతా ఆది పురుషుడు. కొండముచ్చులోనుంచి గద్దిరగాడులోనుంచి వచ్చినామా మనము? గోబ్రాహ్మణేభ్యః అని గోవులోనుంచి మనమువచ్చినామని పెద్దలు చెప్పేవారు. కొందరు విష్ణుమూర్తినోట్లోనుంచి వచ్చినా

మన్నారు. గోవుపోయి, గోవిందుడుపోయి, చివరకుకొండముచ్చైందా మనకు వంశకర్త నాకుసిగ్గువేస్తూంది.

పుర—సిగ్గుపడ వలసిన అవసరంలేదు. ఇప్పటికికూడామనవారు తోకలు సంపాదించుటకై తెల్లకింకుగా తపసుచేస్తున్నారు.

నర—ఏదేముడిని గురించి తపస్సు?

పుర—తెల్ల దేవునిగురించి.

నర—(ఆశ్చర్యముతో) తెల్లదేవుడా? తెల్ల దేవుడెక్కడున్నాడు?

పుర—నల్లదేవుడెక్కడున్నాడో తెల్లదేవు డక్కడేవున్నాడు.

నర—నల్లదేవుడంటే విష్ణుమూర్తి. అతడెక్కడబడితే అక్కడే వున్నాడు. తెల్లదేవుడంటే యెవరు? సాంబమూర్తి గారాయేమిటి?

పుర—ఏమూర్తిగారో, ఏకమూర్తిగారమకో! ఆయనగురించి కొందరు తోకనిమిత్తం తపస్సు చేస్తున్నారు.

నర—ఆతపస్సుకు కావలసిన నియమము లేమిటి?

పుర—బత్తాయినారింజపండ్లు, కమలాఫలాలు, చక్రకేళీఅరటి పండ్లు, అనాసపండ్లు, పంపరపనాసలు, కొబ్బరిబొండములు మొదలైనవి అప్పుడప్పుడా దేముళ్ళకు నైవేద్యము పెట్టవలెను ఆదేవుళ్ళ ఆలయామేనే జర్లకుకూడా అప్పుడప్పుడు ఏదైనాయింత హిరణ్యాంపార నేస్తుండవలెను.

నర—దేవుడు వీరికి ప్రత్యక్షమౌతాడా?

పుర—పూజారి నాశ్రయించి అతని యనుగ్రహము ముందు సంపాదిస్తే దేవుడు తప్పక ప్రత్యక్షమౌతాడు!

నర—ప్రత్యక్షమై యేమిచేస్తాడు?

పుర—దేనికోసం తపస్సుచేస్తున్నారో దానినిస్తాడు.

నర—అంటే తోకయిస్తాడని అర్థమా యేమి?

పుర—తప్పకుండా యిస్తాడు.

నర—ఆయనయిచ్చేది. పొడుగుతోకా పొట్టితోకా?

పుర—పొట్టితోకలూ వున్నాయి పొడుగుతోకలూవున్నాయి. దేవుడికిచేసిన సేవనుపట్టి తపస్సునుపట్టిపైగావాళ్ళ అదృష్టంపట్టి కొందరికి పొడుగుతోకలు, కొందరికి పొట్టితోకలు వస్తవి. కొందరికి యెంత తపస్సుచేసినా చిన్నతోకనుకైనారావు.

నర—ఇందులోకూడ రావడం రాకపోవడంవుందా?

పుర—చేసినతపస్సులకు ఫలమురావడం రాకపోవడం అన్ని విషయములలో నున్నట్టే యిందులోకూడ కలదు.

నర—ఈతోకలవల్ల ప్రయోజనమేమండి?

పుర—అయ్యో! దానిప్రయోజనము నీవెరుగవుగాబోలు, ఎంత ప్రయోజన ముంటేనేగాని, మనుష్యులు పడరానిపాట్లు పడి, చేయరాని సేవలుచేసి, పలుకరానిపలుకులు పలికి, వాటిని సంపాదించుకొందురా?

నర—ఆప్రయోజనమేమిటో కొంచెము చెప్పండి

పుర—తోకగల మనుష్యునికి గౌరవ మెక్కువ జరుగుతుంది.

నర—తోకలేకపోతే గౌరవము జరుగదా?

పుర—జరుగుతుందికాని, తోకవున్నవాళ్ళకే గౌరవం జరుగుతుందని లోకులంతాఅనుకుంటారు. తోకవుంటేవానిపేరు తొందరైఆమడ వ్యాపిస్తుంది.

నర—తోక లేకపోతేమాత్రము వ్యాపించదా? యజ్ఞాలు ధర్మాలుచేసేవాళ్ళపేర్లు తోకలులేకపోయినా తొందరైఆమడ వ్యాపించడంలేదా?

పుర—వ్యాపించవచ్చునుగాని తోకతో వ్యాపించడంసంగతి వేరు. తోకలున్నవారిప్రజ్ఞలు నీవువినలేదా? తోకగలహనుమంతుడు సముద్రము అమాంతముగా దాటివేసినాడు. తోకలున్న కోతులన్ని సముద్రమునకు వంతెనకట్టినవి.

నర—తోకలున్నంత మాత్రముచేత గౌరవమువచ్చేటట్టయితే కుక్కలకు, పిల్లులకు, పందికొక్కులకు, పశువులకు గౌరవం రావలసినదేనా?

పుర—సహజంగా పుట్టిన తోకలకంటె తెచ్చిపెట్టుకొన్న తోకలు గొప్పవి. అవి యెక్కువ గౌరవం తెచ్చును.

నర—నీమాటలు నాకు స్పష్టముగా అర్థం కావడములేదు. వాటిపరమార్థ మేమిటో అరటిపండువొలిచి చేతికిచ్చినట్లు చెప్పు?

పుర—తెలియదని అలాగడిగితే యిదివరకే చెప్పియుందును. అదుగో మనకెదురుగుండా వొక పెద్దమనిషి వస్తున్నాడు. ఆయనను చూడు.

నర—చూచినాను. ఆయన మనగోవిందరావుపంతులు.

పుర—ఆయనపేరు పూర్తిగా నీవు చెప్పడంలేదు. పూర్తిగా చెప్పు.

నర—పూర్తి పేరేమిటి? వారింటిపేరు చెప్పమంటావా? పాలనముద్రం గోవిందరావుపంతులు.

పుర—అంతేకాదు యింకా కొంతపేరున్నది అదికూడా చెప్పవలెను.

నర—ఇకేమున్నది? ఆయనకు గవర్నమెంటువారిచ్చిన బిరుదు కూడ చెప్పమంటావాయేమిటి? అయితే రావుసాహేబు పాలనముద్రం గోవిందరావుపంతులు ఈయన ప్రసంగమెందుకు మనకిపుడు?

పుర—ఈయన తోకగలమనుష్యుడే.

నర—తోకగలమనుష్యుడా? అంటే నాకెంతమాత్రం అర్థంకాలేదు, పెద్దతోకా చిన్నతోకా యీాయనిది?

పుర—వీరభోగ వసంతరాయుడిలాగు ఈయనకు వేపకాయంత తోకయున్నది,

నర—నిజముగా తోకున్నదా? అది పైకి కనపడుతుందా?

పుర—కనుపడకేమి? స్పష్టముగా అందరికి కనుపడుతుంది. ఈయనకు తోకవచ్చినప్పుడు వచ్చినవార్త పత్రికల్లో పడినది గజట్టులో పడినది.

నర—అలా అయితే లోకులు ఎవరూ చెప్పుకోలేదేమి?

పుర—చెప్పుకోకేమి? అందరూ చెప్పుకొన్నారు.

నర—రావుసాహేబు బిరుదువచ్చినట్లు చెప్పుకొన్నారుగాని తోకొచ్చి నట్లెవరూ చెప్పుకోలేదు.

పుర—తోకంటే నీకిప్పటికీ అర్థంకాలేదా?

నర—నాకర్థమేకాలేదు స్పష్టముగా చెప్పు?

పుర—రావుసాహేబే తోక.

నర—తోకంటే బిరుదా! సరిసరి, ఇదిచెప్పడానికిగా యింత చంపినావు. ద్రావిడప్రాణాయామములాగ తల్లక్రిందుగా త్రిప్పి చంపినావే వీటికోసం తపస్సు చేయడమేమిటి?

పుర—తపస్సు చేయడమేమిటా? అధికారిదేవతలను తరుచు వెళ్ళి చూడడం. మంచి మంచిపండ్లు, పంచదారచిలుకలు, మిఠాయిలు వారికి మెహానతుగా పంపుచుండడం వారిసమ్ముఖములవర ధవాలీలు లేని డలాయతులులాగ నిలిచివుండిసేవలుచేయడం మనస్సులో అష్టాక్షరీమహామంత్రం జపం చేయడం.

నర—అష్టాక్షరీ మహామంత్రమేమిటి?

పుర—"బిరుదులుకావలెను" అనేదే అష్టాక్షరమంత్రం.

నర—బిరుదులుపొందినవారంద రిట్టివారేనా? ధర్మకార్యములు లోకోపకారము చేసినవారికి కూడా బిరుదులు వస్తుంటవే.

పుర—అందరు యిట్టివారుకారు, సత్కార్యములు చేసినవారికి

కూడా బిరుదు లప్పుడప్పుడు వస్తుంటవి వారు వాటికి తగినవారే! అందరూ అటువంటివారు కారు. ఈబిరుదులు పొందినవారిలో అనేకులు తగనివారే వున్నారు. తగినవారికి అవి బిరుదులగును. తగనివారికి తోకలగును.

నర—తోకమనుష్యులంటే యిప్పుడు నాకర్థం తెలిసింది. సరే వెళ్ళుదాము రా !

(ఇద్దరు నిష్క్రమించుచున్నారు)

పరస్పర స్తోత్ర సమాజము

(గణపతిరావు, కళ్యాణరావు, శంకరరావు ప్రవేశించుచున్నారు)

గణ—కళ్యాణరావుగారు! మన శంకరరావుగారు చెప్పినమాట నిజమే! అన్నిలక్షణములునున్నవి గాని ఐదవతనముతక్కువన్నట్లు మన ముగ్గురికిన్ని అన్ని తెలివితేటలుండీ అక్కరకురాకుండా పోతున్నాము. దీనికేమైనా తగిన వుపాయం మనమాలోచింపవలసిందే.

కళ్యా—చాలకాలంనుంచి నేనుగూడ నిదే ఆలోచిస్తున్నాను. తెలివితేటలు బొత్తిగా లేని మట్టితలనిర్భాగ్యులుకూడా మనతల దాటి పోతున్నారు. వాళ్ళకన్న యెన్నోరెట్లు బుద్ధిమంతులమైన మనము యీలా అధోగతిలో పడివుండడం చూస్తే నాలోనాకే చాలా ఆశ్చర్యమవుతున్నది. చేయవలసిన దేమిటో నాకు తోచకున్నది. పూర్వజన్మకృత మనుభవించవలసినదేకాని ప్రతిక్రియ యేమిచేయగలము. పైవుద్యోగస్థులకు మనమీద దయలేదు. అందరికీజీతాలు వృద్ధిచేస్తారు. అందరికి బిరుదులిస్తారు. చచ్చుముండావాడు సీతారామయ్యకప్పుడే రావుబహద్దరు వచ్చింది. మనకొక రావుసాహెబైనా లేదు. వాడు చేసిం

దేమిటి. మనము చేయుందేమిటి ? యోజించడంలేదు గాని, మనవాళ్ళ బుద్ధికన్న గొప్పది. ఏమైతే నేమి ? మనగీటు బాగున్నదిగాదు. ఆ శని గాడు మననెత్తి నెక్కి తొక్కుతున్నాడు

శంక—మనము మందపల్లి వెళ్ళి శనికి నూనె అభిషేకముచేదాం. గ్రహశాంతి చేయించుకొందాం. ఇంతకంటె నాకేయుపాయం తోచలేదు. గ్రహములు బాగులేవని నాఅభిప్రాయం. అదేకాకపోతే రాత్రి 10 గంటలుదాకా డస్కుదగ్గర కూర్చొని పనిచేసి ఆఫీసంతా నాదేఅని దొర్లేవాళ్ళకు యేవిధమైనా ప్రోత్సాహము లేకపోవడమేమి ? మనకంటె యేడు వెనకల ఆఫీసులో చేరి సరిగా నాల్గుబంతులైనా వ్రాయలేని అపాత్రులకు అగ్రస్థానములు రావడమేమి ?

కళ్యా—ఓరి నీపిచ్చిగూల ! మొదటినుండి నీవు జాతకాలుచూపించుకొని, గ్రహశాంతులు చేయించుకొని యింతవరకు పాడైనావు. ఇంకా అదేపొంతకాని నీకు రెండోపొంతలేదు. అది వుపయోగంలేదని తెలిసివుండికూడా యింకా అందులోనే దిగుతావేమి ? వెంకప్పశాస్త్రుల్లు జాతకాలుచూచి చక్రాలుగీసి రెండువందల రూపాయలు గొరిగినాడు. ఇంకా నీకు బుద్ధిలేదు. ఈపాటికాదారి మానవేసి మంచిదారినిపడు మనలోకల్లా మన గణపతిరావు బుద్ధిమంతుడు, గణపతికున్నట్లె యతనికికూడ పెద్దపొట్టవున్నది. అది వొట్టిపొట్టగాదు. పొట్టనిండా వుట్టెడు బుద్ధులున్నాయి. అతడే దీనికేదన్నా గట్టివుపాయం చెప్పాల. ఆతడుపాయంచెప్తె కీలెరిగి వాతపెట్టినట్లుంటుంది. కుయుక్తులలో అతనిబుద్ధి అమోఘమైనది. అది వేశాడాఅంటె రామబాణములాగుతగులుకొంటుంది. కాబట్టి ఆతనినే మనము ఆశ్రయిద్దాం. బాబూ ! గణపతిరావ్ ! నీవే యేదో తరుణోపాయం చెప్పవలె ఆదెబ్బతో తేలితె ముగ్గురంతేలుతాం. లేకపోతె ముగ్గురం మునుగుతాం. చెడ్డకాపురమునకు ముప్పేమిటి ? ఇంతకంటె మనమెక్కువ చెడిపోం. చెప్పు. నీవు బాగా ఆలోచించి వుపా

యం! రెండుమూడురోజులనుంచి రాత్రులు నిద్రలేకుండా నేనీవిషయమే ఆలోచిస్తున్నాను.

కళ్యా—ఆలోచన తెగి యేదన్నా వుపాయంతట్టిందామనస్సుకు?

గణ—తట్టినది. అదే యిన్నిటిలోకి యెక్కువ వుపాయంలాగు తోచినది.

కళ్యా—చప్పున చెప్పుబాబు? ఈదెబ్బతో తేలిపోతాను.

శంక—ఇక మనకష్టములు గట్టెక్కినవన్న మాటె.

గణ—ముందుగానే ఆశపడకండి చెప్పినదివినండి! మనము ముగ్గురం కలసి వొక కట్టగావుండి దొరల దర్శనం చెయ్యవలెను. చేసినప్పుడు నన్ను నీవు నీవు నన్ను గొప్పగా చెప్పుచుండవలెను. స్పష్టముగా చెప్తావినండి. నేను దొరగారిదగ్గరకు వెళ్ళినప్పుడు కళ్యాణరావువంటి వాడు లేడని నేను చెప్తాను. దానితో నీమీద మంచి అభిప్రాయంగల్గుతుంది. నీవు వెళ్ళినప్పుడు శంకరరావంత బుద్ధిమంతుడు మనరాజధానిలో లేడని కోతలు కోసివెయ్యి. శంకరరావు వెళ్ళినప్పుడు గణపతిరావుండబట్టి ఆఫీసువున్నదిగాని లేకపోతె వొక్కనిముషము పనిజరుగదనిచెప్పవలెను. లోపల మనలోమనము స్నేహితులుగానుండి పైకిస్నేహము లేనట్లుండవలెను.

కళ్యా—వహవ్వా! వహవ్వా! బుద్ధికి బృహస్పతివయ్యా! భేషైన వుపాయం.

శంక—దీనితో మనకు రావ్‌బహదర్ బిరుదొచ్చిందన్నమాటె

(నిష్క్రమించుచున్నారు)

(అప్పుడు గణపతిరావు, వానిపై యధికారి ప్రవేశించుచున్నారు)

గణపతి—(తనలో) అధికారులను వశము చేసుకొనవలెనంటె మంచిమంచి సప్లయిలు చేయువలెను. అధికారిని చూడవలసి వచ్చినప్పుడు నూరో రెండువందలో బత్తాయిపండ్లు. నాలుగో అయిదోచక్ర

కేళీగెలలు, పట్టుకెళ్ళి చూచితిమా ఆగ్రహపిశాచము ఈ నైవేద్యముతో తొలగిపోతుంది. ఎంతో అనుగ్రహం కుదురుతుంది అధికారుల దర్శనం చేయుటకు ముందు బట్లరు దర్శనం చేయవలెను. వానిని చూడకపోతే దేముడు వరమిచ్చినా పూజారి వరమివ్వడు. నా అదృష్టమువల్ల బట్లరు నాకు ముఖ్యస్నేహితుడే అయినాడు. అధికారుగారు నవ్వుచున్న సమయం చెప్పవలసినదని చెప్పినాను అదిగో! వస్తున్నాడు బట్లర్.

బట్లరు—అధికారిగారు రమ్మన్నారుసామి! మంచి సమయం సామి! పండ్లు లోపలపెట్టేదా?

గణ—అందులో పదిపండ్లు నీవు తీసికొని తక్కినవి అధికారిగారి బల్లమీదపెట్టు.

బట్ల—రొంబ బంప మంచివాడుసామి నీవు నాకు మంచి ప్రెజెంటియ్యాలసామి అధికారిగారితో ఎప్పుడు చెప్తావుంటా మీసంగతి నేను.

గణ—వెళ్ళవచ్చునా లోపలికి?

బట్ల—ఇప్పుడే పోయ్యా! అధికారి కుశాలుగా వుండాడు.

గణ—(లోపలికివెళ్ళి సలాము చేయుచున్నాడు.)

అధికారి—ఏంపనిమీద వచ్చినావ్?

గణ—గుడ్ మార్నింగ్ సర్!

అధి—ఏమిపనిమీదవచ్చినా?

గణ—పూరికే, తమ దర్శనముచేసి వెళ్ళవలెనని వచ్చినాను. మాతోటలో మంచి బత్తాయిపండ్లు కాచినవి. అవి యేలినవారికి దాఖలు చేసికొనుటకు వచ్చినాను.

(అప్పుడు బట్లరు పండ్లగంప తెచ్చును)

అధికారి—కూర్చుండు! ఆకుర్చీమీద కూర్చుండు!

గణపతి—(సంతోషముతో) త్యాంక్యూసార్ ! (అని కూర్చుం డును.)

అధికారి—నీకు తోటలున్నవా ?

గణపతి—నాకు మంచితోటలున్నవండి (తనలో) లేనిదేవున్నా యన్నాను. వీడు యింకా తరిచి తరిచి అడిగితే పడిపోతానేమో అని భయం వేస్తుంది.

అధికారి—ఏమేమితోటలున్నాయి నీకు ?

గణ—బత్తాయి, చక్రకేళీ, కొబ్బరితోట.

అధి—నీకు తోటలమీద ఏమివస్తుంది ?

గణ—(తనలో తక్కువశిస్తు వొస్తున్నదంటే మనమీద వీడికి గౌరముండదు. అందుచేత వొకడాబు డాబుతాను. (ప్రకాశముగా) సాలుకు పదిహేనువందలు రూపాయిలు వస్తవి.

అధి—బాగున్నది. అయితే నీకిప్పుడు జీతమెంత ?

గణ—రు 80-0-0 లు యిస్తున్నారు.

అధి—అయితే నీకుటుంబములో జనమెంత ?

గణ—ఏడెనమండ్రుగురు మున్నాము.

అధి—మీ హిందువులలో మనిషివొక్కంటి కెంతవుతుంది ఖర్చు ?

గణ—నెలకు మనిషి కేడెనిమిది రూపాయ లవుతుంది.

అధి—పదిహేనువందల శిస్తు ఈ ప్రకారంగా నీ కెన్నాళ్ళనుంచి వస్తుంది ?

గణ—పదేళ్ళనుంచి వస్తుంది.

అధి—నీకు పిల్ల లెందరు ?

గణ—ఇద్దరుకొడుకులు ఇద్దరుకూతుళ్ళు.

అధి—నీస్థితిక నాకు చాల సంతోషంగా వుంది. నీవంటిగొప్ప

కుటుంబస్థులు, ఆస్తివున్నవాళ్ళు ఆఫీసులలోవుంటే చాలామంచిది. డబ్బున్నవాళ్ళుగనుక లంచాల కాశపడరు. హానెస్టుగా వుంటారు. నీవు హానెస్టుమ్యాన్‌వనే వింటున్నాను.

గణ—చిత్తము. చిత్తము. మాపెద్దలు యీదేశంలో దేశపాండ్యాలు. మాది చాలాగొప్ప కుటుంబము. నేను మొదటినుంచి హానెష్టుగానే వుంటున్నాను. కాని మాఅందరి ఆనష్టీ లెక్కేమిటండి! నీతి చెప్పవలసివచ్చినప్పుడు కళ్యాణరావుది నీతి, అతనంత హానెష్టుమ్యాను డిపార్టుమెంటులో వుంటాడని నాకుతోచదు.

అధి—ఎవరు! కళ్యాణరావంటే యెవరు?

గణ—చిత్తము, ఏలినవా రెరుగుదురు. యెఱ్ఱగా. పొట్టిగా. లావుగా. వుంటాడు కుడి కనుబొమమీద నల్లని పుట్టుమ చ్చున్నది.

అధి—ఓహో! ఆహెడ్‌క్లార్కా పనుచువాడా?

గణ—చిత్తము.

అధి—అతడంతనీతిమంతుడని నీవేలాచెప్పగలవు?

గణ—చాలా దృష్టాంతరా లున్నవండి! నేను స్వయంగా నెరుగుదును.

అధి—ఏదీ! వొకటి రెండు దృష్టాంతరాలు చెప్పండి! చూతాము.

గణ—ఈ ఆఫీసులో వెనుకవుండే మేనేజరుగారు కళ్యాణరావుకు చాలా దగ్గరచుట్టము. కళ్యాణరా వెంతచెప్తే అంతా ఆయన వినేవాడు. ఒకనాడు ఈవూరిలో పెద్దమనిషికి గొప్పఅవసరం మేనేజరుగారితో కలిగినది. ఆయనవల్ల వొక కార్యం కావలసివచ్చింది. మేనేజరుగారితో చెప్పి శిఫారసుచేసి ఆకార్యం చేయిస్తే వెయ్యిరూపాయిలు రొక్కం యిస్తానని ఆపెద్దమనిషి కళ్యాణరావుతో అన్నాడు. అప్పుడు కళ్యాణరావుకు రు 40—0—0 లే జీతం. కూతురి పెళ్ళికోసం డబ్బులేక

అప్పుడు తిరుగుతున్నాడు. అంతటి యిబ్బందినుండికూడ కళ్యాణరావు చీ! డబ్బునేను పుచ్చుకోనని శిఫారసుచేసి ఆకార్యం చేయించినాడు. అంత మంచివాడింకొకడుండడం కష్టం.

అధి—చాలామంచివాడేకాని, ఆతనికి ప్రమోషనెందుకు కాలేదు?

గణ—న్యాయంచూచే ప్రభువులు లేరు ఏలినవారు వచ్చినారు గనుక యిక జరుగవలెన్యాయం. కొందరు తమ ప్రజ్ఞ చాటుకుంటారు ఇతనిదగ్గరా గుణంలేదు తన పనేమో తానేమో. మంచివాళ్ళకివి రోజులుగావు.

అధి—సరే! బాగున్నది యన్ గుడ్‌మార్నింగ్!

గణ—చిత్తము సెలవు పుచ్చుకుంటాను. (అని తనలో) కళ్యాణరావునుగురించి బాగా కోతలు కోశాను నసాళమంటేట్లు చెప్పాను.

(అని నిష్క్రమించును.)

అధికారియిల్లు (అప్పుడు శంకరరావు ప్రవేశించుచున్నాడు.)

శంక—(తనలో)ఆశ యెటువంటిపనైనా చేయించగలదు. తండ్రి తద్దినమునాడైనా దేశవాళీమామిడిపండ్లు కొని బ్రాహ్మణులకు వేయని ముండావాడిని హావ్వాల్‌రజంబహాంగీర్ ఫసందు అంటుమామిడి పండ్లు రూపాయకు అయిదు చొప్పున ఆరుచొప్పున నూరుపండ్లుకొని పై యధికారికి సమర్పిస్తున్నానుకదా! శివరాత్రినాడైనా దేవుడిగుళ్ళోకి వెళ్ళి పూజారివాడి చేతిలో బేడడబ్బులు పెట్టలేనివాడిని దఫేదారివాడి చేతులో రెండు రూపాయలూ బిళ్ళకుడుములలాగు పెట్టివేస్తున్నాను. ఆమడదూరమైనా అవలీలగా నడిచి పొయ్యేవాడిని డాబుకోసం రూపాయిచ్చి గుర్రంబండెక్కి వచ్చినాను మాయధికారి భోంచేస్తున్నాడు. భోజనమైందాక చచ్చినట్లు యీచెట్టుక్రింద కూర్చుంటాను. రెండురూ

పాయిలూ పుచ్చుకొని డఫేదారు చావగుడ్డయినా వేయడు. ఏమిరా అంటే అసలు వ్యవహారం చెడగొడ్తాడు. మావరస్పరస్తోత్రసమాజములో ఏర్పరచుకొన్న రూలుప్రకారం నేను గణపతిరావును గురించి మాట్లాడవలెను. వీ డబ్బా పిడిశిఖతరగ! ఈగణపతిరావు వట్టి అవకతవకముండాకొడుకు కాని యేర్పరచుకొన్న నియమము ప్రకారము వాడు వువ్వులేకుండా ముప్పందుము త్రాగుతాడని, యింతవాడు లోకంలో లేడని బుద్ధికి బృహస్పతని, దానకర్ణుడని నోటికివచ్చినట్టల్లా చెప్పవలెకాబోలు! ఏమిచేయను వసుదేవుడు గాడిదకాళ్ళు పట్టుకొన్నాడు. విశ్వామిత్రుడు కుక్కమాంసం తిన్నాడు. సమయం తప్పివస్తే స్వలాభం నిమిత్తం ఏంచేసినా చెయ్యాలి.

ఢ ఫేదారు పంతులుగారూ శెలవైంది. లోపల దయచెయ్యండి!

శంక—వస్తున్నా (అని బట్టలుసర్దుకొని లోనికివెళ్ళి) గుడ్ మార్నింగ్ సర్! (అని సలాముచేసి అధికారియెదుట నిలువబడును)

అధి—ఎవరు నీవు?

శంక—జేవరవారి తాబేదారిని ఆఫీసులో వుద్యోగస్తుడిని.

అ—ఏమిపనిమీద వచ్చినావు?

శంక—చిత్తము. ఏలినవారి దర్శనము చేసుకొనేందు కొచ్చినాను.

(అంతలో డఫేదారు మామిడిపండ్లబుట్ట తెచ్చి బల్లమీద పెట్టును.)

అధి—ఎవరు పంపించినారు ఈపండ్లు?

డఫేదారు—ఈ అయ్యగారే తెప్పించినారండి

అధి—ఏం! నీవే తెప్పించినావా?

శంక—చిత్తం చిత్తం నేనే దాఖలుచేసుకొన్నానండి

అధి—ఎక్కడివి ఈ మామిడిపండ్లు? ఏమిరకం?

శంక—ఆవి జహాంగీరుఘసందుపండ్లు మాచుట్టాలున్నారు పంపించినారు. అవి దేవరవారికి (తనలో) (కొని తెచ్చానంటే ఏంతగాదా వస్తుందో బాబూ ఏదో నోటికొచ్చినట్టు కూసివేసినాను)

అధి—ఓ! మీచుట్టాలకు తోటలున్నవా? అందులో ఇంకేమి రకములున్నవి.

శంక—(తనలో) ఏమేమిరకాలున్నవో నేనసలు యెరుగను. అయితే అయింది. యేదో అడ్డంగా కోతకోస్తాను. అధికారులదగ్గర మనిషి చకాపికీగావుంటేగాని పనికిరాడు (ప్రకాశముగా) ఇంకా మంచిమంచి యెక్కురకాల పండ్లున్నాయండి షాజహాను ఘసందు, నూర్జహాను ఘసందు, ఔరంగజేబ్ పసందు వున్నవి.

అధి—జహాంగీరు పసందువిన్నానుగాని, తక్కినపసందులెప్పుడు వినలేదు. ప్రపంచములో ఏతోటల్లోను యివివున్నట్లెరుగను. మీవాళ్ళ తోట్లోవుంటే ఆరకంపండ్లు కొన్నితప్పక పంపించండి.

శంక—(తనలో) దీనమ్మకడుపుకాల కొరివితో తలగోక్కున్నాను ఎరగనివాడని యెరగనట్టూరుకోకుండా కోతలుకోసి కొంప తీసికొన్నాను. కొన్నైనా తీసుకొద్దామంటే ఆరకంపండ్లు లోకంలో లేనేలేవట. నేతవ్వుకున్నగోతిలో నేనేపడ్డాను. ఈరకాలు గిరకాలు నాకు తెలియవు చిన్నప్పటినుంచి నాకు అలవాటైనరకాలు రెండుమూడున్నవి. బెంక పులుపుపసందు. తొక్కపులుపుపసందు. చింతకాయ పసందు మొదలైనవేగాని వీటి మొగమెఱుగను. ఏమనిచెప్పను. అధికారితో వీడు ఆవలిస్తే ప్రేవులు లెక్కపెడ్తాడు. ప్రమోషన్‌గాదుగాని కత్తెరబోనులో ప్రవేశించాను దేవుడా!

అధి—ఏమి! ఆలోచిస్తున్నావేమిటి?

శంక—చిత్తం చిత్తం ఏమిలేదండి తోటలునావికావు. పండ్లు యిస్తారో యివ్వరో! యేమో అని ఆలోచిస్తున్నానండి.

అధి—పోనీ! వాళ్ళివ్వకని తోస్తే నేను రూపాయిలిస్తాను కొని పట్టుకురా?

శంక—(తనలో) చచ్చానురా దేముడా! ఈదెబ్బతో! యిప్పుడేమి జవాబుచెప్పను ఈయనికి. (ప్రకాశముగా) మావాళ్ళు స్వంత యుపయోగానికేగాని అమ్మరండి.

అధి—అమ్మకపోతే రకానికి నాలుగుపండ్లు వూరికేపట్టుకురా?

శంక—చిత్తము! అలాగే తీసుకొస్తానండి!

అధి—నీవువచ్చిన పనేమిటి?

శంక—నాకుప్రమోషనై చాలాకాలమైనది ప్రమోషనిప్పించవలెను.

అధి—నీజీతమెంత?

శంక—రు 50 లు జీతం.

అధి—గణపతిరావు కెంతజీతము?

శంక—గణపతిరావుకు రు 50 లు.

అధి—కళ్యాణరావు కెంతజీతము?

శంక—కళ్యాణరావుకు రు 50 లేనండి.

అధి—మీముగ్గురలో సీనియరెవరు?

శంక—గణపతిరావుగారే సీనియరండి.

అధి—అయితే గణపతిరావుకే ముందుయివ్వవలసి వుంటుంది.

శంక—చిత్తము! చిత్తము! గణపతిరావుగారికే ముందుకావలెనండి గణపతిరావు ఆఫీసంతలోకి రత్నంవంటివాడు అతనికీ నాకూ సరిపడదుగాని, నిజంచెప్పవలసివచ్చినప్పుడు విరోధమైన సత్యంచెప్పక తప్పదు కలంపుచ్చుకుంటే శారదవలె వ్రాస్తాడు. ఆఫీసులోనున్న రికార్డులన్నీ ఆయనకు కంఠతఃవచ్చును. 50 యేండ్లనాటి రికార్డు అయినాఆయనకు తెలియందేమిలేదు. అంత అసిస్టుమ్యాన్ మరొకడుంటాడని నేనను

కోను. రూపాయంటే గుడ్డిగవ్వ. ఆయన యెంతఆనెస్టుమనిషంటే? సర్కారు బంట్రోతులచేత తన వుత్తరాలైనా పోస్టులో వేయించుకోడు తన స్వంత వుత్తరాలు సర్కారుకలం సర్కారుసిరాబుడ్డి పెట్టి యెప్పుడూ రాయడు. ఆఫీసర్లతో సర్క్యూటు వెళ్ళినప్పుడువిస్తరాకుముక్కైనా-సప్లయి పుచ్చుకోడు. అందరికంటె వొక డబ్బెక్కువిస్తాడు సరుకులకు.

అధి—అబ్బా అటువంటి ఆనెస్టుమ్యాను నెప్పుడు చూడలేదె? అయితే యిదివరకెందుకు ప్రమోషనైంది కాదతనికి?

శంక— వెనుకటి మేనేజరుగారికి గణపతిరావుగారికి పడదండీ! వారువైష్ణవులు వీరు మధ్వులు పంగనామాలకు బెండకాయకు లట్ పట్ వచ్చింది.

అధి—ఇతనిమీద లంచాలుపుచ్చుకొన్నట్లర్జీలువచ్చినవంటారే

శంక—అవన్ని కూడా మేనేజరు స్వయంగా యిప్పించినఅర్జీలే యింకా మేనేజరుదగ్గిరె మొత్తక గుణముండేది సం॥ రానికి వొక్కొక్క గుమస్తా వొక నెలజీతమియ్యవలసిందని బలవంతం పెట్టాడు. ఛీ! నేనివ్వను పో అని గణపతిరావు తిరస్కరించాడు అని మేనేజరుకోపము.

అధి—మంచిపనిచేశాడు. ఆలాయివ్వకూడదు. సరె నీవువెళ్ళు గణపతిరావు కిచ్చినతర్వాత నీపని ఆలోచిస్తాము.

శంక—చిత్తము! (అని సలాముచేసి యివతలకువచ్చి తనలో) గణపతిరావు కళ్యాణరావునుగురించి చెప్పాడు. నేను గణపతిరావును గురించికోశాను. ఇక నన్నుగురించి కళ్యాణరావు చెప్పాల. వాడుమా యలపక్కిరు. చూచిరమ్మంటె కాల్చి వస్తాడు. ఇంతకు నేను మామిడి పండ్ల ఆపదలోనుంచి తప్పించుకొని బయట పడితేగదా? మీదదేము డున్నాడు.

(అని నిష్క్రమించును.)

అధికారియిల్లు.

(అప్పుడు కళ్యాణరావు ప్రవేశించుచున్నాడు)

కళ్యాణ—(తనలో) సూక్ష్మములో మోక్షము సంపాదించినవాడే ప్రయోజకుండు. మామిడిపండ్లు బత్తాయిపండ్లు చక్కరకేళీ అరటిపండ్లు నూటికొకనాడైనా మనకు దొరకవు డబ్బుచేతిలోవుంటే నేను నాపెళ్ళాము బిడ్డలు చక్కగా తినకుండా మధ్య అధికారికిపెడితే యేమున్నది. అందుచేత ఒకడబ్బే ఖర్చుచేసి అధికారిని చూడడము మంచిది డబ్బుకి రెండు నిమ్మకాయలు వచ్చినవి. పైగా యిది నా సొంతపని కాదుగదా? నేను వెళ్ళి అధికారిదగ్గర శంకరరావును స్తోత్రము చెయ్యాలి. అందుకోసం పదిరూపాయలు ఖర్చుపెడతానా? గణపతిరావు శంకరరావు అంటె కొంచెము కలిగివున్న వాళ్లు కనుక ఖర్చుపెట్టగలిగినారు. నేనేమి ఖర్చుపెట్టగలను? ఈ రెండు నిమ్మకాయలతో కార్యమైతే అవుతుంది కాకపోతే కాకపోతుంది. శంకరరావును గురించి యేమిచెప్పను? నన్నుగురించి గణపతిరావు లంచాలు పుచ్చుకోనని చెప్పినాడు. శంకరరావు గణపతిరావును గురించి చెప్పేటప్పుడు తెలివిగలవాడు, వ్రాతగాడు, లెక్కగాడు అని చెప్పినాడు. శంకరరావును గురించి నేను ఏమిగాడని చెప్పను. ఆఫీసుకు పనికొచ్చేవాడు గాడు గోదావరిలో పడేస్తే యీతగాడు చీట్లాటలో పడేస్తె కోతగాడు. చెడుగుడీ ఆటలో మంచికూతగాడు. దొరగారి దగ్గర యీసంగతులు చెప్పే పనికిరావు గదా? పనికివచ్చేటందుకు యిప్పుడు కవిత్వం చెప్పాలి. యీకరంభూమి లేనివాడిని రాజాధిరాజని కొండముచ్చుంటివాడని మన్మథుడని కవీశ్వర్లు చెప్పినట్లు నేను మాశంకరరావును స్తోత్రము చెయ్యాలి. సరే మానుతుంది గనుకనా? పీడు గొప్పస్వామిలీ వాడని చెప్తాను. అడుగో? డఫేదారొస్తున్నాడు.

(అప్పుడు డఫేదారువచ్చును.)

డఫేదారు—ఏమండీ ? పంతులుగారూ మొన్న వందయిక్కి యినామువస్తే దర్శనమైందిగాదు.

కళ్యా—(తనలో) దర్శనమైతే రెండురూపాయలు దొబ్బడానికే గదా. (ప్రకాశముగా) అయ్యయ్యో ! నీకోసం రూపాయలుమూట గట్టుకొని కూర్చున్నానోయి. సమయానికి నీవు వచ్చావుకావు. అంతా పట్టుకొని పోయినారు రూపాయలు.

డఫే—మాఅదృష్టంలేదు మహారాజ్ ! నేను పదిసార్లు వచ్చాను మీకోసం. మీరు కనబడలేదు.

కళ్యా—అయ్యో ! నేనింట్లోలేనప్పుడొచ్చావు కాబోలు. ఈవేళ సాయంత్రమురా ? తప్పకుండాను నీది నీకిచ్చివేస్తాను. మీ మామూలు లెక్కడికిపోతుంది. మీపెట్టెలో సున్నట్టే.

డఫే—చిత్తము ! అనకవస్తాను. దొరగారి దర్శనం చేస్తారా యేమిటి ?

కళ్యా—అవును ఇది సమయమేనా.

డఫే—మంచిసమయమండి ? కులాసాగా వున్నారు దొరగారు మీకార్డు యివ్వండి ?

(కళ్యాణరావు కార్డిచ్చుచున్నాడు. డఫేదారు లోనికివెళ్ళి తిరిగివచ్చి)

డఫే—దయచెయ్యండయ్యా ! రమ్మన్నారు.

కళ్యా—సరే ! (అని వెళ్ళుచున్నాడు.)

(అప్పుడధికారి ప్రవేశించుచున్నాడు)

అధి—నీపేరేవరు ?

కళ్యా—(సలాంచేసి) నాపేరు కళ్యాణరావు (అని నిమ్మకాయ —చ్చును.)

అధి—(పుచ్చుకొని బల్లమీదపెట్టి)కూర్చుని ఎందుకొచ్చినావు?

కళ్యా—(కూర్చుండి) దర్శనము చేసివెళ్ళవలెనని వచ్చాను.

అధి—నీకేమికావలెను?

కళ్యా—ప్రమోషను కావలెను.

అధి—అందరు ప్రమోషను కావలెనంటె ఏలావస్తుంది.

కళ్యా—మామూసంగతులు మేను చెప్పుతుంటాము. దేవరవారిష్టమువచ్చినట్లు చేయవచ్చును.

అధి—యిప్పుడేమి ఖాళీల్లేవే.

కళ్యా—వచ్చినప్పుడే తమరు దయచేయించవచ్చును.

అధి—నీవు శంకరరావు సమానజీతంలో నున్నారుగదా? మీ యిద్దరిలో యెవరికియ్యవలసినది?

కళ్యా—దేవరవారియిష్టము యెవరికిచ్చినాసరె! శంకరరావు చాలాపెద్దకుటుంబమువాడు.

అధి—ఏమిగొప్పకుటుంబము కొంచెముచెప్పు.

కళ్యా—(తనలో) వప్పులో అడుగేశాను. ఏమని చెప్పను? ఇప్పుడాలోచిస్తే కార్యంలేదు (అని ప్రకాశముగా) ఈయనతాతహైదరాబాదుయిలాకా తహసీలుదారీ చేసినాడు అతనిముత్తాత మైసూరిలొకాలో యేదోవొక గొప్పవుద్యోగం చేశాడు.

అధి—అబ్బా అంతగొప్పవుద్యోగాలా? తండ్రేమిచేశాడు?

కళ్యా—తండ్రి గొప్పవుద్యోగములు చెయ్యలేదుగాని పెద్దమనిషిఅని పేరుపడ్డాడు అతనికుటుంబం గొప్పేకాకుండా శంకరరావు చాలాపెద్దమనిషి. ఈవూళ్లో ఆతనంటే అందరికిగౌరవం మనడిపార్టుమెంటులో అట్లాంటివాడు లేడని చెప్పవచ్చును. దస్తూరీ ముత్యాలఫలాలు. అతనికున్నవోపిక మరొకరికిలేదు ఆఫీసులో జబ్బుచేసి పనిచేయలేని

వాళ్ళు వస్తుంటా రాయన చేస్తారు. ఆయన పిల్లలుకలవాడుకాడాను. ఆయనకు ప్రమోషనిస్తే మేమంతా సంతోషిస్తాము.

అధి—ఇదివరకు నాకు తెలియలేదు. ఇంతమంచివాడా శంకర రావు? సరే! మీరు వెళ్ళండి!

కళ్యా—సెలవు చిత్తము (అని సలాముచేసి వెళ్ళుచున్నాడు)

(తనలో) శంకరరావుతాత ముత్తాత హైదరబాదులో మైసూరులో గొప్పపుద్యోగాలు చేసినట్లు కోశేశాను. ఈయనగారు నేనులేనప్పుడీ సంగతి అతని నడుగుతారేమో? వాడు మరోలాగు చెప్పినట్లయితే వాడికొంపానాకొంపామునుగుతుంది. నేను చెప్పిన పాటేపాడమని ముందుగావెళ్ళి వాడితోచెప్పాలి.

(అని నిష్క్రమించును)

(కాగితము చేతబుచ్చుకొని చదువుచు అప్పుడు అధికారి ప్రవేశించుచున్నాడు.)

అధి—(తనలో) ఈఅర్జీ చిత్రముగానున్నది. చదివిచూచెదను.

"మహారాజశ్రీ భోగాపురం జిల్లాకలెక్టరువారి సముఖమునకు

భోగాపురం కాపురస్థులైన ఆకాశరామన్న, పిడుగుఅగ్నిహోత్రుడు యేకస్థులై వ్రాయించి దాఖలుచేసుకొన్న అర్జీవిన్నపములు—

ఏలినవారు మీమనస్సువలెనె అందరి మనస్సూస్వచ్ఛమైనదనుకొని మోసపోతున్నారు. మీకచ్చేరీలో మీ తాబేదారులుగనుండే ముగ్గురుమనుష్యులు చిత్రమైన సంఘమొకటి యేర్పరచినారు. దానిపేరు పరస్పర స్తోత్రసమాజము ఆముగ్గురెవరనగా? గణపతిరావు, శంకరరావు, కళ్యాణరావు గణపతిరావు కళ్యాణరావును పొగడడం కళ్యాణరావు శంకరరావును పొగడడం, శంకరరావు గణపతిరావును పొగడడం వారి యేర్పాటు ఈయేర్పాటు మీవద్దకు వచ్చినప్పుడు ముఖ్యంగా జరుప

పలుసిందని వారి నిర్ణయం ఇది మిమ్ముల్ని బుట్టలో పెట్టవలెనని చేసిన ఆలోచన. వీళ్ళుముగ్గురు లంచగొండులు వీళ్ళుముగ్గురు అబద్ధాల కోరులు వీళ్ళుముగ్గురు తుంటరులు ఈసంగతులు పూర్తిగా తెలిసి పెను కటి అధికారులు వీళ్ళకు ప్రమోషను లేకుండా చేసినారు వీళ్లుమాట్లాడు తుంటే నొసలు వెక్కిరిస్తుంటవి వీరు రావణ కుంభకర్ణాదుల వంటి వారు. మనసులో ఆలోచించేది వకటి నోటితో చెప్పేది వకటి. చేతితో చేసేదివకటి. వీళ్ళవంటిమోసగాండ్రు ప్రపంచములో పుట్ట బోరు వీళ్ళమాటలు కొలినవారు నమ్మవద్దు. నమ్మితే బొందలో బడిపోవడమే మీరు క్రొత్తప్రభువులగుటచేత వీళ్ళసంగతులు తెలియక మోసపోవచ్చును. ఇదివరకే వీళ్ళుమీదగ్గర నాటకమారంభించినట్లు కనపడుచున్నది. కళ్యాణరావంతటివాడు లేడని గణపతిరావు, గణపతి రావంతవాడు లేడని శంకరరావు, శంకరరావంతవాడు లేడని కళ్యాణ రావు వొకరినొకరు స్తోత్రముచేసుకుంటూ తమయందు మంచియభి ప్రాయము అధికార్లకు కలుగవలెనని ప్రయత్నముచేస్తున్నారు. ఈ సంగతులు దేవరవారికి తెలియచేయుటకు న్యాయమైనా యీఅర్జీ వ్రాసినాము. ఇందులో అబద్ధము లేదు. ఇందుకు భూమిసాక్షి, ఆకాశం సాక్షి, అగ్నిహోత్రుడుసాక్షి, వాయుదేవుడుసాక్షి.

అంగీరసనామ సం॥ర } ఆకాశ రామన్నవ్రాలు
మాఖశు॥ పున్నమి } పిడుగు అగ్నిహోత్రుడువ్రాలు"

ఈఅర్జీ నిజమైయుండునా ? ఈఅర్జీదారులు వ్రాసినట్లు వీళ్ళు ముగ్గురు నావద్దకువచ్చినారు. ఒకరినొకరు స్తోత్రముచేసుకున్నారు. అంత వరకు ఈఅర్జీలోని సంగతులునిజమే. వీళ్ళుతెలివికలవాళ్లు మర్యాద స్తులైతే పెనకటిఅధికారులు వీళ్ళకు ప్రమోషనియ్యకపోవడానికి కారణ మేమి ? అందుచేత వీళ్ళు తుంటరులన్నమాట నిజము. ఆకాశరామన్న అర్జీ లొకప్పుడు నమ్మవలసేవుంటవి. ఎల్లప్పుడు వాటిని తోసివేయ

కూడదు. నిజమైనసంగతులే ప్రత్యక్షంగా రుజువుచేయలేక ఆకాశ రామన్న అర్జీలు వ్రాస్తారు. ఈముగ్గురు నన్ను నిశ్చయంగా మోసం చేయవలెననే సంకల్పించుకొన్నారు అందుచేత వీళ్ళ తెగులు గట్టిగా కుదర్చవలె వీళ్ళకుబుద్ధిచెప్తాను, ఈదెబ్బతో మరెవరూ యిటువంటి పన్నాగం పన్నకుండా చేస్తాను డఫేదార్ ! శంకరరావునుపిలు.

డఫేదార్లు—(వెళ్ళి పిలుచుకొని వచ్చుచున్నాడు)

శంకర—(ప్రవేశించి) సలాము !

అధి—ఏమి? మిరాచట్టాలతోటలో సూర్జహానుపసందు, ఔరంగ జేబుపసందు మొదలగుమామిడిపండ్లున్నాయన్నావుకాదా ? ఏవీపండ్లు రాలేదేమి ? నాకు ఖరీదుకేకావలె. ఉచితముగా అక్కరలేదు.

శంక—చిత్తము. మావాళ్ళతోటలో ఉన్నాయనుకొన్నాను కాని, లేవండి !

అధి—అనుకొన్నావా ! నీవు. నీవుఅనుకోలేదు. నాలుగు కల్ల బొల్లిమాటలు నాదగ్గర చెప్పి నన్ను బుట్టలో బెట్టనాలోచించినావు. ఎల్లకాలము నీవబద్ధాలు చెప్పినందుకు నీకెప్పుడు ప్రమోషనియ్యకూడదని యిందులో వ్రాసివేస్తాను.

శంక—దేవరవారు క్షమించవలెను. పొరపాటొచ్చింది.

అధి—బుద్ధిపూర్వకముగా చేసినదానికి క్షమించడము లేదు. వెళ్ళు అవతలికి.

శంక—(వెళ్ళుచు తనలో) అనుభవించక తప్పదు.

అధి—డఫేదార ! గణపతిరావునుపిలు.

డఫే—(వెళ్ళి గణపతిరావుతో ప్రవేశించుచున్నాడు)

గణ—సలామండీ.

అధి—నీకు సాలుకు రు 1500 వస్తావని నాతో చెప్పినావు. నీకుఖర్చులెక్కువ, రాబడితక్కువగానున్నట్లు కనబడుతుంది. ఆకారణముచేత నీకు ప్రమోషనియ్యనక్కరలేదు.

గణ—ఎంత చెట్టుకంత గాలివున్నది. ఖర్చు లేకేమండి మహా ప్రభో !

అధి—నీమాట నేను నమ్మను. నీకు ప్రమోషను లేదనరేకదా! నీవు వెనక నాతో చెప్పిన మాటలనుబట్టి నీదగ్గర పదివేలో పదిహేను వేలో వున్నట్లు నాకు కనుపడుతుంది. అది వడ్డీకి తప్పకుండా తిప్పుతుంటావునీవు. కాబట్టి నీకు సాలుకు రు 40 లు ఇన్‌కంటాక్సు వేస్తున్నాను నీవు అప్పీలుచేసుకున్నా కార్యంలేదు. లండన్‌కు వెళ్ళినా కార్యంలేదు. చచ్చినట్లిచ్చుకో ?

గణ—నేనిచ్చుకోలేనండి నేను పేదవాడినేగాని భాగ్యవంతుడనుకాను.

అధి—డఫేదార్ ! ఇతనిని అవతలికి పంపించు. కళ్యాణరావుకు కూడ ప్రమోషనివ్వాలని చెప్పు ? మీవాళ్ళగురికి వీలైతే జీతంతగ్గించడానికి ప్రయత్నంచేస్తానుగాని ప్రమోషన్ యివ్వను. వెళ్ళిపో ? గణపతిరావు వెళ్లుచున్నాడు.

గణ—(తనలో) చేసిన ప్రయత్నమంతా వ్యర్థమై పోయెను.

కడపటిరంగము

(అప్పుడుగణపతిరావు, కళ్యాణరావు, శంకరరావు ప్రవేశించుచున్నారు)

గణ—కళ్యాణరావు ! చేసినప్రయత్నమంతా వ్యర్థమైపోయింది

కళ్యా—మనపాపము మననే కొట్టిందదిరాబాబూ !

శంక—పాపము బద్దలు కాకమానదు.

గణ—తానొకటి తలిస్తే దైవమొకటి తలచినాడు.

కళ్యా—దురాశ దుఃఖములచేటన్నమాట మనయందు సార్థకమైనది.

శంక—ఇటువంటి సమాజము లెప్పుడు స్థాపించవద్దని అధికారి బుద్ధిచెప్పాడు. ఇకమీదైనా బుద్ధిగలిగివుందాము.

గణ — మనము చెప్పిన అబద్ధాలికి భగవంతుడు మాకుశిక్షవిధిం చవలసిందే! రండి! వెళ్ళుదాము. (వెళ్ళుదురు)

గౌరవసంపాదనము

(పేరయ్య వీరయ్య ప్రవేశించుచున్నారు.)

పేర — ఓరే వీరయ్యా! నీవు చెప్పినమాట నిజమే మనకిప్పుడు గడ్డిపరకంత గౌరవమైనాలేదు. కూర్చున్న గుడ్డిముండలేవదు. ఇందుకు మనమేమి చేయవలసియున్నది. మనము గౌరవము సంపాదింపవలయును దీనికేముపాయము.

వీర — గౌరవమేలాగున సంపాదించగలవురా కూరగాయలా బజారులోనికివెళ్ళి వీసెమూడణాలుచొప్పున కొని తెచ్చుటకు పొట్టచించి కంచుకాగడా పుచ్చుకొని వెతకినా యెక్కడ అక్షరమ్ముక్క లేదు. పోనీ డబ్బైనా ఉన్నదేమో అనుకుంటే అమ్మాబువ్వ అయ్యాబువ్వ లాగున్నాము. ఏపూటకాపూటే పోయిమీదికి కుండెక్కదు. మనకున్న భూములు రుద్రభూములేకాని వేరేలేవు.

పేర — డబ్బు, భూములు చదువు లేకపోతేమాత్రము మనిషికి గౌరవమురాదా యేమిటి. మహారాజుగారు పంచభక్ష్య పరమాన్నములు తింటే నేను గంజిమున్నమే తింటాను మనకుండవలసిన గౌరవము మన కుండదా పేదవాళ్ళకు గౌరవముండదా యేమిటి.

వీర — ఉండకేమి డబ్బులేకపోయినా భూమి లేకపోయినా విద్య లేకపోయినా నడతమంచిదిగానుంటే కావలసినంత గౌరముంటుంది. నీకు నాకు ఆ నడతేది నీవు పేచీలకు పెదబాబువు. నాలుగుడబ్బు లెవరైనా అప్పిస్తె ఎగవేస్తె సూత్రమే ఆలోచిస్తావు. అడిగితే చిరాకు అడగకపోతే పరాకు. తప్పుసాక్ష్యమంటే మనకు నదురు బెదురు లేదు. ఈలాటివాళ్ళకు గౌరవము రమ్మంటే యెక్కడనుంచి వస్తుంది.

పేర—మనలను మనమే చులకనచేసుకుంటే పైవాళ్ళు చులకన చెయ్యరా ఈగుణాలు మనకే యుండడమేమి పెద్దమనుష్యులని పేర్లు పెట్టుకొన్నవారికి చాలామందికున్నాయి. మనమేమో వట్టి వెధవలమని పైవాళ్ళందరు గొప్పవాళ్ళని నీకు పట్టి వెర్రిభ్రాంతిపట్టినది. కుండలోకి కూరైన కొలువులోని గొప్పతనమైనా తెచ్చుకుంటేకాని రాదన్నాడు గొప్పతనము మనము తెచ్చుకోవాలి.

వీర—కుండలోకి కూర తెచ్చుకోలేనివాడవు నీవు గొప్పతన మెల్లా తెచ్చుకుంటావో చెప్పు విని సంతోషిస్తాను. నాకుగూడా గొప్ప వాడిని కావాలని అందల మెక్కవలెనని యున్నది నీధర్మమా అని గొప్పవాడినగుతాను. ఆకాస్తాచెప్పి శెయ్యి.

పేర—అయితే చెపుతాను విను. ఈరోజులలో ప్రతిచోట మీటింగులు మీటింగులని చెప్పుకొనుచున్నారు విన్నావా?

వీర—అహా! వింటున్నాను. మన గ్రామములో జరిగేవాటిని చూస్తున్నాను.

పేర—ఆమీటింగులలోకి మనము వెళ్ళి సభలో పెద్దవారికో నము వేసినది పెద్దఅరుగులా వుంటుంది, దాని పేరేదో అంటారయ్యా! పేటుపారమో యేదో అంటారు. దానిమీదకు వెళ్ళి అక్కడ మనము కూర్చోవాలి. దానితో కొంత గౌరవము వస్తుంది.

వీర—ఓరి నీయింటపటారుగాను ఆపేటుపారముమీదే మనము కూర్చోడం ఆసభలోకి వెళ్ళి క్రిందైనా కూర్చోడానికి తాహతులేని ముండాకొడుకులకు మనము పేటుపార మేమిటిరా. ఈమాసిపోయిన కుళ్ళుగుడ్డలు నీవు వెళ్ళావంటే నీకు దగ్గరసా వస్తే కలరా వస్తుందని జుట్టుపట్టుకొని బరబర లాగి వీధిలో కూర్చో పెడతారు. నక్కయెక్కడ దేవలోక మెక్కడరా,

వేర — ఓరి నుట్టితలపీనుగా. ఇందుచేతనే నీవు నామరూపాలు లేకుండా ద్రేపివై పడియున్నావు సభలోకి యీలాగే వెడతాననుకున్నావూ. చాకలిపకీరుగాడు చల్లగావుంటే మనకు బట్టలకు లోపమట్రా. వెఱ్ఱివెదవవై జరీపాగాలు ఆల్పాకాకోట్లు పట్టుకండువాలు తెల్లసుల్లు తాసులు చాలాడబ్బు కర్చుపెట్టి కొనుక్కున్నవాళ్ళున్నారంటావా లేరంటావా వాళ్ళు మనకోసము కొంటున్నారుకాని వాళ్ళకోసమట్రా నాయనా పకీరుగాడికి నాలుగు బట్టలకు నాలుగుడబ్బులు మనవిగావని పారేశి నామంటే పట్టాభిషేకానికి తీసుకొనువెళ్లే మహారాజుకొడుకులా గుండమట్రా ఆ దిరేను వేసికొని కళ్ళకి సుర్మాపెట్టి బూడ్సుజోడొకటి తొడిగికొని, ఎక్కడైనా కొంచెము లవండరు ముట్టెత్తి జేబురుమాలు మీదవేసికొని యెడమచేతితో వాసన చూచుకుంటూ, కుడిచేతితో యరువుబెత్తము చేత బట్టుకొని తాంబూలం ఝుణాయిస్తూ రోడ్డంట టక టక నడిచివెళ్ళి ప్లేటుఫారముమీద కూర్చుంటే, అడిగేనిర్భాగ్యుడెవడురా. మనలనుజూచి యేజమీందారో యేహైకోర్టువకీలో యేయీనాందార్లో అని దిగాలబడి చూచేవాళ్ళేకాని నోరెత్తెమొగాడెవడురా అక్కడికొచ్చే పెద్దమనుష్యులలో సుప్రాతిక మంది మనవలెనే మేడి పండువాటము పెద్దమనుష్యులే.

వీర — ఓరి ముండావాడా! నీవు గండెలుతీసిన బంటవురా. ఇంత ధైర్యముమాత్రము నాకు రాదు.

వేర — ఓరి జైనుపీనుగా నీవు వట్టి అప్రయోజకుడవురా, నీకు చేతకాకపోతే నీకుకూడా పకీరుగాడితో చెప్పి బట్టలిప్పిస్తాను, నావెనకాలే వుండు, ఈమాత్రము ధైర్యము లేకపోతే ప్రపంచకములో బ్రతకడ మెల్లాగురా, వెనక నేను పెద్దాపురంలోనుండి మెట్టదారిని వెళ్ళుచు రాజానగరంలో రాత్రి ఆగవలసివచ్చి పోలీసుయిన స్పెక్టరునని చెప్పి వూళ్ళోవాళ్ళనందరిని గడగడలాడించి పాలుపెరుగులు కాయించి తెప్పించి

జమాయించి విందు చేయించినాను, నేనే గాకుండా నాతో వచ్చిన నలుగురు భావనకుంతలకు గూడ సుష్టుకర్తుగా భోజనం పెట్టించినాను, ఇలాటిదాల్లో మనధైర్య మసాధారణమైనదే

వీర—అబ్బో నీప్రజ్ఞెక్కడ నీవెక్కడ నీకిఅఖండచండాలయోగ్యాలశక్తి రానాయినా నీశక్తిసామర్థ్యాలు మూకుమ్మంటే వస్తాయా.

పేర—కావుగనుకనే వచ్చినట్లు నేనుచెప్పినట్లువిను.

వీర—వింటానునరేకాని నీవు చెప్పిన పన్నాగము మావూళ్లో మీాటింగైనప్పుడు పనికివస్తుంది. రైలుఖర్చులుపెట్టుకొని పడవఖర్చులు పెట్టుకొని మనము వెళ్ళగలమా. దానికయ్యేఖర్చు మనదగ్గరుంటే పది రోజులు మనయింట్లో బియ్యము వస్తాయి.

పేర—వెళ్ళగలిగినప్పుడు చేతిలో డబ్బున్నప్పుడు వెడదాము డబ్బులేనప్పుడు మానివేదాము.

వీర—మానివేస్తే మనకు గౌరవమెల్లావస్తుంది.

పేర—దానికూడా కొన్ని వుపాయాలాలోచించి పెట్టినాను. మీాకుతెలెనేను మట్టితలపెద్దమ్మ ననుకున్నావా యేమిటి ఏమీాటింగుకయినా మనము వెళ్ళలేనపుడు మూడుపావలాలడబ్బులు మనవికావంటే సరి

వీర—మూడుపావలాల డబ్బులేమిటి నాకర్థంకావడములేదు. మూడుపావలాల టోపీయొకటి కొత్తది కొనుక్కొని వచ్చినట్లున్నావు.

పేర—ఈరోజున క్రొత్తగా కొనుక్కురాలేదు. మొదటినుంచి మనదగ్గరనున్నదే. నీకు తెలియదుగనుక చెపుతున్నాను విను. మూడు పావలాల డబ్బులుఖర్చుచేసి ఒకటెలిగ్రాము కొట్టవలెను. ఆటెలిగ్రాములో "సభకు నేను రాలేనందుకు చాలవిచారించుచున్నాను. సభకు జయము కలుగవలెను" అనేమాటలు తప్పక యుండితీరవలెను.

వీర—అలాగు టెలిగ్రాఫిస్తే గొప్పతనమెల్లావస్తుంది.

వేర — అందులోనే యున్నదిరా నాయనా గొప్పతనము. ఆమీటింగులో చెక్రటేరి అంటూ ఒకడుంటాడు. లేకపోతే భోజనాలన్నీ పెట్టేటందుకు పెత్తందార్లుంటారు. దానిపేరు చనుమానసంఘమూ యేదో అంటార్రా. వాళ్ళెవళ్ళో లేచి సభలో నిలుచుండి సభకు రాలేకపోయితిమని చెప్పి టెలిగ్రాపులిచ్చినవాళ్ళ పేర్లు వుత్తరాలు వ్రాసినవాళ్ళ పేర్లు చదువుతారు. మహాభాగ్యంలో తర్వాతాలసమయంలాగ ఆసమయంలో టెలిగ్రాపిస్తేనూ మనపేరుగూడ అక్కడుదహరిస్తారు. అదే గౌరవపం పాదన. గౌరవమంటే వేరేవున్నదా. వేయిమందిసభలో మనపేరు చెప్పుకోవడమే గౌరవము.

వీర — బాగానేయున్నది కాని మనదగ్గర ఆ మూడుపావలాల డబ్బులుగూడ లేకపోతే గతేమిటా అని సందేహము తోస్తుంది.

వేర — "శతకోటిదరిద్రాణాం అనంతకోట్యుపాయాః" అని యొకసామెతున్నది. శతకోటిదరిద్రాలకు అనంతకోటి ఉపాయాలుంటాయని దీనిఅర్థం. దీనికూడా ఒక గత్యంతరము నేను కల్పించకలను. కాలముకాని కాలములో బుట్టినానుకాని వెయ్యేళ్ళనుముందు పుట్టినట్టయితే కుడిచేత్తో యెడమచేత ధర్మశాస్త్రములు వ్రాసిపారేసి నీవంటి వెట్టివెధవలచేత కాళ్ళు పట్టించుకోపోదునా. దానికేమిగాని ప్రస్తుతం చెపుతాను. నీదగ్గర మూడుపావలాల డబ్బులు సమయానికి లేకపోతే నాలుగుడబ్బుల కవరుకొని ఒకవుత్తరం పారేయించు మనఖజానాలో అంతమాత్రం దమ్ముకూడా హాజరు లేకపోతే ఆముక్కలే ఒకకార్డుమీద వ్రాసిపారేసి పోస్టులో జారీచేయించు. దానిలడాఖా అంతా అర్థణా బిళ్ళతో జమాయించిపోతుంది.

వీర — భేష్. బాగావుందిరా నీవుపాయం. కాని యీమీటింగులకు రాక టెలిగ్రాపులు ఉత్తరాలు వేసేవాళ్ళంతా మనసాహాధ్యాయులే అంటావాయేమిటి.

పేర—అబ్బె బ్బే. కాదు కాదు కొందరు గొప్పవాళ్ళు నిజముగా రావడానికి వీలులేక టెలిగ్రాపులు ఉత్తరాలు వేస్తారు. వాళ్ళు మన సహాధ్యాయులుకారు. కాని అందులో మనగోత్రకులుకూడా కొందరుంటారు. ఇందువల్లనే వేరు రావాలనే మహానుభావులు. అప్పుడు మనముకూడా ఒక టెలిగ్రాఫో ఉత్తరమో పారేస్తేమా వాళ్ళతోపాటు మనకుకూడా తిలోదకాలు ముడతాయి.

వీర—నీవు చెప్పిన యుపాయాలన్నీ నా తలకు బాగా నచ్చినాయి. ఇకముందునుంచి అల్లాచేస్తాను. కాని ఒక చిన్న చిక్కు సంభవించేటట్టు కనబడుచున్నది. నీవుగాని నేనుగాని స్వయముగా వ్రాయలేము. ఎవరినైనా వ్రాసిపెట్టమనవలసి వస్తుంది.

పేర—వసే తంటాయేమిటి వ్రాసిపెట్టేవాళ్ళంతా మన గుమస్తాలనుకో. మనము జమీందారులము దొరలము.

వీర—నీవు అఘటనఘటనా సమర్థుడవు నీవు యేలాగువడితే ఆలాగు సమర్థించగలవు. ఇప్పుడు కల్లపురములో వంట్లబ్రాహ్మణుల మహాసభ జరుగుచున్నది. అక్కడికిరాలేమని ఒక టెలిగ్రాము పారేద్దాముర. (అని యిద్దరు నిష్క్రమించుచున్నారు)

ల బ ల బ లు

మొదటిరంగము

కంసాలిదుకాణము

(నాగలింగమను కంసాలియు జోగన్నయను బ్రాహ్మణుడును ప్రవేశించు చున్నారు)

నాగ—జోగన్న బావగారూ మీయభిప్రాయమేమిటో పూర్తిగా సెలవివ్వండి, నీళ్ళునములుచు మాట్లాడితే అర్థముగాకుండా యున్నది.

జోగ—అభిప్రాయాని కేముస్నది నన్నొక యింటివాణ్ణి జేసి రక్షించవలసినదని నాకోర్కె. మహారాజువు వంశము నిలబెట్టిన ప్రఖ్యాతి ప్రతిష్ట నీకుంటుంది.

నాగ—(తనలో) సన్యాసిగాడి పెళ్ళికి పుట్టుదగ్గిరనుంచి మెరువ న్నట్టు నీకన్నీ మెరువే గావలెను. ఇల్లూ వాకలీ పొలముపుట్రా, నగా నట్రా యేమీలేదు. పైగా చుట్టం పక్కం యెవరూలేరు. పట్టుమంటే పది కొత్తడబ్బులులేవు నీదగ్గిర. నీకుపిల్ల నెవరిస్తారయ్యా యేమిచూచి యిస్తారు. డబ్బుచూసిమ్మంటావా రూపంజూసిమ్మంటావా చదువు చూసిమ్మంటావా పరువు ప్రతిష్టజూసిమ్మంటావా, వయెస్సుజూస్తే 60 సంవత్సరములు దాటినవి. అందంజూస్తే అష్టావక్రుడవు. పగలుజూస్తే రాత్రి కల్లోకొస్తావు. నీకు పెళ్ళేంటయ్యా నామొకం. నిన్ను పెళ్ళి చేసుకునేపిల్ల జిల్లేడుపువ్వులు పూజచేసుకుని వుండాలి. నీచెట్టపడితే పడేసుఖం యింతా అంతాగాదు. పిల్ల రెండుచేతులా భోంచేస్తుంది.

జోగ—ఇల్లూ వాకిలీ పొలము పుట్రా చదువు సంధ్యా వున్న వాడికి యెవరుబడితే వాళ్ళే పిలిచిపిల్లనిస్తారు. వారికి వరదక్షిణిచ్చి కాళ్ళు గడిగి పెళ్ళిచేస్తారు. నావంటివాడికి పిల్లనిచ్చేవాళ్ళుండరు గాని వాడికేటి. ప్రయోజకత్వంవుంటే నీకాళ్ళూ నీకడుపులూ పట్టుగోవడమెందుకు యేప్రజ్ఞేనావుంటే నిన్నాశ్రయించడమెందుకు పెళ్ళిగానివాడికి పెళ్ళి జేసితేనేగొప్ప. నూరుకల్లలాడి వొక యిల్లు నిలుపమన్నాడు. అందుచేత నాకీవుపకారం చేసి యీకీర్తి మీరుపొందాలి.

నాగ—నిజమే పాపం నీవంటివాడికి పెళ్ళిచేసితే పుణ్యముంటుం దన్నమాట నిజమే. కాని చూసిచూసి నీకెవడిస్తాడయ్యాపిల్లని. అబద్ధ మాడినా నమ్మాలిగదా 'సీతారామా భ్యాన్నమః' అంటేనేగాని నీకు పూట గడవదు. చస్తేదర్మకర్మసి తగలెయ్యాలిగాని వేరే దిక్కులేదు. అటుంటికి పెళ్ళాంనుంచడకి నాలుగుమూలాయాలు మనవర్తివచ్చే ఆధార మెనాలేదు.

జోగ—నీవు చెప్పే మాటలన్నీ నిజమే బావా. ఈలాటివాడికి పెండ్లిచేస్తేనే నీబుద్ధికుశలత కనపడాల నీవు యుగంధరుడంటివాడవు తలుచుకున్నావంటే కార్యం నెగ్గించి తీర్తావు. ఇవి చేతులుగావు కాళ్ళు. ఆమూహూర్తమున్యాళ్ళువేయించి నన్నొకయింటివాణ్ని చెయ్యి గంగయ్య శాస్త్రులుదగ్గిర పన్నెండేళ్ళ పిల్ల గుఱ్ఱంలావుంది. పెళ్ళయిన ఆరుమాసాలికల్లా కాపరానికొస్తుంది పదిమందిచేత చందావేయించినాసరే యేలా చేయించినాసరే ఆపిల్లను నాకిప్పిస్తావా నీకెంతో పుణ్యముంటుంది. మహారాజువు కొడుకుడితే నీపేరెట్టుకుంటాను. యింకో జన్మానికి నీయింట్లో కుక్కనై పుడతాను

నాగ—గంగయ్యశాస్త్రులు కూతుళ్ళందర్నీ వెయ్యేసిరూపాయిలకమ్ముకున్నాడు ఆయన కింతవరకారుగురు కూతుళ్ళు పుట్టినారు. ఆయన తర్చుగా పెళ్ళాన్ని పిలిచి "వోసీనీబొజ్జ వరహాలబొజ్జే అందరి నీకూతుళ్ళనే కంటున్నావు యింకా పదిమందికూతుళ్ళను కంటివా మనిల్లంతా బంగారమైపోతుంది" అంటూవుంటాడు. యిదివరకు నలుగురు కూతుళ్ళనునాలుగువేలకమ్మినేసేడు. ఒకల్లు డెరవై యేళ్ళవాడు, రెండవవాడు వంటబ్రాహ్మడు మూడవవాడు నీళ్ళబ్రాహ్మడు నాలవవవాడు పీనుగుల మోతగాడు. నీదగ్గిర వెయ్యిరూపాయిలుంటే వాడిపిల్లవస్తుంది చందా వెయ్యిరూపాయి లెవడిస్తాడు. నూరూ యేభై గనుకనా?

జోగ—ఈగ్రామంమీద వెయ్యిరూపాయిలు చందాగావూ? పెళ్ళికార్యమంటే పుణ్యంగనుక చాలామందిస్తారు.

నాగ—వెయ్యిరూపాయిలుకాదుకదా నూరైనా చందాగావు. చదువుకుంటున్నవాడు కుర్రవాడూ అయితే యెవళ్ళయినా చందాయిస్తారు. నీవు చేసేది సూయాకారం తిరగటి గుంట్లులాగ మొహాన్నిండా మసూచికంమచ్చలు నువ్వు ముప్పయ్యోపడ్డెల్లి నలభయ్యోపడొచ్చింది నీపెళ్ళికి చందాలంటే నలుగురూ మొహాంమీదుమ్మేస్తారు.

జోగ—అయితేయిహా ఆశవదలుకోవలసిందే? ఘోటకబ్రహ్మచారినై యిలాచావవలసిందే?

నాగ—మిమ్మల్ని చూస్తే జాలేస్తుందయ్యా పాపం మీదగ్గర యేమాస్తుందండి ఒక యకరంభూమైనా వుందా.

జోగ—వున్న భూమి శ్మశానభూమె అంతకన్నేంలేదు. నాదగ్గర ముష్టెత్తుకొనె రాగిచెంబుంది.

నాగ—సరే ఆబియ్యంకండువాలో పోసి మూటకట్టుకొని ఆరాగిచెంబిలాపారెయ్యవయ్యా.

జోగ—రేపటినుంచి ముష్టెలాయెత్తుకోను.

నాగ—ముష్టిమానేసెయ్యి రూపాయిచెల్లగా రూపాయి నేనిస్తూవుంటాను. అదిపెట్టి వరుకులుకొని తింటూవుండు. బట్టకు రెండబ్బులిస్తే చాకల్ది పడిదికిస్తుంది తెల్లనిబట్టలు కట్టుకుంటూవుండు. ఆపయిని కార్యంచెప్తాను.

జోగ—చిత్తం చిత్తం అలాగే యిదుగో చెంబు.

(అని యిచ్చుచున్నాడు.)

ఇద్దరు నిష్క్రమించుచున్నారు.

---

౩ వ రంగము

(నాగలింగము గంగయ్యశాస్త్రి ప్రవేశించుచున్నారు.)

నాగ—ఏమండి గంగయ్యశాస్త్రిల్లుగారూ యిల్లాదయచేశారు బహుకాలదర్శనం. ఊరకరారుమహాత్ములన్నట్టు యేదోపని యుంటేనే కాని తమరు దయచెయ్యరు.

గంగ—ఊరికినే వచ్చాను కొంచెము పనియుండి వుదుచేరినా నొకటి చేసిపెట్టాలి.

నాగ—మాపిన్నమ్మగారికేనా యేమిటి ?

గంగ—ఆ మీపిన్నమ్మగారికే. ఎనిమిది కాసులనాను రెండు కాసుల జిగినీ చెయ్యాలి. 15 రోజులలోపుగా మాకియ్యాలి. మా వాళ్ళు పెళ్ళికి వెడతారు అప్పటికి తయారుకావాలి.

నాగ—అలాగే తమ సెల వైల్లాగయితే ఆలాగే, 15 రోజు లెందుకండీ వారమునాటికి తయారుచేస్తాను. లగ్గసరికూడా తగ్గింది. ఇప్పుడు చేతిలో పనులాట్టేలేవు. ఒక బంగారు గోవతాడుమాత్రముంది. అదిచాలమట్టుకు తయారై పోయింది.

గంగ—గోవతాడెవరిది ? ఈరోజులలో గోవతాడు పెట్టుకునే వాళ్ళట్టే కనబడరే.

నాగ—ఉన్నాడొక మహానుభావుడు. అయనపేరు చెప్పడానికి వల్లకాదు.

గంగ—చెపితేనుయ్యా ! ఇదేమి దొంగతనమా? లంజతనమా?

నాగ—దొంగతనముకాదు, లంజెతనముకాదు. కాని తన పేరె వరికి చెప్పవద్దని నాచేత వట్టుపెట్టించుకొన్నాడు. నిష్కారణంగా ఆయన పేరు మీతోజెప్పి పెట్టుకొన్నవొట్టు తప్పడమెందుకు ?

గంగ—ఒంటిమీాద పెట్టుకునేవస్తువుగదా దీనికింత రహస్య మెందుకు? మెడని పెట్టుకుంటే పదిమందీచూడరా అప్పుడురహస్యము బయలుపడదా.

నాగ—బయలుబడుతుంది పడకేమి. కాని ఆయన యీవస్తువ రహస్యంగా రాత్రులు పెట్టుకుని అప్పుడే తీసివేస్తాడట. తానుచూచు కొని ఆనందించవలెనని ఆయన సంకల్పముకాని ఒకరుచూచి ఆనందించ వలెనని ఆయన సంకల్పముకాదు.

గంగ—ఈయనచూస్తే విపరీతపుమనిషిలాగున్నాడు.

నాగ—అవును. విపరీతపుమనిషే. ఈయనసంగతి చెప్తాను విను. ఈయనదగ్గర సొమ్ముమూలుగుతూంది ఈయన అంగవస్త్రమే కాని కట్టుకోడు. ముష్టికూడే కానితినడు. పెండ్లిచేసికొనే వయసున్నది కాని పెండ్లిచేసికోనడు. పోనీ ఉన్నసొమ్ము వడ్డీకే నాయియ్యడు. ఇంత పిసినిగొట్టుమనిషిని పృథివిపుట్టిన తరువాత యెప్పుడూ చూడలేదు.

గంగ—నిజంగానేనా ? ఇల్లాంటిమనిషుంటాడటయ్యా! పెళ్ళి చేసికొనకపోవడం ఖర్మమేమి.

నాగ—పెళ్ళిచేసుకుంటే పిల్లనిచ్చేవాళ్ళు వెయ్యో రెండువేలో తెమ్మంటారు. పెళ్ళాన్నిపోషించాలి. అందుక్రింద సొమ్ముఖర్చయి పోతుందికదా కర్చుగిట్టకను పెళ్ళిచేసికొనకపోవడం.

గంగ—(బుగ్గమీద వేలువేసుకొని) లోకములో యిల్లాంటి మనుష్యులయినాయుంటారు. వీడెవడో పెత్తేనేవాను లాగున్నాడు పోనీ వడ్డీకైనా యెందుకిచ్చుకోడుడబ్బు. అందువల్ల వృద్ధవుతుందిగా.

నాగ—వడ్డీకిస్తే పైవాళ్లు భాగ్యవంతులనుకొని పోతారొకటి. రెండవది యెగపెడతారనుభయం.

గంగ—ఈమహానుభావుడు పేరేమిటో ఒక్కమాటు చెవినేస్తూ బాబూ. చెప్పకపోతేవట్టు. నన్ను చంపుకున్నట్టేసరి.

నాగ—బాబుగారూ నామనవిని నన్నొదిలేస్తురూ. యెగ మోటం పెట్టకండి.

గంగ—యెగమోటమేమిలేదు, గిగమోటమేమిలేదు. చెప్పక తప్పదు. చెప్పకపోతే నీవు కాశీలో గోహత్య చేసినట్టే.

నాగ—మాచెడ్డచిక్కు తెచ్చిపెట్టారేనాకు. మీరూ నేనూ ఒకకుటుంబములోవాళ్ళులాగున్నాము గనుక చెప్తా వినండు ఎక్కడా చెప్పనని చేతిలో చెయి వెయ్యండి !

గంగ—ఎక్కడా చెప్పను (అని చేతిలో జేయివేయును.)

నాగ—(రహస్యముగా) ఆబ్రాహ్మణుడు నాప్రాణాని కుసూరుమంటాడు సుమండీ తెలిస్తేను. చెప్పకండెక్కడా. మనవూళ్లో ముష్టెత్తుకుంటూన్నాడే జోగన్న నే బ్రాహ్మణుడు ఆయనే యీయన.

గంగ—(ఆశ్చర్యముతో) ఏమిటీజోగన్నా. వాడిదగ్గరడబ్బుందీ. ఏమాట్లలోయి ముపీ. ఈసంగతి మనిషైనవాడు నమ్మడు.

నాగ—నమ్మరని నాకూ తెలుసును. మీరందరు నమ్మకపోవాలనే ఆయనకోరికకూడాను.

గంగ—ఏమాత్రము డబ్బుందలాయితేను.

నాగ—డబ్బుగిబ్బు నేనెఱుగను ఇరవయి బంగారపు కణికెలున్నవి కణికెవక్కంటికి 50 తులాలు. తులం యిరువయిరూపాయిలు కాడికి చూచుకున్నా కణికె వెయ్యిరూపాయలుఖరీదు. కణికెలన్నీ 20 వేలకిమ్మత్తున్నవి అంతామేలిమిబంగారం. నోవతాడుకోసమిచ్చినబంగారముకూడా అందులో ఒకకణికెలోముక్క.

గంగ—ఎక్కడిదీ బంగారము వీడికి? సంపాదించాడా? ఈ డబ్బుండీ యీముష్టిఖర్మ మెందుకు వీడికి?

నాగ—సంపాదించడానికి వాడితరమా వాడితాతతరమా? పూర్వము వెంటపాడులో వీడు కాపురమున్నపుడు బంగారపు కణికెలతో నిండియున్న బిందెలు పాదుకోసం తవ్వుతూంటే రెండుదొరికినవి తెలిస్తే సర్కారు సొమ్ము పుచ్చుకుంటారని ఆయింటివాళ్లు సొమ్ము తెమ్మంటారని భయముచేత ఆబిందెలు అర్థరాత్రివేళ పట్టుకుని మెల్లాగో మనగ్రామములో వచ్చిపడ్డాడు. పూర్వపుముష్టి మానివేస్తే అనుమానపడతారని యింకా ముష్టియెత్తుచున్నాడు.

గంగ—అత్యాశ్చర్యముగా నున్నది ఇంతకూ వాడదృష్టము బాగావుంది. అయితే పెళ్ళిచేసుకోమని చెప్పరాదామీరు.

నాగ—చెబుతూన్నా నండీ యెన్ని చెప్పినా వినదు. డబ్బుఖర్చు వుతుందని బెంగ.

గంగ—ఎల్లాగైనా మొదలువిరిచి చేయిస్తూ నాదగ్గర 12 ఏళ్ళ పిల్లయున్నది. ఏడాదినాటికి కాపురానికివస్తుంది నేసస్తాను.

నాగ—వినదుగాని చెప్పిచూస్తాను. అయితే మీరు కన్యాదానం చేస్తారా యేమిటి.

గంగ—లేని ముండాకొడుకుని నేను కన్యాదానం చేయగలనూ.

నాగ—అయితే యేమియ్యాలంటారు మీరు.

గంగ—మహారాజువు నాగలింగంచూడూ నీకూ నాకూవున్న స్నేహాన్నిపట్టి రెండు కణికెలు నామొగాన్ని పారవేయించు పిల్లనిస్తాను. నీవెల్లాచెబితే అల్లావింటాడు.

నాగ—అమ్మో రెండుకణికెలే. ఒక్క కణికెకన్న యెక్కువియ్యడు. దానికె నల్లమేకను బలిపెట్టాలి.

గంగ—బాబువుగాదూ నామనవి విను. అతనిని ఒక యింటి వాడిని చేసినవాడవు అవుతావు. నాదరిద్రము తీర్చినవాడవు అవుతావు అల్లాచేయించు.

నాగ—సరే, ఎల్లాగో చెప్పి యిప్పిస్తాను. రేపురాత్రిరండి. కణికలుచ్చుకుని తాంబూలాలిప్పిస్తాను.

గంగ—సరేబాబూ. నీ మూలాన్ని తేల్తాను. రేపురాత్రి వస్తాను. (అనియిద్దరు నిష్క్రమింతురు.)

3 వ రంగము

(గంగయ్యాయు పేరుభట్టను బ్రాహ్మణుడు ప్రవేశించుచున్నారు)

పేరు—గంగయ్యగారూ! మీపిల్లవాన్ని జోగన్నకిచ్చి వివాహాము చేస్తారు షేమిటి?

గంగ—అవునండి ఆలాగే నిశ్చయించినాము.

పేరు—బాగుంది సంతోషించాను. (అప మెల్లగా) ఇచ్చిపుచ్చుకోడాల్లో యేమైనా బాగానరళిగావుందా మీ మూడోపిల్లదానికి రెండోపిల్లదానికి బేరం నాద్వారానే ఫయిసలయింది గనుక అడుగుతూన్నాను. నీకు పది రూపాయలొచ్చాయంటే నాకు పరమానందం.

గంగ—ఇచ్చిపుచ్చుకోడాలేమిలేవు. కాకపోయినా యివ్వడానికి జోగన్న దగ్గర యేముంది మీ రెఱుగరూ.

పేరు—పైకి యేమీ లేనివాడులాగే యున్నాడు. కాని యే పుట్టలో ఏపామున్నదో యెవరికి తెలుసును? అందుకుచేత నేమైనయిచ్చాడేమో యని కాకపోయినా యిదివరకు నలుగురు పిల్లలను యేదో విధంగా రొక్కానికే యిచ్చివేశారు గనుక ఈపిల్లని మాత్రము ఇవ్వరా యని నాకు నమ్మకం.

గంగ—అటువంటిదేమీ లేదు. ఇదివరకు పెద్దపిల్లలు నలుగిరి దగ్గర డబ్బుపుచ్చుకొని నరమాంసవిక్రయము చేసినానని నాకు మనస్సులో కించ వున్నది. అందువలన మాపెద్దలకు మంచిగతులు కలగాలని పెళ్ళికొడుక్కి కాళ్ళుకడిగి కన్యాదానము చేయవలెననినా యుద్దేశ్యము.

పేరు—ఓహో మంచిపని చేస్తూన్నారు కాని అంత కన్యాదానం చేయదలచుకొన్నప్పుడు ఈముష్టి నిర్భాగ్యుడ కియ్యకపోతే కాస్త నోష్నదకాలున్న చోట యియ్యరాదూ.

గంగ—అనోష్నదకాలున్న వాళ్ళకి పిల్ల నెవరుపడితే వారిస్తారు

పెండ్లి చేసికొగలవాడికి పిల్లనిస్తే అందులో విశేషమేమున్నది పొలము పుత్ర యిల్లు వాకిలి యున్న వాడి కేపరుపడితేవారు పిల్లనిస్తారు. అదేమీ లేనివాడికి ముష్టివాడికి పిల్లనెవరుయిస్తారు. అటువంటివాడికిస్తే నే కన్యాదానఫలం దక్కుతుంది అన్నమున్నవాడికి అన్నము పెట్టినా యిల్లున్నవాడికి గృహదానం చేసినా అగ్రహారీకుడికి భూదానం చేసినా ఫలమేమైనా దక్కుతుందా అలాగే కన్యాదానంకూడా కన్యయెక్కడ దొరకక పెండ్లిచేసుకుందు కాధారం లేకుండా వున్నవాడికిస్తేనే ఫలం దక్కుతుంది.

వీరు—ఈమోసరు కన్యాదాన మెక్కడాచూడలేదు. చాలా మంచిదే అయితే వివాహ మెప్పుడు.

గంగ—వివాహము! రేపురాత్రి మీరుతప్పకుండా దయ చెయ్యవలె.

వీరు—చిత్తము తప్పకుండా వస్తాను. సెలవు పుచ్చుకుంటాను (తనలో) ఈదొంగముండాకొడుకున కింత పరమార్థము కూడానా? ఏభూమో పుత్రో అమ్మించో తాకట్టుపెట్టించో నంచో నంచిన్నరో గుంజుకుంటాడుకాని వీడు కన్యాదానంచేస్తాడా! అది వీడబ్బతరాన్ని తాతతరాన్ని కూడా లేదు.

(ఇద్దరునిష్క్రమించుచున్నారు.)

గంగయ్యగారియింట్లో పెండ్లిపందిరి.

(పెండ్లికొడుకు పెండ్లికూతురు గంగయ్య నాగలింగం కొందరు బ్రాహ్మణులు కొందరు ముత్తయిదులు ప్రవేశించుచున్నారు.)

బ్రాహ్మణుడు—గంగయ్యగారూ! పెండ్లి చాలా శోభస్కరంగా అయింది. కన్యాదానఫలం తమకు దక్కింది. ఆ బ్రాహ్మణుని యొకయింటివాడిని చేశారు.

గంగ—ఇంతసొగైదై పక్కృపఅల్లాగున్నది మనప్రయత్న మేమున్నది నాకు తెలపియ్యండి. అప్పగింతలకు వెళ్ళాలి (అని లోపలకు వెళ్లును)

(అప్పుడు ముత్తయిదు లప్పగింతలపాటలు పాడుచున్నారు)

ఒకముత్తయిదు—(మెల్లగా) కణికెలీ మాసొమ్ము కాంతమీా సొమ్మా. (అని చమత్కారముగా పాడును)

నాగ—(మెల్లగా) లబలబలు మీాసొమ్ము లక్ష్మి మాసొమ్ము.

గంగ—అదివిని (తనలో) లబలబలు మీాసొమ్ము లక్ష్మిమా సొమ్ము. అని నాగలింగం పాడుచున్నాడు. ఆశ్చర్యముగా నున్నదే. నాకు పెండ్లికొడుకుచేత యిప్పించిన రెండు కణికెలు నిజమైన బంగారు కణికెలగునా కాదా. నాకప్పగింతలు తోచడములేదు. (పురోహితుని చూచి) శాస్త్రిలుగారూ త్వరగా అప్పగింతలు కానియ్యండీ. నాకేమో కాని కడుపు నొప్పిగానున్నది. కూర్చోలేకుండా వున్నాను. పెండ్లికొడుకుచేతిలో అప్పగించాము చాలదూ. తక్కినవాళ్ళ చేతిలో నెందుకు.

(వెళ్ళును)

రంగము

కంసాలి మల్లేశలింగము యిల్లు

(రంగయ్య మల్లేశలింగం ప్రవేశించుచున్నారు.)

మల్లే—అదిగో బావగారు దయచెయ్యండి. ఏమిపనిమీాదదయ చేశారు.

గంగ—(రహస్యముగా) బావా! రెండు బంగారపు కణికెలు తెచ్చాను. ఇది మేలిమి అగునో కాదో తెగ్గొట్టిచూడాలి.

మల్లే—ఏవీ చూడనివ్వండి. (అనిపుచ్చుకొని) బావగారుపైకి మేలిమిలాగే వుంది. తెగ్గొట్టిచూస్తాను. (అని తెగకొట్టి) బావగారూ శ్రేష్ఠమైన రాగయ్య ఉద్ధరిణీలు చేయించుకో వచ్చునిరూరు.

గంగ—(గుండెబాదుకొని) అయ్యో అయ్యో కొంప మునిగి పోయింది. కొంపమునిగిపోయిందోయిబాబూ నాగలింగంగాడు నాకొంపతీశాడురా నాయనా ? మాణిక్యమువంటి పిల్లని తీసికొనివెళ్ళి ముష్టి ముండాకొడుకు పొట్టని పెట్టేనురా తండ్రీ. పన్నెండేండ్లు పెంచాను. ఎవడికమ్ముకున్నా పన్నెండువంద లిస్తురు. ఎంతదండుగ ఎంతదండుగ ఎంతడబ్బుపోయింది. ఎంతమోసము చేశారు. హరిహరీ.

మల్లే—కన్యదాన మిస్తున్నా ననవటయ్యో నాతోటి.

గంగ—పరువుకోసము ఏడిశాను. ఇక నాకేమిగతి. నేచచ్చిపోతాను. నేను బ్రతకను. అయ్యో పన్నెండువందలు పన్నెండువందలు.

మల్లె—నోరుమూసుకొనిపూరుకో. కన్యాదానఫలమైనాదక్కుతుంది. ఊరుకో వెళ్ళు.

(అని యిద్దరు నిష్క్రమింతురు)

పూ ల మ ం ది ర ము

అప్పులపాలెం జిల్లాలోనున్న సంగ్రామపుర నివాసులయిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు గావజ్జనము సకలవిషయములలోను పరస్పరాభివృద్ధి చేసుకొనుటకై యొక సమాజము స్థాపించుకొని ఆసమాజము నిమిత్తమై యొక మందిరము కట్టింప దలచుకొని యీక్రింది నిబంధలను కట్టుబాటులను నేర్పరచుకొనిరి.

1 ఈసమాజముపేరు పరస్పరాభివృద్ధి సమాజము.

2 ఈసమాజముయొక్క ముఖ్యోద్దేశ్యము లేవనగా. ఒకరికి తెలియని సంగతులుమరొకరివల్ల వినుట పుక్కిటిపురాణములు స్వేచ్ఛగా జెప్పుకొనుట; యిండ్లదగ్గర జెప్పుకొనుటకు మాట్లాడుకొనుటకువీల్లు

లేనివంగతుల సిచ్చట జెప్పుకొనుట సమస్తవిధములయిన యాటలు అనగా—జూదము, పులిజూదము, చెడుగుడి, ఉప్పట్లు, కోకుట్లు, చీట్లాట, పోట్లాట, కాట్లాట, చదరంగము, వైకుంఠపాళి, దశావతారి మొదలగునవన్నియు స్వేచ్ఛగా నాడుకొనుట.

3 పుస్తకములుగాని, వార్తాపత్రికలుగాని యీ సమాజము నిమిత్తమెప్పుడును తెప్పించగూడదు, ఈ సమాజముయొక్క యేసభికు డయినా తనయింటివద్దకు పత్రికలు తెప్పించుకొన్నాడని సమాజము వారికి తెలిసినపక్షమున వెంటనే యాసభికుడు సమాజమునుండి తీసి వేయబడవలసినది. మఱియు యేసభికుడయినను పొరబాటు చేతగాని బుద్ధిపూర్వకమునగాని, నిబంధనలను యెరిగిగాని యెరుగకగాని యే పుస్తకమునుగాని వార్తాపత్రికనుగాని చేతిలోగాని జేబులోగాని పట్టుకొని సమాజమందిరము లోనికిగాని, ఆవరణలోనికిగాని, స్వయముగాగాని యితరుల ప్రోత్సాహమునగాని ప్రవేశించిన పక్షమునగాని ప్రవేశింప దలచిన పక్షమునగాని వెంటనే సదరు పుస్తకముగాని పత్రికగాని సమాజపు బంట్రోతులు వాని చేతిలోనుండి లాగివేసి వాని నవతలకు గెంటివేయవలసినది. ఈనిబంధనయున్న నిబంధనలలోనికి ముఖ్యమైనది. కాబట్టి యీ నిబంధన నెవ్వరతిక్రమించగూడదు.

4 ఈ మందిరముగాని, దీని యావరణలో దేనిభాగముగాని, పగలుగాని, రాత్రిగాని ఉదయముగాని, సాయంకాలముగాని, మధ్యాహ్నముగాని, మరియేవేళనప్పుడుగాని మీటింగు చేయుటకై యెప్పుడు నివ్వబడగూడదు. మీటింగులవల్ల కలుగు నష్టములన్నిటిని యీ సమాజము వారు లోకానుభవసిద్ధులగుటచే గ్రహించి యీ నిబంధనమును లోకోపకారార్థమై యేర్పరచినారు గావున యీ నిబంధన నతిక్రమించిన వారు సమాజమునుండి వెలివేయబడుదురు.

5 ఈ సమాజములోని సభికులకు నెల 1కి రు 0—1—9½ లు యిచ్చుకొనునట్లు చందా యేర్పరుపబడినది. ఈ చందాధనము చీట్లపేకలు కొనుటకు చదరంగబలములో విరిగిపోయినవాటిని తీసివేసి క్రొత్తవి దెప్పించుకొనుటకు అవసరమునుబట్టి అనవసరపు ఖర్చులు చేయుటకు ఆకాశరామన్న అర్జీలనిచ్చుటకు దొంగవుత్తరములు వ్రాయించుటకు నుపయోగించుకొనబడవలసినదేగాని మరొక విషయమై వినియోగింప బడగూడదు.

6 ఇందులో జేరినట్టి ప్రతిమెంబరు చుట్టకాల్చ తీరవలయును. ఒకవేళ నిదివరకు అలవాటు లేనివాడైనను నిందులో చేరిన వారము దినములలోపల నేర్చుకొనవలయును చుట్టకాల్చుట నేర్పుటకై యిద్దరు చుట్టల యుపాధ్యాయు లేర్పరుపబడినారు. ఈ యుపాధ్యాయుల బోధన వల్లగాని, స్వబుద్ధివల్లగాని, క్రొత్తగా జేరిన సభికుడు వారము దినముల లోపులో చుట్టత్రాగుట నేర్చుకోజాలని పక్షమున అతడు సమాజములో నుండి తీసివేయబడును. చందాధనములో మిగిలిన సొమ్మంతయు చుట్టలు త్రాగువారెక్కడబడితే నక్కడ యుమ్మివేసికొనుటకై పీకి దానులు కావలసియుండునుగనుక వాట్ల నిమిత్తమై ఖర్చుపెట్టబడును.

బూతులు మేము మాటలాడమని బింకములు బలుకునట్టివారును భోగముమేళములు చూడమనినట్టివారును యీసమాజములో నెన్నడు సభికులుగా జేర్చుకొనబడజాలరు. ఏలననగా అప్పుడప్పుడు యిక్కడ మేజువాణీలు జరిగించుకొనుట ఈమాటలామాటలననుండ నోటికివచ్చిన మాటలెల్ల నాడుకొనుట యీ సమాజముయొక్క ముఖ్యోద్దేశములు కాబట్టి సంగ్రామపురమునందు కాపురమున్న జనులందరు యీ సమాజ ములో తప్పక చేరవలయునని కోరబడుచున్నారు. ఇంతకంటె ఆనంద కరమైన సమాజము యింతకంటె నుపయోగకరమైన సమాజము స్థాపించుటకు ప్రపంచములో వీలులేదుగనుక యిది తమపాలిటి భాగ్య

దేవతే యని తలంచుకొని దీనిని పురజనులందరు అభివృద్ధిచేయుదురు గాక.

ఈ క్రిందసామెత లెందుకు బుట్టినవో మనసామాజికులు పూర్ణముగా విమర్శించుచు చక్కని యుపన్యాసములుకూడ నిచ్చుచుందురు.

తంజావూరుసత్రము, చిదంబర రహస్యము. ఏదో కుంభకోణము, చెన్నపట్నపుటోపి, కంచిగరుడసేవ, తిరుపతిమంగలిక్షౌరము, నెల్లూరి నెరజాణలు, రావూరి రసికులు, బందరు బడాయి, తణుకభిమానము, ఐతంపూడి యుద్యోగము, గోలకొండకబుర్లు తణుకోయి మాచవరం, పుల్లాయవేమవరం, గునుపూడిజంగాలు, పెంటపాడు బైరాగులు, కొండవీటి సీమచేంతాడు, కొల్లేటిదోమలు, కలువాయి వేదాంతము, శ్రీరంగనీతులు, ఒంగోలుజంగాలు, ద్వారపూడి పచ్చిపాళ్ళు, చిక్కవోలుతూము, కూచిపూడి భాగవతులు, ఆడ మళయాళము, బల్లిపాడు పెళ్ళిళ్ళు.

కావలెను "సభ్యులు" కావలెను!

...చూచి భయపడేవారు, దౌర్భాగ్యపు పనులు చేయుచు జాబుగా తిరిగేవారు, తానె గొప్పవాడనని భావించుకొని గర్వముచే విఱ్ఱవీగుచు తలకుదగని వేషములువేసి జనులను మోసముచేయుచు ధనమార్జించువారు, దొంగభక్తులు మాయమాటలుచెప్పి నీతిమాలిన పనులుజేయుచు ఉదరపోషణ గావించుకొనువారు, ధర్మోపన్యాసముల జేయుచు న్యాయమార్గమున సంచరించువారువలె కనబడుచు అవినీతి కార్యంబుల చేయత్వరపడువారు; త్రాగుబోతులై, జూదరులై, ముండల

నుంచుకొని రోగములచే తీసుకొనుచు పెద్దవేషములువేసి, ఉద్యోగస్థుల మనియు, జమీందార్లమనియు, షాహుకారులమనియు భాగ్యవంతుల మనియు గర్వపడు మహానుభావులు ఇతరులపై లేనిపోని నేరములు గల్పించి కలహించువారు, ఒకరికొకరికి తంత్రములుపన్ని కలహమును గల్పించువారు, ఏయవనీతిపనియైన జేసి కుటుంబమును బోషించుకొన్న వారలునని చెప్పి యితరులచే నట్టి యవనీతిపనుల జేయించుచు వారివలన గౌరవము నొందుచుండువారు ఎల్లప్పుడు తిట్లయందే కాలముగడుపు వారు, పిత్రార్జితమైన భూములనమ్మి ముండలకు సొమ్ము కొల్లబెట్టి తినతిండిలేక కడుపు చేతబట్టుకొని దేశాంతరముల కేగినవారు తుంటరు లైన గొప్పవారితోను జమీందారులతోను గలసి తుంటరిపనులచేయు టయే గొప్పయని సమ్మవర్తించు పండితులు, గావలెను ధనముగలవారి పజ్జచేరి వారిహృదయము నాకర్షించి తుదకువారిని భిక్షకులుగాచేయుచు పండితులమని చెప్పుకొను తుంటరులును కావలయును. ఎల్లప్పుడువీధు లవెంబడి సంచరించుచు చూచినస్త్రీని మోహించుగొప్పవారు, గొప్ప వారికి కోపమువచ్చునేమోయను భయముచేత వారుచెప్పినదుష్కా ర్యముల నాచరించు రొద్దివారు కావలయును. అబద్ధములాడి దొంగప త్రములవ్రాసి, దొంగసాక్ష్యములిచ్చి సంసారము పోషించుకొనుచున్న వృద్ధులు యౌవనులు గావలయును తాగకూడదనియు, తుంటరిపనులు చేయగూడదనియు, నీతిగా నుండవలెననియు జెప్పు సన్మార్గులు తుంట రులు నీచులు త్రాగుబోతులు కన్నగాండ్రు, ముండల ముఠాకోరులు నైన బియ్యేలు ఎంయేలు, న్యాయవాదులు కావలయును. ఇట్టివారు దేశమును బాగుచేయువారు కావున వీరినిమానసమాజములో జేర్చుకొని వీరికి తగిన బహుమానములనిచ్చి సత్కరించుచుందుము. త్రాగుబోతు లైన కవులకు నుద్యోగస్థులకు వారి వారికి తగిన మరియాదల చేయుచు ఆదరింతుము. ఇట్టివారినిపోషించుటకై పదికోట్లరూపాయలు మూలధన

ముతో సమాజము బయలుదేరతీసినాము. ఈసమాజమువారు లోకములోగల లోటులనవరించి దేశమును క్షేమకరమైనదిగా జేయుదురుగావున నందరు తమపిల్లలనుబుద్ధిలేకపాడై పోయేవారిని యీసమాజములో జేర్చి బాగుచేయవలయునని కోరబడుచున్నారు మేము కేవలములోకము సుద్ధరింపవలయుననియే ఈసమాజమును స్థాపించుచున్నాముగాని స్వలాభము కోరిగాదు ఇందుచదువుకొన్నవారును న్యాయవాదులును, ఉద్యోగస్థులున్నారు. జమీందారులున్నారు భాగ్యవంతులున్నారు కావున చేరేవారు సంశయింపబనిలేదు. త్రాగుడు, జూదము, తుంటరితనము బాగుచేయుటకుముఖ్యమైనవి గనుక గొప్పవారిలో ననేకులు ఎట్టిపనుల చాచరించుచుండుటవలనను, ఈసమాజముకు మంచిపరువువచ్చుననే యాశతో దీనిని స్థాపించినాము గనుక తప్పక చేరవలయును బాలురుచేరేయెడల ఈసమాజములో చేసెడు తుంటరిపనులుమాని యింటిలోనుండి కాటికికాళ్ళుజాపుకొన్న ముసలి తలిదండ్రులుగాని పోషకులుగానీ యేమైనా అంటారేమో అన్నభయమక్కరలేదు. వారికి యెంతమాత్రమును తెలియదుసరిగదా. ఇందులోనున్న పండితులు పాండిత్యము నేర్పి కవులు కవిత్వము నేర్పి మహారాజులు బిరుదులిచ్చి ధనికులు కొలువులు పతకముల బహుమానముచేసి బంపుదురు గావున విభూతి పిండికట్లు ధరించి మునుపటికన్న డాబుగా తిరగవచ్చును కావున నందరును తప్పక చేరి యీ సమాజమువారి యుద్యమునకు ప్రోత్సాహము కలుగుజేయుదురుగాక! మా సమాజమునుజూచి యెవరేమనుకొన్నను లక్ష్యపెట్టక యెల్లప్పుడు సాగేటట్టు ఏర్పాటు చేసినాము గనుక పోవునేమోయని భయపడనక్కరలేదు.

, ఇందు త్రాగుబోతు లున్నారనిగాని తుంటరులున్నారనిగాని యెవరును చెప్పకో గూడదని మేముఅందరకు తెలియజేసినాము కావున సమాజములో చేరేవారికిరహస్యముబయలుపడునేమోయను భయము

క్కరలేదు దరఖాస్తులు పంపువారు మా క్రిందిచిరునామాకు పేర పంపవలయును. ఇందు ముఖ్యముగా డాబుగా వేషములువేసి లోపల లోపల త్రాగి, తుంటరిపనులు చేయుటయందు, ఆశక్తిగలిగి చరించే మహానుభావులనే చేర్చుకొందుము కాని అవకతవక ప్రసంగములు చేయుచు ముక్కుసూటిగా నడచుచున్నామనే వెఱ్ఱిబాగులవారిని జేర్చుకొనమని యిందుమూలముగా దెలియజేయుచున్నాము.

అప్పాలపాలెం జిల్లా సంగ్రామపురం	ఇట్లు, బడాయి బాపన్న.

ఏ జం ట్ల త మా షా లు

(వెంకటశాస్త్రులు వీరన్న ప్రవేశము)

వెంకట—ఏమోయి వీరన్న ! పనిమీద వచ్చినావా ఏమిటి?

వీరన్న—చిత్తమండి తమరేం నలా శెబుతారోఅని యవ్వారం మనిము శెయ్యడానికొచ్చామండి.

వెంకట—ఆవ్యవహారమేమిటి ?

వీరన్న—ఏవుందండి మా పెదెంకన గాడెవారమే.

వెంకట—దాని కింతాలోచ నెందుకోయి. వాడు చచ్చినట్లు లొంగుతాడు. మొన్ననునేను చెప్పినట్టు చెయ్యి తప్పకుండా డిక్రీ అయితీరుతుంది నీకేమి భయములేదు నేను వెనకాలుండి కథంతా నడిపిస్తానుకాదూ.

వీరన్న—అమ్మబాబో అంతపని శెయ్యడమే నాగుండి లుండ బట్టవుండి. కోర్టోరు పెమాణకం శెయ్యమంటే నోరు తడబడదూ అంత

పనిచెయ్యడానికి నాకిష్టం లేదుమండి మరో మార్గం సూదురూ. ఆణ్ణి పిలిచి మందలించుమండి. ఆడికేసుదరికి నేనెళ్ళాను. కనకనా, ఆడు నా శేలోకి రాడానికి.

వెంక—చూడు నీవు వెర్రిబాగులమనిషివి నేను నీకు లాభము వచ్చేపని చెప్పినా చెయ్యనంటావేమిటోయి. నీకంతగా భయముంటే నాపేర వ్రాస్తుపరుచెయ్యి. మనబుచ్చావధానులుగారు, వ్యాఘ్రేశ్వర చయనులుగారు సాక్షి వ్రాళ్ళు చేస్తామన్నారు రామసోమయాజులుగారు నోటువ్రాసి దానిమీద వెంకన్న నిశానిపెట్టి తప్పక కోర్టులో సాక్ష్య మిస్తానన్నారు. అంతా సిద్ధమైయుందికదా. ఇక నీకేమిభయము?

వీరన్న—ఏంభయ మంటారేంటి నాకాళ్ళు గజగజ లాడు తున్నాయి. ఆణ్ణి తిక్కొట్టి అంతసొమ్ముచ్చుకుంటే నేనింక ముందు కొత్తానా! మీాకేం మీారు బాగానే యుంటారు. అంతబద్ధమాడి, ఆడికొంప తీత్తే దేముడు సన్నూరుకుంటాడా బాబు. మీారు బ్యామ్మలు కన్క పాపాలంటవుకుండాని యేంజేసినా శెత్తారు అంతపనే.

వెంక—చూడు నీకిష్టములేకపోతే వాడిని యేడిపించి తిరిగి యిచ్చివేయవచ్చును. నీవు సొమ్ముపుచ్చుకోనేవద్దు కాని నోటు సృష్టించి కంప్లయింటు చేసినావంటే వాడికి భయముంటుందోయి. దుర్మార్గుల నేమిజేసినా పాపం లేదన్నాడు నీవు భయపడకు రేపు నేను వెళ్ళి సోమయాజులుగారిచేత మూడువందలకు సృష్టినోటు వ్రాయించి కంప్ల యింటునిమిత్తం రాజమహేంద్రవరము పట్టుకువెడతాను నేను మొన్నను వెళ్ళినప్పుడు లంబోదరరావు పంతులుగారితో అంతా ఆలోచించి నాను, ఆయన డిక్రీఅవుటకు అభ్యంతరములేదన్నాడు. వారి తీరుబడి రోజులుకూడానట. తప్పకుండా వ్రాయించితీసుకరమ్మని సలహా యిచ్చి

నారు. గనుక నీవు మారుమాట చెప్పకు. నీవు బోనెక్కవలసిన అవసరమే యుండదుతే అంతా మేమేచేస్తాము. నాయకా వున్నాననిపిద్దూ.

వీరన్న—(నవ్వి) ఎంతకేనా తగినోరయ్యా. అప్పుడే ప్లీడరు గారితో ఆలోచించారూ ఏంటీ అగిటై మనకి శిక్షు లేదుకందా తగోత ఆడిసొమ్మోడికిత్తాం కాదూ. అందులో దోసాలున్నాయా!

వెంక—ఏదోషమూ లేదోయి. భయపడకు అనలు దుర్మార్గులను ఏవిధంగానైనా చెరపమని శాస్త్రాలు చెవుతున్నాయి నీకేమి భయములేదు. కానియ్యమన్నావా?

వీరన్న—మీాశిత్తం.

వెంక—అటైతే సాక్షులనిమిత్తం నలభై రూపాయలు కావాలి ప్లీడరుగారిఫీజు తర్వాత ఇయ్యవచ్చునులే.

వీరన్న—ఇప్పుడు ఖర్చేందా? డబ్బుఖరుచుపెట్టాలా యేంటి?

వెంక—ఖర్చుపెట్టకపోదే సాక్షులువస్తారా. అవుతేమిలే. యీ సొమ్మంతా మళ్ళీతిరిగి మనకొస్తుంది భయములేదు. జంకుతావేమిటి చూడు ఇకముందు నీపేరుచెప్పితే గజగజలాడుతూ వుంటాడు.

వీరన్న—కాని మళ్ళీ మనకొస్తుంది కందా అటైతే భయం లేదు. చూడండి చాత్తులుగారూ మీామాట నమ్మానుచుమండి నాకు మాటరాకూడదు. మరి మీాచిత్తం మద్దాలబోశేశి ఆయిాదికొత్తేని చోమ్మిత్తాను. పీడరుగారు నాకేమీా భయములేదని చెప్పారుకందా.

వెంక—ఓయి వెఱ్ఱివాడా నీకు మాటరానిస్తానా వాడిపొగరడ చాలని కాని మరొకటికాదు. పొద్దోయింది ఇకనీవుపో. నేనుభోజనం చేసి మీాయింటికివచ్చి అంతా మాట్లాడుతాను.

వీరన్న—నాకు మాటరాకుండా శెయ్యండి బాబు. నేపోతాను.

వెంక—సరే వెళ్ళు. (అని తనలో) మళ్ళీ యిదోకొన్నాళ్ళు నడుస్తుంది ప్రస్తుతం నలభైరూపాయలు చేతిలో పడతాయికదా. సాక్షులకు యిరువయిరూపాయలు పోయినా మనకుయిరువయిరూపాయ లుంటాయి ప్లీడరుగారితో (నోటు డిక్రీతాలూకు సొమ్ములో పుచ్చు కొనేపద్ధతిని) యిదివరకే మాటాడినాము. కాని భగవంతుడున్నాడు. ఏదో యింత దొరకకపోవునా ? ఆ పరమాత్ముడు భుక్తిమార్గము చూపకమానడు.

(అని నిష్క్రమించును.)

నక్షత్రములు లెక్క

(మహాదేవరాజు, నాగలింగము, మల్లిఖార్జునశాస్త్రియను విద్దఱు జ్యోతిష్కులు, సభాసదులు ప్రవేశించుచున్నారు)

మహా—మంత్రులారా! పండితులారా! మాతండ్రిగారి మరణా నంతరమున నేను సింహాసనమెక్కి యిరువదిసంవత్సరములనుండిరాజ్యము చేయుచుంటిని. నాకు సామంతులై కప్పములకట్టుచున్న రాజులనే కులు కలరు భక్తవత్సలుడైన పరమేశ్వరుని నే నెల్లప్పుడారాధనము జేసి యాతని యనుగ్రహము సంపాదించి శైవమతోద్ధారకుడనియు వీర శైవుడనియు గొప్పబిరుదులగాంచి యష్టైశ్వర్యములు ననుభవించితిని. ఏకొరంతయు నాకులేదు. శత్రువుల ననేకుల యుద్ధములలో జయించి లింగములుకట్టి వారిని శైవమతములో గలిపితిని. గాని యెవ్వరిని బల వంతపెట్టలేదు. బలవంతపెట్టలేద సటకు వేరె సాక్ష్యమక్కర లేదు. నారాజ్యములో నాకు లోబడి వరదరాజు తిరుమలరాజు మొదలగు

వీరవైష్ణవశిఖామణులు జమీందారులైయుండి నాకు కష్టములుగట్టినదు వారిమతములో వారు సుఖముగ నుండుటచేత నే నెంత పరమతసహానము గలవాడనో తెలిసికొనవచ్చును శైవులమీద నా కపరిమితానురాగమే కాని వైష్ణవులమీద నాకు ద్వేషము లేదు. చక్రాంకితము జేసికొని తిరుమణి తిరుచూర్ణములు ధరించుకొన్నవారి మొగములు చూడకూడదని లింగధారణ కాలమందు మావంశపరంపర గురువులగు చిక్కయ్యఅయ్యవార్లంగారు నాకు హితోపదేశము జేసిరి. కాని కొన్ని లౌకికబాధలచేత వారి యుపదేశప్రకారము నేను నడచుకొనజాలనైతిని. ఇదియే నేనుచేసిన గురుద్రోహము ఈమహాపాతకము జేసినందుకు నామనస్సెంతో తపించుచున్నది. అయినను దానికనేక ప్రాయశ్చిత్తములు చేసికొన్నాను. నాకు విచారములేవియు లేవు. కోరికలేవియు లేవు కాని నాకొక్క కుతూహలము మాత్రము చిరకాలమునుండి గలదు ఆకుతూహలము నా సంస్థానమునగల పండితులందఱి సహాయమున గాని తీరదు.

నాగ — (లేచి) మహాప్రభూ! మేము మూడుతరములనుండి మీయాస్థానములో పండితులమైయున్నాము మీకుతూహలము దీర్చుటయె మాకు ముఖ్యకర్తవ్యము మీకుతూహలమేదో మాకు తెలియజేసినపక్షమున నది మాకు సాధ్యమగునేని తప్పక తీర్చెదము.

మల్లి — దేవా! నేను లేనిపోనిమాటలు చెప్పువాడను కాను. మీకుతూహలము తీర్చునిమిత్తము నాశరీరమైన కోసి యిచ్చెదను.

మహా — ఇటువంటిపండితులు మంత్రులు నావద్దనుండగా నాకు లోపమేమియు లేదు. ఇదిగో చెప్పుచున్నాను వినండి నాకుతూహలము ఆకాశముమీద నెన్నినక్షత్రములున్నవో లెక్కపెట్టించి తెలిసికొనుటకు నాకు బాల్యమునుండియు కుతూహలముకలదు. ఇది తర్కశాస్త్ర పండితులవలనకాదు. వేదాంతశాస్త్ర పండితులవలనగాదు. వ్యాకరణ

శాస్త్రప్రవీణులవలనగాదు. జ్యోతిశ్శాస్త్రజ్ఞులవల్లనే కావలెను. అందు చేత మీరే గుణించి గణించి నక్షత్రములసంఖ్య నాకు నాలుగుమాసము దినములలో తెలియచేయవలయును దీనికి మారుమాటాడవలదు.

నాగ—(తనలో) చంపివేసినాడురా నాయనా రాజు. ఇది నా తరమా. నాయబ్బతరమా. నాతాతతరమా. చుక్కల లెక్కబెట్టుట నాకుగాదు సరిగదా నన్నుపుట్టించిన జేజెమ్మతరమైనా కాదు. ప్రభువులనగా ఒకవిధమైన యున్మత్తులు వాళ్ళతో దినములెటగాని మారుమాట వినరు. చేతగాదంటిమా యుద్యోగములు పోవును. చేతనవునంటిమా లెక్కపెట్టుమని త్రోయును ఈరాజు మనువుకున్నవాడు సరసుడు నగునుగాని మధ్య మధ్య పిచ్చికళలు వీనికి ఎత్తుచుండును. ఈపిచ్చికళ యీపరిణామము జ్యోతిష్కులమీద పడినది. దీనికేమియుపాయము. నాలుగువందలమంది సాలెవాండ్రను జంగమువాండ్రను శిష్యులుగ గ్రహించి యేటేట శిష్యసంచారము వెళ్ళి మైదానువందల రూపాయిలేలాగో యేరుకొని తెచ్చుకొని హాయిగా నుండక రాజస్థానములలో నుద్యోగమెందుకు సంపాదించితినయ్యా. ప్రారబ్ధమింతకూ యీలాగున నున్నది. ఇంతకు యేమిచేయగలను. ఇదివరకు భూలోకములో నాయంత పండితుడు లేడని చొరకాయ లడ్డముగా గోసితిని. ఇప్పుడు చేతకాదని యనుటకు నోరెట్లాడును. అయినను మావల్లిభూర్జునుడు సమయస్ఫూర్తి గలవాడు. ఏదో ఫణుగురాయలాగున నొక్కమాట నడ్డువేసి యీపద వెళ్ళబుచ్చలేకపోవునా ?

మల్లి—(తనలో) మెడమీదికి కత్తివచ్చినది. చుక్కలులెక్క పెట్టుమని చెప్పిన పిచ్చివాడు లోకమున వీనితప్ప మరియొకడు లేడు. మారుమాటాడితినా మండిపడిపోవును. చావగొట్టించి నభలోనుండి గెంటించును. మహారాజుల మాటలు మాయవాదములచేతనే గెలువ

వలయును. అందుచేత నేనొక చమత్కారప్రయోగము చేసెదను. ఇది బ్రహ్మాస్త్రమువలె పట్టుకొని తీరవలసినదే.

మహా — ఏమయ్యా! కుతూహల మేమిటో చెప్పు మని నన్ను తొందరపెట్టి నేను చెప్పగానె నోళ్లు మూసికొని యూరకొన్నారేమి చేతనగునా కాదా భూమండలంబున మీయంత పండితులు లేరని యిదివర కనేకసారులు చెప్పితిరిగదా మాకవసరము వచ్చినప్పుడు నోరెత్తి ధాటిగా జెప్పలేరేమి ఈ మాత్రము మాటలు చెప్పలేక పోయినచో మీరు గణించెడిదేమి. గుణించెడిదేమి. పంచాంగములు వ్రాయుటలో నొకగొప్పలేదు. ఈదినములలో గుడ్డిముండ వ్రాయుచున్నది పంచాంగాలు ఏమి మాటలాడరేమి.

మల్లి — మహారాజా! నాదొక్క మనవియున్నది. జ్యోతిశ్శాస్త్రములో మావంటి పండితులు లేనిమాటనిజమే కాశీలో సదానంద పండితులవద్ద నేను చదువుకొన్నాను ముప్పదిసంవత్సరము లిందులో కృషిచేసినాను గ్రహసంచారములు గ్రహములు ఉత్తరాయణ దక్షిణాయణ ప్రవర్తనములు జక్కగా జెప్పగలను భూతభవిష్యద్వర్తమానములను మేముచెప్పినట్లు మరియొకడు చెప్పనేలేడు ఈసంగతులు దేవరవారికి మొదటినుండియువిదితము. ఎన్నోసారులు మేము చెప్పినది చెప్పినట్లు జరిగినది. ఇక నీవిషయములో నందురా మాప్రజ్ఞలు పనికిరావు ఎందుచేతనంటే మనమందరము లింగధార్లము లింగధార్లు చచ్చిపోయినప్పుడు భూమిలో బాతివేయుదురు అందుచేత లింగధార్లకు భూమిలో సంగతులు భూమిమీద సంగతులు విశేషముగా దెలియునుగాని ఆకాశముమీద సంగతులు విశేషముగా దెలియవు నక్షత్రము లాకాశముమీద నున్నవి గనుక మాకు తెలియుట దుర్లభము వైష్ణవులు చచ్చిపోయినప్పుడు వారిని కాల్చివేయుదురు అందుచేత వారు ధూమరూపముగా నాకాశమార్గమును జేరుదురు. కావున వారి నాకాశముమీద

సంగతులు విశేషముగా తెలియగలవు మామనవిచిత్తగించి దేవరవారు వైష్ణవజ్యోతిష్కులకు వర్తమానములంపివారిని పిలిపించి వారి నడిగిన పక్షమున మీాసందేహము తీరగలదు ఈచుక్కలలెక్కలో వైష్ణవుల మించినవా రెవ్వరు లేరు తక్కిన జ్యోతిశ్శాస్త్రములో వారుమాకు చాలరు. ఇందులో మేము వారికిచాలము.

మహా—మీారుచెప్పినమాట మంచియుక్తియుక్తముగ నున్నది. శైవులను పాతిపెట్టుదురు గావున వారికి భూసంబంధములైన విషయములే తెలియును వైష్ణవుల కాకాశముమీాద సంగతులు తెలియుటకు మీారు చెప్పినసంగతులు సరిపోయునవి. వైష్ణవపండితు లెక్కడున్నారు.

మల్లి—మహాప్రభూ! తిరుమలరాజుగారి సంస్థానములో నున్నారు. అక్కడ తాండపకృష్ణమాచార్యులుగారు తిరునారాయణాచార్యులుగారు పెరుమాళ్ళయ్యవార్లంగారు జోతిశాస్త్రములో చక్రవర్తులని చెప్పవచ్చును. వారిని పంపించవలసినదని దేవరవారు తిరుమలరాజుగారిపేర జాబు వ్రాసినపక్షమున వారు తప్పక పంపగలరు.

మహా—పంపుదురా లేదాయని సందేహించుచున్నాను.

నాగ—సరి సరి పంపకపోవుట కెన్నివేలగుండెలున్నవి దేవరవారియాజ్ఞ శిరసావహించనిపక్షమున వారిప్రాణములు దక్కునా వారు మీాకరిగాపులన్నమాట దేవరవారు మరచిపోతిరా యేమి.

మహా—అవునవును మనమాట తీసివేసి వారు బ్రతుకగలరా అవునయ్యా తిరుమలరాజుగారికి జాబు వ్రాయుండి.

మంత్రి—చిత్తము మహాప్రభూ! ఇప్పుడేవ్రాసి యేలినవారి సంతకము నిమిత్తము పట్టుకొనివత్తును.

మహా—పండితులను పంపకపోయినట్టయితే వారి మానప్రాణములు దక్కవని స్పష్టముగా వ్రాయుండి.

మంత్రి—అస్మద్గ్రాసిదను దేవరివారియాజ్ఞ ముల్లోకములు వెళ్ళిన తిరగదు. తిరిగినట్టు జ్ఞానముగలా త్రినేత్రుండయినా తమసెలవు ప్రకారము నడుచుకొనవలసినదే.

మహా—సరే ప్రస్తుతము మీరంతా వెళ్ళండి మధ్యాహ్నమయి నది శివపూజకు లేవవలెను.

(రాజు మంత్రిలేచి వెళ్ళుచున్నారు)

నాగ—(వెళ్ళుచు త్రోవలో) మల్లిఖార్జునశాస్త్రీ! నీకు నీ పెద్ద లకు పదివేల నమస్కారములు. నేటికి మా ప్రాణములు దక్కించినావు నీది మిక్కిలి మంచి సమయస్ఫూర్తిరా బాబూ! ఎటువంటియుక్తి వచ్చి నావంటే మూడులోకములకు వెళ్ళిరా తిరుగని యుక్తి వచ్చినావు వహావా నీవు మంత్రిగా నుండదగినవాడవు కాని సామాన్యుడవు కావు బాబూ నీవామాటలు చెప్పుచున్నపుడు కడుపు చెక్కలగునట్లు నాకు నవ్వువచ్చినది నవ్వితే బుఱ్ఱ యెగిరిపోవునను భయమున నగముచచ్చి నట్లు పడియున్నాను ఎంతచమత్కారముగా జెప్పినావయ్యా మట్టితల ముండకొడుకు క్లిష్టమిన్నా సరే యన్నాడు. కీలెరిగి వాతబెట్టినావయ్యా.

మల్లి—శ్రీలింగమూర్తి సమయమునకు నాకటువంటి యుక్తి తోపించినాడు నానాలుకమీద ఆపరదేవతవాణి నిల్చి అవిఘ్నముగా నని పించినది లేకపోతే నేటిదినమున మనమీవిధముగ మరల మనయిండ్లకు వెళ్ళగలమా ఈపిచ్చిరాజునకు నచ్చినదికాని నాయుక్తి తెలివిగల వాని కవ్వానికి నచ్చదు మానినది మందనునట్లు యేదో తోచినది నమ యానికి ఇంతకూమనము లేచినవేళ మంచిది పెళ్ళాము బిడ్డలు చేసి కొన్న పుణ్యము మంచిది. పెద్దపులినోరునుండి బయలువడినాము మన మీద వాలిన శనిగానిని వైష్ణవులమీద త్రోసివేసినాము పోతే వైష్ణ వులే పోవుదురు ఒక్క పంచాంగములవాడు పోయినా మనకు మంచిదే మనకు రెండుగోదానములు దక్కినట్లు వలాగనగా మనప్రాణ

ములు దక్కుట. మా క్షేత్రవులైన ఒకరిద్దరు వైష్ణవులు పోవుట ఒక బెడ్డతో రెండు పిట్టలను గొట్టునట్లు కావచ్చును.

అని నిష్క్రమించుచున్నారు)

[అప్పుడు తిరుమలరాజు తాండవకృష్ణమాచార్యులుగారు నారాయణా చార్యులుగారు పెరుమాళ్ళయ్యవార్లంగారు మరి కొందరునభికులు, మంత్రి ప్రవేశించుచున్నారు]

తిరు—మంత్రి ! మహాదేవరాజెవరిని బంపించినారు ? ఎందుకు బంపించినారు ?

మంత్రి—వారి సంస్థానములోని మనిషియొక డొచ్చినాడు మీకేదో జాబు తెచ్చినాడు.

తిరు—ఏడీ ! ఆమనుష్యుడు రాలేదేమి ?

మంత్రి—అదుగో వచ్చుచున్నాడు.

[అప్పుడొక మనుష్యుడు ప్రవేశించును]

మను—దేవరవారికి నమస్కారము.

తిరు—నీ పేరెవరు ? నీ వెక్కడనుండి వచ్చితివి ? ఏమివని మీద వచ్చితివి ?

మను—నాపేరు చంద్రశేఖరుడు మహాదేవరాజుగారు మీకొక జాబిచ్చి పంపినారు.

తిరు—ఏదీజాబు. ఇటు తెమ్ము.

చంద్ర—చిత్తమిదిగో ! (అని అందిచ్చుచున్నాడు)

తిరు—(అందికొని) మంత్రీ ! దీనిని విప్పి చదువుము.

మంత్రి—చిత్తము. (అనియిట్లు చదువుచున్నాడు)

'మహారాజరాజశ్రీ మహామండలేశ్వరులైన తిరుమలరాజుగారికి శ్రీ మద్రాజాధిరాజ రాజపరమేశ్వర పరగండభైరవ వైరిసింహశరభ

హత్తుహన్నిబ్బరగండ హత్తుహైవదగండ జగనొబ్బగండ మూరు రాయరగండ వీరశైవప్రతిష్ఠాపనాచార్యబిరుదాంకితు లగు మహాదేవ రాయలు వ్రాయించి పంపించిన యుత్తరువులు శ్రీమదుమామహేశ్వరుల యనుగ్రహముచేతను, బసవేశ్వరులవారి యాశీర్వచనము చేతను మేమిక్కడ సురక్షితముగా నున్నాము మాకు నిన్నటిదినమున నక్షత్రము లెన్నియున్నవో తెలిసికొనవలెనని సదాశివప్రసాదమువల్ల బుద్ధి పుట్టినది. జ్యోతిశ్శాస్త్రములో గొప్పప్రజ్ఞగల పండితులు నక్షత్రములు లెక్కపెట్టగల పండితులు, మీ సంస్థానమునందు గొందఱువైష్ణవు లున్నారని మాదివ్యచిత్తమునకు తెలియవచ్చినది. ఆవైష్ణవపండితులను యీజాబు చేరిన వెంటనే మాసన్నిధానమునకు పంపించవలసినది వారల మీరు పంపకపోయినను, వారు రాకపోయినను వచ్చి యిక్కడ సరిగా నక్షత్రముల లెక్క చెప్పకపోయినను మీరందరు మాఆగ్రహమునకు పాత్రులగుదురు. మాకాగ్రహము వచ్చినా యేమిజరుగునో మీకే తెలియును. కాబట్టి వారిని తక్షణమె పంపించి వేయవలసినది.

ఇట్లు
మహాదేవరాయలు

తిరు—(తనలో) ఆహాహా! గొప్పచిక్కువచ్చినదే. ఈవైష్ణవులు తిరిగి బ్రతికిరారు. వీరికర్మము గాలినది. (అని ప్రకాశముగా) ఓయి చంద్రశేఖరా! నీకు మాసత్రములో బస యేర్పరచితిమి. నీ వక్కడ పోయియుండవచ్చును. నీకు బత్తెమంపెదము సేవకుల నంపెదము. మహాదేవరాయలవారి సెలవుప్రకారము పండితుల పంపెదనని మనవిచేయుము. విష్వక్సేనాళ్వార్ల యనుగ్రహముచేతను, లక్ష్మీసమేతులగు శ్రీమన్నారాయణమూర్తివారి యనుగ్రహముచేతను, మే మిక్కడందరము క్షేమముగా నున్నామని మనవిచేయుము.

చంద్ర—చిత్తము. నేను సెలవు పుచ్చుకొనుచున్నాను. (అని నిష్క్రమించును.)

తిరు—ఏమండి! నారాయణాచార్యులవారూ! తాండవకృష్ణమాచార్యులుగారు పెరుమాళ్ళయ్యావార్లంగారు! మీరందరుపయనమై వెళ్ళండి.

తాండవ—మహాప్రభో. ఇంతకాలమునుంచి పెరుమాళ్ళకైంకర్యము పదోవిధంగా జేసికొనుచు కాలక్షేపము చేయుచున్నాము. దేవరవారే అళహాశింగరిస్వాములవారని దేవరవారి తిరువడిఘళైనమ్మికొన్నాము. ఖండనుకుమామీద దయలేదు.

పెరుమా—తమరు చక్రవర్తి తిరునుహావారంతవారు. నీటముంచినా పాలముంచినా మీదేభారము ఎంబెరుమానారి అనుగ్రహమెల్లాగున్నదో తెలియదు.

నార—శ్రీమతే రామానుజాయనమః నాథమునినేనమః ఆరాజురుద్రుని భక్తుడు మనలను చూడగానే పరమపదమునకు పంపించి వేయును తోళ్ళెక్కములనిమిత్తము చెరుకు కఱ్ఱలుకూడా తీసుకొని మనమక్కడికి వెళ్ళవలెను. పెళ్ళాము బిడ్డలకు మనకు ఋణము తీరినది. ఆరాజు లింగధారియగుటచే మనప్రాణాలుతీసి దహనమయినా చేయకుండా త్రవ్వి పాతిపెట్టించగలడు. మనము ఉభయలోకభ్రష్టులమై పోగలము.

తిరు—ఆచార్యులుగారూ! విచారించకండి తిరువెంగడత్తాన్ మనపాలిటయున్నపక్షమున మనకు మేలుకలుగగలదు. మీరు నాలాయుములో పాశురములు చదువుకొనుచు సాక్షాత్ రంగేశ్వరుని మనస్సులో నిలుపుకొని వారి యాస్థానమునకువెళ్ళి శాస్త్రరీత్యా నక్షత్రముల సంఖ్య చెప్పండి చెప్పినపక్షమున మీకే యుపాయము కలుగదు శైవులన్న కారణముచేత ప్రాణములుతీయడు.

తాండ—చెప్పగలిగితే మాకిన్ని పాట్లెందుకండీ! మేమెన్నో గ్రంధములు జ్యోతిశ్శాస్త్రములు చదువుకొన్నాముగాని, నక్షత్రముల లెక్క మాకెక్కడా కనుపడలేదు ఏగురువూ మాకుపదేశము చెయ్యలేదు. మేముముగ్గురము చచ్చిపోయినామన్నమాటే

తిరు—నేనేమిచేయగలను. పంపకపోయినపక్షమున నారాజ్యము పోవును. నాతలపోవును. పంపిన పక్షమున మీప్రాణములు పోవును. ఇప్పుడు చేయవలసినదేమో నాకు తెలియకున్నది. ఈరాత్రిమనమందరము పెరుమాళ్ళకైంకర్యము మిక్కిలి ప్రపత్తితో చేయుదము. శ్రీయఃపతి ఏమియోచించునో అది రేపు చేయుదము. ప్రస్తుతము వెళ్ళండి.

(అందరు నిష్క్రమించుచున్నారు)

(అప్పుడు తిరుమలరాజు, తాండవకృష్ణమాచార్యులు, నారాయణాచార్యులు పెరుమాళ్ళయ్యవార్లంగారు, మంత్రి, పింగళప్పయును, విదూషకుడు ప్రవేశించుచున్నారు)

తిరు—ఆచార్యులుగారూ! యెన్ని విధముల యోచించినామీరు విజయం చేయకతప్పదని తోచుచున్నది. రాత్రి పెరుమాళ్ళు నాకలలోకి వేంచేసి మిమ్ములను పంపించుమని శాసించినారు ఉడయవరుయొక్క మంగళాశాసనములుకూడ ఆప్రకారముగానె కనబడుచున్నవి.

తాండ—నాథమునులవారు తెల్లవారుజామున నాస్వప్నములో దర్శనమిచ్చి శైవసభకు వెళ్ళవద్దని శైవుల మొగముల చూడవద్దని శాసించినారు.

నారా—మనవాళ్ళ మహామునులు, తిరుమంగయాళ్వారు నా స్వప్నములో దర్శనమిచ్చి మేము వెళ్ళుట యెంతమాత్రము భావ్యము గాదని సెలవిచ్చినారు.

పెరు—పెరుమాళ్ళు మీతో అలా సెలవిచ్చినారేమో గాని, నాతో అల్లా శాసించలేదు. నేను నేత్రములు మూసికొని ధ్యానరూపకముగా పరుండియుండగా గరుడవాహనారూఢులై భాష్యకార్ల వారితో గూడ మేఘములాగున చక్కావచ్చి "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అని సెలవిచ్చి వెళ్ళిపోయినారు. దీని అర్థమేమిటో తెలియకుండా వున్నది.

తిరు—పెరుమాళ్ళు నాతో వొక మాట చెప్పి మీతో వొక మాట చెప్పారా? మీస్వప్నము నేను నమ్మను అందుచేత మీరందరు వెళ్ళక తప్పదు.

తాండ—అయితే మేమందరము చచ్చిపోవలసినదేనా?

తిరు—శ్రియఃపతి సెలవైతే తప్పుతుందా. వారి సంకల్పమే సంకల్పముగాని, మన సంకల్పములు నెరవేరునా?

పెరు—నాయనా! వెంగళప్పా! పిన్నావుగదా మాయవస్థ. దీని కేదైన వుపాయము యోచించి మమ్మొకదరి జేర్చలేవా?

వెంగ—ఉభయపరులు శ్రియఃపతులు చేయలేని పనులు నేను చేయగలనా?

తిరు—ఓనోయి వెంగళప్పా! మరచిపోయినాను. నీ కుత్పన్న మందబుద్ధులు పుట్టుచుండును. గట్టియోచనచేసి పాప మీస్వాములకు వచ్చిన యీ ఆపద తప్పించు.

వెంగ—నాలుగు దినములపాటు నన్నే పెరుమాళ్ళుగా నెంచుకొని వీరందరు శ్రద్ధగా కైంకర్యము చేసినపక్షమందు నేను వీరికందరికి తొల్లైక్యము జరుగకుండా జాగ్రత్తపెట్టగలను.

తాండ—నాయనా ! అదీ కావలసినది. నాలుగుదినములేకాదు. కంఠములో ప్రాణ మున్నంతవరకు నీకు నిత్యకైంకర్యము చేయు చుందుము.

వెంగ—అట్లయినపక్షమున నేను చెప్పినమాట వినండి మహా దేవరాజు సభలోకి నేను గొప్పజ్యోతిశ్శాస్త్రపండితుడనని వెళ్ళెదను. నాకు పెద్దంచు దక్షిణాదిపంచలు కట్టబెట్టండి. తులసిపూసలు తావళ ములు నామెడనిండా వేయండి ద్వాదశోర్ధ్వపుండ్రములు మీరు ముగ్గురు కూర్చుండి నాశరీరముమీద మొగమునిండా దిద్దండి. మంచి పావుకోళ్ళజత యొకటి యివ్వండి. పండ్రెండుగురు భోయీల సవారిలో నన్ను కూర్చోబెట్టండి. సింహనాధములు మోగుచుండగా భోయిలు ఓం ఓం ఓం అని ఓంకారధ్వనులు చేయుచుండగా వెళ్ళుమని మహా దేవరాజుగారిపట్నం నేను వెళ్ళెదను. మీరు ముగ్గురు నావెంట శిష్యులుగా రండి ఈయన మా గురువుగారు జ్యోతిశ్శాస్త్రములో బృహస్పతిని మించినవారు ఈయన వద్దనే మేము చిన్ననాటనుండి విద్యలు నేర్చుకొన్నాము. ఈనాడు ప్రపంచములో జ్యోతిశ్శాస్త్రములో యింతవారు లేరు అని చెప్పండి. నన్నెవరైనా మహాదేవరాజుగారి సభలోని పండితులు వాదానికి రమ్మంటె ముందు మాశిష్యులతో వాదించమని మీదగ్గిర కంపుతాను నావద్దకుమాత్రము వాళ్ళను వాద మునకు రానియ్యకండి వచ్చినట్లయితే పొట్టచించినా అక్షరము లేని వాడను. గనుక నావరువు మీపరువు బయటపడును. అంతవరకు రానియ్య కండి. పరువుకొరకున అనుకోక నాకు వింజామరలు వేయుండి, నేను కూర్చోమన్నదాకా కూర్చోకండి. ఆసభలో నాయెదుట చేతులు జోడించుకొని నిలుచుకొనండి. నన్ను చూచినప్పుడు లేచి నిలిచియుండండి నేను మధ్య మధ్య లేనికోపము తెచ్చుకొని మిమ్మును దౌర్భాగ్యులారా తెలివితక్కువవాళ్లారా ! అక్షరము ముక్కలు రావు అని తిట్టుచుందును

ఒకప్పుడు పర్యాసనము దీసికొని కొట్టనూగలను. గట్టిదెబ్బలు తగల నియ్యను. అంతమాత్రముచేత మీరు కోపగించుకొని ముక్కుమూరెడు మొగముజానెడు చేసికొని మేమయ్యా గొప్ప ఆచార్యులవారము. మమ్ముల నీనిర్భాగ్యుడు తిట్టుచున్నాడని గుంజుకోవద్దు. మీవద్దనున్న తాటాకులపుస్తకము లన్నిటిని బండ్లమీద వేసి నాసవారీవెనుక పంపించండి. తాటాకులపుస్తకములు కొత్తవి వ్రాయునివి రెండుబండ్లు కూడా పంపించండి నేను మీకు గురువుగారిని గనుక మంచి మంచి భక్ష్యములు ఫలహారములు, పానకములు, మజ్జిగతేటలు, కొబ్బరికాయనీళ్ళు మొదలైనవి నాకెప్పటికప్పుడు సిద్ధముచేసి యుంచవలెను కాళ్ళు పిసకమంటే పిసకవలెను. ఇన్నిమాట లెందుకు, నాటీవి, నావైభవము చూచి మహాదేవరాజు అతని ఆస్థానంలోవుండే లింగధారపండితులు డంగుపోవలెను. ఈప్రకారం చేసినపక్షమందు నేను సరిగా చుక్కలు లెక్కపెట్టి మహాదేవరాజును మెప్పించి గొప్ప బహుమానములు పుచ్చుకొని మీప్రాణములు గాచి మన రాజుగారిపరువు దక్కించి పెళ్ళిమని పెళ్ళికొడుకులాగున తిరిగి పట్నంచేరగలను. ఇది మీకు సమ్మతమైనపక్షమున రేపుఉదయం సిద్ధముగండి. లేదా యెవరికివారే యమునాతీరే.

తాండ—నాయనా! నీవేలాగున చెప్పితే ఆలాగున వింటాము.

పెరు—బాబూ నీకు దాసానుదాసులమై యుండగలము.

నారా—తిట్టినా సరే కొట్టినా సరే మాకిష్టమే ప్రాణాలు రక్షించు.

తిరు—వెంగళప్పా నీఅదృష్టము మంచిదికాని యిటువంటి స్వాములచేత ఉపచారములు చేయించుకొను యోగ్యతపట్టింది నీజాతక మిప్పుడు యోగించినది. లేకపోతే నవారియోగములు పట్టునా? రేపు ప్రయాణమై వెళ్ళండి.

వెంగ—దీనికంతకు దేవరవారి అనుగ్రహమే కారణము సెలవియ్యండి.

(అందరు నిష్క్రమించుచున్నారు.)

(మహాదేవరాజు, నాగలింగము, మల్లిఖార్జునుడు ప్రవేశించుచున్నారు)

మహా—వారు రావలసిన దినము నేడేకాదా?

నాగ—నేడేనండి.

మల్లి—యింకను రాకపోవుటకు కారణమేమో! తిరుమలరాజుగారు పంపకపోయియుందురా? లేక వారు రాకపోయియుందురా?

మహా—ఏమీ! తిరుమలరాజు పంపకయుండునా? వారు రాకపోయియుందురా? మూడవకన్ను తెరచిన మహాదేవుడువలెనే మహాదేవరాజు, వారి నందరిని భస్మపటలము చేయునని వారెరుగరా? పరమేశ్వరుడు త్రిపురాసురుల సంహారించినట్లు సంహారించనా.

నాగ—చిత్తము చిత్తము. అలాగే మల్లిఖార్జునుడు మాటవరుసకాలాగన్నాడుగాని, దేవరివారిమాట కెదురున్నదా లోకములో.

(అప్పుడు భటుడు ప్రవేశించుచున్నాడు)

భటుడు—మహాప్రభూ! గోడలకు వెల్లపరజాలువేసినట్లు వంగనామాలు పెట్టుకొని వైష్ణవులు సాతానులు వచ్చినారండి సెలవైతే లోనికిరమ్మంటాను, లేకపోతే, మెడమీద చెయివేసి గెంటుతాను.

మహా—(నవ్వి)ఓహో! వచ్చినారా యమిస్యాములు. రమ్మను.

భటు.—చిత్తము. (అని వెళ్ళి వెంగళప్పను తాండవకృష్ణమాచార్యులుగారిని, నారాయణాచార్యులుగారిని, పెరుమాళ్ళయ్యవార్లంగారిని తీసికొని ప్రవేశించుచున్నాడు.)

వెంగ—శ్రీమతే రామానుజాయనమః

వైష్ణవులు—శ్రీమతే రామానుజాయనమః

మహా—సాంబసదాశివశంకర. సాంబసదాశివశంకర.

నాగ-మల్లి—బసవేశ్వరాయనమః బసవేశ్వరాయనమః

వెంగ—(తనలో) అబ్బా! ఏమిరుద్రాక్షలు! ఏమి విభూతి పిండికట్లు! నందీశ్వర దుండీశ్వర చండీశ్వరులలాగు కూర్చున్నారు.

వైష్ణవులు—(తనలో) ఈబూడిద పూసికొన్న ముండాకొడుకులను చూడవలసిన పాడుయోగము మాకు పట్టినదికదా! శ్రీమన్నారాయణమూర్తీ! ఈదయ్యాలనోట్లోనుండి యెప్పుడుబయట పడజేయుదువో.

నాగ—(తనలో) వంటికి వెల్లవేసినట్లు పణ్ణెండు ఊర్ధ్వపుండ్రము లేలాగున ధరించినారో! తులసిపూసలుధరించినారు. వీళ్ళతులసిపూసలు మండిపోను అచ్చుపోసిన ఆంబోతులులాగు జబ్బలు తెగ కాల్చుకొని పులిహోరముద్దలు; దద్ధోజినంముద్దలు, మింగుచు కైంకర్యములు చేయుచుందురు. తలకోకలింగము కట్టి వదిలివేసిన బాగుండును

తాండ—(తనలో) వీళ్ళలింగాలు తెంపివేసి చక్రాంకితము చేసి వదలివేసిన బాగుండునుగదా! ఈ లింగధారివీనుగుల మొగములు చూడగనే నాకు డోకు వచ్చుచున్నది.

మహా—ఎవరండీ మీరు?

వెంగ—మహాప్రభూ! నేను శ్రీతిరుమల దేవరాయల వారి ఆస్థానంలో జ్యోతిష్కుడను. శ్రీమన్నారాయణమూర్తి వారి అనుగ్రహముచేతను, ఎంబెరుమానారి వాత్సల్యముచేతను, పన్నిద్ద రాళ్వార్ల

పరిపూర్ణకటాక్షముచేతను, తక్కిన ఆచార్యపరంపరయొక్క దయచేతను, నేను చదువని గ్రంధములేదు చూడని శాస్త్రములేదు వేయని గణితములేదు. తెలిసికొనని విషయములేదు. వాదముచేయని పండితుడులేడు. ఓడింపని జ్యోతిష్కుడులేడు. పుచ్చుకొనని బహుమానము లేదు. దేవరవారు తప్ప తక్కిన రాజులందరిదివరకే నన్ను మెచ్చి పారితోషకములు కప్పినారు. అఖండభూమండలాఖండలులైన దేవరవారిదర్శనముకూడ చేయవలెనని చిరకాలమునుండి కోరుచునేయుంటిని, నేటికి లభించినది నేనదృష్టవంతుడను. నాజన్మ తరించినది కైలాసము విడిచి భూలోకము నవతరించిన శంకరులనగా తమరే. శత్రుమిత్రులను సమానముగా జూచునట్టి మహానుభావులెవరనగా తమరే. మీ సంస్థానమునకు వచ్చుటచేత నాపాండిత్యముకూడ సఫలమగును. వీరు ముగ్గురు నాశిష్యులు వీడు కొండవకృష్ణుడు వీడు పెరుమాళ్ళయ్యవార్లు వీడు నారాయణాచార్యులు, వీళ్లు నాశుశ్రూషచేసి సమస్తవిద్యలు నా వద్దనేర్చినారు. దాదాపుగా నాయంతవాళ్ళయినారు.

నాగ—(కోపముతో) వాదముచేయని పండితులు లేరనిమీరు ప్రభువుగారియెదుట సొరకాయకోతలు కోయుచున్నారే మీరుమాతో వాదించినారా ?

వెంగ—నేను పండితులతో వాదము చేసితినని చెప్పినాను పండితులైతే మీతో వాదము చేసియుందును.

మల్లి—ఏమీ ! మేము పండితులముకామా ?

నాగ—ఏమీ ! వైష్ణవులు గర్వము !

వెంగ—వైష్ణవులను మీరు దూషించినను, నేను శైవులను దూషింపను. మీరు పండితులైన పక్షమున ప్రభువుగారు చుక్కల లెక్కనిమిత్తము మమ్మేల పిలిపించవలసివచ్చును ?

మహా—సరే వాదములు కట్టిపెట్టండి అయ్యా! మీపే రేవరండి?

వెంగ—మాయింటిపేరు ప్రతివాది భయంకరనల్లానిచక్రవర్తులు వారు నాపేరు తొండరటిప్పాడి నిరువేంగడిత్తాన్,

మహా—నాయనా! నీపేరు నీయింటిపేరు నానోట పట్టుటలేదు. ఇదెక్కడి పేరయ్యా. విపరీతపునామధేయమువలె నున్నది.

వెంగ—తల్లిదండ్రులు తెలివితక్కువచేత ఆప్రకారముపెట్టినారు పేరు మార్చుకోవలెనని నాకుకూడా వున్నదికాని యిదివర కెన్నో దస్తావేజులలోను అప్పుపత్రములలోను ఈపేరే యుండుటచేతః మార్చు కొనుటకు వీలులేకపోవుచున్నది.

మహా—సరే. పేరుకేమిగాని, మేము నిన్ను పిలపించిన సంగతి తెలియునా?

వెంగ—చిత్తము చుక్కలలెక్కనిమిత్తము పిలిపించినా రని విన్నాను.

మహా—ఔను ఆకాశముమీద చుక్కలెన్నియున్నవో మాకు చెప్పవలెను!

వెంగ—(నవ్వుచు) ఈమాత్రపులెక్క చెప్పలేకపోయిన పక్షమున నాజ్యోతిశ్శాస్త్రపాండిత్యమెందుకు. తగలపెట్టనా! కాని, నా కొక వారము దినములు గడువు ఇప్పించండి. మీచిత్తమొచ్చినట్లుచెప్పి మెప్పించెద.

మహా—సరే ఇచ్చినాను. మీరు మాకోటలో చిట్టచివర మేడలో బసచేయవచ్చును. మీకు కావలసిన సమస్తసామగ్రులు పం పించెద వెళ్ళండి.

వెంగ—చిత్తము మహాప్రభో!

(అందరు నిష్క్రమించుచున్నారు.)

(అప్పుడు మహాదేవరాజు, నాగలింగము, మల్లికార్జునుడు, తిరునారాయణాచార్యులు, పెరుమాళ్ళయ్యవార్లంగారు, తాండ్రకృష్ణమాచార్యులు, వెంగళప్ప, మరియు ననేక సభికులు ప్రవేశించుచున్నారు)

మహా—(వెంగళప్పనుజూచి) అయ్యవార్లంగారూ! మీఅద్భుత గణితము వినుటకు ఈపట్టణములోనుండియేగాక చుట్టుప్రక్కలనున్న పల్లెలనుంచి వందలకొలది జనము వచ్చినారు. సభ కలకలలాడుచున్నది చుక్కలలెక్క చెప్పవలసిన దినమీదినమేగదా? కాబట్టిత్వరగాచెప్పి మమ్మందరను మహానందము నొందింపుడు.

వెం—చిత్తము అందుకేగదా వచ్చినది అయిదుదినములనుండి రాత్రి తెల్లవార్లు నాకు నిద్రలేదు.

మహా—ఎందుచేతనండి నిద్రలేకపోవుట?

వెంక—ఏమని మనవిచేయగలను? తన్ను తానుపొగడుకొనుట తన్ను కొన్నట్లుంటుందన్నారు. దీపములుపెట్టింది. మొదలుకొని నిద్రాహారములులేకుండ తిరిగి తెల్లవారువరకు యెత్తినమెడ యెత్తినట్లే యుండునట్లు, తెరచినకన్నులు తెరచినట్లే, కదలెడు పెదవులుకదలినట్లే యుండునట్లు, నక్షత్రములు లెక్కపెట్టుచూ, గ్రహసంచారములు తెలిసికొనుచు, నేను పైకి చూచునప్పటికి చేతిలోని గంటము లెక్కలు చేయవలసినదే నేను వేసిన లెక్కల తాటాకులు నాలుగుబండ్లమీద వచ్చినవి.

తాండవ—(తనలో) అరే వీడమ్మకడుపుకాల ఈవెంగళప్ప గాడు ఏమికోతలు కోయుచున్నాడురా నాయనా! దీపముపెట్టగానే గేదెపెరుగుపోసుకొని లకోటాకు మెతుకులేకుండా అన్నముతిని గుర్రుపెట్టి నిద్రపోయి కన్నుమూయలేదని చెప్పుచున్నాడు. ఈతాటాకుల మీద మీయిష్టమువచ్చిన అంకెలు వేయుమని మమ్మును బ్రతిమాలి వేయించి అవి అన్నీ తాను గణితముకొరకు వేసినట్లు సొరకాయకోతలు

కోయుచున్నాడు. ఈమహాదేవరాజును పిడుచక్కగా బుట్టలోపెట్టినాడు కాని, వీడివల్ల తిలగాచుకొంటిమా పిడెన్ని జేసినను నకే.

మహా—అబ్బబ్బ ! పాప మెంత శ్రమపడుచున్నారు. నక్షత్రముల లెక్కనగా యింతకష్టమున్నది గాబోలు ?

వెంగ—మహాప్రభూ ! ఇంతంతశ్రమకాదు. ఈదెబ్బతోనేను మంచమెక్కిపోతాను. ఆరునెలలదాక మసిమసిగాను. బుద్ధిపనిచెయ్యవండి దీనికి. ఒకటే ఆలోచన ఒకటేఆలోచన, శంఖాలు, అర్బుదాలు, కోట్లు మనసులో గణించుకోవలసినదే. అలాగునమనసులో గణించగా మిగిలినలెక్కలో యీతాటాకులమీద నున్నవి. ఈచుక్కలలెక్క నాశత్రువునకైనా వద్దండి. సామాన్యముగా యీవిద్య మరెవరికిరాదు. నేను చిన్నప్పుడు బ్రహ్మకపాలమువరకు యాత్రవెళ్ళి యక్కడ బదరీనారాయణాశ్రమములో సాక్షాత్తు వేదవ్యాసునివద్ద జ్యోతిషము నేర్చుకొన్న యొక మహామునివద్ద పదమూడు సంవత్సరములు శుశ్రూషచేసి వారి యనుగ్రహము సంపాదించి యీవిద్య నేర్చుకొన్నాను. శుశ్రూషఅనగా ఎటువంటి శుశ్రూషనుకొన్నారు ? కాళ్ళుపిసికి, దర్భాసనములుమోసి, కౌపీనములు కాషాయవస్త్రములువుదికి యెన్నోసార్లు పెద్దపులిగండాలు, చిరతపులిగండాలు, తాచుపాముగండాలు తప్పించుకొని, యెట్టెటో బయటపడినాను. మరొకడైతే ఆశుశ్రూషచేయలేడు ఈవిద్య సంపాదించలేడు. నేనుగనుకా నిశాచరపు ముండావాడనూ అంతకష్టపడినాను గాని మనుష్యమాత్రుడు పడగలడా !

మహా—అయ్యయ్యో మీరు చాలా శ్రమపడి సంపాదించినారు. శ్రమలమాట తర్వాత చెప్పవచ్చునుగాని, ముందు గణితము చెప్పండి ? వినవలెనని కుతూహలముగా నున్నది.

వెంగ—చిత్తగించండి. (అని క్షణమునేపు కన్నులుమూసి ధ్యానముచేసి) శ్రీమతే రామానుజాయనమః, శ్రీమన్నారాయణాయనమః, శ్రీమదనంతగరుడవిష్వక్సేన పాదారవిందాభ్యాంనమః అయ్యా సభవా రందరు వినండి. ఆకాశమునమీద తూర్పుదిక్కునయున్న చుక్కలు సరిగా నాలుగువేల తొమ్మిదివందల తొంభైనాలుగు అర్బుదములు, తొమ్మిదివేల తొమ్మిదివందల డెబ్బదిమూడుకోట్లు తొంబదితొమ్మిది లక్షల తొంబది తొమ్మిదివేల తొమ్మిదివందల తొంభైతొమ్మిది. దక్షిణంవైపునయున్న చుక్కలు సరిగా మూడువేల రెండువందల పదకొండు అర్బుదములు. ఏడువేల ఆరువందల యేబదినాల్గుకోట్లు యెనభై యెనిమిదిలక్షల యెనుబది యెనుబదవేల యెనుబదివందల యెనుబదియెనిమిది. పడమటనున్న చుక్కలు సరిగా అయిదువేల నాలుగువందల ముప్పదిమూడర్బుదముల యేడువేల తొమ్మిదివందల నలుబదినాలుగు కోట్లు, డెబ్బదియేడులక్షల డెబ్బదియేడువేల యేడువందల డెబ్బదియేడు. ఉత్తరమునయున్న చుక్కలు సరిగా రెండువేల రెండువందల యిరువది రెండర్బుదముల మూడువేలమూడువందల ముప్పదిమూడుకోట్ల అరువది యారులక్షల అరువదియారువేల ఆరువందల అరువైయారు.

(అందరు చప్పట్లు కొట్టుచున్నారు)

వైష్ణవులు—జయ జయ! జయా! జయా! జయ!

మహా—భళీ! అయ్యవార్లంగారు భళీ!

నాగ—మహాప్రభూ! యీలెక్క తప్పు. ఇదినేనొప్పుకోనను.

వెంగ—(కోపముతోలేచి) ఏమనుచున్నావు! రాత్రి పగలు నిద్రాహారములులేక నేను గణితములు వేసినలెక్క తప్పా? తప్పైతే లెక్కపెట్టి యెక్కడతప్పో చూపించు? మహారాజా! యిది మోర్వ లేనితనము.

మహా—నిశ్చయముగా నిదివోర్వాలేనితనమే! ఏమయ్యా నాగలింగముగారు! మీరు చెప్పలేరు సరిగదా సరియైకరు చెప్పినప్పుడుతప్పు తప్పందురా? నోరెత్తినారంటే మిమ్మిద్దరను దేవిడీ మన్నా చేయించెదను.

నాగ—(తనలో) ఈ వెంగళప్ప ముండాకొడుకు మామంత్రి రాజుకు టోపీవేసినాడు. మోసపోయినావయ్యా అని నేను చెప్పినను వినడు ఇంతకు వానియదృష్టము బాగున్నది. ఈసామ్రాజ్యసాహసము నావద్దలేకపోయినది.

మహా—మంత్రీ! ఈఅద్భుత జ్యోతిష్యునకు పదివేలరూపాయిలను దక్షిణాలువలు బహుమానము నిప్పించుము. వాని శిష్యులకు ముగ్గురికి నూటపదహారుచొప్పున బహుమానము చేయించుము.

తాండ—(తనలో) బతికినాముగాబాబు! బహుమానాలకేమి గాని ప్రాణాలతో బయటబడ్డాము. వెంగళప్ప మమ్ము కాపాడుటేగాక పదివేలు సంపాదించుకొన్నాడు.

వెంగ—మహాప్రభో! మేమింక సెలవు పుచ్చుకొందుము.

మహా—మంచిది వెళ్ళండి.

వెంగ—తమకేదైన యిట్లసాధ్యమైన గణితము వచ్చినప్పుడు నాకు వర్తమానమంపండి.

(అందరు నిష్క్రమించుచున్నారు)

కరణాల కట్నం

(కొందరుకాపులతో గ్రామకరణం సుబ్బారాయుడు ప్రవేశించుచున్నాడు)

సుబ్బా—బాపన్నా! సాగుబడిలెక్క వ్రాసి పదిరోజులలో తాలూకాకు పంపించాలి. రివిన్యూ యినస్పెక్టరుగారు తణిఖీకి వస్తూన్నారు నీయరటితోట విషయంలో యేమంటావు?

బాపన్న—అనేందు కేముందండి. అంతా మీకే తెల్సు మామూలు పెకారం కేయించండి.

సుబ్బా—విన్నావా! వెంకన్నా! నేను మామూలు ప్రకారం వ్రాసి నిరుడు మనకట్నంగి మొత్తమే మంగల నూరిగాడిని పంపిస్తే నానామాటలు అన్నాడట ఉపకారానికి రోజులుకావు పదిరూపాయిలు తీరువాయికదా అని యేదో వ్రాసినాను. ఇతనిమాట లెట్లు నమ్మను?

బాపన్న—ఓయి బాబూ! కూంచేపుండి రారాంటే, ఆడికంత పొగరా మీతో చెపితే, ఆమాటట్టుకున్ని నన్నుకాదంటే దిగడిం దేంటయ్యా ఆతాచీలుదారుకే తాంబూలంయిత్తాను తాంబూల ముచ్చుకోని ఒకణ్ణీనూపెడుదూ యేలుమడిలో?

వెంక—ఒరే బాపన్నా! అరు కామాదికార్లు ఆరెల్లా చెబితే అల్లాగినాలా కాకమడకురా! దికార్లకొక్కొవ మొత్తుది.

సుబ్బా—చూచావా! సుబ్బిరెడ్డి! మీరహితాంగం వ్యవహారమేయిది. అందితేజుట్టు లేకపోతే కాళ్ళు కరణాల కట్నాలకుపేచీ పెట్టని రహితున్నాడా? అబ్బే అందుకనే నాకెందుకని యూరకుంటు

న్నాను. మీాపాట్లు మీారు పడక్కారు దరఖాస్తులు లేకుండా నీరు పెట్టి నప్పుడు డబ్బిలుతీరువాయి యిచ్చుకొన్నప్పుడు కాని తెలియదు చాలు చాలు.

సుబ్బారెడ్డి—ఊరుకోండి. అదు బుద్ధిలేనోడు. మీారుకూడా కాకపడితే యెల్లాగా మీాకట్టాలికి పేసీలెవరు పెట్టరు బాబూ. ఏంటో యిబ్బందుంటే నదరి చెప్పుకుంటా కాని పేచీపెడితే తెల్లారిమల్లీ రావొద్దూ.

బావ—సుబ్బిరెడ్డీ! నీక్కూచుబాచు తెల్దూమకో. నిరుడు పాల కాయలపంపు యెండిపోతే రిమీాచ సిప్పిత్తారనుకుంటే ఆ రిమీాచ నంతా అయనే వుచ్చుకొన్నాడు. పైగా మామూలంట. కరణాలకేంట్రా చాలూమాములంలేదు. ఏకమామూళ్లే ఏకమామూళ్లే. కూరమామూలు పెరుగుమామూలు గడ్డిమామూలు. అబ్బబ్బా పాణం యిగిరిపోతుందంటేనమ్ము. యినీ మాహాజేడి ఆశాచీలుదారంతకంటేని ఈళ్ళుద్దోగాలువుండా. చత్తరువులంట తిని, ఊరంటమున్చెత్తి యీాళ్ళునమ్మోని ఉద్దోగాల్లోకి రావడం మనపాణాలు తియ్యడాన్కే కాబోలు. ఉద్దోగత్తులొత్తున్నారంటే యెముల్లొళ్లొత్తున్నారన్నమాటే.

సుబ్బా—చూచారా! మీారంతా! నాయెదుటనే యెల్లుతిట్టు చున్నాడో మొన్నను రివిన్యూయినస్పెక్టరుగారిమీాద యీారీతిగానే వడ్డాడట. ఆయన నాతో చెప్పి సిగ్గుపడ్డాడు.

వెంకన్న—అడుమోటోడు. అడికేం తెల్లండి మీారికూంత కరుణించాలికాని తొందర పడకండి.

సుబ్బా—ఎందుకు ఇతనివిషయమై పైకిర్రాస్తాను. ఇట్టిదుర్మార్గులు గ్రామంలోనుంచి అంతా చెడిపోరూ.

బాపన్న—చూడండి. మీరెంతరాచినా చరేకాని నాకేం బయంలేదు. దొంగతనంశేశానా, లంజతనంచేశానా. నాకేం బయమయ్యా. మీకు లంచాలియ్యకపోతే గొసిరుగారు బుజ్జగిత్తారేమో శూత్తాను.

సుబ్బి—లంచాలనకురా బాబు. కట్నాలను.

సుబ్బా—తొందరపడకు. లంచాలిస్తూన్నావుగా. సరే ఆలోచించుకో.

బాపన్న—ఓయిబాబు పొణుకొచ్చిందయ్యా, ఏంబెదిరిత్తావు మొన్న నింజనీరుగారితో మాటాడేప్పుడు నేయిన్లేదూ చెరువుమరమ్మతుచాల్దని యింకాలాగాలనుకున్నావు కాబోలు ఈరోజు ముచ్చికుందుగాని కాదూ.

సుబ్బా—అదేమిటి చెరువు మరమ్మతేమిటి కొత్తకల్పనలు చేస్తూన్నావు. కొంచము పైత్యకళమునిపిచి లాగున్నావు.

బాపన్న—పైత్తెకలా చాల్లేవయ్యా కావుల్ని శెల్లోశేపలపట్టుకుని నాచుతియ్యమంటం లేదు.

సుబ్బా—అవును శుభ్రముగా నుండునని తీయమన్నాను దానికేమి?

బాపన్న—లోకలు పండోరిచ్చే డబ్బేంచేస్తున్నావయ్యా అది మీపెట్లోకా? నీచుమూపొట్లోకా? ఏంకరణాలో మలమలమాడ్చుకు తింటారుకంబా

సుబ్బి—అయితేని సుబ్బారాయుడుగారూ! మన శెరువు కేటాయేళ్ళై రూపాయలు మరమత్తుచెయ్యమని యిత్తున్నారంట కాదుండి.

సుబ్బా—అదంతా అబద్ధమేనోయి కిట్టనివాళ్ళకల్పన.

బాపన్న—అబొ్బకల్పనా. నిజం శెబితే వులొ్కత్తుంది నాకెందుకు.

సుబ్బా—చూడు నీవు నాయెదుటనుండిపో, నీ మొగముచూడ కూడదు వట్టి పశుప్రాయుడవు లాగున్నావు పో.

సుబ్బి—కోంమడకుండి అడితోటేంటి.

సుబ్బా—వెంకన్నా నీవు సుబ్బిరెడ్డి మధ్యాహ్నం మొక్కసారి మాయింటికిరండి మీతో మాట్లాడాలి భోజనమునకు ప్రొద్దుపోయినది. నేను వెళ్ళుచున్నాను బాపన్నా నీవేమయ్యా యేమంటావు. కట్నం యెప్పుడు తెస్తావు

బాపన్న—యెల్లుహ కట్నానికేం దిమ్మాచనిద్దూ మద్దే లొత్తాను.

సుబ్బా—నీవుకూడా భోజనము చేసిరా. వెఱ్ఱిమొఖమా చెడిపోకు.

(అని పోవును)

(అందరు నిష్క్రమించుచున్నారు)

వడ్డీ వ్యాపారము

[అంతట వెంకటశాస్త్రులుగారియింట రామప్పపంతులు
రమణయ్యాలతో ప్రవేశము]

రాము—(తనలో) వెంకటశాస్త్రుల్లుగారు బదులు యిస్తానన్నారు. కాని గౌరీపతి శాస్త్రుల్లుగారువింటే నన్నేమైనా అంటారేమో అని భయముగుచున్నది. వీడు ఏలాగున బాగుపడడు. ఆ నహోవానము వదలడు. కావున మనకు దొరికేటి సొంమ్ముకు పోగొట్టుకోవాలి బంధు

త్వముమాట అనక విచారించుదాము. వేయిరూపాయలకు నోటు వ్రాయిస్తే మనకు వందరూపాయలు యిస్తామన్నారుగదా. వాడికిచ్చేవి
వ్రాయిస్తే మనకు వందరూపాయలు యిస్తామన్నారుగదా వాడికిచ్చేవి
అయిదువందలు మొత్తము ఆరువందలు వెయ్యిరూపాయలు వెంకట శాస్త్రుల్లుగారికి యిప్పించినట్లు. కావలసినంత ఆస్తి యున్నదిగదా. మొన్నను గోపాలచార్యులతో వెళ్ళి రంగసానికి ఎనిమి దెకరాల భూమి వ్రాసి యిచ్చినాడట. మనము బదుళ్ళు యిప్పించినామంటే యీనాలుగు రోజులలోను మనకు తప్పకుండా యేమైనా డబ్బుదొర కకమానదు. అదిగో చావడిలో కూర్చున్నారు. లోపలికివెళ్ళి బదులు సంగతిచెప్పి తప్పకయిచ్చేలాగునచేస్తాను. (ప్రకాశముగా) రమణయ్యా అదిగో ఆయన చావడిలో కూర్చుని యేవో కాగితములు చూచుకొను చున్నారు. నేను వెళ్ళి మాట్లాడివస్తాను. నీవిక్కడనే కూర్చో ఆచుట్ట పారేద్దూబాబూ! ఆయనకు నీగొడవంతా తెలుస్తే అసలుడబ్బు పుట్టదు.

రమ—సరే పారేస్తాను. మీరు వెళ్ళండి.

రామ—(లోపలకువెళ్ళి) శాస్త్రుల్లుగారూ నమస్కారము.

వెంక—దయచేయండి. ఆకుఱ్ఱవాడిని తీసుకువచ్చినారా యేమిటి?

రామ—ఆ. తీసుకువచ్చినాను. ఈవేళ వ్రాతమూలం అయిపో వాలి. లేకపోతే మళ్ళీ వీలుండదు.

వెంక—అయితే ప్లీడరుని యెవరినైనా తెలుసుకొన్నారా? వీడిచేత దస్తావేజు వ్రాయించుకోవచ్చునా.

రామ—ఆ. కనుక్కొన్నాను. మనసుందర్రావు పంతులుగారిని తెలుసుకొన్నాను. వేరేయున్నాడు గనుక కొన్నినెంబర్లు ఉదహరించి

వ్రాయిస్తే చెల్లుతుందన్నారు. సమయమువస్తే ఆయనకు వకాల్తనామా యిమ్మన్నారు. మీరు భయపడనక్కరలేదు. ఆస్తికి లోపములేదుగదా.

వెంక—అయితే నేనొకమాట చెప్పుతాను. మీరు కోపము పడకండి. ఈకుఱ్ఱవాడు తాగుతాడటకాదూ?

రామ—తాగితే మనకేమి? ముండ నుంచుకుంటే మనకేమి? మనకు డబ్బుప్రధానము వాడికి బదుళ్ళెందుకు. అందుకే గాదటయ్యా.

వెంక—అట్లయితే మనము త్రాగించి వ్రాయించినా మంచి దేమో.

రామ—వాడిమొగం రిజిష్ట్రాఫీసులో డబ్బిచ్చి రిజిష్టరీచేయించిన తరువాత యీవెఱ్ఱివేషాలు సాగుతాయా!

వెంక—రిజిష్ట్రారుగారియెదుట వెయ్యిరూపాయిలు పొయ్యాలా? అక్కరలేదా?

రామ—పొయ్యవద్దూ లేకపోతే రిజిష్టరెల్లాగ?

వెంక—అందుకోసమని చేద్దాము. ఏమిటంటే యిదివరకు అయిదు వందలకు నోటు వ్రాసినట్లున్నూ ఆనోటుబాపతువడ్డీ వసూలు యిచ్చి నట్లున్ను ఆనోటుసొమ్ములోకలిపి యిప్పుడు వేయిరూపాయిలు బదులు యిచ్చినట్లున్ను వ్రాయిద్దాము. అది బాగావుంటుందా?

రామ—భేషైన వాడవయ్యా మంచి వ్యవహారతలు మీకు మేము సలహా చెప్పాలా. అదిచాలా బాగానున్నది. అట్లయితేముసా యిదా వ్రాయించండి.

వెంక—ఆకుఱ్ఱవాడేది. తీసుకువచ్చినారా.

రామ—తీసువచ్చినాను కాని మీరు వారి గొడవ తెలియ నట్లే నటించాలి.

వెంక—మనకెందుకు. వాడిపాడునడతవల్ల వాడే చెడిపోతాడు ఆగొడవ మనకెందుకు.

రామ—ఈచిత్రం విన్నారా. మొన్న యేలూరునుండి మళ్ళీ యింకోకతెను. తీసుకువచ్చాడట వీడిపిచ్చమండా. రంభలాగునభార్య యుండగా వీడి పొయ్యేకాలం చూచారా! ఏమైనా అంటే చెడతాగి కొడతాడేమో అని భయం.

వెంక—పదిమందిని తీసుకు రానియ్యండి. మన కెందుకా గొడవ చెడిపోతాడు. ఎన్నాళ్ళుసాగుతుందిలెండి. లోపలకు రమ్మనండి.

రామ—(నీధిలోనున్న రమణయ్యనుతీసుకువచ్చి) అరుగో శాస్త్రిల్లుగారు! ఎప్పుడేనా వీరిదర్శనంచేశావా?

రమణ—చెయ్యకేమి చాలాసార్లు చూచినాను.

వెంక—అబ్బాయీ కూర్చుండుము నీ వయస్సెంతనాయనా!

రమణ—నాకిప్పు డిరువది మూడవసంవత్సరము.

వెంక—అయితే మీరు పంచుకొన్నారటకాదు.

రమ—భోజనమువేరేనే చేయుచున్నాము భూములమీదవచ్చే శిస్తుమాత్రం పంచుకొనుచున్నాము.

వెంక—మీకంతా పదిహేనువందలు వస్తాయనుకుంటాను.

రమ—ఆ రెండువేల రూపాయలువచ్చుచున్నాయండి.

వెంక—నీకు తప్పకుండా సొమ్ము యీవేళ కావాలా?

రమ—చిత్తము ఈవేళ కావాలాండి. మా మేనమామను ధాన్యము ఖరీదునిమిత్తం పంపించాలి. మనిషిని గాత్రిబండిమీద వెళ్ళుచున్నాడు.

వెంక—(తనలో) ఔరా! మేనమామకు పంపవలెనని వ్యవహారస్తులు మాట్లాడినట్టే మాట్లాడినాడు. బొంక నేర్చినవాడే రంకునేర్చినవాడన్నారు. (ప్రకాశముగా) మధ్యాహ్నము భోజనముచేసి పందల

కడరా! మన రామప్పగారు మీతో అంతా మాట్లాడుతారు. వెళ్లు.

రమ—చిత్తము. మధ్యాహ్నము తప్పక పై పలుచెయ్యాలండి.

వెంక—తప్పకుండా యిస్తాను.

రామ—చిత్తము. శాస్త్రుల్లుగారూ సెలవా? వెళ్ళుచున్నాను.
(అనిపోవును)

(అందరు నిష్క్రమింతురు)

మ హో ప న్యా స ము

ఒ క స భ

[అప్పుడు సభాధ్యక్షుడు వందలకొలది పెద్దమనుష్యులు కూర్చుండగా దంబాల దశరథరామయ్య లేచి యుపన్యసించుచున్నాడు]

దశ—సభానాయకుడిగారికి దణ్ణాలు. కూర్చున్న పెద్దమనుష్యులందరికి నమస్కారాలు. ఈపాక చాల చల్లగానున్నది. ఈ పాకే యించినోరికందటికి దణ్ణాలు. ఈసభలో నన్ను మాటాడమని మావూరినుంచి మావోళ్ళుపంపించారు. పరే మీరందరూ కూడా వింటావన్నారు గనుక నాకుతోచినమాటలు నాలుగుచెపుతాను. మొత్తిమాటలో మొత్తిమాటలో అవిమీరు జాగ్రత్తగా వినాలి. నాది గుడిసెలగూడెం కాపురము నాయింటిపేరు దంబాలవారు. నాపేరు దశరథరామయ్య. మాఅమ్మపేరు జానకమ్మ మానాయినబోయి పదేళ్ళయినది. మాఅమ్మ చచ్చిపోయి రొణ్ణెలయినది. పెద్దముండ కూతురైనా

మాఅమ్మబోవడం నాకు చాలా కష్టంగావుంది. పులుసుకాచిందంటే మాఅమ్మే కాచాలి నాకేక్షై యేళ్ళున్నాయికాని మాఅమ్మని తలుచుకుంటే నాకేడుపొస్తాది. (అని వెక్కివెక్కి యేడ్చుచున్నాడు)

సభ్యులు—(చప్పట్లు కొట్టినవ్వి) భేష్‌భేష్ వహావా వహావా బాగుంది, బాగుంది. దిగుదిగు చాలుచాలు.

అధ్యక్షుడు—ఏమండోయి దశరథరామయ్యగారు మీఅమ్మ సంగతి మీనాన్నసంగతి యెందుకండీ అల్లాటిమాటలు చెప్పకూడదు. సీటితూరల విషయమైన తీర్మానము మీరుబలపరచాలి. అందుకుమిమ్మల్ని పిలిచాము. చెప్పగలిగితే నాలుగు ముక్కలు దానిని గూర్చి చెప్పండి. లేకపోతే వెళ్ళికూర్చోండి, మీరు సభలో వెక్కి వెక్కి యేడవ కూడదు.

దశ—ఏడవకూడదూ? ఏడుపువస్తే యేంజెయ్యమన్నారు? వాళ్ళంతాయిప్పుడు నవ్వొస్తే నవ్వలేదు? నన్నుచూస్తే మీకింత కోపమెందుకు? నేను చెప్పేమాటల్లో అబద్ధమేముంది? మాఅమ్మ చచ్చిపోవడ మబద్ధమా? మాఅమ్మ బాగా పులుసుకాచడ మబద్ధమా? ఇల్లాటిమాటలు చెప్పకూడదంటారుమీరు! తమరేయీలాటి మాటలంటే నేనేమి మనవిచెయ్యను? ప్రజలకష్టనిష్ఠూరాలు చెప్పుకోవడం విషయమై యీసభ పుట్టించవని అందరు చెప్పుకొంటున్నారు. అంచేత నాకష్టాలు చెప్పుకోనేటందుకు నేనొచ్చాను. సభచేస్తామంటే నాలుగు రూపాయలిచ్చాను. నాలుగురూపాయలకి నాల్గుగళ్ళైనా మాటాడనియ్యరా యేంటి? ఏడీ నన్నెవ్వడు కదుపుతాడో కదపమనండి? అళ్ళంతా నవ్వేరంటే మీరుకూడా యిల్లాగంటారా? సిగ్గులేనిమొకాలకి నవ్వేసింగారమని కీసబాన తెలియక నవ్వునవ్వుతారు. అళ్ళమాటక్కుకు మీరిల్లాఅంటారా? ఇంకా నాలుగు మాటలున్నాయి చెప్పిపోతారు ఊరుకోండి.

సభ్యులు—చెప్పనియ్యండి, చెప్పనియ్యండి కథపట్టుచాల రస వంతంగా వుంది.

సభ్యులు—చాలు, చాలు, దింపండి ఇదివరకు వినిపించిన కలాపంచాలు.

దశ—ఊరుకొన్నకొద్దీ పొగరెక్కి పోయేరు మీరంతాను ఈ తూరి నోరెత్తారంటే నంకలు తెగమొదుతాను జాగ్రత్త.

అధ్య—సభవారంద రూరుకోండి. నేనున్నాను. జాగ్రత్తపెట్టి తాను. దశరథరామయ్యగారు! మీరు చెప్పదలచుకొన్న దేదో చెప్పండి. త్వరగా కానియ్యండి.

దశ—త్వరగానే కానిస్తాను. ఆవరసని చెప్పనిస్తే జల్లుమంట మెల్లిపోను పెవాఘం. వీళ్ళంతా గోల్లుమంటే ఆధార మెనక్కిమోయింది. కొంచెం నేపుండండి, గేపకంచేసి చెప్పతాను—మావూళ్ళో నేను బైల్దేరేటప్పటికి చాలపొద్దుంది. ఆపాటికి పడవమీద పడ్డాను. ఆపడవలో చెక్కవూటుగా బస్తాలేశారు. ఆడబ్బసిగ్గోయ్యా! పంనల్లులని చెప్పను! ఈగలంతేసి నల్లులున్నాయి. తొంగున్నిద్దోతూంటే ఆకళాసోడు చింతపండు బుట్ట నాయీపుమీదేశాడు. ఆలంకణాలపడవ రెండుజాములకొచ్చింది ఇక్కడకురాగానే పప్పాదప్పళాలతో భోజనాలు మాంబాగా పెట్టారు. పప్పుధప్పళాలు మారుచిగా వున్నాయి సబేంటి మాబాగావుంది. ఇల్లాంటిసబే చూళ్ళేదు నేను. మాంవూరు తాశీలుదారు గారు చేసినపెళ్ళిలాగుంది. నన్ను మీరంతా ఓపెద్దమ్మను జేసి నువ్వు పెద్దోడవుచెప్పవయ్యా అంటేనేను చెపుతున్నాను. నేనాళ్ళే గెందాలు గిందాలు నదువుకొన్నోణ్ణికాను. గెరిడీటీలు పేపరులు సూశినోణ్ణికాను. సూడకపోయినా యీసూశినోళ్ళకంటె బాగానె శెప్పాను.

సభాధ్యక్షుడు—తూరలనిగురించి కూడా చెప్పండి మరి కొంచెము.

దశ—చెవుతావుంటేనే తొందరపెడితే యెల్లాగా నోటిలో నుంచి మాటరానియ్యరేమి. నీటితూరలు బాగావున్నాయి మానేలకి నీరుసరిగా వస్తూంది డెంటూనూవరెంటు ఆడుచ్చుకునే దాడుచ్చుకొన్నా యీలకి నీరొదలిపెడ్తాను.

సభా—మీరాలా చెప్పగూడదు. అపతీర్మానాసకివ్యతిరేకము.

దశ—యెతిరేకమైతే నాకేంయి. అనుభోగమైతేనాకేంయి ఉన్నామాటంటో యేకరమెట్టాను. మీరిల్లా శెలవిస్తే నేనేంశెలవియ్యాను డెటూనూపరెంటు మంచోడుకాడంటే రేప్రొద్దున్న శెలిగర కట్టుకుపోవాలి. అప్పుడు మీరొత్తారా యీళ్ళొత్తారా? ఛేసి, యీలాంటి సభలోకి రావడం నాదే బుద్ధిపొరబాటు. (అని దిగుచున్నాడు)

(సభాసదులు చప్పట్లు మిక్కిలిగట్టిగా గొట్టుచున్నారు)

దీని తరువాయి రెండవ భాగము చదువవలెను.

ఆంధ్ర నాటకములు

		రు	అ
పద్మవ్యూహం	చ॥ మా॥	0	8
శ్రీకృష్ణగాయుధారం	డిటో	0	8
కన క్తార	డిటో	0	8
సంగీత కృష్ణలీల		0	8
లవకుశ	డిటో	0	8
మోహినీ రుక్మాంగద అ॥ శే॥		0	8
దశావతారములు మ॥ శ్రీ॥		0	8
సతీ సక్కుబాయి కో॥ కా॥		0	8
సంగీత సారంగధర		0	8
సతీ అనసూయ శొం॥ గ॥		0	8
చింతామణి జో॥ మృ॥		0	8
సంగీత గులోబకావళి		0	8
భక్తకుచేల		0	8
అర్జున ప్రతిజ్ఞ		0	8
రోషనార		0	8
భక్తతుకారాం		0	8
భక్తకబీరు		0	8
దానవీరకర్ణ		0	8
సంగీత జయంత జయపాల మ॥ శ్రీ॥		0	8
రామదాసు	డిటో	0	8
కాంతామతి	డిటో	0	8
సంపూర్ణ భారతము చ॥ మా॥		1	0
లంకాదహనం అ॥ శే॥		0	8
సంగీత ప్రహ్లాద అ॥ సో॥		0	8
సంగీత శశిరేఖ	డిటో	0	8

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి.

చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి నవలలు

		రు	అ
అహల్యాబాయి		1	0
రాజరత్నం		1	0
కృష్ణవేణి		0	12
హేమలత		1	0
కర్పూరమంజరి	1 వ భా॥	1	8
డిటో	2 వ భా॥	1	8
రామచంద్ర విజయము		1	0
సౌందర్యతిలక		1	8
వినోదములు	1 వ భా॥	0	12
డిటో	2 వ భా॥	0	12
Tales of Rajasthan అను రాజస్థానకథావళి	1 వ భా॥	1	4
డిటో	2 వ భా॥	1	4
మణిమంజరి		0	6
సువర్ణగుప్తుడు		0	8
చమత్కారమంజరి	1 వ భా॥	1	0
డిటో	2 వ భా॥	1	0
Lives of great men మహాపురుషుల జీవితచరిత్రలు	1 వ భా॥	1	0
డిటో	2 వ భా॥	1	0
డిటో	3 వ భా॥	1	0
రామకృష్ణ పరమహంస Life and Teachings		1	0
ప్రహసనమంజరి		0	12
నవ్వులగని		1	8
నానక్ చరిత్ర		0	12
గురుగోవింద చరిత్ర		0	12

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి.